ఈనాడు

విజయవాడ 2-12-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 112
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



వైకుంఠ ద్వార దర్శనాలకు ఈ-డిప్ నేడు

మొదటి మూడు రోజులకు 24.05 లక్షల మంది నమోదు

1.76 లక్షల మందికి దర్శన భాగ్యం కలిగే అవకాశం

2లో

గ్రామ స్థాయి నేతలు రాష్ట్ర నాయకులుగా ఎదగాలి

తెదేపా మన ఉనికి అని గుర్తుంచుకోవాలి

పార్టీ మండలాధ్యక్షుల శిక్షణలో మంత్రి నారా లోకేశ్

త్వరలో 'ఫిల్మ్ టూరిజం పాలసీ'

సీఐఐ బిగ్ పిక్చర్ సమిట్‌లో మంత్రి కందుల దుర్గేశ్

నేడు హైకోర్టుకు పరకామణి కేసు నివేదిక

30 మందిని విచారించిన సీఐడీ

లోపలి పేజీల్లో »

18 నెలల్లో రూ.50 వేల కోట్లు

పింఛన్ల రూపంలో అందించాం

- పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి
- 2027లో జాతికి అంకితం చేస్తాం
- సాగులో రైతులు సాంకేతికతను అందుకోవాలి
- వైకాపా నిర్వాకంతో కొందరు లేడీ డాన్లుగా మారారు
- ఏలూరు జిల్లా నల్లమాడు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఎలా ఉన్నారు.. ఏం కావాలి?

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో కిడ్నీ వ్యాధిగ్రస్థురాలు గుడ్ల నాగలక్ష్మికి పింఛను అందించి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఈనాడు - ఏలూరు

గోదావరి పుష్కరాల కన్నా ముందే 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు సాకారమైతే గోదావరి జిల్లాల్లో నీటి ఎద్దడి ఉండదని పేర్కొన్నారు. నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల పథకం పనుల్ని పూర్తిచేసి పోలవరం కుడికాలువ ద్వారా మెట్ట ప్రాంతానికి నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. 'దేశంలో సామాజిక పింఛన్లు ఏపీలోనే అధికంగా ఇస్తున్నాం. ఐదేళ్లలో ఒక్క పింఛన్లకే రూ.1.65 లక్షల కోట్లు వెచ్చిస్తున్నాం. గత 18 నెలల్లో రూ.50 వేల కోట్లు పంపిణీ చేశాం' అని చెప్పారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. తొలుత మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న గుడ్ల నాగలక్ష్మి ఇంటికి వెళ్లి రూ.10 వేల పింఛను అందజేసి ఆమె ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. అనంతరం నల్లమాడు ప్రజావేదిక వద్దకు చేరుకుని, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రైతులు ప్రత్యామ్నాయ పంటలకు మళ్లాలి. వాణిజ్య పంట ఆయిల్‌పామ్‌ను 1984లో ఎన్టీఆర్ పరిచయం చేశారు ఇప్పుడది లాభసాటి సేద్యమైంది. నిపుణుల సూచనలు పాటిస్తూ, ఆధునిక, సాంకేతిక పద్ధతులు తెలుసుకోవాలి. డ్రోన్లు వాడి ఖర్చు తగ్గించుకోవాలి. లాభసాటి సాగుపై ప్రభుత్వం రూపొందించిన పంచసూత్రాలపై ఈ నెల 3న ప్రతి నియోజకవర్గంలో రైతులకు అవగాహన కల్పిస్తాం. ఆ రోజు వ్యవసాయంపై జరిగే ప్రత్యేక చర్చలకు హాజరు కావాలి. కొల్లేరు సమస్యలు పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తాం. (మిగతా 13లో)



ప్రజా వేదికపై మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

> గతంలో వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో కొందరు మహిళలు గంజాయి అమ్మి, లేడీ డాన్లుగా ఎదిగారు. తాజాగా నెల్లూరులో ఓ మహిళ బయటకొచ్చారు. నాటి ప్రభుత్వం గంజాయి కట్టడికి ఒక్క సమీక్షా చేయలేదంటే, వైకాపా ఎంత ప్రమాదకర పార్టీయో ప్రజలు ఆలోచించాలి. ఇది ఆడబిడ్డల గౌరవాన్ని కాపాడే ప్రభుత్వం. అందుకే స్త్రీ శక్తి అమలు చేస్తున్నాం.
> – చంద్రబాబు

పీ4 దేశానికే తలమానికం

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు చేపట్టిన కార్యక్రమమిది

ముఖ్యమంత్రి చంద్రబాబు 13లో

పిల్లల చదువు సంధ్యలన్నీ.. తల్లిదండ్రుల దృష్టికొచ్చేలా!

మెగా పీటీఎం నిర్వహణకు ప్రణాళిక

మన్యం జిల్లాలో జరిగే సమావేశంలో పాల్గొననున్న సీఎం 3లో


మీ నాటకాలు పార్లమెంటులో కాదు

- నిస్పృహ వెళ్లగక్కడానికి సభను వాడుకుంటున్నారు
- ఎన్నికల్లో ఓటములను జీర్ణించుకోలేకపోతున్నారు
- వ్యూహాన్ని మార్చుకోండి.. లేదంటే టిప్స్ చెబుతా రండి
- విపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని మోదీ
- 'సర్'పై రాజ్యసభ నుంచి ప్రతిపక్షం వాకౌట్



వాడిగా వేడిగా మొదలైన శీతాకాల సమావేశాలు

దిల్లీ: పార్లమెంటు అనేది సేవల అందజేతకు తప్పిస్తే.. నాటకాలకు వేదిక కాదని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. ఎన్నికల్లో ఓటములతో నిస్పృహలో ఉన్న విపక్షాలు ఆ కోపాన్ని తీర్చుకునేందుకు పార్లమెంటును ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. ఎన్నికల సన్నాహక కసరత్తులు చేసే ప్రాంతంగా చట్టసభల ప్రాంగణాన్ని గత కొంతకాలం నుంచి మార్చేస్తున్నాయని విరుచుకుపడ్డారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్లమెంటు వెలుపల విలేకరులతో మోదీ మాట్లాడారు. తర్వాత లోక్‌సభలో ప్రసంగించారు. "రాజకీయ నాటకాలు ఆడేందుకు కాకుండా నిర్మాణాత్మక.. ఫలితాలను రాబట్టే చర్చలకు వేదికగా పార్లమెంటు ఉండాలి. నాటకాలు ఆడాలంటే ఎక్కడైనా అవకాశాలుంటాయి. పార్లమెంటును మాత్రం సేవల అందజేతకే వాడాలి. ఒకవేళ నినాదాలు ఇవ్వాలని మీకు అనిపిస్తే దేశంలో ఎక్కడైనా ఇవ్వండి.. పార్లమెంటులో మాత్రం కేవలం విధానాలపైనే దృష్టి పెట్టండి. ఓటమి ఎదురైన బిహార్ వంటిచోట ఇప్పటికే మీరు మాట్లాడారు. ఇంకా ఓడిపోబోతున్న రాష్ట్రాల్లో కూడా మాట్లాడండి. బిహార్‌లో ఓటమి మీకు మింగుడుపడటం లేదు. పరాజయ దుగ్ధతో ఆటంకాలు కలిగించకూడదు.. అలాగని విజయ గర్వంతో విర్రవీగకూడదు. (మిగతా 3లో)



లోక్‌సభలో సోమవారం ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

కరిచేది కుక్క కాదు... పార్లమెంటులో కూర్చున్నవారు

వివాదం రేపిన కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి వ్యాఖ్యలు

ఆమెపై కఠిన చర్యలకు భాజపా డిమాండ్ 3లో

మద్యం ముడుపుల సొమ్మును.. నగదు, నగల రూపంలో ఇచ్చేశా

- ప్రతిఫలంగా కమీషన్ తీసుకున్నా
- సిట్ విచారణలో అనిల్ చోఖ్రా వెల్లడి
- తన డొల్ల కంపెనీల్లోకి రూ.78 కోట్లు జమైనట్లు అంగీకారం
- కొత్తగా తెరపైకి చాముండ బులియన్ యజమాని చేతన్‌కుమార్ పేరు

ఈనాడు - అమరావతి

'ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు మద్యం డిస్టిలరీలు వాటి బ్యాంకు ఖాతాల నుంచి మీ డొల్ల కంపెనీల ఖాతాల్లో డబ్బు జమచేస్తాయి. ఆ సొత్తు విత్‌డ్రా చేసి నగదు, బంగారం రూపంలో వెనక్కి ఇస్తే.. మీకు కమీషన్ చెల్లిస్తామంటూ ముంబయికి చెందిన చాముండ బులియన్ యజమాని చేతన్‌కుమార్ నన్ను సంప్రదించారు. ఓల్వీక్ మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ-11), క్రిపాటి ఎంటర్‌ప్రైజస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ-12), నైస్నా మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ-13), విశాల్ ఎంటర్‌ప్రైజస్ (ఏ-19) తదితర డొల్ల కంపెనీల బ్యాంకు ఖాతాల వివరాలు ఆయా డిస్టిలరీలకు అందజేయగా.. వాటిలో రూ.78 కోట్లు వారు జమచేశారు. అందులో నా కమీషన్ మినహాయించుకుని మిగతా సొత్తు నగదు, బంగారం రూపాల్లోకి మార్చి చేతన్‌కుమార్‌కు అందజేశా' అని వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో నిందితుడు (ఏ-40), ముఠా తరఫున మద్యం ముడుపుల



అనిల్ చోఖ్రా

సొమ్ము మనీ లాండరింగ్ చేసిన ముంబయివాసి అనిల్ చోఖ్రా సిట్ దర్యాప్తులో వెల్లడించాడు. చేతన్‌కుమార్ తండ్రికి దుబాయ్‌లోని పలువురు వ్యక్తులతో ఆర్థిక సంబంధాలున్నాయని తెలిపాడు. న్యాయస్థానం అనిల్ చోఖ్రాను మూడు రోజుల పాటు సిట్ కస్టడీకి ఇవ్వగా, తొలి రోజు సోమవారం ఆయన్ను దాదాపు 6 గంటల పాటు పోలీసులు ప్రశ్నించారు. కీలక వివరాలు రాబట్టినట్లు తెలిసింది.

నాటి ప్రభుత్వ పెద్దలకు ముడుపుల సొమ్ము

'వైకాపా హయాంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న అదాన్ డిస్టిలరీస్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, లీలా డిస్టిలరీస్ సంస్థలు రాజ్ కెసిరెడ్డి(ఏ-1), ముప్పిడి అవినాష్ రెడ్డి (ఏ-7)ల నియంత్రణ, పర్యవేక్షణలో ఉండేవి. ఈ మూడు సంస్థలు కలిపి మొత్తం రూ.78 కోట్లను అనిల్ చోఖ్రాకు సంబంధించిన డొల్ల కంపెనీల ఖాతాల్లోకి మళ్లించాయి. రెండో దశలో ఆ నిధులు (మిగతా 3లో)



గాజు వంతెన పైనుంచి వ్యూ ఇలా..

విశాఖ సిగలో మరో అందం

కైలాసగిరిపై గాజు వంతెన ప్రారంభం

విశాఖపట్నం (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: గాజు వంతెనతో విశాఖలో పర్యాటకం మరింత అభివృద్ధి చెందుతుందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ, సాయి మోక్ష షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్, భారత్‌మాత వెంచర్స్ (ఆర్జే ఎడ్వంచర్స్) సంయుక్తంగా రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన గాజు వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్‌లు మాట్లాడుతూ (మిగతా 3లో)



కింద నుంచి చూస్తే గాజు వంతెన ఇలా

సవాళ్లకు ఎదురొడ్డి సాధించాడు



- ఎంబీబీఎస్ సీటు కోసం సుప్రీంకోర్టులో న్యాయపోరాటం
- 3 అడుగుల ఎత్తున్న డాక్టర్ గణేశ్ బరైయా విజయగాథ

రోగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న గణేశ్ బరైయా

ఇంటర్నెట్ డెస్క్: డాక్టర్ గణేశ్ బరైయా.. ఎత్తు మూడు అడుగులు. ఉద్యోగం ప్రభుత్వ వైద్యాధికారి. జీవితంలో ఏదైనా సాధించాలంటే శారీరక రూపం ముఖ్యం కాదు, దృఢమైన సంకల్పం, ఆశయం చాలని నిరూపించారు గుజరాత్‌లోని భావ్‌నగర్ జిల్లా గోరఖి గ్రామానికి చెందిన గణేశ్. గ్రోత్ హార్మోన్ లోపంతో జన్మించిన ఆయన జాతీయ స్థాయిలో న్యాయపోరాటం చేసి మరీ వైద్యుడు కావాలన్న తన కలను సాకారం చేసుకోవడం విశేషం. నీట్‌లో మంచి మార్కులు సాధించినా.. ఎత్తు తక్కువన్న కారణంతో తనకు ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ ఇచ్చేందుకు భారత వైద్యమండలి నిరాకరించినట్లు గణేశ్ తెలిపారు. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గుజరాత్ హైకోర్టులో కేసు వేయగా.. తనకు ప్రతికూలంగా తీర్పు వచ్చిందన్నారు. అయినా నిరాశ చెందకుండా సుప్రీంకోర్టులో పోరాడి గెలిచి.. 2019లో భావ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందినట్టు వివరించారు. అలా వైద్యుడు కావాలన్న తన లక్ష్యాన్ని నెరవేర్చుకుని ప్రస్తుతం బాండెడ్ మెడికల్ ఆఫీసర్ హోదాలో ప్రజలకు సేవ చేస్తున్నట్టు చెప్పారు. లక్ష్య సాధనలో అలుపెరగని పోరాటం చేసిన గణేశ్ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

రెండో విడత భూసమీకరణకు రైతుల అంగీకారం 13లో

ఇదీ సంగతి!



ఇక ఆపండి సార్...
ఇప్పటికే 11 సీట్లకు వచ్చాము!!

క్వాంటమ్ భవనం రెండు అంతస్తుల్లో

- 42,958 చ.అడుగుల్లో నిర్మాణం
- ఈ నెలలో శంకుస్థాపన!

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (ఏడీసీసీ) ప్రధాన భవనాన్ని రెండు అంతస్తుల్లో నిర్మించేలా నిర్మాణ సంస్థ నమూనా సిద్ధం చేసింది. క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు, దాని నిర్వహణకు అవసరమైన ఇతర విభాగాల ఏర్పాటుకు వీలుగా నమూనాను రూపొందించింది. మొదటి అంతస్తు 21,517.06 చ.అడుగులు, రెండో అంతస్తు 21,441.71 చ.అడుగులు కలిపి.. 42,958.77 చ.అడుగుల్లో భవనం రూపుదిద్దుకోనుంది. క్వాంటమ్ భవనాన్ని ఐకానిక్ టవర్‌గా తీర్చిదిద్దాలని భావించిన ప్రభుత్వం.. నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పిలిచింది. ఈ నెలలో శంకుస్థాపన చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

క్వాంటమ్ కంప్యూటర్ భవనం ఇలా: గ్రౌండ్, మొదటి అంతస్తుల మధ్య సిబ్బంది రాకపోకలకు వీలుగా ఒకే స్ట్రెచర్ లిఫ్ట్, టెర్రస్‌కు చేరుకోవడానికి రెండు చోట్ల మెట్ల మార్గం

- రెండు మెట్ల మార్గాల్లో ఒకదాన్ని మాత్రం బేస్‌మెంట్‌లోని పంప్ హౌస్ ప్రాంతం వరకు ఏర్పాటు చేయనున్నారు.
- నీటి శుద్ధి యూనిట్, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అగ్ని ప్రమాదం సంభవిస్తే నీటిని వినియోగించుకునేందుకు ప్రత్యేక ట్యాంకు ఉంటాయి.

పరిపాలనా భవనం ఇలా..

- ఈ భవనంలో క్వాంటమ్ కంప్యూటింగ్ ల్యాబ్, మినిమం ఎస్కలేషన్ రిక్వైర్‌మెంట్స్ (ఎంఈఆర్) ల్యాబ్, అనుబంధంగా పరిశోధన, అభివృద్ధి వంటి కీలక విభాగాలు ఉంటాయి.
- వాటితో పాటు పరిపాలనా కార్యకలాపాల గదులు, వర్క్‌స్పేస్, సమావేశ మందిరం, మెకానికల్ ఎక్విప్‌మెంట్ కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తారు. పరిశోధనలకు ఇబ్బంది లేకుండా సందర్శకులకు అవగాహన కల్పించేందుకు గ్యాలరీ అందుబాటులో ఉంటుంది.

నింగికీ నేలకూ ఉపగ్రహ బంధం



- భూమిపై మార్పులను కచ్చితత్వంతో పసిగడుతున్న శాటిలైట్లు
- మురుగునీటి పారుదల, పట్టణ ప్రణాళికలకూ అవే ఆధారం
- ప్రజల నిత్యజీవితంలో కీలకపాత్ర

ఈనాడు డిజిటల్, తిరుపతి

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అంటే చాలా మందికి చంద్రయాన్, ఆదిత్య ఎల్1 వంటి భారీ ప్రయోగాలే గుర్తొస్తాయి. కానీ ఈ సంస్థకు చెందిన అనేక భూ పరిశీలన ఉపగ్రహాలు (ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్స్) రోజూ అంతరిక్షంలో తిరుగుతూ మన పల్లెలను, పట్టణాలను తీక్షణంగా గమనిస్తున్నాయి. అవి ఎప్పటికప్పుడు పంపిస్తున్న వివరాలు వ్యవసాయం నుంచి మురుగునీటి పారుదల వరకు ఎలా ఉపయుక్తంగా ఉంటున్నాయో తెలుసుకుందాం!

రైతులకు వెన్నుదన్నుగా..

ఉపగ్రహాలు
రిసోర్స్ శాట్-2,
రిసోర్స్ శాట్-2ఏ
కెమెరాలు
ఎల్ఐఎస్ఎస్-3, 4



ఏం చేస్తాయి: ఈ ఉపగ్రహాలు పంట ఆరోగ్యాన్ని, విస్తీర్ణాన్ని, భూ వినియోగాన్ని పర్యవేక్షిస్తాయి. ఎల్ఐఎస్ఎస్-3, 4.. వంటి హైరిజల్యూషన్ కెమెరాల ద్వారా వెజిటేషన్ ఇండెక్స్ (ఎన్‌డీవీ) డేటాను సేకరించి, రైతులకు యాప్‌ల ద్వారా పంపుతాయి. ఏ పొలంలో నీటి శాతం తక్కువగా ఉంది, ఏ తెగులు సోకే ప్రమాదం ఉందనే విషయాలను ముందుగానే తెలుసుకుని, నష్టాన్ని తగ్గించుకోవచ్చు. వర్షపాతం అంచనాలు, చెరువులు, రిజర్వాయర్లలో ప్రస్తుత నీటి మట్టాలను ఈ ఉపగ్రహాల ద్వారా కచ్చితంగా తెలుసుకోవచ్చు. (మిగతా 3లో)

'ఇలాగైతే దర్యాప్తు ఎప్పటికీ పూర్తికాదు'

ఈనాడు, హైదరాబాద్‌: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగి మార్చి నాటికి ఏడేళ్లవుతుందని, ఒకవైపు హత్యలో పాల్గొన్న నిందితుడు బయట స్వేచ్ఛగా తిరుగుతుంటే, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోందని నిందితుల తరఫున న్యాయవాది సీబీఐ కోర్టుకు నివేదించారు. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలంటూ నర్రెడ్డి సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి టి.రఘురాం సోమవారం విచారణ చేపట్టారు. వై.ఎస్‌.అవినాశ్‌రెడ్డి, భాస్కరరెడ్డి, శివశంకర్‌రెడ్డిల తరఫు న్యాయవాది ఉమామహేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. ఏవైనా కొత్త ఆధారాలు లభించినప్పుడు తదుపరి దర్యాప్తు కోరవచ్చని, అయితే ఇప్పటికే విచారణ పూర్తయిన అంశాల ఆధారంగానే దర్యాప్తు కోరడం సరికాదని, ఇలాగైతే దర్యాప్తు ఎప్పటికీ పూర్తికాదని చెప్పారు.

రాష్ట్రానికి తగ్గిన జీఎస్టీ రాబడి

- నిరుటి నవంబరుతో పోల్చితే గత నెలలో రూ.131 కోట్ల తగ్గుదల
- పన్ను ధరల తగ్గుదలే కారణం

ఈనాడు- అమరావతి: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) 2.0 ప్రభావం రాష్ట్ర రాబడిపై పడింది. జీఎస్టీ సంస్కరణల పేరుతో కేంద్రం పన్నులు తగ్గించడంతో ఆ మేరకు జీఎస్టీలో రాష్ట్రానికి వచ్చే ఆదాయమూ తగ్గింది. కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత తొలి లెక్కలు సోమవారం వెలువడ్డాయి. కిందటి ఏడాది నవంబరు నెలలో వచ్చిన రాబడితో పోలిస్తే ఈ నవంబరులో రూ.131 కోట్ల (4.61%) మేర తగ్గుదల నమోదయింది. కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ 2.0 ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చింది. అక్టోబరు నెల ఆర్థిక కార్యకలాపాలు, కొనుగోళ్లు, అమ్మకాలు అన్నీ తాజా జీఎస్టీ ధరల ఆధారంగానే జరిగాయి. ఆ నెల వచ్చిన జీఎస్టీ రాబడి ఎంతనేది నవంబరులో ప్రతిఫలిస్తుంది.

నవంబరు వరకు పెరిగి...

ఆ తర్వాత తగ్గి..: రాష్ట్రంలో అక్టోబరు నెలాఖరు వరకు జీఎస్టీ రాబడిలో మంచి ఫలితాలు కనిపించాయి. గత ఏడాదితో పోలిస్తే రాబడి దాదాపు 5.80% పెరిగింది. జీఎస్టీ 2.0తో నవంబరులో ఆదాయం తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్‌ రాబడిపై జీఎస్టీ ధరల తగ్గుదల ప్రభావం పడుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖాధికారులు ముందే చెప్పారు. ఒకవైపు వస్తువుల విక్రయాల సంఖ్య పరంగా పెరిగినా జీఎస్టీ ధరల తగ్గింపు వల్ల మొత్తం ఆదాయంపై ప్రతికూల ప్రభావం పడిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

◆ ఎస్‌జీఎస్టీ తగ్గిపోవడానికి ప్రధానంగా ఆటోమొబైల్‌, సిమెంట్‌, ఎలక్ట్రానిక్‌ వస్తువులు, పాల ఉత్పత్తుల జీఎస్టీ ధరలు తగ్గడమే కారణంగా విశ్లేషిస్తున్నారు. క్రయవిక్రయాల పరిమాణం పెరిగినా ధరలు తగ్గడంతో రాబడీ మందగించింది.

◆ పెట్రోలియం ఉత్పత్తుల నుంచీ ఆదాయం తగ్గింది. కిందటి ఏడాది నవంబరుతో పోలిస్తే ఈసారి 1.06% మేర తగ్గుదల ఉంది. మధ్య ఆంధ్ర, కోస్తా ప్రాంతం మొత్తం అక్టోబరు నెలలో మొంథా తుపాను ప్రభావంతో వాహనాల రాకపోకలు తగ్గాయి. ఇది వ్యాపారాలను ఇబ్బంది పెట్టింది. ఆ ప్రభావం జీఎస్టీ రాబడిపైనా పడిందని మరో విశ్లేషణ.

రాబడి ఎక్కడ తగ్గిందంటే..

అంశం	2024 నవంబరులో వసూళ్లు (రూ.కోట్లలో)	2025 నవంబరులో వసూళ్లు (రూ.కోట్లలో)	తగ్గుదల (శాతాల్లో)
ఎస్‌జీఎస్టీ	1,197.14	1,109.17	-7.35%
ఐజీఎస్టీ	1,630.10	1,588.15	-2.57%
ఇతర అమ్మకపు పన్ను కోర్టు కేసుల పరిష్కారం వల్ల	7.32	6.16	-16.01%
మొత్తం జీఎస్టీ రాబడి	**2,834.56**	**2,703.48**	**-4.61%**
పెట్రోలియం ఉత్పత్తులు	1,320.57	1,306.62	-1.06%
ఎక్సైజ్‌పై వ్యాట్‌	74.00	70.40	-4.82%
వృత్తి పన్ను	29.41	43.00	+46.21% (పెరిగింది)
జీఎస్టీ రాబడికి పై మూడూ కలిపితే..	**4,258.54**	**4,123.50**	**-3.16%**

నేడు వైకుంఠ ద్వార దర్శనాలకు ఈ-డిప్‌

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడు రోజులకు ఆన్‌లైన్‌ ఈ-డిప్‌లో ఎంపికైన భక్తుల వివరాలను మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు తితిదే విడుదల చేయనుంది. గత నెల 27న ప్రారంభమైన రిజిస్ట్రేషన్‌ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. మొత్తం 9,55,703 రిజిస్ట్రేషన్ల ద్వారా 24,05,237 మంది భక్తుల వివరాలు సమర్పించినట్లు తితిదే ఐటీ డీజీఎం వెంకటేశ్వరనాయుడు తెలిపారు. ఈ-డిప్‌లో ఎంపికైన భక్తులకు ఫోన్‌ ద్వారా సంక్షిప్త సందేశం పంపుతారు. అందులోని లింక్‌ ఓపెన్‌ చేసుకుని ఉచిత టోకెన్లు డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. డిసెంబర్‌ 30వ తేదీకి 57వేలు, 31వ తేదీకి 64వేలు, జనవరి 1వ తేదీకి 55 వేల టోకెన్లు అందుబాటులో ఉన్నట్లు సమాచారం. మిగిలిన ఏడు రోజులు ఎలాంటి టోకెన్లు లేని భక్తులను నేరుగా అనుమతిస్తారు. ఇదే సమయంలో రోజుకు 15 వేల చొప్పున రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, వెయ్యి శ్రీవాణి దర్శన టికెట్ల కోటా అమలు చేయనుండగా ఈనెల 5వ తేదీన వాటిని ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

తితిదే టికెట్ల కొనుగోలులో పేమెంట్‌ గేట్‌వే సేవలకు అంతరాయం

శ్రీవారి దర్శన టికెట్లకు సంబంధించి పేమెంట్‌ గేట్‌ వే పని చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీ బ్రేక్‌, ఎస్‌ఈడీ దర్శనాలకు సంబంధించి నగదు చెల్లింపులకు సోమవారం సాయంత్రం చాలామందికి సంక్షిప్త సందేశాలు అందాయి. కానీ చెల్లింపులు వీలుపడకపోవడంతో ఇబ్బంది పడ్డారు. దీంతో ఎంబీసీ-34లో నగదు చెల్లించి టికెట్లను నేరుగా కొనుగోలు చేయాలని తితిదే సూచించింది. పేమెంట్‌ గేట్‌ వేకు సంబంధించి బ్యాంక్‌ నెట్‌వర్క్‌ పని చేయకపోవడంతో ఈ ఇబ్బంది తలెత్తినట్లు ఐటీ విభాగం గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తోంది.

శ్రీశైలంలో ఉచిత లడ్డూల పంపిణీ ప్రారంభం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో రూ.500 స్పర్శ దర్శనం టికెట్లు, రూ.300 అతిశీఘ్ర దర్శనం టికెట్లు తీసుకున్న భక్తులకు ఉచిత లడ్డూల పంపిణీ కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. స్పర్శ దర్శనం టికెట్‌పై 100 గ్రాముల లడ్డూలు రెండు, రూ.300 దర్శనం టికెట్‌కు ఒక లడ్డూను పంపిణీ చేశారు.

నిర్మాణ ఖర్చు నియంత్రణకు 'లీన్‌ కన్‌స్ట్రక్షన్‌'

- రాష్ట్రంలో త్వరలో ప్రయోగాత్మక ప్రాజెక్టు
- పురపాలక మంత్రి నారాయణ

ఈనాడు డిజిటల్‌- తిరుపతి; న్యూస్‌టుడే- ఏర్పేడు: నిర్మాణ రంగంలో వృథాను పూర్తిగా అరికట్టి, వ్యయాన్ని నియంత్రించి, ప్రాజెక్టుల నాణ్యతను పెంచే దిశగా 'లీన్‌ కన్‌స్ట్రక్షన్‌' విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రాష్ట్రంలో ఈ విధానాన్ని త్వరలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని చెప్పారు. ఐఐటీ తిరుపతి సివిల్‌ ఇంజినీరింగ్‌ విభాగం, ఇండియన్‌ లీన్‌ కన్‌స్ట్రక్షన్‌ ఎక్సలెన్స్‌తో కలిసి నిర్వహిస్తున్న 8వ ఇండియన్‌ 'లీన్‌ కన్‌స్ట్రక్షన్‌ కాన్ఫరెన్స్‌-25' (ఐఎల్‌సీసీ) సోమవారం తిరుపతి ఐఐటీలో జరిగింది. ప్రభుత్వ అధికారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు (ఎల్‌అండ్‌టీ, అప్కోన్స్‌, గోద్రెజ్‌), విద్యావేత్తలు (ఐఐటీలు, ఎన్‌ఐటీలు) ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రాజెక్టులను నిర్దిష్టమైన నాణ్యతతో, సకాలంలో పూర్తిచేయడానికి అవసరమైన సాంకేతికత, టూల్స్‌ వినియోగంపై ఈ సదస్సులో చర్చించారు. మంత్రి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'ఈ విధానంతో నిర్మాణ రంగంలో అనవసర ఖర్చు, సమయం తగ్గించడంతోపాటు సొమ్ము ఆదా చేయొచ్చు' అని వివరించారు. అంతకు ముందు ఐఐటీలోని ఇన్నోవేషన్‌ హబ్‌ను పరిశీలించి సాంకేతిక వినియోగాన్ని గురించి తెలుసుకున్నారు. ఐఐటీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ కె.ఎన్‌.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యా పరిశోధనలు పరిశ్రమల అవసరాలతో అనుసంధానం చేయడమే తిరుపతి ఐఐటీ లక్ష్యమన్నారు. ఐఎల్‌సీఈ బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్టర్‌ అనుప్‌ మాథ్యూ, శైలజ్‌ కరంజా తదితరులు పాల్గొన్నారు.


లీన్‌ కన్‌స్ట్రక్షన్‌ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

కొత్త ఒరవడి.. లీన్‌ కన్‌స్ట్రక్షన్‌

రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నిర్మాణ ప్రాజెక్టుల్లో వ్యయాన్ని, సమయాన్ని గణనీయంగా తగ్గించే 'లీన్‌ కన్‌స్ట్రక్షన్‌'పై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనితో ప్రాజెక్టుల కాలం, ఖర్చు తగ్గించేందుకు లైడార్‌ వంటి అధునాతన సాంకేతికతను వినియోగించనున్నారు. ఈ టెక్నాలజీ మౌలికవసతుల కల్పనలో కచ్చితత్వాన్ని, పారదర్శకతను పెంచనుంది. నిర్మాణంలో సుమారు 20-25 శాతం వరకు వృథా ఉంటుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కార్మికుల పనిగంటలు పక్కాగా సద్వినియోగం చేసుకోకపోవడం, నిర్మాణం సరిగా చేయక పగలగొట్టి మళ్లీ కట్టడం, మెటీరియల్‌ను అవసరానికి కంటే ముందే కొనుక్కురావడం వల్ల వాటి నాణ్యత తగ్గడం, చోరీకి గురికావడం, వడ్డీ దండగ, స్టీల్‌, కాంక్రీట్‌, కలప వంటివి అవసరానికి మించి ఉత్పత్తి చేయడం లేదా కట్‌ చేయడం వంటివన్నీ వృథాలే. వీటిని తగ్గించి, కార్మికుల ఉత్పాదకతను మెరుగుపరిస్తే ప్రాజెక్టులో పది శాతం పైగా ఆదా చేయొచ్చు. కొన్ని రకాల టెక్నిక్‌లు, టూల్స్‌తో సాధ్యపడుతుంది.

ఎలా అరికట్టవచ్చంటే..

◆ క్షేత్రస్థాయిలో కార్మికుల ఇబ్బందులు, సాధ్యమయ్యే పనులపై ముందుగానే స్పష్టత రావడం.


◆ పైనుంచి చేసే 'పుష్‌ ప్లాన్‌' కాకుండా పని చేసే వారి ఫీడ్‌బ్యాక్‌ తీసుకుని ప్రణాళిక మెరుగుపరచడం.

◆ ప్రాజెక్టుకు అనవసరమైన పనిని గుర్తించి దాన్ని తగ్గించడం.

◆ నిర్మాణ పనులు అడ్డంకులు లేకుండా సజావుగా సాగేలా చూడడం.

కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి వెంకటరెడ్డి

- తెదేపా నాయకుల జంట హత్యల కేసులో పరిణామం



మాచర్ల(కారంపూడి), న్యూస్‌టుడే: తెదేపా నాయకుల జంట హత్యల కేసులో ఏ8 నిందితుడు పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కండ్లకుంట సర్పంచి పిన్నెల్లి వెంకటరెడ్డి సోమవారం మాచర్ల అదనపు జూనియర్‌ డివిజన్‌ సివిల్‌ జడ్జి కోర్టులో లొంగిపోయారు. న్యాయమూర్తి శ్రీనివాస్‌ కల్యాణ్‌ అతనికి 15 రోజుల రిమాండ్‌ విధించారు. మాచర్ల గ్రామీణ పోలీసులు నిందితుడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన తెదేపా నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు మే 24న హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ8 నిందితుడు కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్నాడు. సోమవారం అతను కోర్టులో ప్రత్యక్షం కావడం గమనార్హం. మరోవైపు ఇదే కేసులో ఏ6 మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ7 పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సైతం రెండు రోజుల్లో కోర్టులో లొంగిపోనున్నట్లు సమాచారం.

నేడు హైకోర్టుకు పరకామణి కేసు నివేదిక

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తితిదే పరకామణిలో చోరీ కేసుకు సంబంధించి.. విచారణలో వెలుగుచూసిన వాస్తవాల నివేదికను సీఐడీ డీజీ రవిశంకర్‌ అయ్యన్నార్‌ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం మంగళవారం హైకోర్టుకు సమర్పించనున్నట్లు సమాచారం. తితిదే నాటి ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, సీవీఎస్‌వో నరసింహ కిశోర్‌, వీజీవో గిరిధర్‌తో పాటు కేసు నమోదు చేసిన తిరుమల వన్‌టౌన్‌ ఎస్సై రామకృష్ణారెడ్డి, ఎస్‌హెచ్‌వో జగన్‌మోహన్‌రెడ్డిలను విచారించారు. అలాగే తితిదే పరకామణి డిప్యూటీ ఈవో మల్లికార్జునరావుతో పాటు సిబ్బంది, అధికారుల నుంచి వివరాలు రాబట్టారు. కేసు రాజీ చేసిన సమయంలో విధుల్లో ఉన్న కోర్టు సిబ్బందిని సైతం విచారించారు. కేసులో నిందితుడైన రవికుమార్‌, వారి కుటుంబ సభ్యులను, ఫిర్యాదుదారుడు అప్పటి ఏవీఎస్‌వో సతీష్‌కుమార్‌ను విచారించారు. సుమారు 30 మందిని విచారించి నివేదిక సిద్ధం చేశారు.

నేడు కొన్ని జిల్లాల్లో వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాలకు సమీపంలో కొనసాగుతోంది. ఇది ఉత్తర దిశగా కదులుతూ.. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాలకు సమాంతరంగా ప్రయాణించనుంది. మంగళవారం ఉదయంలోగా వాయుగుండంగా బలహీన పడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. మంగళవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, డా.బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్‌, గుంటూరు, బాపట్ల, పల్నాడు తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది.

ఖతర్నాక్‌ డాన్‌ కామాక్షమ్మ ఇల్లు ధ్వంసం

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: గంజాయి వ్యాపారంతో పాటు పలు నేరారోపణలు ఎదుర్కొంటున్న లేడీ డాన్‌ అరవ కామాక్షమ్మపై ఆమె నివాసం ఉంటున్న నెల్లూరు నగరంలోని ఆర్డీటీ కాలనీవాసులు ఆగ్రహించారు. ప్రస్తుతం ఆమె సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో అరెస్టు అయ్యింది. ఇన్నాళ్లూ తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కామాక్షమ్మను తమ ప్రాంతానికి రానివ్వబోమని స్థానికులు హెచ్చరించారు. సోమవారం సామూహికంగా వెళ్లి ఆమె ఇంటితో పాటు అనుచరుల ఇళ్లను ధ్వంసం చేశారు.


స్థానికులు కూల్చివేసిన కామాక్షమ్మ ఇల్లు

గ్రహం అనుగ్రహం

2-12-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
ద్వాదశి: మ. 12-15 తదుపరి త్రయోదశి
అశ్విని: సా. 6-25 తదుపరి భరణి
వర్జ్యం: మ. 2-39 నుంచి 4-09 వరకు
తిరిగి తె. 3-23 నుంచి 4-52 వరకు
అమృత ఘడియలు: ఉ. 11-38 నుంచి 1-08 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-29 నుంచి 9-13 వరకు
తిరిగి రా. 10-30 నుంచి 11-22 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.17; సూర్యాస్తమయం: సా.5.20

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్‌	9.2	28.3
విజయనగరం	16.0	22.0
అనంతపురం	19.2	29.0
రాజమహేంద్రవరం	20.5	32.0
కడప	21.0	26.0
శ్రీకాకుళం	21.0	27.0
కర్నూలు	21.2	31.3
విశాఖపట్నం	21.6	24.8
తాడేపల్లిగూడెం	22.0	27.0
విజయవాడ	22.0	27.4
నరసాపురం	22.2	25.0
ఒంగోలు	22.5	25.5
తిరుపతి	22.8	24.7
నెల్లూరు	23.0	25.0

మీ నాటకాలు పార్లమెంటులో కాదు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైనచోట నిర్మాణాత్మక విమర్శలు చేస్తే ప్రజలకూ, దేశానికీ మేలు" అని విపక్షాలకు చురకలతో ప్రధాని హితబోధ చేశారు.

ఆమోదయోగ్యంకాని ఆట ఇది

"కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డు తగలవద్దు. గత పదేళ్లుగా ప్రతిపక్షాలు ఆడుతున్న ఆట దేశ ప్రజలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. రాజకీయాల్లో సానుకూలత తీసుకువచ్చేందుకు కావాలంటే కొన్ని టిప్స్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని మోదీ చెప్పారు. ఓటమిని స్వీకరించే మనసు విపక్షానికి లేదని విమర్శించారు. "ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో అధికార, విపక్షాలు కీలక పాత్ర పోషించాలి. ఎంపీలందరూ రాజకీయ వైరుధ్యాలను పక్కనపెట్టి, నిర్మాణాత్మక చర్చ జరపాలి. దేశ ప్రగతి కోసం మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలి" అని సూచించారు.

క్రికెట్ జట్టును అభినందించిన లోక్‌సభ

ఇటీవల మృతిచెందిన సభ్యులకు లోక్‌సభ సంతాపం తెలిపింది. వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు తెలిపింది. 2025-26లో రూ.41,455 కోట్ల అదనపు ఖర్చుకు ఉద్దేశించిన అనుబంధ పద్దుల బిల్లును, కొత్తగా పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం.. పాన్ మసాలా తయారీదారులపై సెస్సు విధించే బిల్లుల్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగిన 12 నిమిషాల్లో వివిధ అంశాలపై విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో స్పీకర్ ఓంబిర్లా సభను కొంతసేపు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక.. మణిపుర్‌లో జీఎస్టీ చట్ట సవరణల అమలు బిల్లును గందరగోళం మధ్యనే సభ ఆమోదించింది. ఓటర్ల జాబితా అంశాలపై విపక్ష ఆందోళనలతో సభ మంగళవారానికి వాయిదా పడింది. దివాలా ప్రక్రియ, జన్‌విశ్వాస్ నిబంధనల బిల్లులపై నివేదికల సమర్పణకు కమిటీలకిచ్చిన గడువును ప్రస్తుత సమావేశాల చివరిరోజు వరకు పెంచాలని లోక్‌సభ నిర్ణయించింది. అటు రాజ్యసభలో సర్‌పై చర్చకు విపక్షం పట్టుబట్టి చివరకు వాకౌట్ చేసింది. చర్చకు ప్రభుత్వం విముఖం కాదని, కాలపరిమితిని నిర్దేశించాలను కోవడం మాత్రం తగదని అధికారపక్షం పేర్కొంది.



శీతాకాల సమావేశాల సందర్భంగా సోమవారం పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ

డ్రామా అంటే అదీ..: ప్రియాంక

మోదీ వ్యాఖ్యలపై వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. పార్లమెంటులో వివిధ అంశాలను విపక్షాలు లేవనెత్తడం, వాటిపై చర్చలు జరపడం డ్రామా కాదని, అది ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరులో ఒక భాగమని అన్నారు. ప్రజలకు అవసరమైన, వారికి సంబంధించిన అంశాలపై పార్లమెంటులో చర్చకు అనుమతించకపోవడమే పెద్ద డ్రామా అని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్), దిల్లీలో తీవ్ర వాయుకాలుష్యం వంటివాటిపై అత్యవసరంగా పార్లమెంటులో చర్చించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కరిచేది కుక్కకాదు... పార్లమెంటులో కూర్చున్నవారు

- వివాదం రేపిన కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి వ్యాఖ్యలు

ఈనాడు, దిల్లీ : "కరిచేది కుక్కకాదు... పార్లమెంటు లోపల కూర్చున్నవారు" అంటూ కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి చేసిన వ్యాఖ్యలు సోమవారం శీతాకాల సమావేశాల తొలిరోజు వివాదం రేపాయి. రోడ్డుపై ఢీకొన్న వాహనాల వద్ద ఉన్న ఓ కుక్కను తీసుకొని ఆమె పార్లమెంటు ఆవరణలోకి రావడంతో భద్రతా కారణాల దృష్ట్యా లోపలికి తీసుకెళ్లకుండా సిబ్బంది అడ్డుకున్నారు. దాంతో ఆమె దాన్ని వెనక్కు పంపారు. ఈ సందర్భంగా అక్కడున్న మీడియా సిబ్బంది ఇది ప్రొటోకాల్ ఉల్లంఘన కిందికి రాదా? అని ప్రశ్నించారు. "నేను పార్లమెంటుకు వస్తున్నప్పుడు దారిలో ఒక స్కూటర్, కారు ఢీకొన్నాయి. ఆ సమయంలో కుక్క అక్కడుంది. ఏ వాహనం కిందైనా పడుతుందేమోనని దాన్ని తీసుకొని కారులో పార్లమెంటుకు వచ్చా. ఇందులో ప్రొటోకాల్ ఉల్లంఘన ఎక్కడుంది? ఒక మూగజీవిని కాపాడేందుకు ప్రయత్నిస్తే వివాదాస్పదం చేశారు. ప్రభుత్వం వద్ద ఇంత కమించి విషయం ఇంకేమీ లేదా? ఒకవైపు ఎస్ఐఆర్ నిర్వహించలేక బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎల్ఏ) చనిపోతుంటే దాన్ని అధికారపక్షం డ్రామాగా అభివర్ణిస్తోంది. మరోవైపు కుక్కను రక్షిస్తే దాన్నికూడా సమస్యాత్మకంగా చిత్రీకరిస్తోంది" అని రేణుకాచౌదరి అన్నారు. ఆమె వ్యవహారశైలిపై భాజపా సీనియర్ ఎంపీ జగదంబికాపాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా ఆమె పార్లమెంటు ఆవరణలోకి కుక్కను తెచ్చి తమాషా చేస్తున్నారని మండిపడ్డారు. ఆమెపై సభాధ్యక్షులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతున్న రేణుకాచౌదరి. పక్కనే కారులో ఆమె తీసుకొచ్చిన కుక్క



గాజు వంతెనపై ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ ఉన్నతాధికారులు

విశాఖ సిగలో మరో అందం

(మొదటి పేజీ తరువాయి)

సముద్ర మట్టానికి 1,020 అడుగుల ఎత్తున, 40 ఎంఎం మందం గల గాజుతో ఈ వంతెనను నిర్మించామన్నారు. దేశంలోనే అతి పెద్దదైన ఈ గాజు వంతెనకు ఒకే సారి 100 మందిని మోయగలిగే సామర్థ్యం ఉన్నప్పటికీ భద్రత దృష్ట్యా 40 మందిని మాత్రమే అనుమతిస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రవేశం ఉంటుందని, రుసుం ఒకరికి (పిల్లలకు, పెద్దలకు) రూ.300గా నిర్ణయించామన్నారు. 10 నిమిషాల పాటు వంతెనపైనుంచి పచ్చని కొండలు, సాగరతీర అందాలు వీక్షించవచ్చని వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ సంయుక్త కమిషనర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగుర వేస్తున్న మంత్రి సత్యకుమార్. చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ, డీఎంహెచ్‌వో సుహాసిని తదితరులు

2030 నాటికి ఎయిడ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం: మంత్రి సత్యకుమార్

విజయవాడ(విద్యాధరపురం), న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని 2030 నాటికి ఎయిడ్స్ రహితంగా మార్చడమే లక్ష్యం కావాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సోమవారం విజయవాడలోని పాత ప్రభుత్వాసుపత్రి నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సభలో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి మంత్రి మాట్లాడారు. "ఎయిడ్స్ నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న అవగాహన, నివారణ, నియంత్రణ కార్యక్రమాల ద్వారా 2.34 శాతం ఉన్న పాజిటివ్ రేటు 0.58 శాతానికి తగ్గింది. 42 వేల మంది హెచ్ఐవీ బాధితులకు కూటమి ప్రభుత్వం పింఛన్లతో భరోసా కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 15 మొబైల్ ఐసీటీసీలను రాష్ట్రానికి తీసుకొచ్చాం" అని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠరెడ్డి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్ బాబు, పబ్లిక్ హెల్త్ అండ్ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి, డాక్టర్ సమరం, కలెక్టర్ లక్ష్మీశ, డీఎంహెచ్‌వో సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

3న నల్లజర్లకు సీఎం చంద్రబాబు

'రైతన్నా మీకోసం' సదస్సుకు హాజరు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 3న 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో పాల్గొననున్నారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్ల-2 రైతు సేవా కేంద్రంలో జరిగే సదస్సుకు హాజరవుతారు. ప్రస్తుత రబీ, 2026-27 ఖరీఫ్, రబీ పంటకాలాలకు సంబంధించి గ్రామ స్థూల విలువ జోడింపు, కార్యాచరణ ప్రణాళికలపై చర్చిస్తారు. 3న రాష్ట్రవ్యాప్తంగా 8,451 రైతు సేవా కేంద్రాల్లో కరపత్రాల పంపిణీ, ఇదే తరహా సదస్సులు నిర్వహించనున్నారు.

మద్యం ముడుపుల సొమ్మును.. నగదు, నగల రూపంలో ఇచ్చేశా

(మొదటి పేజీ తరువాయి)

మరో 32 డొల్ల కంపెనీల ఖాతాల్లోకి మళ్లించారు. అక్కడి నుంచి వివిధ రూపాల్లో ఆ సొత్తు వైకాపా ముఠాకు.. వారి నుంచి అప్పటి ప్రభుత్వ పెద్దలకు చేర్చేవారు. ఎక్కడా ఆడిట్‌కు దొరక్కుండా, నేరం గుట్టు బయటపడకుండా బహుళ అంచెల్లో నిధుల మళ్లింపునకు పాల్పడ్డారు' అని సిట్ గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆ మొత్తం మనీ లాండరింగ్ గుట్టు రాబట్టేందుకు అనిల్ చోఖ్రాను ప్రశ్నించింది.

నలుపు తెలుపుగా.. తెలుపు నలుపుగా

రాజస్థాన్‌లోని అజ్మీర్ ప్రాంతానికి చెందిన అనిల్ చోఖ్రా.. నవీ ముంబయిలోని సాన్పాడాలో నివసించేవాడు. అక్కడ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి కొంత డబ్బులిచ్చి వారి ఆధార్, ఇతర గుర్తింపు కార్డులను సేకరించేవాడు. వాటితో డొల్ల కంపెనీలు సృష్టించి వాటి ద్వారా మనీ లాండరింగ్ చేయడంలో సిద్ధహస్తుడు. తద్వారా కమీషన్లు పొందేవాడు. వైట్‌ను బ్లాక్ మనీగా, మళ్లీ బ్లాక్‌ను వైట్‌లోకి మార్చి కమీషన్ పొందుతుండేవాడు. వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా పెద్ద మొత్తాల్లో సొత్తు హవాలా చేసినందుకు గతంలో అతనిపై కేసులు నమోదయ్యాయి. ఈడీ అరెస్టు కూడా చేసింది. వైకాపా మద్యం ముఠా కోసం చోఖ్రా పలు డొల్ల కంపెనీలు సృష్టించి, అక్రమ నగదు లావాదేవీల కోసం వాటిని వినియోగించాడని అభియోగాలున్నాయి. ఈ నేపథ్యంలో అతనితో వైకాపా ముఠా సభ్యులు ఎవరెవరు సంప్రదింపులు జరిపారో సిట్ కూపీ లాగుతోంది.

పిల్లల చదువు సంధ్యలన్నీ.. తల్లిదండ్రుల దృష్టికొచ్చేలా!

మెగా పీటీఎం నిర్వహణకు సమగ్ర ప్రణాళిక

సమాధానపత్రాలు, ప్రోగ్రెస్, హెల్త్ కార్డులు అందజేత

మన్యం జిల్లాలో జరిగే సమావేశంలో పాల్గొననున్న సీఎం

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 5న నిర్వహించనున్న తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల బృహత్ సమావేశం (మెగా పీటీఎం)లో.. ఈసారి పిల్లలు రాసిన పరీక్ష పేపర్లను వారి తల్లిదండ్రులకు అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అన్ని పరీక్షలు ఒకే పుస్తకంలో రాసేలా మూల్యాంకన పుస్తకాలు ప్రవేశపెట్టారు. వాటిలోనే అన్నిరకాల పరీక్షలు రాయించి, మూల్యాంకనం చేసి మార్కులు వేస్తున్నారు. గతంలో ప్రత్యేకంగా పేపర్లపై రాసిన సమయంలో పరీక్ష పూర్తికాగానే వాటిని ఎక్కడో చోట పడేసేవారు. ఈసారి పుస్తకాల రూపంలో తీసుకొచ్చినందున, అవి అందరికీ అందుబాటులో ఉండనున్నాయి. ఈ మూల్యాంకన పుస్తకాల పరిశీలనతో తమ పిల్లలు పరీక్షలు ఎలా రాశారు? చదువుల్లో ఏ స్థాయిలో ఉన్నారు? ఎన్ని మార్కులు వచ్చాయి? అనే విషయం తల్లిదండ్రులకు తెలుస్తుంది. ఇక కొత్తగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును తల్లిదండ్రులకు ఇవ్వనున్నారు. విద్యాభివృద్ధి, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేధో సామర్థ్యాలు, సైన్స్ ప్రయోగాల పరిస్థితి, ఆటల్లో రాణింపు తదితర కోణాల్లో పిల్లల సమగ్ర వికాసానికి సంబంధించిన అంశాలను నమోదు చేస్తారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్‌కార్డులను తల్లిదండ్రుల సమావేశంలో అందిస్తారు.

■ ప్రాథమిక తరగతుల తల్లిదండ్రుల్లో ఒక్కొక్కరితో ఉపాధ్యాయులు చర్చిస్తున్నప్పుడు మిగిలిన వారు ఖాళీగా ఉండకుండా.. తల్లిదండ్రుల మొబైల్ ఫోన్‌లలో లీప్ ఇన్‌స్టాలేషన్ చేయిస్తారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్, నిపుణ్ ఆంధ్ర పాట, భాష, గణితం సబ్జెక్టుల్లో సాధించాల్సిన కనీస సామర్థ్యాలకు సంబంధించిన వీడియోలను వారికి చూపిస్తారు.

తల్లిదండ్రులకు ప్రత్యేక ఆహ్వానపత్రికలు

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండల కేంద్రంలో నిర్వహించే మెగా పీటీఎంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కడే ఉంటారు. మొదటిసారి బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎంకు సీఎం హాజరు కాగా, రెండో పర్యాయం శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ దఫా ఉత్తరాంధ్రలో పాల్గొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా పీటీఎంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు పాల్గొననున్నారు. తల్లిదండ్రులను ఆహ్వానించేందుకు పిల్లలతో ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలు తయారు చేయించి, అందిస్తున్నారు.

12 ఏళ్లు దాటిన వాహనాలను ఈ నెల 10 నుంచి నడపబోం

- సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వ తీరుకి నిరసనగా ఈ నెల 10 నుంచి రైల్వే గూడ్స్ యార్డులు, షిప్ యార్డులు, పొరసరఫరాల గోదాముల నుంచి సరకు రవాణా చేసే 12 ఏళ్లకు పైబడిన వాహనాలను నిలిపేస్తామని సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఎస్ఐఎంటీఏ) తెలిపింది. ఈ మేరకు తమిళనాడులోని వేలూరులో సోమవారం సమావేశమై పలు తీర్మానాలు చేసినట్లు అధ్యక్షుడు గోపాల్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి షణ్ముగప్ప, ఆల్ ఇండియా మోటార్‌ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు (సౌత్‌జోన్) వైవీ ఈశ్వరరావు చెప్పారు. రూ.1,340 ఉన్న ఫిట్‌నెస్ ఛార్జీలను కేంద్రం గరిష్ఠంగా రూ.33,040కి పెంచిందని, దీని వల్ల 12 ఏళ్లకు పైబడిన లారీ యజమానులపై అధిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత ఫీజులనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు 12 ఏళ్లకు పైబడిన లారీలను రోడ్లపై నడపబోమని వెల్లడించారు. సమావేశంలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళలకు చెందిన లారీల యజమానులు పాల్గొన్నట్లు ఈశ్వరరావు తెలిపారు.

క్వాంటమ్ ఆన్‌లైన్ శిక్షణకు 14 వేలకు పైగా దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ మిషన్‌లో భాగంగా 50 వేల మందికి క్వాంటమ్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చేందుకు అమెరికాలోని వైజర్, హైదరాబాద్‌లోని క్యుబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆహ్వానించిన దరఖాస్తుల ప్రక్రియకు విద్యార్థుల నుంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 8 నుంచి కోర్సును ప్రారంభించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులు, డిగ్రీలో గణితం, భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులు, ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారు, అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. దీనికి మూడు రోజుల్లోనే 14 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు.

రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.39 కోట్లు విడుదల చేసింది. మొత్తం 135 గురుకులాల్లో ఈ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనుంది.

నింగికీ నేలకూ ఉపగ్రహ బంధం

(మొదటి పేజీ తరువాయి)

భూమిపై నిఘా..

ఉపగ్రహం: కార్టోశాట్-3 సిరీస్
రిజల్యూషన్: 25 సెం.మీ.
ఏం చేస్తోంది: కార్టోశాట్ సిరీస్ ఉపగ్రహాలు భూమికి 600-800 కి.మీ. ఎత్తులో తిరుగుతాయి. 25 సెం.మీ. కంటే పెద్దగా ఉండే దేన్నైనా వేరు చేసి స్పష్టంగా గుర్తించగలవు. ఇవి పంపే అత్యంత స్పష్టమైన చిత్రాల ద్వారా మన ఇంట్లో కారును, పొలంలోని మట్టిని కూడా గుర్తించవచ్చు. అంతరిక్షం నుంచి చూస్తే రోడ్డుపై వెళ్లేది కారా లేకా లారీనా అని మాత్రమే కాదు.. దాని రంగునూ గుర్తించే సామర్థ్యమూ వీటికి ఉంటుంది.

అక్రమ నిర్మాణాల నియంత్రణ

ఉపగ్రహాలు: కార్టోశాట్ సిరీస్-2, 3
రిజల్యూషన్: 5.8 మీ

ఏం చేస్తాయి?: కార్టోశాట్ సిరీస్-2, 3 ఉపగ్రహాలు సెంటీమీటర్ల రేంజులో వివరాలు ఇవ్వగలవు. ఇవి ఉపరితలంపై భౌగోళిక మార్పులను, నిర్మాణాల విస్తీర్ణాన్ని గుర్తిస్తాయి. ఇందులో ఎల్ఐఎస్ఎస్-4 కెమెరా అందించే 5.8 మీటర్ల రిజల్యూషన్ చిత్రాలు, కొత్త రోడ్లు వేయడానికి, పట్టణాలు మ్యాపింగ్ చేయడానికి కీలకంగా మారాయి.

■ పాత రోడ్లు, జనాభా విస్తరణ ఆధారంగా, ఏ ప్రాంతంలో కొత్త రోడ్డు వేయాలి, ఎక్కడ వంతెనలు అవసరం.. వంటి మౌలిక సదుపాయాల ప్రణాళికనూ అధికారులు శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ప్రతి 3-6 నెలలకోసారి ఆయా ప్రాంతాల ఉపగ్రహ చిత్రాల్ని తీసుకుంటారు. వీటిని పాత చిత్రాలతో పోల్చి చూస్తారు. దీంతో ఎక్కడ కొత్తగా భవనం వచ్చింది, ఎక్కడ ఆక్రమణ జరిగిందో గుర్తించడానికి వీలవుతుంది.

■ ప్రభుత్వ భూములు, చెరువులు లేదా నదీ పరివాహక ప్రాంతాలు వాటి సరిహద్దులను ఉపగ్రహ చిత్రాలతో జియో ఫెన్సింగ్ చేస్తారు. ఆ సరిహద్దు లోపల ఏ కొత్త నిర్మాణం వచ్చినా అది 'అక్రమ నిర్మాణం'గా వెంటనే గుర్తిసారు. దీనికి ఆధారాలుగా ఈ ఉపగ్రహ చిత్రాలను సాక్ష్యంగా చూపొచ్చు.



2025లో బ్రహ్మోత్సవాలకు ముందు, ఉత్సవాలు జరుగుతున్న సమయంలో తిరుమల ఆలయ పరిసరాలను ఉపగ్రహం స్పష్టంగా చూపించింది ఇలా..

ఇవిగో కొన్ని ఉదాహరణలు...

■ 2016లో ఆర్మీ 'సర్జికల్ స్ట్రైక్స్' చేపట్టినప్పుడు కార్టోశాట్-2సీ ఉపగ్రహం భారత్-పాక్ సరిహద్దు ప్రాంతాలను జల్లెడ పట్టింది. అక్కడి దట్టమైన అడవుల్లో ఉగ్రవాదుల బంకర్లు ఎక్కడ ఉన్నాయి, అక్కడికి వెళ్లడానికి సురక్షితమైన దారులేవనే వివరాలను హైరిజల్యూషన్ చిత్రాల ద్వారా సైన్యానికి అందించింది.

■ 2024 జులైలో కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి భారీ విపత్తు సంభవించింది. కార్టోశాట్-3, రాడార్ శాటిలైట్ (ఆర్ఐఎస్ఏటీ).. ప్రమాదానికి రెండు రోజుల ముందే ఆ ప్రాంతంలో మట్టి కదిలిన ఆనవాళ్లను పసిగట్టాయి. ప్రమాదం తర్వాత 86 వేల చ.మీటర్ల భూమి ఎలా కొట్టుకుపోయిందో, నదీ ప్రవాహం ఎలా మారిందో చూపించే చిత్రాలను ఇస్రో విడుదల చేసింది. శిథిలాల కింద కూరుకుపోయిన ఇళ్లను గుర్తించడానికి ఆర్మీకి ఇవి దిక్సూచులుగా మారాయి.

■ తిరుమల ఘాట్‌రోడ్లలో తరచూ కొండచరియలు విరిగిపడుతుంటాయి. దీని కోసం ఇస్రో లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్ (లైడార్) టెక్నాలజీని వాడింది. విమానం నుంచి లేజర్ కిరణాలు ప్రయోగించి తిరుమల కొండలను మిల్లీమీటర్ల స్థాయిలో త్రీడీ మ్యాపింగ్ చేశారు. రెండో ఘాట్ రోడ్డులో 13 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. రెండో ఘాట్ రోడ్డులో 12వ కి.మీ. నుంచి 16వ కి.మీ. మధ్య దాదాపు 25 నుంచి 30 ప్రాంతాలను 'హై రిస్క్‌జోన్స్'గా మార్క్ చేశారు. అక్కడ రాతి పొరలు ఎంత బలహీనంగా ఉన్నాయో లెక్కలతో సహా తితిదే ఇంజినీర్లకు నివేదించింది. వాహనాల రాకపోకల వచ్చే ప్రకంపనాలకే కిందకు జారిపోయే ప్రమాదం ఉన్న భారీ బండరాళ్లను గుర్తించింది. దీని ఆధారంగానే తితిదే రూ.కోట్లు ఖర్చు చేసి ఆయా ప్రాంతాల్లో 'స్టీల్ మెస్, రాక్ బోల్టింగ్' నిర్మించింది.

అరచేతిలో ఇస్రో డేటా

ఉపగ్రహాలు అందించే ఇలాంటి కీలక డేటాను శాస్త్రవేత్తలే కాదు మన సెల్‌ఫోన్లలోనూ చూసుకునేందుకు ఇస్రో మూడు పోర్టల్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

భువన్
ఇది మన స్వదేశీ గూగుల్ ఎర్త్. మన గ్రామం, రోడ్లు, చెరువులను హైరిజల్యూషన్‌లో చూడొచ్చు.

సఫర్
ఏ గ్రామంలోనైనా గాలి నాణ్యత (ఏక్యూఐ), కాలుష్యం, వాతావరణ మార్పులను తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

వేదాస్
రైతులకు ప్రత్యేకం. పంట ఆరోగ్యం, భూ సార పరీక్షలు, సాగుకు సంబంధించిన వాతావరణ పరిస్థితులను దీని ద్వారా తెలుసుకోవచ్చు.

ఈనాడు

ఆధార్‌తో అనుసంధానించాల్సిందే!

అధికారంలో ఉన్న నాయకులు కాదు, వారిని ఎంచుకునే ప్రజల యుక్తాయుక్త విచక్షణా బలమే ఒక ప్రజాస్వామ్య దేశం శక్తిసామర్థ్యాలకు సరైన కొలమానం కాగలుగుతుంది. సమర్థత, దార్శనికత, నిస్వార్థం, కలుపుగోలుతనం కలగలిసిన వారిని పాలకులుగా ఎన్నుకోవడంలో జనసామాన్యమంతా భాగస్వాములు అయినప్పుడే ప్రజాప్రాతినిధ్య వ్యవస్థ పటిష్ఠమవుతుంది. ఆ మేరకు ప్రజాకాంక్షలకు పట్టంకడుతూ, ప్రజాసమస్యలకు సహేతుక పరిష్కారాలు చూపుతూ సామాజిక సమ్మిళిత సమగ్రాభివృద్ధికి సాధనంగా భారత ప్రజాతంత్రం తేజరిల్లాలంటే- అన్నింటి కన్నా ముందు ఎన్నికలు నిష్పాక్షికంగా స్వేచ్ఛాయుతంగా జరగాలి. అర్హులందరూ తమ ఓటుహక్కును కచ్చితంగా వినియోగించుకోవాలి. అందుకుగానూ పద్దెనిమిదేళ్లు నిండిన భారతీయుల్లో ప్రతి ఒక్కరూ ఓటేసేందుకు వీలుండాలి. కానీ, జాతి దౌర్భాగ్యం కొద్దీ దేశీయంగా ఓటర్ల లిస్టులు ఇప్పటికీ తప్పులతడకలుగానే అఘోరిస్తున్నాయి. జాబితాల్లోంచి అర్హుల పేర్లు అదృశ్యమై, బోగస్ ఓట్లు కుప్పలుతెప్పలుగా వచ్చి చేరడం వంటివి మన జనస్వామ్యాన్ని నేతిబీరగా నిలబెడుతున్నాయి. ఈ దయనీయావస్థను చెదరగొట్టాలంటే- ఓటరు కార్డులతో ఆధార్‌ను అనుసంధానించి తీరాలి!

ప్రస్తుతం పన్నెండు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ సాగుతోంది. వచ్చే గురువారం పూర్తి కావాల్సిన ఆ క్రతువు గడువును ఎన్నికల సంఘం తాజాగా మరో ఏడు రోజుల పాటు పొడిగించింది. ఇంతవరకు జరిగిన పనిని బట్టి పరిశీలిస్తే, పశ్చిమ బెంగాల్ ఓటర్ల లిస్టులో 40 నుంచి 50 లక్షల మంది మృతుల పేర్లు బయటపడొచ్చని అంటున్నారు. రాజస్థాన్‌లో 24 లక్షల మంది ఓటర్ల ఆనుపానులు తెలియట్లేదని చెబుతున్నారు. మరణించిన వారి ఓట్లను ఎప్పటికప్పుడు తీసేయలేకపోవడం ఒక సమస్య అయితే- ఊరూపేరూ లేని మనుషులు లిస్టులోకెక్కడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించే మరో వ్యవస్థాగత లోపం! గుట్టుచప్పుడు కాకుండా దొంగ ఓట్లు గుద్దుకోవడానికి రాజకీయ పార్టీలకు ఇవే అవకాశం కల్పిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పదిహేడు వందలకు పైగా పౌరసేవలు, సంక్షేమ పథకాలిప్పుడు ఆధార్ సాయంతోనే అమలవుతున్నాయి. ఆధార్‌తో లంకె మూలంగా నకిలీ రేషన్ కార్డులూ ఎల్పీజీ కనెక్షన్లను కోట్ల సంఖ్యలో తొలగించగలిగామని, పథకాల లబ్ధిదారుల్లో అనర్హులను ఏరేయగలిగామని అధికార యంత్రాంగం సగర్వంగా సెలవిస్తోంది. తద్వారా రూ.1.85 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఆదా చేయగలిగామనీ భుజాలు చరచుకుంటోంది. ఆధార్ అనుసంధానంతో దేశానికి అంతటి మేలు జరుగుతున్నప్పుడు ఓటర్ల జాబితాల ప్రక్షాళనకు దాన్నెందుకు ఉపయోగించుకోకూడదు?

డూప్లికేట్, బోగస్ ఓట్ల ఏరివేతకు ఉపకరించే ఆధార్‌తో ఓటరు కార్డుల అనుసంధాన సంకల్పాన్ని ఈసీ పదేళ్ల కిందటే ప్రకటించింది. జాబితాల సంస్కరణలో భాగంగా 66.23 కోట్ల మంది ఓటర్ల ఆధార్ వివరాలను అప్‌లోడ్ చేసినట్లు రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కానీ, నాలుగు నెలల క్రితం కేంద్రం రాజ్యసభలో చేసిన ప్రకటన ప్రకారం- ఓటరు కార్డులతో ఆధార్ అనుసంధానం ఇంకా మొదలుకావాల్సి ఉంది! శీఘ్రంగా దానికి శ్రీకారం చుడితే- ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్నవాళ్లను సులువుగా గుర్తించవచ్చు. జనన మరణాల రిజిస్ట్రర్లు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విభాగాల ద్వారా 'ఉడాయ్' సేకరిస్తున్న మృతుల వివరాలు ఎప్పటికప్పుడు ఈసీకి బట్వాడా అయితే చనిపోయినవారి ఓట్లనూ వెంటనే తొలగించవచ్చు. ఇదే సమయంలో ఆధార్ నంబర్ల కేటాయింపులో అక్రమాలపైనా ప్రభుత్వం నిఘా పెట్టాలి. ఎవరి దగ్గరైనా నకిలీలు లభ్యమైనా, లంచాలకు ఆశపడి విదేశీయులకు ఆ కార్డులను కట్టబెట్టినా... సంబంధిత వ్యక్తులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి!



సంస్థల సీఈవోలు సాంకేతిక నిపుణులు కానక్కర్లేదు కానీ, టెక్నాలజీలో వస్తున్న మార్పులు తెలుసుకుంటూ ఉండాలి. అవసరమైనప్పుడు తమ సంస్థలో ఆయా మార్పులు చేయగల ధైర్యం ఉండాలి. స్టేటస్‌కోని సవాలు చేయాలి. ఉద్యోగులకు మెంటార్ పాత్ర నిర్వహించాలి.

– కె.వి.కామత్

గెలుపు దారి

లోకంలో కొందరు తమ బుద్ధి విశేషంతో, అపార అనుభవంతో ఎలాంటి సమస్యలనైనా తేలిగ్గా ఎదుర్కొంటారు. సొంతంగా నిర్ణయాలు తీసుకోగల ఆ సామర్థ్యాన్ని స్వయం ప్రతిపత్తిగా చెప్పుకోవచ్చు. ఆ క్రమంలో విజయం సాధించినప్పుడల్లా తమపై తమకు నమ్మకం పెరుగుతూ వస్తుంది. ఆధ్యాత్మిక పరిభాషలో 'పౌరుషం' అంటే అదే!

మరికొందరు ప్రతి విషయానికీ దేవుడి సాయం ఆశిస్తారు. తమ చిత్తాన్ని దైవానికి అంకితం చేసి, కోరికలను ప్రార్థన రూపంలో భగవంతుడికి నివేదిస్తూ ఉంటారు. ఆ క్రమంలో గెలుపొందినప్పుడల్లా వారికి దేవుడిపై నమ్మకం మరింత బలపడుతూ వస్తుంది. అలా తమను తాము దైవానికి సమర్పణ చేసుకోవడమే- 'శరణాగతి'. ఆ మార్గంలో దక్కిన విజయాన్ని 'దైవికత' అంటారు. దైవ, పౌరుషాల మధ్య సమన్వయం చేకూరితే సంపూర్ణ విజయం సిద్ధిస్తుందని పెద్దల సూచన. అర్జునుడికి లభించింది అది. పూర్తి సామర్థ్యంతో, పరాక్రమంతో తానే యుద్ధం చేసినా కీలక సమయాల్లో మాత్రం కృష్ణుడి సహకారాన్ని స్వీకరించాడు. దైవ, పౌరుషాల ఆ మేలికలయిక కిరీటికి గొప్ప విజయాన్ని అందించింది. 'శిశుపాల వధ'లో మాఘకవి- ఆ కలుపుగోలు ధోరణిని వివరిస్తూ 'విద్వాంసుడు పూర్తిగా దైవంపై ఆధారపడడు. అలా అని, అంతా తన ప్రతిభనే పొరబడడు. సత్కవులకు శబ్దం, అర్థం రెండూ అవసరమైనట్లే... విజేతల విషయంలో దైవ పౌరుషాలు ఒకటవ్వాలి' అన్నాడు. ఆధునిక యుగంలో ఈ సూత్రాన్ని విజయవంతంగా అమలుచేసిన వారిలో భారత పూర్వ రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ అగ్రగణ్యులు.



అంతర్యామి

'ఆదినుంచీ దైవాన్ని నా కార్యకలాపాల్లో భాగస్వామిగా నమ్మడం అలవాటు. విధుల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించడం అన్నివేళలా సాధ్యం కాదని, అది నా శక్తికి మించినదని నాకు తెలుసు. నా సామర్థ్యాన్ని తొలుత అంచనా వేసుకుని దాన్ని యాభైశాతం పెంచి, నన్ను నేను దేవుడి చేతులకు సమర్పించుకుంటాను. ఆ తరహా సమష్టి భాగస్వామ్యంలో నేను అదనపు శక్తిని పొందడమే కాక, అది నిజంగానే నా ద్వారా ప్రసరిస్తున్న అనుభూతిని సైతం స్వయంగా ఆస్వాదించాను. దేవుడి రాజ్యం నీలోనే ఆ శక్తి రూపంలో ఉంటుందని నిశ్చయంగా చెప్పగలను' అంటూ తన ఆత్మకథలో కలామ్ చెప్పారు.

దిలీప్‌కుమార్‌గా పుట్టి పదహారో ఏట సూఫీజాన్ని స్వీకరించి, భారతీయ సినీ సంగీత జగత్తును శాసించే స్థాయికి ఎదిగిన ఎ.ఆర్.రెహమాన్ అనుభవమూ అదే. 'ఎప్పటికప్పుడు కొత్తదేదో చేయడానికి నన్నొక శక్తి ముందుకు తోస్తోందని నిత్యం అనిపిస్తూనే ఉంది' అన్నారాయన. పడమటి సంగీతానికి పట్టుచీర కట్టినట్లు తన పౌరుషానికి దైవికతను చుట్టబెట్టానని దాని అంతరార్థం.

కలామ్, రెహమాన్‌ల విషయంలో ఆధ్యాత్మికత అనేది విశ్వాసాలకు చెందినది కాదు- అధ్యయనం చేయాల్సిన అంశంగా నిరూపణ అయిన విషయం. దాన్ని అర్థం చేసుకుంటే ఆధ్యాత్మికతను మనిషి తనకు చోదకశక్తిగా మలచుకోగలుగుతాడు. అది గెలుపు దిశగా మనిషిని నడిపించగలుగుతుంది.

– ఎర్రాప్రగడ రామకృష్ణ



కొత్త కోడ్‌లతో... ప్రయోజనమెంత?

కేంద్రం నవంబరు 23ను చారిత్రక దినంగా ప్రకటించింది. వేతనాల కోడ్-2019తో పాటు 2020 నాటి పారిశ్రామిక సంబంధాలు; సామాజిక భద్రత; వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చినట్లు ప్రకటించింది. ఈ నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు మరింత సాధికారత కల్పిస్తాయనీ, వాణిజ్యాన్ని మరింత సులభతరం చేయడం ద్వారా 'వికసిత్ భారత్' సాకారానికి బాటలు పరుస్తాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కార్మిక సంఘాలు మాత్రం వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇంతకీ ఆ కోడ్‌లు ఏం చెబుతున్నాయి?

కార్మికుల సంక్షేమం ఉమ్మడి జాబితాలోని అంశం. అంటే, కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా దీనిపై చట్టాలు చేయవచ్చు. అయితే, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ఆమోదంతో మొత్తం 29 కార్మిక చట్టాలను కలిపి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చింది. దీంతో రాష్ట్రాలు వీటికి అనుగుణంగా తమ చట్టాలను సవరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. వాస్తవంగా విశ్లేషిస్తే- ఈ కొత్త కోడ్‌లలో చెప్పుకోదగిన కొత్తదనమేమీ లేదు. అంతకుముందు ఒకే అంశంపై ఉన్న వివిధ చట్టాలను సంగ్రహించి ఒక్కచోట క్రోడీకరించారు తప్పితే, మరీ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని చెప్పలేం!

వివక్షకు తావు లేకుండా...


గతంలో వేతనాన్ని వివిధ చట్టాలు రకరకాలుగా నిర్వచించాయి. తాజా నిర్వచనం ప్రకారం- ఇంటి అద్దె, రవాణా, ఆరోగ్యం, యూనిఫాం, ఇతరత్రా అలవెన్సులన్నీ కలిపి మొత్తం వేతనంలో 50శాతానికి మించితే, ఆ మించిన మొత్తాన్ని మూల వేతనంతో కలపాల్సి ఉంటుంది. అలా గణించిన మొత్తంపైనే వివిధ చట్టాల ద్వారా లభించే ప్రయోజనాలను లెక్కించాల్సి ఉంటుంది. దీనివల్ల ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ చెల్లింపులు పెరుగుతాయి. అదే సమయంలో ఉద్యోగులకు నెలనెలా చేతికందే మొత్తం తగ్గినా, పొదుపు పెరుగుతుందన్న విషయాన్ని గమనించాలి. ప్రస్తుత నిబంధన ప్రకారం, ఉద్యోగుల పింఛన్ పథకం కింద యాజమాన్యం సిబ్బంది వేతనంపై 8.35శాతం చందా చెల్లించాలి. అంటే వేతన పరిమితి రూ.15వేలకు గాను రూ.1,250 చెల్లించాల్సి ఉంటుంది. 2021-22 నాటి చందా వివరాలను పరిశీలిస్తే- ఈ పథకం కింద సుమారు ఆరు కోట్ల మంది చందాదారులు ఉన్నారు. అయితే, వీరిలో మూడు కోట్లమంది చందా రూ.600లోపు, 60లక్షల మంది చందా వంద రూపాయలలోపే ఉండటం విస్మయకరం. చాలా యాజమాన్యాలు కార్మికుల పూర్తి వేతనంలో పది శాతాన్ని బేసిక్‌గా, మిగతా మొత్తాన్ని అలవెన్సులుగా చూపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో కేంద్రం తీసుకొచ్చిన తాజా నిబంధనలు కచ్చితంగా ఆహ్వానించదగినవే.

1936నాటి పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్ రూ.24వేల లోపు వేతనం ఉన్నవారికే వర్తించేది. 1948 నాటి కనీస వేతన చట్టాన్ని నిర్ణీత ఉద్యోగాలకే పరిమితం చేశారు. ఇప్పుడు అన్ని సంస్థలకూ, అన్ని ఉద్యోగాలకూ ఈ నిబంధనలను వర్తింపజేశారు. ప్రతి ఉద్యోగికీ నియామక పత్రం, నెలవారీ వేతన స్లిప్‌లను అందించాలనీ, ప్రతినెలా ఏడో తేదీలోగా వేతనం చెల్లించాలని 'వేతన స్మృతి'లో పేర్కొన్నారు. అన్ని సంస్థల ఉద్యోగులకూ భవిష్యనిధి పథకాన్ని వర్తింపజేశారు. ఇంతకాలం కార్మిక రాజ్య బీమా పథకం(ఈఎస్ఐ) నోటిఫైడ్ ప్రాంతాలకే వర్తించేది. ఇప్పుడు దేశమంతటా ఈఎస్ఐ సదుపాయం రానుంది. పది కంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న సంస్థలు కచ్చితంగా ఈఎస్ఐ సదుపాయం కల్పించాల్సి ఉంటుంది. అంత కంటే తక్కువ మంది కార్మికులు ఉన్న సంస్థలు కూడా స్వచ్ఛందంగా ఈ పథకంలో చేరవచ్చు. అయితే, ప్రమాదకర పనులు నిర్వర్తించే సంస్థల్లో ఒక్క కార్మికుడు ఉన్నాసరే, ఈ చట్టం వర్తిస్తుందని కొత్త కోడ్ చెబుతోంది. పీఎఫ్ చందా చెల్లింపులో విఫలమైన సంస్థలపై విచారణ నిర్వహించడానికి ఇంతకుముందు ఎలాంటి కాలపరిమితి ఉండేదికాదు. ఇప్పుడు దీన్ని అయిదేళ్లకు కుదించారు. దీనివల్ల ఆయా సంస్థలు దీర్ఘకాలిక వివాదాల నుంచి తప్పించుకుంటాయని కార్మిక సంఘాలు అంటున్నాయి. కొత్త కోడ్‌లలో లింగ వివక్షను నిషేధించారు. స్త్రీలు, పురుషులు, ట్రాన్స్‌జెండర్ల విషయంలో పనివేళలు, వేతనాల చెల్లింపుల్లో ఎలాంటి వివక్షకూ తావుండరాదు. పైగా మహిళా కార్మికులు ఇకపై తమ అత్తమామలను కూడా కుటుంబ సభ్యులుగా పేర్కొనవచ్చు. కొత్త పారిశ్రామిక కోడ్ పరిధిలోకి గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లను, వీటిని నిర్వహించే అగ్రిగేటర్ సంస్థలను తీసుకురావడం విశేషం. వీరికోసం ప్రత్యేక సామాజిక రక్షణ నిధిని ఏర్పరచి, అగ్రిగేటర్ సంస్థలు తమ వార్షిక టర్నోవర్‌లో 1-2% చందాను దానికి చెల్లించేలా నిబంధనను తీసుకొచ్చారు. ఇప్పటికే తెలంగాణ సహా పలు రాష్ట్రాలు గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టాలను ప్రతిపాదించాయి.



కీలక అంశాలపై దృష్టి సారించాలి...

కాంట్రాక్టు ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా పని, వేతనం, ఇతర భత్యాలను ఇవ్వాలని కొత్త నిబంధనలు చెబుతున్నాయి. అంతకుముందు గ్రాట్యుటీ పొందాలంటే కనీసం అయిదేళ్ల సర్వీసు ఉండాలి. ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు ఏడాది సర్వీసు ఉన్నా గ్రాట్యుటీ ఇచ్చేలా నిబంధన తీసుకొచ్చారు. దీనివల్ల శాశ్వత నియామకాలు తగ్గిపోతాయనీ, కార్మిక సంఘాలను నిర్వీర్యపరిచే నిబంధనలు తీసుకొచ్చారనీ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ మేమో, కాంట్రాక్టు కొలువులు కాకుండా ప్రత్యక్షంగా నియామకాలు చేపట్టే అవకాశం పెరుగుతుందని చెబుతోంది. ఇప్పుడు అమలులోకి వచ్చినవి కేవలం కోడ్‌లు మాత్రమే. వీటి అమలుకు అవసరమైన నియమాలను, బాధ్యతలను ఇంకా ప్రకటించలేదు. ప్రభుత్వం ముందుగా వీటిపై ప్రజాభిప్రాయాన్ని కోరి, వివిధ వర్గాల అభ్యంతరాలనూ అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. రాజ్యాంగం మాదిరిగానే ఈ లేబర్ కోడ్‌లనూ అవసరమైనప్పుడు మార్చుకునే వీలుంటుందని గుర్తుంచుకోవాలి. ఉద్యోగుల పింఛన్ పథకం కింద ప్రస్తుతం ఇస్తున్న వెయ్యి రూపాయల పెన్షన్‌ను పెంచడం; ఈపీఎఫ్ వేతన పరిమితిని(రూ.15వేలను), ఈఎస్ఐ వేతన పరిమితిని(రూ.21వేలను) రెట్టింపు చేయడం వంటి ముఖ్యమైన అంశాలపై కార్మిక సంఘాలు దృష్టి సారిస్తే, ఎక్కువమంది వేతన జీవులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.



జె.శ్రీనివాస్
విశ్రాంత రీజినల్ పీఎఫ్ కమిషనర్–II



చలి.. చక్కిలిగిలి

'చలి బాగా పెరిగింది కదండీ..' మరింత ముడుచుకుపోతూ పక్కవాళ్లతో పలకరింపు. 'ఆ స్వెట్టర్ వేసుకో, చల్లగాలి కొట్టేస్తుంది' ఆత్మీయులతో ప్రేమపూర్వక సలహా. 'చలేస్తుంది, దగ్గరకి రా' ఆ ఒక్కరికీ ఓ అందమైన ఆజ్ఞ. చలి ఎంత మంచిదో! మాట్లాడుకునేందుకు బోలెడు విషయాలిస్తుంది. అది పెరిగినా, తగ్గినా వార్తే. ఉంటే 'ఊఊ...' అంటూ వణుకుపాట్లు. లేకపోతే 'ప్చ్.. అంతగా లేదు' అని నిట్టూర్పులు. భలే గమ్మత్తయినది ఈ చలి.

బడికెళ్లే బుడుతలు అసలే పొద్దున్న నిద్రలేవరు. అందునా ఈ చలికాలం వస్తే.. అంత పొగమంచులోనూ అమ్మలకు చుక్కలు కనిపించడం ఖాయం. 'లే బంగారం.. మా అమ్మ కదూ' అంటూ ఎంత బతిమాలినా దుప్పటి లోంచి బయటికి రాని ఆ చిన్నతనం ఓ లగ్జరీ. ముద్దులొలికే ఆ అల్లరి మొహాలను తనివితీరా చూస్తూ, చిరునవ్వుతో కోపం నటించే అమ్మానాన్నలకు అదో సంతోషకరమైన మార్నింగ్. మళ్లీ ఎప్పుడొస్తాయి అలాంటి రోజులు? మరి ఎంత మంచిదో కదా ఈ చలి!

ఆమెకు ఏసీతో పాటు ఫ్యాన్ కూడా ఉండాలి. అతడికి ఎంత వేడిలోనైనా దుప్పటి కావాలి. చలికాలం వచ్చిందంటే ప్రతి సాయంత్రం చర్చలే. కానీ అంత రచ్చలోనూ.. వెచ్చదనపు వాకిట్లో కాచుకునే చలిమంటలు.. చెలి మంటను తగ్గించేస్తాయి. తిరిగి మరో అందమైన ఉదయానికి తెరతీస్తాయి. చలే లేకపోతే ఇదంతా ఎలా? అమ్మో తలుచుకుంటేనే భయంగా ఉంది కదూ!

'త్వరగా లేవలేకపోతున్నాం బాబూ' అంటూ ఫిర్యాదు చేసే బామ్మగారే.. 'అప్పట్లో నాలుగింటికే లేచి చన్నీళ్లు తలకు పోసుకునేవాళ్లం తెలుసా' అంటూ గొప్పలు పోతుంది. మెడలో మఫ్లర్ వేసుకునైనా వెళ్తారే గానీ మార్నింగ్ వాక్ మాత్రం అస్సలు మానరు తాతగారు. ఆ పడీపడని ఎండలో పెద్దాయన స్నేహితులతో కలిసి కలబోసుకునే ఊసులకు ఈ చలే చక్కటి సాక్ష్యం.

ఏముంది ఈ చలిలో? చల్లగా ఒంటినీ, వెచ్చగా మనసునూ తాకే మధురమైన మత్తు ఏదో దాగి ఉంది. నోరు తెరిస్తే వచ్చే పొగలు, చల్లగా తాకే గాలి తెమ్మెరలు, ఉదయపు నీరెండలోని హాయిరాగాలు, అయిదింటికే కమ్ముకునే చీకట్ల మేఘాలు.. ఒకటా రెండా! ఎంత చెప్పినా చీటీ చాలని చిన్నెలెన్నో ఈ చలి సొంతం. అందునా తన జతకో కప్పు కాఫీ కలిస్తే.. ఆ సమయాన నచ్చిన మనిషి ఎదుట నిలిస్తే.. అలాంటి అనుభూతిని వర్ణించడానికి ఎన్ని మాటలున్నా చాలనే చాలవు. అందుకే ఈ చలి రోజులు భలే గొప్ప జ్ఞాపకాలు. నిశీధికీ ఉషోదయానికీ ఎక్స్‌ట్రా ఫ్లేవర్ యాడ్ చేసే ఈ చలికి మనం థాంక్స్ చెప్పే తీరాలి!

– చంద్రమౌళిక



ఢీకొంటే అంతే!

కొన్ని గ్రహశకలాలు తరచూ భూమికి సమీపంగా వస్తూ ఒకింత ఆందోళనకు గురి చేస్తుంటాయి. పొరపాటున అవి పుడమిని ఢీకొంటే ఉత్పాతాలు తప్పవు. 6.6 కోట్ల సంవత్సరాల కిందట దాదాపు పది కిలోమీటర్ల పరిమాణంలోని ఒక గ్రహశకలం భూమిని బలంగా తాకడం వల్లే డైనోసార్లు అంతరించిపోయాయి. అవనిపై భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. 2022లో భూ కక్ష్యకు సమీపంలో 31వేల గ్రహశకలాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. తరవాతి సంవత్సరంలో వాటి సంఖ్య దాదాపు 34 వేలకు చేరింది.

(ఆధారం: నాసా సెంటర్ ఫర్ నియర్-ఎర్త్ ఆబ్జెక్ట్ స్టడీస్)

2024లో భూమికి దగ్గరలో ఆయా పరిమాణాల్లో ఎన్ని ఆస్టరాయిడ్లను గుర్తించారంటే...



సమస్యలు అనేకం... పరిష్కారాలే ప్రశ్నార్థకం!

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరణ లేదా పునర్ వ్యవస్థీకరణ చేయాలని నీతిఆయోగ్ సూచించింది. ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీ, కెనరా బ్యాంకులను మాత్రమే ప్రభుత్వ నియంత్రణలో ఉంచాలని పేర్కొంది. దీని ద్వారా వికసిత్ భారత్- 2047 లక్ష్యాలకు అనుగుణంగా 20 అంతర్జాతీయ అగ్ర బ్యాంకుల జాబితాలో కనీసం రెండు భారతీయ ప్రభుత్వరంగ బ్యాంకులు చేరే అవకాశం మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయం మంచిదే అయినా బ్యాంకింగ్ రంగంలోని ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం చాలా అవసరమిప్పుడు!

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఎక్కువ

గడచిన పదేళ్లలో (2014-24) షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు మొత్తం రూ.16.35 లక్షల కోట్లు నిరర్థక ఆస్తులుగా ప్రకటించాయి. అందులో కేవలం రూ.2.69 లక్షల కోట్లు మాత్రమే, అంటే 16శాతమే వసూలైంది. ఈ నిరర్థక ఆస్తుల్లో ప్రైవేటు బ్యాంకుల వాటా కేవలం రూ.4.46 లక్షల కోట్లుకాగా, ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా రూ.12.08 లక్షల కోట్లు కావడం గమనార్హం. ఎన్‌సీఎల్‌టీ, ఎన్‌సీఎల్ఏటీ, డీఆర్‌టీలలో వేలకొద్దీ కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఎన్‌సీఎల్‌టీలో 2024 జూన్ నాటికి 19,770 కేసులున్నాయి. సగటున కేసుల పరిష్కారానికి 716 రోజులు పడుతోంది. దివాలా, దివాలా కోడ్ (ఐబీసీ) కింద 2025 ఏప్రిల్ వరకు 3,400 కంపెనీల కేసులు పరిష్కారమయ్యాయి. రూ.3.58 లక్షల కోట్లు, అంటే మొత్తం బకాయిల్లో 32.1శాతమే వసూలైంది. 2023-24లో ప్రభుత్వం సంబంధిత చట్టాలకు 12 సవరణలు చేసి సుమారు 86 కీలక మార్పులు తీసుకొచ్చినా ఎన్‌సీఎల్‌టీ, డీఆర్‌టీ సభ్యుల నియామకంలో జాప్యం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదు. సభ్యుల నియామకం సకాలంలో చెయ్యాలని సుప్రీంకోర్టు పలుమార్లు నిర్దేశించినా పరిస్థితి మెరుగు పడలేదు. బకాయి పడ్డ కంపెనీలను స్వాధీనం చేసుకుని, వాటి యాజమాన్యాన్ని మార్చి, మళ్లీ లాభాల బాటలో నడిపి, తద్వారా బ్యాంకులు తమ రుణాలను వసూలు చేసుకోవడానికి 2021లో బ్యాడ్ బ్యాంకు అనే సంస్థను ఏర్పాటుచేశారు. దీని ద్వారా రెండు లక్షల కోట్ల రూపాయల బకాయిలను వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటిదాకా బ్యాడ్ బ్యాంకుకు బదలాయించిన బకాయి రుణాల విలువ రూ.62వేల కోట్లు మాత్రమే. 2025 మార్చి నాటికి 1,629 మంది ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులు ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.1.62 లక్షల కోట్లు ఎగవేశారు. క్రెడిట్ కార్డులు, ఇంటర్నెట్ నేరాలే ఎక్కువగా ఉన్నాయని, నేరాల విలువలో రుణ బకాయిలు అధికంగా ఉన్నాయని, రుణ బకాయి నేరాలు ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనే ఎక్కువని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు బలంగా ఉండటమే ఇందుకు కారణం. 2019 నుంచి దేశంలో కొన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు పతనమయ్యాయి. పీఎంసీ బ్యాంకు, ఎస్ బ్యాంకు, ఐఎల్ఎఫ్ఎస్, డీహెచ్ఎఫ్ఎల్‌లే ఇందుకు ఉదాహరణ. ఇటీవలి కాలంలో ఇండస్‌ఇండ్ బ్యాంకు రూ.1,500 కోట్ల నష్టాన్ని గోప్యంగా ఉంచినట్లు వెల్లడైంది. ఆర్‌బీఐ, సెబీల మధ్య సమన్వయ లోపమే వీటన్నింటికీ కారణం. నియంత్రణ సంస్థలకు స్వతంత్రత, ఆర్థిక స్వావలంబనతోపాటు, వాటి మధ్య మెరుగైన సమన్వయం అవసరం.



చిన్న, పెద్ద ప్రభుత్వరంగ బ్యాంకులను విలీనం చేసే తదుపరి దశను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. భారత దేశానికి ప్రపంచ స్థాయిలో పోటీ పడగల పెద్ద బ్యాంకులు అవసరమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పేర్కొనడం గమనార్హం.

పతనం వైపు నెట్టే లోపాలు

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కేంద్రం పెట్టుబడి వాటాను తగ్గించి, వాటిలో జోక్యాన్ని తొలగించాలంటూ నాయక్ కమిటీ (2014) చేసిన ప్రతిపాదన ఇప్పటికీ అమలు కాలేదు. దీనివల్ల ప్రభుత్వరంగ బ్యాంకులపై ఆర్‌బీఐతోపాటు, ప్రభుత్వ నియంత్రణ కూడా కొనసాగుతోంది. ఇలాంటి ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా, ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేసేసి, తద్వారా అంతర్జాతీయ పరపతి సాధించాలనుకోవడం ప్రయాసే. నిబంధనలు, వ్యవస్థల్లోని లోపాలు ఎంతటి పెద్ద బ్యాంకునైనా పతనం వైపు నెట్టే అవకాశం ఉంది. మన బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలు ప్రస్తుతం చిన్నగానే అనిపించినా, చిన్న రంధ్రం కూడా పెద్ద పడవను నిలువునా నీళ్లలో ముంచగలదన్న సత్యాన్ని విస్మరించకూడదు. కాబట్టి ప్రభుత్వం, ఆర్‌బీఐ ప్రభుత్వరంగ బ్యాంకులను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించాలి. బ్యాంకింగ్ రంగంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి.



డాక్టర్ బి.యస్.వి.పార్థసారథి
మాజీ వైస్ ప్రెసిడెంట్,
బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ అండ్ కువైట్


రైలుబండి.. కబుర్లు!

హాయ్ నేస్తాలూ..! మనం చాలాసార్లు రైలు ఎక్కే ఉంటాం కదా! మరి మనకు దాని గురించి ఏం తెలుసు అంటే.. 'కూ.. చుక్.. చుక్ అంటూ పెద్దగా శబ్దం చేస్తుంది.. చాలా వేగంగా వెళ్తుంది. ఎక్కువమంది ఎక్కొచ్చు' అని చెబుతాం అంతే కదా! కానీ ట్రైన్‌కి సంబంధించి ఇంకా బోలెడు విషయాలున్నాయి..!

హాయ్! బుజ్జీ!!

అప్పట్లో గనుల్లోంచి బొగ్గును తీసుకెళ్లడానికి చిన్న బండ్ల లాంటివి ఉండేవి. వాటి స్థానంలో వేరే ఏదైనా వాహనం ఉంటే బాగుండు అనుకున్నప్పుడే ఈ రైలు ఆలోచన పుట్టిందట నేస్తాలూ! అంటే బొగ్గును మోసుకెళ్లడానికి కనిపెట్టిన వాహనం అన్నమాట రైలు. అది కాలక్రమంలో సరకులు రవాణా చేయడానికి, మనం ప్రయాణం చేయడానికి పనికొచ్చేలా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం నడిచే ట్రైన్లన్నీ ఎలక్ట్రిక్‌వే కదా. కానీ మొదట్లో రైళ్లు ఆవిరితో నడిచేవి తెలుసా! 'ఆవిరితో ఎలా నడుస్తాయి. అది సాధ్యమవుతుందా?' అని ఆశ్చర్యంగా అనిపించినా అదే నిజం! మొదటి స్టీమ్ ఇంజిన్ రైలును జార్జ్ స్టీఫెన్‌సన్, రిచర్డ్ ట్రెవిథిక్ అనే ఇద్దరు ఇంజినీర్లు 1804లో కనిపెట్టారు. ఇది గంటకు 20-30 కిలో మీటర్ల వేగంతోనే నడిచేదట. ఇదెలా పని చేసేదంటే.. ఒక పెద్ద ట్యాంక్‌లో బొగ్గు కొన్ని ఇంధనాల సాయంతో నీటిని మరిగిస్తారు. నీళ్లు ఎక్కువగా మరిగినప్పుడు ఆవిరి వస్తుంది కదా! ఆ ఆవిరి ఒత్తిడి వల్ల రైలు ముందుకు కదులుతుందన్నమాట. ఇంకా మొదట్లో ట్రైన్‌లో హారన్‌కి బదులుగా గంటని వాడేవారట. ట్రాక్‌లు కూడా చెక్కతో చేసేవారు. తరవాత్తరవాత.. ఐరన్ రైల్వేట్రాక్‌లు వచ్చాయి.

1853లో మన దేశంలో మొదటిసారి అప్పటి బొంబాయిలో రైలుని ప్రారంభించారు. వేగంగా సరకు రవాణా చేయడానికి, సైన్యాన్ని ఒకచోటు నుంచి ఇంకోచోటకు పంపించడానికే బ్రిటిష్ వాళ్లు దాన్ని తీసుకొచ్చారు. ఈ ట్రైన్ విశేషాలు మీకెలా అనిపించాయి ఫ్రెండ్స్..! ★



నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'అరకు'లో ఉంటాను కానీ 'చెరకు'లో లేను. 'వల'లో ఉంటాను కానీ 'వెల'లో లేను. 'కారం'లో ఉంటాను కానీ 'దూరం'లో లేను. 'వంశం'లో ఉంటాను కానీ 'వంక'లో లేను. నేనెవర్ని?
2. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'సరి'లో ఉంటాను కానీ 'హరి'లో లేను. 'మనం'లో ఉంటాను కానీ 'ధనం'లో లేను. 'గాయం'లో ఉంటాను కానీ 'గాలం'లో లేను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1.అవకాశం 2.సమయం

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
మంగళవారం డిసెంబరు 2, 2025

మన నగరికి.. మరో మణిహారం!

- గొల్లపూడి-కనకదుర్గ వారధి మధ్య భారీ పైవంతెన
- ఎన్‌హెచ్-65 విస్తరణలో 5 కి.మీ. మేర నిర్మాణం

ఈనాడు – అమరావతి


గొల్లపూడి ప్రాంతం

విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్-65 ఆరు వరుసల విస్తరణలో భాగంగా నగర పరిధిలో భారీ పైవంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. గొల్లపూడి నుంచి కనకదుర్గ వారధి వరకు 5 కి.మీ. మేర దీన్ని నిర్మించే ప్రతిపాదనలను కన్సల్టెన్సీ డీపీఆర్‌లో పొందుపరిచింది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాఫిక్ రద్దీ పెద్ద సమస్యగా మారింది. ఈ పైవంతెన నిర్మిస్తే సాఫీగా రావచ్చు. ప్రస్తుత రహదారిని సర్వీస్ రోడ్డుగా మారుస్తారు.

రూ. 500 కోట్ల వ్యయం

❖ ఆరులైన్ల విస్తరణకు అవసరమైన భూమి వెడల్పు 60 మీటర్లు ఉండాలి. ఇక్కడ 40-50 మీటర్ల మధ్యలో ఉంది. భూమి సేకరించాల్సి వస్తే భూమి మార్కెట్ విలువ గజం రూ. లక్ష ఉంది.

❖ ఈ ఐదు కిలోమీటర్లు భూమి సేకరించి విస్తరించాలంటే రూ.వెయ్యి కోట్లు అవసరమని ఎన్‌హెచ్ అంచనా. పైవంతెన అయితే.. రూ.500 కోట్లు చాలు. అన్ని విధాలుగా ప్రయోజనం కూడా.

❖ ఈ ప్రాంతం.. దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలకు కేంద్రం. ఆవాస గృహాలు ఉన్నాయి. విస్తరణ నేపథ్యంలో భూమి సేకరిస్తే ఇవన్నీ తొలగించాల్సి వస్తుంది.

❖ ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో భారీ పైవంతెన నిర్మాణం క్షేమమని భావిస్తున్నారు. ఒకవైపు ట్రాఫిక్ వదిలి మరోవైపు నిర్మించాలని నిర్ణయించారు.

❖ ప్రస్తుతం డీపీఆర్ ప్రాజెక్టు అప్రైజల్ అండ్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీ(పీఏటీఎస్‌సీ) ముందుకు వెళ్లింది. అక్కడ ఆమోదిస్తే మిగిలిన దశల్లో పరిశీలన పూర్తయ్యాక 2026 ఏప్రిల్ నాటికి పనులు మొదలయ్యే వీలుంది.

శేషమ్మ సంకల్పం.. శ్రీవారి ఆలయం సాకారం



తిరుమల వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం, శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహించడం ఆమె జీవితంలో ఒక భాగమైంది. ఆ దేవదేవుడికి తన వంతుగా సేవ చేయడానికి ఓ ఆలయం నిర్మించాలనుకుంది. అలా 30 ఏళ్లుగా ఆ ఆలోచన తన మదిలో ఉండిపోయింది. జీవిత చరమాంకంలోనైనా దాన్ని కార్యరూపంలోకి తేవడానికి సిద్ధపడింది. అందుకు రూ.కోటి విలువ చేసే స్థలం ఇవ్వడంతో పాటు ఆలయ నిర్మాణానికి మరో రూ.కోటి విరాళంగా అందించింది. కంకిపాడు మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన బీసవరపు శేషమ్మ(90) వెంకటేశ్వరుడికి పరమభక్తురాలు. గుడి నిర్మిద్దామని నిర్ణయించుకున్న తర్వాత గ్రామ పరిధిలో జాతీయ రహదారికి సమీపంలో ప్రధాన మార్గానికి పక్కనే ఉన్న 30 సెంట్ల స్థలాన్ని గతేడాది కేటాయించింది. అంతేకాకుండా పనుల కోసం రూ.కోటి ఇచ్చింది. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తికాగా త్వరలో ప్రతిష్ఠాపనోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమె సంకల్పానికి కుటుంబ సభ్యుల సహకారం తోడవడంతో ఇదంతా సాధ్యమైంది. భక్తులకు ఆహ్లాదమిచ్చేలా దర్శన భాగ్యం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు శేషమ్మ చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు(కంకిపాడు)

వీడిపో మేఘమా.. వేదనే తేకుమా

ఈనాడు – అమరావతి

↗ అన్నదాతల్లో దిత్వా తుపాను కలవరం
↗ పంటలు కాపాడుకునేందుకు ఆరాటం



దిత్వా తుపాను తీవ్ర ప్రభావం లేకున్నా అన్నదాతల్లో అంతులేని అలజడి నింపింది. క్షణక్షణం... భయం భయంగా రైతులు గుండెలు గుప్పిట పెట్టుకుని కాలం గడుపుతున్నారు. పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న తడిసిపోకుండా రక్షించుకునేందుకు ఖర్చు తడిసిమోపెడవుతోంది.

మొక్కజొన్న.. దక్కేనా..? 11 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. 50 శాతం కోత పూర్తవగా ఎక్కువ పంట కల్లాల్లోనే ఉంది. కొనుగోలు కేంద్రాలు తెరవని వేళ... రైతులకు మద్దతు ధర రూ.2,400 దక్కడం లేదు. దళారులు రూ. 1700లకే కొంటున్నారు. ఇప్పుడు ఏమాత్రం తడిసినా ఎందుకూ పనికి రాదు. ఒక్కో పట్టా రూ.5వేలు పెట్టి కొని పంటను కాపాడుకుంటున్నారు. మొక్కజొన్న పోగు చేయడానికి కూలీ ఖర్చు అదనం.

కలవరంతోనే.. జిల్లాలో 1.46 లక్షల ఎకరాల్లో వరి వేశారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, రెడ్డిగూడెం తదితర మండలాల్లో 50 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ధాన్యం మొత్తం రహదారుల మీద, పొలాల్లో కల్లాలపైనే ఉంది. వర్షం పడితే అంతే సంగతులు. కోత పూర్తి కానిచోట్ల గాలులు వీస్తే పైరు పడిపోతోందని వాపోతున్నారు. ప్రభుత్వం సొసైటీల ద్వారా 2,200 పట్టాలు రైతులకు అందించింది.

ముంగిట విపత్తి... జిల్లాలో 89 వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. మొంథా తాకిడితో నందిగామ, వీరులపాడు, కంచికచర్ల, పెనుగంచిప్రోలు, మైలవరం పరిధిలో వందల ఎకరాల్లో పత్తి నిలువునా కుళ్లింది. నాణ్యత లేమితో ధర పడిపోవడం, సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో రైతులు కుదేలయ్యారు. కాస్తో.. కూస్తో మిగిలిన పంట రెండ్రోజుల జల్లులకు తడిసింది.

రూ.13 వేలు అదనపు భారం...

నాలుగెకరాల్లో మొక్కజొన్న వేస్తే... 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వర్షానికి తడిస్తే ఎవరూ కొనరు. రూ.10 వేలు పెట్టి రెండు పట్టాలు కొన్నా. పంట పోగేసేందుకు నలుగురు కూలీలకు రూ.3 వేల వరకు ఖర్చయింది. అప్పు తెచ్చి రూ.13 వేలు ఖర్చు చేశా. కొనుగోలు కేంద్రాలు తెరవాలి.
– చెరుకూరి గోపాలరావు, వీరులపాడు

వాతావరణం భయపెడుతోంది

నాలుగెకరాల్లో వరి వేశా. జల్లుల దెబ్బకు... తిండి, నిద్ర లేకుండా అల్లాడుతున్నాం. ఎకరాకు రూ.35 వేల పెట్టుబడి పెట్టాం. మిల్లర్లు తేమ శాతం 17 దాటితే ధాన్యం కోత పెడుతున్నారు. కూలీలకు రోజుకు రూ.2 వేలు ఖర్చు చేస్తున్నాం. 20 శాతం తేమ ఉన్నా కోత లేకుండా ప్రభుత్వమే కొనాలి. – నాగభూషణం, పెనుగంచిప్రోలు

రాయనపాడులో దిగితే.. అంతే..!

- అర్ధరాత్రి దాటాక ఆగే రైళ్లే అధికం...
- స్టేషన్ నుంచి ఇంటి కెళ్లాలంటే చుక్కలే


అమృత్ భారత్‌లో భాగంగా తీర్చిదిద్దిన రాయనపాడు స్టేషన్

“ రాయనపాడు రైల్వేస్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా మారుస్తామని ఆరేళ్ల కిందట ప్రకటించారు. 2019 డిసెంబరు నుంచి ప్రయోగాత్మకంగా కొన్ని రైళ్లను రాయనపాడు మళ్లించి అక్కడ ఆపుతున్నారు. రాజమహేంద్రవరం, వరంగల్ వైపు వెళ్లే ఏడేసి రైళ్లను ఆపుతున్నా వీటిలో అర్ధరాత్రి ఆగేవే అధికం. ”

“ ఆ సమయంలో... స్టేషన్ నుంచి నగరానికి చేరేందుకు.. ప్రైవేటు వాహనాలు, ఆటోలే దిక్కు. ఆర్టీసీకి లేఖలు రాసినా స్పందించలేదనేది రైల్వే మాట. తాజాగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. రాయనపాడును అభివృద్ధి చేశారు. ఇప్పటికైనా రవాణా సౌకర్యాల పెంపుపై దృష్టి పెట్టాలి. ”

ఈనాడు – అమరావతి

విజయవాడకు రాకుండా రాయనపాడు నుంచి గుణదలకు నేరుగా బైపాస్‌లో కొన్ని రైళ్లను ఆరేళ్ల కిందట పంపించారు. తర్వాత కొన్ని ప్రత్యేక రైళ్లను రాయనపాడు మీదుగా మళ్లించారు. ఆపై రాయనపాడు స్టేషన్ నుంచి విజయవాడ ఈశాన్య కేబిన్ మీదుగా.. బల్బ్‌కేబిన్ పక్కనుంచి నేరుగా గుణదలకు రైళ్లు చేరుకునేలా దారేశారు. ఈదారిని గతంలో గూడ్స్ రైళ్లు తిప్పేందుకు వాడేవారు. తర్వాత ఎక్స్‌ప్రెస్‌లు నడిచేలా మార్చారు. ఈ ట్రాక్‌పై ప్రత్యేక రైళ్ల రాకపోకలు సత్ఫలితాలు ఇవ్వగా.. పూర్తిస్థాయిలో రోజువారీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపడం ఆరంభించారు.

14 రైళ్లను ఆపుతున్నా... విజయవాడ స్టేషన్‌తో సంబంధం లేకుండా 2020 ఏప్రిల్ నుంచి రాయనపాడు నుంచి నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లను... కాకినాడ పోర్ట్-లింగంపల్లి గౌతమి(12737/38), కాకినాడటౌన్-లింగంపల్లి కోకెనడా(12775/76), నాందేడ్-సంబల్‌పూర్(20809/10), విశాఖ-నాందేడ్ (20811/12) నడపడం ఆరంభించారు. ఇప్పటికీ ఇవే ఇక్కడి నుంచి నడిచే ప్రధాన రైళ్లు. ఇవికాక.. పండగలు, సెలవుల్లో నడిపే రైళ్లనూ రాయనపాడులో ఆపుతున్నారు. ప్రయాణికులు తెలియక.. విజయవాడ అనుకుని రాయనపాడుకు టిక్కెట్ బుక్ చేసుకుంటే.. అంతే. ఏ అర్ధరాత్రికో రైలొచ్చి ఆగుతుంది. అక్కడి నుంచి ఇంటికెలా వెళ్లాలో తెలియక.. ఆటోవాలాల బాదుడు భరించలేక లబోదిబోమంటున్నారు.

రవాణా సౌకర్యాలే కీలకం... హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు.. రాయనపాడుకు రావడానికి ఎంత ఖర్చవుతోందో, ఇక్కడి నుంచి ఇంటికి చేరడానికీ అంతే అవుతోంది. ప్రస్తుతం ఆపుతున్న రైళ్లలో అధికంగా అర్ధరాత్రి 12.30, 1, 2 గంటలకు వస్తున్నవే అధికం. ఆర్టీసీ 24 గంటల సర్వీసులను ఆరంభిస్తామని ఆరేళ్ల కిందట చెప్పినా ఒక్క సర్వీసునూ నడపక పోవడంతో ప్రయాణికులకు వాత తప్పడం లేదు.

బుల్లి పిట్టకు.. బుజ్జి గూడు..



పక్షి ప్రేమికులు వాటికి ఆహారాన్ని అందించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. వాటికి కృత్రిమ గూళ్లు, అందమైన బాటిళ్లలో ఆహారంగా చిరుధాన్యాలను ఉంచి ఇళ్ల ముందు వేలాడదీస్తున్నారు. పక్షులు ఏదో ఒక సమయంలో వచ్చి గింజలను తింటాయి. విజయవాడ నగరం హనుమాన్‌పేటలోని సీపీఐ దాసరి భవన్ ముందు కనిపించిన గూళ్లివి.

- ఈనాడు, అమరావతి

ఆర్జిత సేవల వేదిక మార్పు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలోని ఆర్జిత సేవలను నూతనంగా నిర్మించిన ఏసీ పూజ మండపంలోకి మార్పు చేస్తున్నామని ఈవో శీనానాయక్ తెలిపారు. సోమవారం దుర్గమ్మ ఆలయ ప్రాంగణాన్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కుంకుమార్చన, శ్రీచక్రార్చన సేవలను పూజ మండపంలో నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న ఆశీర్వచన మండపంలో కాకుండా అమ్మవారి దర్శనం చేసుకొని వచ్చిన వారికి వేద అశీర్వచనం మూల విరాట్‌కు ఎదురుగా కుంకుమార్చన చేసే ప్రాంతంలో చేసేందుకు వారం రోజుల పాటు ట్రయల్ రన్ వేస్తున్నామని తెలిపారు. ఈ మార్పులతో దుర్గమ్మ ప్రధాన ఆలయం చుట్టూ కొంత వెసులుబాటు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఈ రాంబాబు, ఏఈవో వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇదేం వేట.. ప్రాణాలతో ఆట..



సరదాగా గాలాలతో చేసే చేపల వేట కారణంగా ఎంతో మంది ప్రమాదాల పాలై ప్రాణాలు కోల్పోతున్నారు. బస్టాండు సమీపంలో ఉన్న రైల్వే వంతెన పైకి ఎవరినీ వెళ్లనివ్వరు. అయినప్పటికీ అటు రైల్వే, ఇటు పోలీసుల కళ్లు గప్పి రైల్వే వంతెన కింద ఉన్న గట్టు పైకి చేరి ఇలా ప్రమాదకరంగా చేపల వేట సాగిస్తున్నారు.

- ఈనాడు, అమరావతి

అక్షర ఆడితే.. పతకం సొంతమే

న్యూస్‌టుడే, కానూరు, పోరంకి



పోరంకికి చెందిన **అల్ల అక్షర** వయసు పదమూడు. 7వ తరగతి చదువుతున్న చిన్నారి గోగేమ్, ఐస్ స్కేటింగ్, స్కేటింగ్, కూచిపూడి నృత్యాల్లో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన అసమాన ప్రతిభ చాటుతోంది. తండ్రి నరేంద్రకుమార్, తల్లి వైష్ణవీదేవి. వారు అక్షరకు చిన్ననాటి నుంచి కూచిపూడి నృత్యంతో పాటు తనకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ అందించారు. కోచ్ ప్రసాద్ వద్ద స్కేటింగ్, ఐస్‌స్కేటింగ్‌తో పాటు, జపనీస్ గోగేమ్‌లో శిక్షణ తీసుకుంది. వాటిల్లో నైపుణ్యం చూపిస్తూ పోటీలకు సిద్ధమైంది. చక్కగా రాణిస్తూ బంగారు, వెండి పతకాలతో అదరగొడుతోంది.

గోగేమ్‌లో అవార్డులు..

★ 2024లో బిహార్‌లో జరిగిన గోగేమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అక్షర అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బంగారు పతకాలు సాధించింది.

★ 2025 ఫిబ్రవరిలో బిహార్‌లో జరిగిన పోటీల్లోనూ అదే రీతిలో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుంది.

★ 2025 నవంబరులో ఒడిశాలో జరిగిన గోగేమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14 విభాగంలో సిల్వర్, అండర్-17లో బంగారు పతకాలు సాధించింది.

స్కేటింగ్‌లో సత్తా..

■ 2024లో ఐస్ స్కేటింగ్ పోటీలు గుర్గావ్‌లో జరగ్గా అక్షర జాతీయ స్థాయిలో సిల్వర్ పతకం అందుకుంది.

■ 2025లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి ఐస్‌స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

కూచిపూడి నృత్యంలో రాణిస్తూ

అక్షర గురువు నరేంద్ర వద్ద కూచిపూడి నృత్య శిక్షణ తీసుకుంది. ఇందులోనూ రాణిస్తూ 2024లో ఫ్రాన్స్‌కు చెందిన వరల్డ్ పెర్ఫార్మెన్స్ ఆర్ట్ ఛాంపియన్‌షిప్-2024 అవార్డు అందుకుంది. ఇంకా జాతీయ స్థాయిలో 12కు పైగా అవార్డులు సొంతం చేసుకుంది. ఆమెకు శివనంది, బసవనంది, నృత్యప్రభ, నృత్యకృష్ణవేణి, శ్రీకృష్ణనాట్యరవళి అవార్డులు వచ్చాయి. క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నది తన లక్ష్యమని అక్షర చెబుతోంది.

జగమే చూసేలా.. జయమే మురిసేలా..

- అంధుల మహిళా టీ 20 ప్రపంచ కప్ కైవసంలో కీలకపాత్ర
- కరుణకుమారి విజయగాథ



ఆసక్తి, ఎంచుకున్న లక్ష్యంపై మనసు పెడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది అల్లూరి సీతారామరాజు జిల్లా వంట్లమామిడి గ్రామానికి చెందిన **వంగి కరుణ కుమారి** (15). తల్లిదండ్రులు సంధ్య, రాంబాబు వ్యవసాయ కూలీలు. భారత అంధుల మహిళా టీ 20 జట్టులో స్థానం సాధించి ప్రత్యేకత చాటుకుంది. గత నెలలో కొలంబోలో జరిగిన తొలి అంధుల మహిళ టీ 20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌పై 28 బంతుల్లో 42 పరుగులు సాధించి జట్టు విజయంలో ఆమె కీలకపాత్ర పోషించింది. దీంతో ఒక్కసారిగా ప్రపంచవ్యాప్తంగా కరుణకుమారి పేరు మార్మోగింది. ఆమె ఈ స్థాయికి ఎదగడానికి దోహదపడిన అంశాలు ఇలా...

★ **మనోనేత్రమే దివిటీ..:** మన్యం ప్రాంతానికి చెందిన కరుణకుమారి చిన్నతనం నుంచి అంధురాలు. పాడేరులోని బాల సదన్ స్కూల్‌లో ఏడో తరగతి వరకు చదివింది. ఆమెకు చిన్నతనం నుంచి ఆటలపై మక్కువ. కానీ ఆడలేని పరిస్థితి. ఎనిమిదో తరగతిలో విశాఖలోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశించింది. అక్కడ ఆట, క్రీడల్లో సాధన చేసే అవకాశం వచ్చింది. క్రికెట్‌పై ఆసక్తి ఉన్నా.. కంటిచూపు లేక ఆడలేకపోయేది. అంధుల పాఠశాలలో ప్రవేశించాక అథ్లెటిక్స్.. షాట్‌పుట్, డిస్కస్ త్రోలో సాధన ప్రారంభించింది. ఈ సమయంలో సహచరులు క్రికెట్ ఆడటం తనకు వినబడింది. అంధుల క్రికెట్‌లో వాడే బాల్ నుంచి బౌలింగ్ చేస్తే శబ్దం వస్తుంది. దీంతో అథ్లెటిక్స్‌ను పక్కనపెట్టి పీఈటీ రవికుమార్ సహకారంతో క్రికెట్ సాధన ప్రారంభించింది. మరో పీఈటీ ఉపాధ్యాయిని సత్యవతి బ్యాటింగ్, బౌలింగ్‌లో మెలకువలు నేర్పింది. ప్రిన్సిపల్ డి. విజయ ప్రోత్సాహం మరింత తోడైంది.

★ **మువ్వన్నెల రెపరెప..** మే నెలలో కేరళలో జరిగిన ఇన్ఫినిటీ ట్రోఫీలో తలపడి సెంచరీ (114)తో సత్తా చాటింది. ఈ ప్రతిభతో భారత మహిళా అంధుల టీ20 క్రికెట్ జట్టులో స్థానం లభించింది. తల్లిదండ్రులు విదేశానికి వెళ్లేందుకు వద్దన్నా.. బాగా ఆడి దేశానికి ట్రోఫీ అందిస్తానని తల్లిదండ్రులకు మాట ఇచ్చింది కరుణ. ఫైనల్‌లో మెరుగైన ఆటతీరు కనబరచి విజయానికి తోడ్పడింది. ఇచ్చిన మాట నిలబెట్టిన తమ కుమార్తెను చూసి కన్నవారు మురిసి పోతున్నారు. భవిష్యత్తులో చదువు కొనసాగిస్తూనే.. క్రికెట్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించి.. భారత కీర్తి పతాకను ఎగురవేస్తానంటోంది కరుణ కుమారి.

– న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

చైతన్యమే రక్ష..!



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం మాచవరంలోని ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మానవహారం ఆకట్టుకుంది. ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రెడ్ రిబ్బన్ ఆకారంలో నిలబడ్డారు. 'ఒకే జీవితం-సురక్షితంగా జీవిద్దాం' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త లక్ష్మీ జానకి, వైస్ ప్రిన్సిపల్ పి.శైలజ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, మాచవరం

8,9 తేదీల్లో ప్రత్యేక సర్వే

విజయవాడ వైద్యం: ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈనెల 08, 09వ తేదీలలో బోదకాలు నివారణ సర్వే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని జిల్లా మలేరియా అధికారి డా.ఇందుమతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి ఫైలేరియా వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాత్రి 08:30 గంటల నుంచి 12 గంటల వరకు రక్తపోటు సేకరణ కార్యక్రమాన్ని కూడా చేపడతామని వివరించారు. ప్రజలు ఇంటింటికి వచ్చే ఏఎన్ఎంలు, ఆశాలకు సహకరించాలని ఆమె కోరారు.

3 నుంచి ఎన్టీఆర్ వర్సిటీ క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 3న ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలలో పురుషుల వాలీబాల్, 5న ఏలూరు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల మైదానంలో పురుషుల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని విశ్వ విద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న వైద్య, దంత, ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత కళాశాల వ్యాయామ సంచాలకుడి వద్ద ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత పత్రాలతో హాజరవ్వాలని ఆయన సూచించారు.

మాటలతో బేడీలు.. ముంచేసే కేడీలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

★ 'ఆధార్ కార్డు, చరవాణితో సదఖత్ ఖాన్ అనే బడా నేరస్థుడితో కలిసి మనీ ల్యాండరింగ్ చేశారు. మీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. మిమ్ములను అరెస్టు చేస్తున్నాం..' అంటూ పటమటకు చెందిన ఓ విశ్రాంత ఉద్యోగిని హెచ్చరిస్తూ రూ.50.7 లక్షలు కొట్టేశారు.

ముందుగా భయపెట్టి... సైబర్ నేరస్థులు తొలుత ఫోన్ చేసి సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అంటారు. మీ మీద కేసులు నమోదయ్యాయని భయపెట్టేస్తారు. సుప్రీంకోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని రంగు రంగుల లెటర్‌హెడ్‌లపై వారెంట్లు తయారు చేసి పంపిస్తారు. ఆలోచించుకునే వ్యవధి ఇవ్వకుండా.. ఎవరితోనూ మాట్లాడకూడదని.. జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని బుకాయిస్తారు. ఎవరికైనా చెబితే 3 సంవత్సరాల జైలు, రూ.5లక్షల జరిమానా కట్టాలని హెచ్చరిస్తారు.

బుజ్జగించి... అసలు విషయానికి వస్తారు... రెండు రోజుల పాటు భయపెట్టి తర్వాత మెత్తబడినట్లు నటిస్తారు. మీరు అమాయకులని మాకు తెలుసని.. కానీ కోర్టులకు తెలియవు కదా అంటారు. మీ మీద కేసు లేకుండా ఉండాలంటే కొంత సొమ్ము న్యాయస్థానంలో జమ చేయాలంటారు. కేసు పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేస్తారని.. ష్యూరిటీ కోసమే ఇదంతా అని బుజ్జగిస్తారు. లేకపోతే మిమ్ములను అరెస్టు చేసేందుకు వచ్చేస్తున్నామని భయపెట్టి ఆందోళనకు గురిచేసి నగదు బదిలీ చేయించేసుకుంటారు. డిజిటల్ అరెస్టుల పేరుతో జరిగే కేసులన్నీ ఇదే తరహాలో జరుగుతున్నాయి.



ఎవరికీ మినహాయింపు లేదు.. డిజిటల్ అరెస్టు పేరుతో జరిగే మోసాల్లో అక్షరాస్యులు, నిరక్షరాస్యులు మోసపోతూనే ఉన్నారు. బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారూ బలైపోతున్నారు. మేం అలాంటి వారు కాదని చెబుతున్నా.. పట్టించుకోకుండా వారిని భయపెట్టేస్తున్నారు. ట్రాన్స్‌కో యువ ఇంజినీర్ తనకు ఏ విధమైన సంబంధం లేదని మొత్తుకుంటున్నా డబ్బులు గుంజేశారు.

ఫోన్లు వస్తే ఇలా చేయండి...

- ఎవరైనా సీబీఐ, పోలీస్, కస్టమ్స్, ఈడీ పేరుతో అరెస్టు చేస్తామని ఎవరైనా మీకు ఫోన్లు చేస్తే ఆందోళన చెందొద్దు. వారు సైబర్ నేరగాళ్లే. కాల్ కట్ చేయండి.
- ఆధార్ కార్డు, పాన్‌కార్డు పంపించమంటే నమ్మవద్దు.
- పిల్లలను అరెస్టు చేశామని బెదిరిస్తారు. అదే సమయంలో పిల్లల ఫోన్లు పనిచేయకుండా చేయగల సత్తా సైబర్ నేరగాళ్లకు ఉంది. మిమ్ములను మరింతగా భయపెట్టేందుకు సైబర్ నేరగాళ్లు ఇలా చేస్తుంటారు. పిల్లల ఫోన్లు కలవకపోతే భయపడకండి. బంధువులకో, స్నేహితులకో ఫోన్ చేసి నిజం నిర్ధారించుకోండి.
- తరచూ ఫోన్లు వస్తుంటే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయండి.

రైల్వేలో సమూహ బుకింగ్

- ప్రయాణికులకు మరింత సౌకర్యం..
- రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ద్వారా సేవలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

కుటుంబ సభ్యులతో కలిసి బృందంగా వెళ్లే వారి కోసం గ్రూప్ బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. శుభకార్యాలు, ఆఫీస్ ట్రిప్పులు, విహార యాత్రలు, పుణ్య క్షేత్రాల సందర్శనలు తదితర పర్యటనలు చేసే వారికి గ్రూప్ బుకింగ్ ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. అయితే ఈ సౌకర్యం ఉన్నట్లు ఇప్పటికి చాలా మందికి తెలియదు. రైల్వే గ్రూప్ బుకింగ్‌లను ఐఆర్‌సీటీసీ ఆన్‌లైన్ లేదా రైల్వే స్టేషన్లలోని రైల్వే రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ల ద్వారా చేసుకోవచ్చు. ఎక్కువ మంది వెళ్లే ప్రయాణికులు ఒకేసారి గ్రూప్ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు.



ఐఆర్‌సీటీసీ ఆన్‌లైన్ ద్వారా..

ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌కు వెళ్లి లాగిన్ అవ్వాలి. ఒక్కో ఫారంలో 6 మంది ప్రయాణికులు వరుస క్రమంలో చేసుకోవచ్చు. ముందుగా వెబ్‌సైట్‌లో లాగిన్ అయి యూజర్ నేమ్ మరియు పాస్ వర్డ్ నమోదు చేయాలి. అనంతరం ప్రయాణించాల్సిన రైలు, తేదీ, కోచ్ వివరాలు వంటి అవసరమైన సమాచారాన్ని నమోదు చేయాలి. అన్ని వివరాలు సరి చూసుకున్న తర్వాత టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

రైల్వే రిజర్వేషన్ కేంద్రాల్లో..

అన్ని రైల్వే స్టేషన్లలోని రైల్వే రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ల వద్ద కూడా ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ద్వారా చేసుకోవాలంటే ముందుగా రిజర్వేషన్ సూపర్ వైజర్‌ను కలిసి ప్రత్యేక ఫార్మెట్ ద్వారా దరఖాస్తు చేయాలి. ప్రయాణికుడి ఆధార్ కార్డు జత చేయాలి. కౌంటర్ల ద్వారా 100 మంది వరకు స్లీపర్ తరగతిలో, ఏసీలో అయితే 30 మంది వరకు చేసుకోవచ్చు. అంత కన్నా ఎక్కువ మంది ప్రయాణికులు ఉంటే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని రైళ్లల్లో టికెట్ల లభ్యతను బట్టి గ్రూప్ టికెట్ బుకింగ్ చేస్తారు.

పింఛన్లతో పేదలకు భరోసా : మంత్రి అనిత

పటమట, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని పేదలకు ప్రతి నెలా మొదటి తేదీన వారి ఇంటికి వెళ్లి మరీ పింఛన్లు అందజేస్తూ కూటమి ప్రభుత్వం వారికి భరోసా కల్పిస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం తూర్పు నియోజకవర్గ పరిధి 15వ డివిజన్ రామలింగేశ్వర్‌నగర్‌లోని రుద్రభూమి వద్ద సుమారు రూ.1.40 కోట్ల నిధులతో చేపట్టిన రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి పింఛను మొత్తాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల్లో కంటే ఎక్కువగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం మనదే అని పేర్కొన్నారు. సీనియర్ ఎమ్మెల్యే, మృదుస్వభావి అయిన గద్దె రామ్మోహన్‌ను చూసి తాను స్ఫూర్తి పొందుతున్నానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రామలింగేశ్వర నగర్‌లో సుమారు 450 మీటర్ల పొడవున రిటైనింగ్ వాల్ ఎత్తు తక్కువగా ఉండటంతో కొన్ని ఇళ్లల్లోకి వరద వస్తోందని, ఆ ఇబ్బందులు లేకుండా రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచుతున్నామని చెప్పారు. జనసేన తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమ్మిశెట్టి వాసు, వీఎంసీ ఈఈ సామ్రాజ్యం, సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిషోర్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, నాయకులు గాదిరెడ్డి అమ్ములు, గల్లా రవి, రావి సౌజన్య, చలసాని రమణ పాల్గొన్నారు.



రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అనిత, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

మందుబాబులపై ఉక్కుపాదం

తాగి వాహనం నడిపితే తప్పదు శిక్ష

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

మద్యం తాగిన మత్తులో వాహనాలు నడపటమే రోడ్డు ప్రమాదాలకు కారణం. 70 శాతం ప్రమాదాలు దీని వల్లే జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు.. మద్యం తాగి వాహనాలను నడిపే వారిని కట్టడి చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు స్పష్టం చేశారు. అందుకే నగర వ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. చోదకులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి.. మద్యం తాగినట్లు రుజువైన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.



బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	కేసులు
1వ	535
2వ	743
3వ	442
4వ	387
5వ	1,138
6వ	382
ఇబ్రహీంపట్నం	35

6 పోలీస్‌స్టేషన్ల పరిధిలో..

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లోని నగర పరిధిని 6 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లుగా విభజించారు. ఒక్కో స్టేషన్‌కు ఇద్దరు సీఐలు, ఎస్సైలు ఇతర సిబ్బందిని కేటాయించారు. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పరిధిలో రెండు నెలల నుంచి కేసుల నమోదు చేపట్టారు. వీరు నిత్యం ట్రాఫిక్‌ను పర్యవేక్షించడంతో పాటు మద్యం తాగి వాహనాలను నడిపే వారిని తనిఖీలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు 26 వరకు జరిగిన తనిఖీలు, కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.

తీవ్రతను బట్టి..

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. వారిని విచారించిన న్యాయమూర్తులు నేరం తీవ్రతను బట్టి వారికి రూ.10వేలు లేదా రూ.15వేలు చొప్పున జరిమానాలు విధిస్తున్నారు. మొత్తం 3,663 కేసులు పెట్టగా.. రూ.3,73,60,000 జరిమానా, 50 మందికి జైలు శిక్ష పడింది.

పర్యాటక అభివృద్ధికి హోంస్టేలు సువర్ణావకాశం

పాయకాపురం, న్యూస్‌టుడే : పర్యాటక అభివృద్ధికి హోంస్టేలు ఒక సువర్ణావకాశం అని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో రాష్ట్ర పర్యాటక విధానం- హోంస్టేస్, బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానంపై సమన్వయశాఖల అధికారులకు కార్యశాల నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యాటకులు స్థానిక ఇళ్లల్లో ఆతిథ్యం, సంస్కృతి సంప్రదాయాల ఔన్నత్యం వంటివి తెలుసుకోవడం, ప్రత్యేక రుచులను ఆస్వాదించడం వంటివి హోంస్టేస్, బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానాలతో వీలవుతుందని తెలిపారు. 2029 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పది వేలకు పైగా రిజిస్టర్ హోంస్టేల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని వివరించారు. వీటిపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఔత్సాహికులు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. వాటి యజమానులకు విద్యుత్తు నీటి సరఫరా, ఆస్తి పన్నుల్లో రాయితీ ప్రయోజనాలు ఉంటాయన్నారు. జిల్లాను నంబర్-1గా నిలిపేందుకు అధికారులంతా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పర్యాటకశాఖ ఆర్డీ వై.వి.ప్రసన్నలక్ష్మి, టూరిజం మేనేజర్ రాజ్యలక్ష్మి, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, డీఆర్‌డీఏ, మెప్మా, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

హోంగార్డులకు ఉచిత వైద్య శిబిరం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల ఆరోగ్య పరిరక్షణ కోసం సోమవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (గ్రౌండ్స్)లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్ సక్ తా ఆవాజ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవలు అందించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రారంభించారు. నగరంలోని పలు ఆసుపత్రులకు చెందిన ప్రముఖ వైద్యులు హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యం అందించారు. నిర్వాహకుల సేవలను సీపీ కొనియాడారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, ఎస్.వి.డి.ప్రసాద్, ఏఆర్ ఏడీసీపీ కె.కోటేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు వి.శివకుమార్, రాధా మాధవి, బి.కిరణ్‌కుమార్, డాక్టర్ తులసి, డాక్టర్ వర్ష తదితరులు పాల్గొన్నారు.



సేవలను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

పాయకాపురం, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా రెవెన్యూ శాఖాధికారి ఎం.లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అధికారులు వినతి పత్రాలు స్వీకరించారు. రెవెన్యూశాఖకు 58, పోలీసు 19, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలకు 17 చొప్పున ఫిర్యాదులు అందాయి. పంచాయతీరాజ్, ఎక్సైజ్‌లకు 7, విద్య 6, సర్వే, ఆరోగ్యం, మత్స్యశాఖలకు నాలుగు, డీఆర్‌డీఏ, నైపుణ్యాభివృద్ధి, రిజిస్ట్రేషన్ స్టాంపులు, జలవనరులు, పౌరసరఫరాలు, వ్యవసాయశాఖలకు రెండేసి చొప్పున ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వీటిని సత్వరం పరిష్కరించే దిశగా అధికారులు దృష్టి సారించాలని డీఆర్వో పేర్కొన్నారు.

నేడు మైలవరంలో పీజీఆర్ఎస్.. ఈ నెల 2వ తేదీ మంగళవారం (నేడు) మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐదు గంటల వరకు మైలవరంలోని ఎస్వీ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలను మనోధైర్యంతో ఎదుర్కోవాలి

పటమట, న్యూస్‌టుడే : విద్యార్థులు విద్యతో పాటు జీవన విలువలను కూడా అలవర్చుకోవాలని.. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా మనోధైర్యంతో ఎదుర్కొనే తత్వం పెంపొందించుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలిలోని వాసవ్య చిల్డ్రన్ హోమ్‌లోని పిల్లలతో ఆయన ముచ్చటించారు. ... చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ జి.సమరం, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు బి.కీర్తి, కార్యదర్శి జి.రశ్మి, ఉపాధ్యక్షురాలు పి.దీప్తి, వాసవ్య సిబ్బంది పాల్గొన్నారు.

98వ సారి రక్తదానం



జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: నాలుగు దశాబ్దాలుగా రక్తదానంతో సేవ చేస్తూ స్ఫూర్తిగా నిలిచే గండ్రాయి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేలవల్లి రమేష్ సోమవారం 98వసారి రక్తదానం చేశారు. పట్టణంలోని చెరువుబజార్‌కు చెందిన వృద్ధ మహిళకు అత్యవసరంగా రక్తం కావాల్సి రావడంతో ముందుకొచ్చి రక్తదానం చేశారు. జగ్గయ్యపేట బ్లడ్ డోనార్స్ గ్రూప్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన కుటుంబ సభ్యులు కూడా ఇదే మార్గంలో ఉండడం విశేషం.

కలవరమాయె మదిలో



వీరులపాడు మండలం అల్లూరు, పెద్దాపురం గ్రామాల మధ్య 20 రోజులుగా కోసిన పంటను ఆరబెట్టుకుంటూ ఎదురుచూస్తున్న రైతులకు దిత్వా తుపాను హెచ్చరికలు భయాందోళనలకు గురిచేశాయి. ఎక్కడ మొక్కజొన్న పాడైపోతుందోనని రూ.3వేల నుంచి రూ.5వేలు వెచ్చించి టార్పాలిన్లు కొనుగోలు చేసి కప్పామని ఆవేదన వ్యక్తం చేశారు. -ఈనాడు, అమరావతి

జీవో నంబరు-800 అమలుకు డిమాండ్

విజయవాడ(గాంధీ నగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు-800ను అమలు చేయాలని లైసెన్స్ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముత్యంగౌడ్ కోరారు. సోమవారం ఈ విషయమై ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019 సంవత్సరం నుంచి సర్వేయర్లను రెన్యువల్ చేయకుండా ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పనలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో తమను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజయ్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో లైసెన్స్ సర్వేయర్లు

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : వివాహాది శుభకార్యాల సందర్భంగా విజయవాడ ఎంజీరోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ప్రదర్శన వినియోగదారులను ఆకట్టుకుంటోంది. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ చీరలు వివిధ స్టైల్లో ఉంచారు. దేశంలోని వివిధ ప్రాంతాల సాంప్రదాయ నేత విధాలను ప్రతిబింబించే మగ్గాల ఉత్పత్తులు, దుపట్టాలు, సల్వార్ తదితర ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 7 వరకు ప్రదర్శన ఉంటుందని, నగర, సమీప ప్రాంతాల ప్రజలు సందర్శించాలని నిర్వాహకులు కోరారు.



చీరలు ప్రదర్శిస్తున్న మహిళ

ఆస్తి వివాదాల ఫిర్యాదులే అధికం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 79 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్, ఏడీసీపీ ఎం.రాజారావు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిల్లో అత్యధికంగా భూ, ఆస్తి వివాదాల ఫిర్యాదులు 38 ఉన్నాయి. వివిధ మోసాలు 16, కుటుంబ కలహాలు 5, మహిళా సంబంధ నేరాలు 5, దొంగతనాలు 3, కొట్లాట 1, ఇతర వివాదాలు 11 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపి పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు.



దివ్యాంగుడి సమస్య వింటున్న ఏడీసీపీ రాజారావు

పాఠశాల బస్సుల ఆకస్మిక తనిఖీలు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : పాఠశాల బస్సులకు తరచూ జరుగుతున్న ప్రమాదాలపై రవాణాశాఖ అధికారులు స్పందించారు. ఎన్టీఆర్ జిల్లాలో వాటి పని తీరు, నిబంధనల అమలును పరీక్షించేందుకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం 10 బృందాలతో ఏకకాలంలో 60 పాఠశాల, కళాశాలల బస్సులను పరిశీలించారు. వీటిలో నిబంధనలను పాటించని 16 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగా కొన్ని కీలకమైన నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినట్లు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ తెలిపారు. అత్యవసర ద్వారానికి అడ్డుగా సీట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. దీనివల్ల అత్యవసర సమయంలో విద్యార్థులు కిందకు దిగడం ఇబ్బందికరంగా ఉన్నట్లు వెల్లడైంది. అత్యవసర ద్వారం ఎదురుగా సీటు లేకుండా ఉంటే.. సులువుగా.. వేగంగా కిందకు దిగవచ్చని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు యాజమాన్యాలను కోరుతున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా మంటలను అగ్నినిరోధక యంత్రాలతో ఏ విధంగా ఆర్పవచ్చో అధికారులు విద్యార్థులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు.



అత్యవసర ద్వారం వద్ద అడ్డుగా సీటు... నెమ్మదిగా దిగుతున్న విద్యార్థి

కఠిన చర్యలు తప్పవు : ఎ.మోహన్, జేటీసీ

కొన్ని పాఠశాల బస్సుల్లో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్రమాదం జరిగినప్పుడు అభం శుభం తెలియని పిల్లల ప్రాణాలు పోతాయి. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు కూడా పిల్లలను బస్సుల్లో పంపించేటప్పుడు వాటి పరిస్థితిని గమనించాలి. ఏదైనా లోపాలు ఉంటే సంబంధిత విద్యాసంస్థ దృష్టికి తీసుకువెళ్లాలి. వారు చర్యలు తీసుకోకపోతే రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

తేమ శాతం తగ్గే వరకు ధాన్యం ఆరబెట్టాలి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండే వరకు ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టాలని నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, పౌర సరఫరాల శాఖ డీఎం సతీష్ సూచించారు. మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రామాల్లో సోమవారం కల్లాల్లో ఆరబోసిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ధాన్యం ఆరబెట్టే విధానం, కొనుగోలు కేంద్రాలకు తరలింపు వంటి విషయాలపై తగిన సలహాలు అందించాలని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట తడవకుండా పరదా పట్టాలు అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఉచితంగా తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శాంతలక్ష్మి, పెనుగంచిప్రోలు సొసైటీ సీఈవో కొండలుశర్మ తదితరులు పాల్గొన్నారు.




పెనుగంచిప్రోలులో ధాన్యం నిల్వలు పరిశీలిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ, డీఎం సతీష్

జోగి సోదరుల కుమారులకు సిట్ నోటీసులు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, అతని సోదరుడు రాము కుమారులకు సిట్, ఎక్సైజ్ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. బుధవారం విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు రావాలని వాటిలో పేర్కొన్నారు. ఈమేరకు జోగి రమేష్ కుమారుడు రాజీవ్, రోహిత్.. రాము కుమారులు రాకేష్, రామ్మోహన్‌లకు సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నంలోని వారి నివాసాలకు వెళ్లి వీటిని అందజేశారు. జోగి సోదరుల అరెస్టు సమయంలో వారి నివాసాల నుంచి పోలీసులు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. రమేష్, రాముల కస్టడీ చివరి రోజైన ఆదివారం వారి ఫోన్ల ఫేస్‌లాక్‌ను వారి సమక్షంలో ఫోరెన్సిక్ బృందం తెరిచింది. అదేసమయంలో ల్యాప్‌టాప్‌లను కూడా తెరవాలని పోలీసులు కోరగా.. అవి కుమారులకు చెందినవనీ, వాటి పాస్‌వర్డ్‌లు వారికే తెలుసని సమాధానమిచ్చారు. ఈనేపథ్యంలో ల్యాప్‌టాప్‌లను తెరిచేందుకు వీరికి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

బ్రాయిలర్ ధరలు



(కిలో ఒక్కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -119 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం అడ్మిషన్ల బ్రోచర్ విడుదల

కానూరు, న్యూస్‌టుడే: సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2026-27 సంవత్సరానికి బీటెక్‌లో అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచర్‌ను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మలినేని రాజయ్య మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం నిర్వహించే ఎస్ఈఈఈ-2026 ప్రవేశపరీక్ష, జేఈఈ, ఈఏపీసెట్‌లలో ర్యాంకుల ఆధారంగా మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. వర్సిటీ పోర్టల్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ ప్రవేశపరీక్ష రెండు దశల్లో ఉంటుందని స్పష్టత ఇచ్చారు. మొదటి దశ ఏప్రిల్‌లో ప్రతి శని, ఆదివారాలు.. రెండో దశ మే నెలలో ప్రతి శని, ఆదివారాల్లో జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు, ప్రోవైస్‌ఛాన్సలర్ ఏవి రత్నప్రసాద్, డీన్ అడ్మిషన్లు జీవీఆర్‌స్వామి, ఈసీఈ విభాగాధిపతి వెంకటరావు, రిజిస్ట్రార్ రవిచంద్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజయ్య, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, రత్నప్రసాద్ తదితరులు

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు

రూ.26.50 లక్షల సొత్తు స్వాధీనం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను గుంటూరు నేరవిభాగ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ వివరాలు వెల్లడించారు. గుంటూరులోని గోరంట్లకు చెందిన చిల్లర సురేష్ జల్సాలకు అలవాటుపడి కొన్నేళ్లుగా దొంగతనాలు చేస్తున్నాడు. ఇతనిపై పట్టాభిపురం, అరండల్‌పేట, కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు, నల్లపాడు సహా రెండు తెలుగురాష్ట్రాల్లో 78కుపైగా చోరీ కేసులున్నాయి. గుంటూరు జిల్లాలోని మొదటి పదిమంది దొంగల జాబితాలో ఇతని పేరుంది. ఇతనికి గంజాయి కేసులో అరెస్టై జైలులో ఉన్న విజయవాడలోని రామలింగేశ్వర్‌నగర్‌కు చెందిన కాజా నాగవీర భాస్కరరావుతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ జైలు నుంచి వచ్చాక దొంగతనాలు చేశారు. చోరీ సొత్తును గుంటూరులోని శివనాగరాజుకాలనీకి చెందిన లంకా రాజేష్ ద్వారా విక్రయించి.. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. నవంబరు 8న సంపత్‌నగర్‌లోని వెంకటఅప్పయ్యశాస్త్రి కుటుంబం తిరుపతి వెళ్లగా.. ఆయన ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 152 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఎస్పీ ఆదేశాలతో సీసీఎస్ డీఎస్పీ మధుసూదనరావు, సీఐలు కిశోర్, శివప్రసాద్ కేసు దర్యాప్తు చేశారు. నిందితులు లాలాపేటలో ఉన్నట్టు గుర్తించి సీఐలతోపాటు ఎస్సై రాములు, ఏఎస్సై రామకృష్ణ, సిబ్బంది పీటర్ రాజు, కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, శివప్రసాద్ చాకచక్యంగా అరెస్టు చేశారు. రూ. 26.50 లక్షల విలువైన 227 గ్రాముల బంగారు ఆభరణాలు, 182 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

ఏపీ ఎన్జీవో నగర శాఖ సమావేశం రేపు

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఏపీ ఎన్జీవో నగర శాఖ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 3న గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహిస్తున్నట్లు నగర అధ్యక్షుడు సి.వి.ఆర్.ప్రసాద్ తెలిపారు. 2వేల మందికిపైగా సభ్యులు ఉన్న శాఖకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత కమిటీ గత మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలపై చర్చిస్తామన్నారు. ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో 11 కేవీ టౌన్ ఫీడర్ నందు విద్యుత్తు తీగల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 నుంచి 10.30 వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నేడు

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి పురపాలిక కో-ఆప్షన్ ఎన్నికను పురపాలిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఛైర్మన్ చిట్టిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరగనుంది. తెదేపా తరఫున మాబు సుభాని, జనసేన తరఫున యర్రంశెట్టి సాంబశివరావు, భాజపా తరఫున షేక్ నగీనా ఇప్పటికే నామినేషన్లు సమర్పించగా కూటమిలో భాగంగా ఈ ముగ్గురికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

నేత్రదానం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు నగర పంచాయతీ పరిధిలో పసుమర్తి శకుంతల(85), సామినేని సీతమ్మ(75) అనే ఇద్దరు వృద్ధ మహిళలు మృతి చెందారు. వీరి నేత్రాలు దానం చేయాలని కుటుంబ సభ్యులు అంగీకరించడంతో లయన్స్ క్లబ్ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, కొమ్మినేని రాజేష్‌బాబు కోరగా సోమవారం వీరిద్దరి కార్నియాలను సేకరించి ఖమ్మం నేత్ర నిధికి దానం చేశారు.

విజేతలకు అభినందన

కొండపల్లి, న్యూస్‌టుడే : జాతీయ స్థాయిలో డీపీపీ కీర్తి పతాకం ఎగురవేయాలని ఎస్జీఎఫ్ఎస్ ముఖ్య ఇంజినీరు శివరామకృష్ణ కోరారు. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎన్.నిహారిక, ఎస్.బిందు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సోమవారం అభినందించింది. ఉపాధ్యాయులు, ఎస్జీఎఫ్ఎస్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

ప్రజా సమస్యలు పరిష్కరించండి

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని రామచంద్రాపురంలో డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందించారు. నాయకులు పి.ఆనందరావు, ఎ.యేసోబు, సీహెచ్.శివపార్వతి, సీహెచ్.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

● జి.కొండూరు బీసీ కాలనీలోని కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావు సిబ్బందితో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు ● తిరువూరు 14వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, బురద పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయించారు. ● తిరువూరు 8వ వార్డులోని డ్రెయిన్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికులు సమస్యను అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి తమ సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

? కూనపరాజుపర్వ గ్రామంలోని పెద్దిరెడ్డి పల్లె పాఠశాల దగ్గర రోడ్డుపైకి మురుగు చేరుతోంది. - పుల్లయ్య, స్థానికుడు ✔ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

? విస్సన్నపేట పంచాయతీలోని రాజీవ్ నగర్ కాలనీలో కోతుల బెడద అధికంగా ఉంది. - కాలనీ నివాసితులు ✔ కోతులను పట్టి గతంలో అడవుల్లో వదిలేశాం. ఆవాసాలు వెతుక్కుంటూ మరల వచ్చాయి. వీటి నియంత్రణకు చర్యలు చేపడతాం. - కేశవ హరికృష్ణ కుమార్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, విస్సన్నపేట

తుండ్లు, రాత పుస్తకాలు పంపిణీ

గంపలగూడెం, న్యూస్‌టుడే : గీతా జయంతి ఉత్సవంలో భాగంగా పెనుగొలనులో సోమవారం శ్రీ బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న 25 మంది బాల బాలికలకు తుండ్లు, రాత పుస్తకాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

గంపలగూడెం, తిరువూరు: తిరువూరు మండలం లక్ష్మీపురం పీఏసీఎస్ సభ్యుడైన బాలమర్తి వెంకటేశ్వరరావు మృతి చెందారు. ఈ మేరకు సహకార సంఘం నుంచి మంజూరు చేసిన రూ.10 వేలు ఆతని కుటుంబ సభ్యులకు ప్రెసిడెంట్ నెల్లుపర్తి ప్రమీల, సర్పంచి జి.శ్రీనివాసరావు, సీఈవో బి.రమురామ్ సోమవారం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా ఆర్.శిల్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గంపలగూడెం మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఆమె పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న జి.సుధాకర్ గంపలగూడెం మండలం లోని ఆదర్శ పాఠశాలకు వెళ్లారు.

సర్వే ముగిసింది.. ఎంపిక మిగిలింది

సొంతింటి నిర్మాణానికి స్థలాలు గుర్తింపు

గంపలగూడెం, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉన్న పేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఫేస్ కింద గృహాలు మంజూరు చేయడానికి అందిన అర్జీలపై అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సర్వే ప్రక్రియ ముగిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించే ఆర్థిక చేయూతతో పేదలు తమ సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి నేరుగా దరఖాస్తులు ఆహ్వానించారు. వీటిపై అసలు అర్హులు ఎవరు, స్థలాలు ఉన్నాయా.. లేదా అని నిర్ధారించేందుకు నవంబరు 11 నుంచి 30వ తేదీ వరకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో సర్వే చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2.50 లక్షల వరకు ఇంటి నిర్మాణానికి సాయం అందించే అవకాశం ఉంది.

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో సొంత స్థలాలు ఇలా..	
మండలం	స్థలాలు
గంపలగూడెం	2,987
ఎ.కొండూరు	2,708
విస్సన్నపేట	2,670
తిరువూరు	2,150
రెడ్డిగూడెం	1,452



గంపలగూడెం మండలం రాజులపాలెంలో సర్వే చేస్తున్న అధికారులు

● అర్జీదారుల్లో ఖాళీ స్థలాలు ఉన్న కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పీఎంఏవై ఫేస్‌లో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం మంజూరుకు అర్హతను గుర్తించాల్సి ఉంది. లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు మరోసారి విచారించి అర్హుల జాబితా అని నిర్ధారిస్తారు. కాలనీ గృహాలు మంజూరు చేయొద్దని అధికారులు ప్రభుత్వానికి రానున్న రెండేళ్లలో అవన్నీ మంజూరు చేస్తారు. తిరువూరు, రెడ్డిగూడెం, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో ఆదివారం సాయంత్రం 5.30 గంటల వరకు సర్వే ద్వారా 11,967 మంది అర్జీదారులకు సొంత స్థలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ముఖ్యమంత్రి హామీ మేరకు పింఛను మొత్తం పెంపు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లబ్ధిదారులకు సామాజిక పింఛన్ల సాయం పెంచిందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి ఎన్టీఆర్ భరోసా పథకం పింఛను పంపిణీ చేశారు. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో జరిగిన పంపిణీలో తెదేపా నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని వెలగలేరులో స్థానిక నాయకులతో కలిసి ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రాభివృద్ధిని చూసి వైకాపాకు చెందిన 20 మంది కార్యకర్తలు తెదేపాలో చేరారు. పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



గొల్లపూడిలో వివరాలు వెల్లడిస్తున్న దేవినేని ఉమ

గొల్లపూడి, న్యూస్‌టుడే : ప్రజల సంక్షేమ పథకాలు అందించడంలో కూటమి ప్రభుత్వం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో రూ.50 వేల కోట్లు పైగా నగదును పింఛన్ల రూపంలో అందించినట్లు తెలిపారు.

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, తెదేపా నాయకులు కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో జరిగిన పింఛన్ల పంపిణీలో తెదేపా మండల అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వర రెడ్డి, ఉప సర్పంచి కె.వెంకటేశ్వరరావు(బాబు) నాయకులు పాల్గొన్నారు.



తిరువూరు: పింఛను పంపిణీ చేస్తున్న శాసన సభ్యుడు శ్రీనివాసరావు



వెలగలేరు: వృద్ధురాలికి నగదు ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

మొర్సుమిల్లి (మైలవరం), న్యూస్‌టుడే : పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించి, ఆ భూతాన్ని తరిమికొట్టాలని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డీన్ పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత గ్రామం మొర్సుమిల్లిలో సోమవారం వారం రోజుల పాటు నిర్వహించే శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామంలో భారీ ప్రదర్శన చేశారు. ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రోగ్రాం అధికారి శివప్రసాద్, ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఆర్థిక నేరాలపై అవగాహన

జి.కొండూరు, న్యూస్‌టుడే : కుటుంబ వ్యవస్థ సరిగా ఉంటేనే మంచి సమాజం ఆవిర్భవిస్తుందని డీసీపీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. జి.కొండూరు మండలం గంగినేనిపాలెం, సున్నంపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రుల పాత్ర ప్రధానమని సూచించారు. ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్, ఎస్సై కె.సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ, పక్కన ఏసీపీ ప్రసాదరావు

ధ్రువపత్రాల అందజేత

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణకు హాజరైన మహిళలకు ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ కార్యాలయంలో సోమవారం ధ్రువపత్రాలు అందజేశారు. రెండు విడతల్లో 55 మందికి రెండు నెలల పాటు శిక్షణ అందించామని చెప్పారు.





బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఉపన్యసిస్తున్న విద్యార్థిని

ప్రతిభ చాటి.. గెలుపొంది

మైలవరం, న్యూస్‌టుడే : ఈనాడు అంశంపై ఉపన్యసించిన విద్యార్థినులు సత్తా చాటి పోటీల్లో పతకాలు సాధించారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థినులకు 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో జూనియర్ ఇంటర్ విద్యార్థులు పసుపులేటి ప్రగతి(ఎంపీసీ), దేశబోయిన ప్రగతి(బైపీసీ), జరబల శ్రావణి(ఎంపీసీ) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. ఈ మేరకు వీరికి ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఉపాధ్యాయులు రాంప్రసాద్, సూరిబాబు, గోపాలం, శంకర్ నాయక్, ఆనంద్, సాంబిరెడ్డి తదితరులు బహుమతులు అందించారు.

కుంగిన వారధి.. స్పందించండి సారథి

జి.కొండూరు, న్యూస్‌టుడే

మండలంలోని హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై ఉన్న వంతెన కుంగి ప్రమాదకరంగా మారింది. దీనిపై నిత్యం పలు గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల కిందట నిర్మించిన వారధి 2022 వరకు సేవలందించి ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో దీనికి ప్రత్యామ్నాయంగా అప్పటి వైకాపా నాయకులు రూ.55 లక్షలు పెట్టి తాత్కాలిక వంతెన నిర్మించి చేతులు దులుపుకొన్నారు. దీంతో బుడమేరు ఉద్ధృతంగా ప్రవహించినప్పుడు దీనిపై నుంచి వరద నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. శాశ్వత వంతెన నిర్మాణం చేపడితేనే సమస్య తీరుతోందని ప్రజలు వాపోతున్నారు. దానిపై ప్రయాణం చేసే సమయంలో వంతెన కూలిపోయి అనుకోని విపత్తు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



ప్రమాదకరంగా వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

నిర్లక్ష్యమే కారణం

వైకాపా హయాంలో వంతెన దిగువన ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడంతో ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు. దాని కింద ఉన్న మట్టి మొత్తం కోతకు గురై కుంగిపోయిందని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు గత ప్రభుత్వంలో వంతెన కుంగినా శాశ్వత ప్రతిపాదికన వారధి నిర్మాణం చేపట్టక పోవడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి పాలకులైనా స్పందించి బుడమేరుపై శాశ్వత వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

అంచనాలు సిద్ధం చేసి అధికారులకు నివేదించాం

వంతెన నిర్మాణానికి రూ.10.5 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైతే ఆయా పనులు చేపట్టి వాహనదారుల అవస్థలు తీరుస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - అప్పారావు, ఆర్‌అండ్‌బీ సహాయక ఇంజినీరు

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం మండల నూతన కార్యవర్గ ఎన్నిక ఇబ్రహీంపట్నంలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వి.నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా వై.శ్రీనివాసరావు, ప్రవీణ, అశోక్ కుమార్, రమాదేవి ఎన్నికయ్యారు. ఉపాధ్యాయులకు 30 శాతం ఇంటీరియల్ రిలీఫ్ ఇచ్చేందుకు సంఘం కృషి చేయాల్సిన అవసరం ఉందని అధ్యక్షుడు నరేంద్ర పేర్కొన్నారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక స్థలం తిరిగి ఇప్పించాలని వినతి

కొండపల్లి, న్యూస్‌టుడే : డ్వాక్రా మహిళా సామాజిక స్థలాన్ని కబ్జా చేశారని పలువురు మహిళలు ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం, ఛైర్మన్ చిట్టిబాబులకు విన్నవించారు. కొండపల్లి పురపాలికలోని 27వ డివిజన్ నేతాజీ నగర్‌లో రెండు సెంట్ల సామాజిక స్థలం ఉంది. దీన్ని డ్వాక్రా మహిళా సామాజిక భవనం నిర్మించుకునేందుకు గతంలో కేటాయింపులు జరిగాయి. కొందరు వ్యక్తులు ఆ స్థలానికి కాగితాలు పుట్టించి ఇతరులకు అమ్మకాలు జరిపారు. విషయం తెలుసుకున్న డ్వాక్రా సంఘ సభ్యులు ఈ విషయాన్ని సోమవారం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వైభవంగా గీతా జయంతి వేడుకలు

మైలవరం, న్యూస్‌టుడే : గీతాజయంతిని పురస్కరించుకుని సోమవారం ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య పర్యవేక్షణలో ప్రధానార్చకుడు టి.గోపాలాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. నమో వెంకటేశాయ, జై జనార్దన భక్త బృందాల ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం చేశారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా తిరువూరులోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మైలవరంలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాల స్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమా గౌరీ శంకరుని ఆలయంలోని శివలింగాన్ని అర్చకుడు పి.కోటేశ్వరరావు శోభాయమానంగా అలంకరించారు. భక్తులు శివ లింగం దర్శించుకుని పూజలు చేశారు. గంపలగూడెం, మేడూరు, పెనుగొలను, తిరువూరు, ఎ.కొండూరు మండలం కంభంపాడు శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.



శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ శ్రేణులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ విస్సన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంఈవో- 1 శంకరరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. సంఘ జిల్లా కార్యదర్శి జి.బాల్యా, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.అంకరాజు, పి.చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ వాలీబాల్ విజేత క్యూఐఎస్ కళాశాల జట్టు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఒంగోలులోని క్యూఐఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు, నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. మూడో స్థానాన్ని బాపట్ల జిల్లా చీరాలలోని సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల, వీఆర్ సిద్ధార్థ కళాశాల జట్లు సంయుక్తంగా సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఎల్బీఆర్‌సీఈ గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశరెడ్డి, జేఎన్‌టీయూ ఐసీటీ కార్యదర్శి లోవరాజు, కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి తదితరులు బహుమతులు అందించారు.



మొదటి స్థానం సాధించిన వారికి ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

అప్రమత్తతతో హెచ్ఐవీ దూరం

మైలవరం, న్యూస్‌టుడే : ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారానే ప్రమాదకరమైన హెచ్ఐవీ వ్యాధికి దూరంగా ఉండొచ్చని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప ప్రిన్సిపల్ పి.రంగారావు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఫణికుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సుభాషిణి, అధ్యాపకులు రాముడు, దేవానంద్ కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.



మైలవరం : మాట్లాడుతున్న ఉప ప్రిన్సిపల్ రంగారావు



తిరువూరు : అవగాహన ర్యాలీలో వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుతేజా, ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ ఎ.దుర్గాప్రసాద్, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

తిరువూరు టౌన్: స్థానిక బాలికోన్నత పాఠశాలలో తిరువూరు మండల స్థాయి ఆటల పోటీలను ఎంఈవో- 2 పీయస్‌యన్.రాజు సోమవారం ప్రారంభించారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే డివిజన్ పోటీలకు పంపనున్నారు.



రిబ్బను కత్తిరిస్తున్న ఎంఈవో- 2 పీయస్‌యన్.రాజు

ముగిసిన.. జి.కొండూరు: జి.కొండూరు మండలంలో రెండు రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల క్రీడా ఎంపికలు సోమవారంతో ముగిశాయని ఎంఈవో ఎం.వీరాస్వామి తెలిపారు. ఆయా క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని మండలానికి ఎంపిక చేశామని, వీరు డివిజన్ స్థాయిలో విజయవాడలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పీడీ పురుషోత్తం తెలిపారు. పాఠశాల హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ ఆలోచన మానుకోవాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : డొక్కా సీతమ్మ పేరుతో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరణ చేసే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని మధ్యాహ్న భోజన పథక వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కె.రాజేశ్వరి అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవో పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. రాజేశ్వరి, లక్ష్మి, కోటేశ్వరి, ఉషా, పూర్ణకల్యాణి, మహేష్ పాల్గొన్నారు.



ఎంఈవో పుష్పలతకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ సభ్యులు

క్రైమ్ కార్నర్

చెరువులో మృతదేహం లభ్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే : ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి కుళ్లిన స్థితిలో మృతదేహంగా లభ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు .. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా కటేకళ్యాణ్ మండలం, కటేకళ్యాణ్ గ్రామం నుంచి మైసరమ్ నాగ్(45) అనే వ్యక్తి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఏడాది కిందట జి.కొండూరు మండలం చెవుటూరుకు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో అతను మద్యానికి బానిసై ఇంటి నుంచి బయటకెళ్లి కనిపించకుండా ఉంటూ మరలా తిరిగి రావడం పరిపాటిగా మారింది. వారం కిందట ఇదే మాదిరిగా ఇంటి నుంచి వెళ్లిన నాగ్ పక్కనే ఉన్న చెరువులో విగతజీవిగా దర్శనమిచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో వైద్యులు చెరువు వద్దే పోస్టుమార్టం చేశారు. భార్య బిజినీ ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనదారుడికి తీవ్ర గాయాలు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక ఆల్ఫా సర్కిల్ వద్ద, జాతీయ రహదారి బైపాస్‌పై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక రాజాపేటకు చెందిన బి.జనార్దన్, బైపాస్‌లో ఓ బండి వద్ద పానీపూరి తీసుకొని ఇంటికెళ్లేందుకు తన ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో జి.కొండూరు వైపు నుంచి వస్తున్న టాటా ఏసర్ ఆటో బైక్‌కు తగిలింది. దీంతో రహదారిపై పడిపోయిన అతనికి తీవ్ర గాయాలు కావడంతో, స్థానికులు పక్కనే ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి నుంచి విజయవాడకు తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చదువు

■ e-mail: edc@eenadu.in

ఎల్‌ఎల్‌బీ తర్వాత ఎంబీఏ?

ఎల్‌ఎల్‌బీ చేస్తున్నాను. దీని తర్వాత ఎంబీఏలో చేరితే కెరియర్ ఎలా ఉంటుంది. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు వస్తాయా? - గంటా రాకేశ్

■ ఎల్‌ఎల్‌బీ తర్వాత ఎంబీఏ చదవాలనుకోవడం నేటి ఉద్యోగ మార్కెట్‌లో సరైన నిర్ణయమే. ఈ రెండు డిగ్రీల ద్వారా.. చట్ట పరిజ్ఞానం, నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ సామర్థ్యం, వ్యాపార అవగాహన లాంటి అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. కార్పొరేట్ ప్రపంచం, బ్యాంకింగ్, కన్సల్టింగ్, హ్యూమన్ రిసోర్సెస్, కంప్లయెన్స్, పాలసీ మేకింగ్ వంటి రంగాల్లో ఈ రెండు డిగ్రీల కలయిక మీకు మంచి కెరియర్‌ను అందిస్తుంది.

ప్రస్తుత ఉద్యోగ పోటీ ప్రపంచంలో ఒకే డిగ్రీతో పరిమితం కాకుండా, చాలామంది విద్యార్థులు కెరియర్‌కు బలమైన పునాది వేయడానికి వివిధ కోర్సులను కలిపి చదవడం సాధారణమైంది. ముఖ్యంగా ఎల్‌ఎల్‌బీ తర్వాత ఎంబీఏ చేస్తే.. ఒకవైపు న్యాయ పరిజ్ఞానం, మరోవైపు మేనేజ్‌మెంట్ ప్రతిభ పొందవచ్చు. ఈ రెండిటి సమ్మేళనం ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను అందిస్తుంది.

> ఎల్‌ఎల్‌బీలో న్యాయ ప్రక్రియలు, ఒప్పందాలు, నమోదు విధానాలు, వివాద పరిష్కారం, చట్టపరమైన అనాలిసిస్ వంటి కీలక నైపుణ్యాలను పొంది ఉంటారు. దీనికి అదనంగా ఎంబీఏ చదివితే.. నిర్వహణ, ఆర్థిక వ్యవస్థ, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్, ఫైనాన్స్, ఆపరేషన్స్, లీడర్‌షిప్, స్ట్రాటజీ వంటి రంగాల్లో ప్రావీణ్యం పొందుతారు. ఈ రెండు నైపుణ్యాలూ కలిసినప్పుడు కార్పొరేట్ రంగంలో ఉద్యోగావకాశాలు బాగా మెరుగవుతాయి.

ఎల్‌ఎల్‌బీ తర్వాత ఎంబీఏతో..

కార్పొరేట్ లా విభాగాల్లో: వివిధ సంస్థల మధ్య ఒప్పందాలు, లీగల్ అనాలిసిస్, కంప్లయెన్స్, పాలసీలు, నియామకాలు, బిజినెస్ అగ్రిమెంట్లు నిర్వహించడానికి అవసరమైన నైపుణ్యాలు నేర్చుకుని.. లీగల్ మేనేజర్, కార్పొరేట్ లీగల్ అడ్వైజర్, కంప్లయెన్స్ ఆఫీసర్, కాంట్రాక్ట్ స్పెషలిస్ట్‌గా స్థిరపడవచ్చు.

హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో: చాలా చట్టపరమైన అంశాలు ఉంటాయి. ఉద్యోగ ఒప్పందాలు, కార్మిక చట్టాలు, వేతన నిబంధనలు, ఉద్యోగ వివాదాలు, పాలసీల రూపకల్పన లాంటి వాటికి న్యాయ పరిజ్ఞానం బాగా అవసరం. ఈ అంశాలపై పట్టు సాధిస్తే, హెచ్‌ఆర్ మేనేజర్, ఎంప్లాయీ రిలేషన్స్ మేనేజర్, లేబర్ లా స్పెషలిస్ట్‌గా ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

బిజినెస్ కన్సల్టింగ్: బిజినెస్ కన్సల్టింగ్ కంపెనీల్లో.. కార్పొరేట్ స్ట్రాటజీ కన్సల్టెంట్, లీగల్ కంప్లయన్స్ కన్సల్టెంట్ లాంటి ఉద్యోగాలకూ ప్రయత్నించవచ్చు.

మెరుగైన కెరియర్ కోసం కనీసం మూడేళ్ల న్యాయవాద వృత్తిలో కొనసాగి, ఆ తర్వాత నేషనల్ లా యూనివర్సిటీల్లో కానీ, ఐఐఎం లాంటి ప్రముఖ విద్యా సంస్థల్లో ఎంబీఏ చేస్తే, మీకు మంచి కెరియర్ ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వ్యక్తులైనా, వ్యవస్థలైనా ఉన్న స్థితి నుంచి అత్యున్నత స్థాయికి చేరుకోవడానికి 'మార్పు'ను అస్త్రంగా మలచుకోవాలి. ఆధునిక అవసరాల ప్రకారం మారడాన్ని నిత్య వ్యవహారంగా భావించినవాళ్లే ప్రపంచంతో పరుగు తీయగలరు. ఎప్పుడూ ఒకేలా ఉంటే పోటీ నుంచి పక్కకు జరిగిపోతారు. అందుకే మిమ్మల్ని మీరు మలుచుకోవాలి. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచానికి అడాప్టబిలిటీ(ఒదిగే స్వభావం) కీలకమైన జీవన నైపుణ్యం.

ఒదిగే గుణం.. ఎదిగే నైపుణ్యం

సాఫ్ట్ స్కిల్స్



సారిక.. పేరొందిన కళాశాల నుంచి 9.1 సీజీపీఏతో ఇంజినీరింగ్ పూర్తి చేసింది. బహుళజాతి సంస్థ నిర్వహిస్తోన్న ప్రాంగణ ఎంపికలకు హాజరైంది. రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, బృంద చర్చలలో విజయవంతమైంది. చివరి హెచ్‌ఆర్ రౌండ్లో ఆమెకు ఊహించని ప్రశ్న ఎదురైంది. అదేంటంటే..'మీరు చేస్తున్న ప్రాజెక్టులో ఒక పరికరం కనిపించలేదు.. దాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నించినా లభించలేదు. ఆ సమయంలో మీరు ఆ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారు?' దీనికి సారిక సమాధానం.. 'ఆ పరికరం కోసం మళ్లీ ఆర్డర్ చేస్తాను.. వచ్చే వరకూ వేచి ఉంటాను'. దీంతో ఆమె ఉద్యోగానికి ఎంపికయ్యే అవకాశాన్ని కోల్పోయింది. ఎందుకంటే.. ప్రాజెక్టులో అకస్మాత్తుగా వచ్చిన సవాలుకు ఆ సమయంలో ఆమె పరిష్కారం చూపలేకపోయింది. ప్రత్యామ్నాయ ప్రణాళిక, మార్పులకు సర్దుబాటు చేసుకోలేకపోయింది. ఆమెలో అడాప్టబిలిటీ నైపుణ్యం లోపించింది.

సంస్థలు ఆశిస్తాయివీ..

కార్పొరేట్ ప్రపంచ పని వాతావరణంలో అనేక సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని సమయస్ఫూర్తితో అధిగమించ గలిగే సామర్థ్యం ఉన్నవారినే సంస్థలు కోరుకుంటాయి. ఎంపికలో సాంకేతిక నైపుణ్యాల కంటే అడాప్టబిలిటీ వంటి సాఫ్ట్‌స్కిల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. సాంకేతిక మార్పులు, ప్రపంచవ్యాప్త బృందాలను సమన్వయం చేసుకోవడం, ఇంటి నుంచే పని, నిత్యం మారుతోన్న వ్యాపార అవసరాల కారణంగా.. 'నేను ఈ పద్ధతిలోనే పనిచేయగలుగుతాను' అంటే అవకాశాలు కోల్పోతారు. 'ఎలా పని చేయాలో చెప్పండి, నేర్చుకుంటాను' అనే ఆలోచనా విధానం(ఫ్లెక్సిబుల్ మైండ్ సెట్) ఉన్న వారినే సంస్థలు ఎంచుకుంటున్నాయి. కృత్రిమ మేధ, ఆటోమేషన్ కారణంగా ఉద్యోగానికి, ఎదుగుదలకూ అవసరమైన నైపుణ్యంగా 'అడాప్టబిలిటీ' అవతరించింది.

అడాప్టబిలిటీ ఎలా..

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, నూతన పద్ధతులు, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. వేగవంతమైన పని విధానానికి అలవాటు పడాలి. ఆలోచనా సరళి, వ్యవహార విధానాన్ని పని వాతావరణానికి అనుగుణంగా మార్చుకోగలిగే నేర్పరితనం కలిగి ఉండాలి. మార్పులకు అనుగుణంగా ఒదిగిపోవడం లేదా ఆ వాతావరణంలో ఇమిడిపోవడం పుట్టుకతో రాదు. అలా అని నేర్చుకోలేనంత కష్టమైందీ కాదు.

అపార్థం చేసుకోవద్దు..

చాలా మంది అడాప్టబిలిటీని చేతగానితనం అని అపార్థం చేసుకుంటారు. పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడం అంటే.. గుడ్డి ఎద్దు చేలో పడ్డట్టు తలూపడం అని కాదు. 'ఎప్పుడు తగ్గాలి.. ఎప్పుడు మీ అభిప్రాయాన్ని స్థిరంగా ఉంచాలి' అనేది కచ్చితంగా తెలుసుకోవడం కూడా అడాప్టబిలిటీలో భాగమే. వెన్నెముకలా వ్యవహరించాలి. అది ఫ్లెక్సిబుల్‌గా ఉంటూనే మిమ్మల్ని నిటారుగా నిలబెడుతుంది. ఈ గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి.

✦ నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్ రిపోర్టు ప్రకారం.. మన దేశంలో 2026 నాటికి 90 శాతం ఉద్యోగాలకు అడాప్టబిలిటీతో పాటు కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకునే సామర్థ్యం అత్యవసరంగా మారుతుంది.

✦ లింక్డిన్ గ్లోబల్ ట్యాలెంట్ ట్రెండ్స్ 2024-25.. రిక్రూటర్లు అడాప్టబిలిటీ, సాఫ్ట్‌స్కిల్స్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొంది.

✦ మెకిన్స్ సర్వే.. అడాప్టబిలిటీ నైపుణ్యం ఉన్న వారు ఇతరుల కంటే నాలుగు రెట్లు ఎక్కువగా విజయవంతం కావడానికి, ఉన్నతి సాధించడానికి అవకాశం ఉందని తేల్చింది.

వీటితో సాధ్యం..

స్వీయ అవగాహన: ఇది అడాప్టబిలిటీకి పునాది లాంటిది. ఎలాంటి పరిస్థితులు, సందర్భాల్లోనైనా.. భావోద్వేగాలు, ఆలోచనలు, వ్యవహార శైలిని క్రమ పద్ధతిలో ఉంచుకోవాలి. ఒత్తిడిలో ఉన్నా, ఊహించని పరిణామాలు ఎదురైనా వాటిని అవకాశాలుగా మలుచుకుని, సంస్థలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి.

కంఫర్ట్ జోన్ నుంచి బయటకు: ఎప్పుడూ కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు, సరికొత్త అనుభవాలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలి. అవి సౌకర్యవంతమైనా, ప్రతికూలమైనా.. ఆకస్మాత్తుగా జరిగిన ఏ మార్పునైనా స్వీకరించాలి. అది మీ కెరియర్ వృద్ధికి ఉపయోగపడేలా చేసుకోగలగాలి. కంఫర్ట్ జోన్ కెరియర్‌ను అక్కడే ముగించేస్తుంది. సవాళ్లను స్వీకరించేందుకు సిద్ధపడితేనే ముందుకెళ్తారు.

నేర్చుకోవాలనే తపన: కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రశ్నలు అడగడానికి సందేహించకూడదు. వీటితో జ్ఞానం పెరుగుతుంది. నిత్య విద్యార్థిలా అభ్యాసం చేస్తూ, కొత్త పద్ధతిలో ప్రభావవంతంగా పని చేయగలగాలి.

ఆశావహ దృక్పథం: ఎప్పుడూ సానుకూలంగా ఉండాలి. ఉన్నతమైన కలలు కనాలి. వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడాలి. ఈ గుణం మిమ్మల్ని మీ పని వాతావరణంలో ఎదురయ్యే సవాళ్లు, మార్పులను సానుకూల దృక్పథంతో స్వీకరించగలిగే అవకాశాన్ని కలిగిస్తుంది. తద్వారా పరిస్థితులకు అనుగుణంగా ఒదిగిపోవడానికి ఉపయోగపడుతుంది. 'ఎందుకు' అని కాకుండా..'ఎలా' అనే దానిపై ఫోకస్ పెట్టాలి.

అభిప్రాయాలూ స్వీకరించాలి: ఇతరుల ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకోవడం, వాటిని స్వీకరించడమూ అడాప్టివ్ నైపుణ్యంగానే పరిగణించాలి. ఇది ఎదుటివారికి మీపై నమ్మకాన్ని ఇవ్వడంతో పాటూ, మీ బృందం పని తీరునూ మెరుగుపరుస్తుంది. సమస్యలూ పరిష్కారమవుతాయి, మీపై గౌరవమూ పెరుగుతుంది.

సాంకేతిక నైపుణ్యాలతో కొన్నాళ్లు లేదా కొన్నేళ్లే ప్రయాణం చేయగలం. ఎందుకంటే ఇవి ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. కానీ అడాప్టబిలిటీ నైపుణ్యాలు ఎప్పటికీ మిమ్మల్ని వదిలిపోవు. జీవితాంతం వీటితో ఉపయోగమే. వ్యక్తిగత జీవితంలోనూ ఈ నైపుణ్యాలెంతో మేలు చేస్తాయి.



– గంపా నాగేశ్వర్‌రావు
సైకాలజిస్ట్, ఇంపాక్ట్ వ్యవస్థాపకులు

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్
సంస్థ: క్లాపింగో ఎడ్యుకేషన్ ప్రై.లి.
నైపుణ్యాలు: కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మల్టీటాస్కింగ్, టీమ్‌వర్క్ **స్టైపెండ్:** రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
☛ https://shorturl.at/Gkczm

బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్
సంస్థ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోబోటిక్స్ **నైపుణ్యాలు:** బిజినెస్ డెవలప్‌మెంట్, కోల్డ్ కాలింగ్, ఈమెయిల్ మార్కెటింగ్, మార్కెటింగ్ ఆటోమేషన్, సేల్స్
స్టైపెండ్: రూ.5,000-6,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
☛ https://shorturl.at/hv01A

ఆండ్రాయిడ్ యాప్ డెవలప్‌మెంట్
సంస్థ: క్రాక్‌కోడ్ **నైపుణ్యాలు:** ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, జావా, కాట్లిన్, రెస్ట్ ఏపీఐ, ఎక్స్‌ఎంఎల్ **స్టైపెండ్:** రూ.3,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 27
☛ https://shorturl.at/rOPJB

సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో..

సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, లఖ్‌నవూ..44 టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● టెక్నికల్ అసిస్టెంట్: 12 ● టెక్నీషియన్-1: 32 **అర్హతలు:** టెక్నీషియన్‌కు పదో తరగతి, ఐటీఐ. టెక్నికల్ అసిస్టెంట్‌కు సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ ఉండాలి. **వయసు:** చివరి తేదీ నాటికి 28 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.67,530; టెక్నీషియన్‌కు రూ.36,918. **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్టులతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 26.12.2025.
వెబ్‌సైట్: https://cdri.res.in/

ఐహెచ్‌బీటీలో టెక్నికల్ అసిస్టెంట్లు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరిసోర్స్ టెక్నాలజీ.. ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● టెక్నికల్‌అసిస్టెంట్-I: 04 ● టెక్నీషియన్: 05 **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, బీఎస్సీతో పాటూ ఉద్యోగానుభవం ఉండాలి. **వేతనం:** టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.35,400; టెక్నీషియన్‌కు రూ.19,900. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాత పరీక్ష/సీబీటీ, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌కు రూ.500; ఎస్సీ/ ఎస్టీ, మహిళలు, దివ్యాంగులకు ఫీజు లేదు. **తపాలా ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** 29-12-2025 **చిరునామా:** ది సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్, సీఎస్ఐఆర్-ఐహెచ్‌బీటీ, పోస్ట్ బాక్స్ 6, పాలంపుర్, కంగ్రా జిల్లా, హిమాచల్ ప్రదేశ్.
వెబ్‌సైట్: https://www.ihbt.res.in/en/otherlinks/recruitment

ఆన్‌లైన్‌లో తిరుపతమ్మ దర్శనం టికెట్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో దర్శనం, ఇతర సేవలు బుకింగ్, ప్రసాదాల టోకెన్లను ఆన్‌లైన్ ద్వారా భక్తులు బుక్ చేసుకోవచ్చని ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు అమ్మవారి దర్శనం కల్పించేందుకు ఆలయంలో ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశామన్నారు. టికెట్లను ఆన్‌లైన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా లేదా మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009లో బుక్ చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు ఆలయం వద్ద క్లోక్ రూమ్ పక్కన ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. వివరాలు ఇచ్చేందుకు కూడా వెబ్‌సైట్‌లో వీలుందని.. ఈసేవలను వినియోగించుకోవాలని కోరారు.

అంధ క్రికెటర్ కరుణకుమారికి ఘన స్వాగతం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అంధుల టీ 20 మహిళా వరల్డ్ కప్ కైవసం చేసుకున్న భారత జట్టులో సభ్యురాలిగా కీలకపాత్ర పోషించిన రాష్ట్ర క్రీడాకారిణి పంగి కరుణకుమారికి సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. వరల్డ్ కప్ సాధించాక.. ఆమె తొలిసారిగా సోమవారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి, పాలక మండలి సభ్యులు ఎస్.సంతోష్ కుమార్, కె.జగదీశ్వరి, అర్జున అవార్డు గ్రహీత ఐ.అజయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘ అధ్యక్షుడు చెన్నా శరత్‌బాబు, కార్యదర్శి జి.రవీంద్రబాబు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, పలువురు శిక్షకులు, క్రీడాకారులు, గన్నవరం సెయింట్ జాన్స్ క్రీడాకారిణులు హాజరై కరుణకు ఘన స్వాగతం పలికారు.



క్రీడాకారిణికి స్వాగతం పలుకుతున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎండీ భరణి తదితరులు

మట్టి తవ్వకాలపై.. సమగ్ర విచారణ!

వైకాపా హయాంలో భారీగా తవ్వేశారు ● ఏం చర్యలు చేపట్టారని లోకాయుక్త దృష్టి

ఈనాడు, అమరావతి

కొత్తూరు రిజర్వు ఫారెస్టులో వైకాపా హయాంలో.. విచ్చలవిడిగా జరిగిన అక్రమ మట్టి తవ్వకాలు, అటవీ భూముల ఆక్రమణపై.. లోకాయుక్త తాజాగా విచారణ చేపట్టింది. ఈ తవ్వకాలపై ఆధారాలతో సహా లోకాయుక్తకు 2023లో ఫిర్యాదు చేసిన వారిని సోమవారం పిలిచి.. విచారించింది. గతంలోనే దీనిపై లోకాయుక్త స్పష్టంగా ఆదేశించినా.. వాటిని అటవీ, రెవెన్యూ అధికారులు పాటించలేదు. ఈ నేపథ్యంలోనే మరోసారి ఫిర్యాదు దారైన.. కొత్తూరు తాడేపల్లివాసి మెండెం జమలయ్యను కర్నూలులో లోకాయుక్త ప్రధాన కార్యాలయానికి సోమవారం పిలిచి.. వివరాలు సేకరించింది. తవ్వకాలు జరిగిన ప్రాంతం అటవీ పరిధిలో లేదని ఆ శాఖ అధికారులు చెప్పడంతో.. రెవెన్యూతో కలిసి సంయుక్త సర్వే చేపట్టాలని.. రెండేళ్ల కిందటే లోకాయుక్త సూచించింది. కానీ.. ఇంతవరకూ అధికారులు సర్వే చేపట్టకుండా.. ఒకరిపై మరొకరు తప్పు నెట్టేస్తూ.. కాలయాపన చేస్తున్నారు. దీనిపైనే తాజాగా ఫిర్యాదుదారు నుంచి లోకాయుక్త వివరాలు సేకరించింది.

సంయుక్త సర్వే ఊసేదీ...?

అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ చేయాలంటూ.. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్)కు లోకాయుక్త 2023లోనే సూచించింది. ఫారెస్ట్ విజిలెన్స్ 02 విభాగం ఆధ్వర్యంలో విచారణ కూడా చేశారు. తవ్వకాలు జరిగాయనే అనుమానాలున్నాయని, అటవీ భూములు సైతం ఆక్రమించారని తేల్చారు. దీంతో అప్పట్లోనే.. ఇద్దరు ఉద్యోగులపై చర్యలు కూడా చేపట్టారు. వెరసి తవ్వకాలు జరిగిన ప్రాంతం అటవీ పరిధిలో ఉందా లేదా అనేది సంయుక్త సర్వే చేసి తేల్చాలని లోకాయుక్త ఆదేశించింది. అయినా.. ఇప్పటికీ సర్వే, చర్యలు వంటివేవీ చేయలేదు. తాజాగా మరోసారి అధికారులకు వీటిపై స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని లోకాయుక్త చెప్పినట్లు ఫిర్యాదుదారు జమలయ్య తెలిపారు.

హద్దు రాళ్ల తొలగింపు నేరం...

అటవీ ప్రాంతంలో హద్దు రాళ్లను పీకేసి మరీ లోపలకు వెళ్లి మట్టి తవ్వకాలు చేపట్టడం తీవ్ర నేరం. అందుకే.. అది తమ పరిధిలో లేదని అప్పట్లో అటవీ అధికారులు చెప్పారు. 310, 311 నంబర్లున్న హద్దురాళ్లను తొలగించేసి.. ఈ ప్రాంతంలో భారీలోతున తవ్వకాలు చేపట్టారు.

స్లీపర్ మార్పిడి పనులు విజయవంతం

రైల్వేస్టేషన్(విజయవాడ), న్యూస్‌టుడే: రైలు పట్టాల మధ్య ఉన్న స్లీపర్ మార్పిడి పనులను అత్యాధునిక యంత్రం సహాయంతో విజయవంతంగా మార్పిడి చేసినట్లు విజయవాడ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే నెలలో 10.70 కిలో మీటర్ల పనులను ట్రాక్ రిలేయింగ్ ట్రైన్(టీఆర్‌టీ) సహాయంతో నిర్ణీత వ్యవధిలో చేపట్టారు. ఏలూరు సెక్షన్‌లో ఈ పనులను డీఆర్‌ఎం మోహిత్ సొనాకియా పరిశీలించారు. ఇంజినీరింగ్, ఆపరేటింగ్, ఎస్అండ్‌టీ, టీఆర్‌డీ విభాగాల సిబ్బంది ట్రాక్ మార్పిడి పనుల్లో భాగస్వామ్యం వహించారు. విజయవాడ డివిజన్‌కు అత్యాధునిక యంత్రం అందుబాటులోకి రావడంతో తక్కువ వ్యవధిలోనే స్లీపర్ మార్పిడి పనులు పూర్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులు, సిబ్బందిని డీఆర్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు.

చాణక్య బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న బూనేటి చాణక్య (ఏ8) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈనెల 3వ తేదీకి వాయిదా వేశారు. ఈ పిటిషన్ సోమవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. దీనిని తదుపరి విచారణ నిమిత్తం వాయిదా వేశారు. ఇదే కేసులో సిట్ స్వాధీనం చేసుకున్న తమ కారును విడుదల చేయాలని కోరుతూ సత్యం ఇస్పాత్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను బుధవారానికి వాయిదా పడింది.

ఐపీఎస్ అధికారి సంజయ్..: అగ్నిమాపక శాఖ, సీఐడీలో డీజీగా పనిచేసిన కాలంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంజయ్.. నాలుగోసారి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ పిటిషన్‌పై విచారణ సోమవారం ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 3వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. ఇదే కేసులో కొండలరావు (ఏ4) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ కూడా 5వ తేదీకి వాయిదా పడింది.

జోగి, అద్దేపల్లి సోదరులు..: నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, రాము దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై విచారణ ఈనెల 4వ తేదీకి వాయిదా పడింది. ఇదే కేసులో ప్రధాన నిందితులైన అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావుల బెయిల్ పిటిషన్లు గురువారానికి వాయిదా పడ్డాయి. నిందితుల బెయిల్ పిటిషన్లు సోమవారం విజయవాడ ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చాయి. వీటిని తదుపరి విచారణ నిమిత్తం వాయిదా వేశారు.

'సీసీ ఫుటేజీ కోర్టు ముందుంచేలా ఆదేశించండి'

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై కిడ్నాప్, దాడి కేసుకు సంబంధించి పటమట పోలీసు స్టేషన్‌లోని సీసీ కెమెరా ఫుటేజీని కోర్టు ముందుంచేలా దర్యాప్తు అధికారి (ఐవో)ని ఆదేశించాలని కోరుతూ వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్ వేశారు. ఈఏడాది ఫిబ్రవరి 10న వంశీపై పటమట స్టేషన్‌లో కేసు నమోదైంది. తెదేపా కార్యాలయంపై దాడి కేసు ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను అపహరించి, దాడి చేసి కేసు ఉపసంహరింపజేశారని కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పటమట స్టేషన్, ప్రాంగణంలోని సీసీ కెమెరాల్లో ఈఏడాడి ఫిబ్రవరి 10 నుంచి 15 వరకు నిక్షిప్తమైన దృశ్యాలను న్యాయస్థానం ముందుంచేలా ఆదేశించాలని పిటిషన్‌లో వంశీ కోరారు. ఆ ఫుటేజీని కేసు రికార్డుగా భావించి భద్రపరచాలని కోరారు. పిటిషనపై నోటీసుల నిమిత్తం మంగళవారానికి వాయిదా పడింది.

రైతేరాజు

పోషకాల పండు.. ఆదాయం మెండు!

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పోషకాలు పుష్కలంగా ఉండే గ్యాక్ పండ్లను ప్రయోగాత్మకంగా సాగుచేసి విజయం సాధించారు ఓ యువ రైతు. కేరళ రాష్ట్రం నుంచి మొక్కలను తెప్పించారు. ఇక్కడి వాతావరణానికి అనువుగా అవి ఎదిగి పండ్ల దిగుబడి వచ్చింది. వాటిని విక్రయించడంతో పాటు ఆయా మొక్కలను పెంచి ఆసక్తి ఉన్న రైతులకు విక్రయించి ఆదాయం పొందుతున్నారు.


ఏడాదిన్నర కిందట.. రామిరెడ్డిపల్లికి చెందిన బొద్దులూరి శేషుబాబు ఏడాదిన్నర క్రితం వంద గ్యాక్ పండ్ల సాగును 25 సెంట్ల విస్తీర్ణంలో సాగుచేశారు. ఎనిమిది మాసాల్లో కాయలు కాశాయి. మొక్కల ఎదుగుదల బాగుండటంతో మరో అరెకరంలో 220 వేశారు. తానే నర్సరీలో పెంచి పొలంలో పందిరి ఏర్పాటు చేసి నాటారు. ప్రస్తుతం వాటికి పండ్లు కాస్తున్నాయి. ఇవి పచ్చ, పసుపు, ఆరంజ్, ఎరుపు రంగుల్లో ఉంటాయి. ఎర్రగా పక్వానికి వచ్చిన వాటిని తింటారు. వీటిని కిలో రూ.500కు విక్రయిస్తున్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరకు హైదరాబాద్, బెంగళూరులోని మాల్‌కు వారానికి 50 కిలోల పండ్లు అమ్ముతున్నారు. వినియోగదారుల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్ తీసుకుని కొరియర్ ద్వారా పంపుతున్నారు.

రూ.4 లక్షల నికర ఆదాయం.. ఏడాది పాటు పెంచిన గ్యాక్ పండ్ల తోటలో ఆడ మొక్కల కాండం నుంచి ముక్కలను సేకరించి నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. నెల రోజుల్లో చేతికొస్తుంది. ఎకరానికి 450 నాటాలి. వంద ఆడ మొక్కలకు 30 మగవి నాటించాలి. రెండింటి పువ్వులకు పరాగ సంపర్కం(పాలినేషన్) చేయిస్తారు. ఒక్కో మొక్కను రూ.300 వంతున విక్రయిస్తున్నారు. ఏపీ, తెలంగాణలో ఆసక్తి ఉన్న రైతులకు ఇప్పటి వరకు 1800 అమ్మారు. పండ్లు, మొక్కల విక్రయం ద్వారా ఇప్పటి వరకు రూ.3.50 లక్షలు ఆదాయం పొందారు. మరో అరెకరంలో సాగుచేసిన తోటలో పండ్లు చేతికొచ్చాయి. ఒక్కో మొక్కకు 15 కిలోల పండ్ల దిగుబడి వస్తోంది. అన్నీ ఖర్చులు పోను రూ.4 లక్షల నికర ఆదాయం వస్తోందని రైతు ఆశిస్తున్నారు.



తోటలో గ్యాక్ పండును చూపుతున్న రైతు శేషుబాబు

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా



ప్రశ్న: బెంగళూరు మిర్చి(కూరమిరప) సాగుకు వాతావరణం, నేలలు, విత్తనమోతాదు, నారుమడి యాజమాన్యం గురించి వివరించండి.
- టి.వెంకట్రావు, రైతు, చినకళ్లేపల్లి

సమాధానం: కారం లేని బెంగళూరు మిర్చి(కూరమిరప) గంట ఆకారంలో లావుగా ఉంటుంది. వీటిని పచ్చి కూరగాయలుగా ఉపయోగిస్తారు. దీన్ని సిమ్లా మిర్చి అనికూడా అంటారు. వీటిలో ఎ, సి విటమిన్లు అధికంగా ఉంటాయి. శీతాకాలం రాత్రి వేళల్లో అత్యల్ప ఉష్ణోగ్రత 10-17 డిగ్రీల మధ్య 30-40 రోజుల పాటు ఉంటే ఈ పంటకు అనుకూలం. రాత్రి ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ పూతరాలడం ఎక్కువవుతుంది. కాయ నాణ్యత తగ్గుతుంది. నీరు బాగా ఇంకే బరువైన, సారవంతమైన నేలలు అనుకూలం. సుమారు 250 గ్రాముల విత్తనాలను 25 చ.మీ నారుమడిలో పలుచగా చల్లుకోవాలి. కిలో విత్తనాన్ని 3 గ్రాముల చొప్పున థైరమ్ లేదా మాంకోజెబ్‌తో శుద్ధి చేయాలి. నారుమడిలో ఫ్యూరడాన్ గుళికలు(100 గ్రాములు) వేసుకోవాలి. విత్తిన 12, 19వ రోజున కాపర్ సంబంధిత శిలీంధ్ర నాశనిలతో నేల తడిచేలా పిచికారీ చేసి నారుకుళ్లు తెగులు నివారించుకోవాలి. **- వి.మంజువాణి, ఉద్యానశాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల**

వ్యర్థాల దహనం.. భూసారం హననం!

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: పంట వ్యర్థాలను చాలా మంది రైతులు దహనం చేస్తున్నారు. ఇలా.. చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ముమ్ముందు మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కె.నాగేంద్రరావు తెలిపారు. మంటల కారణంగా భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు మృతిచెందడమే కాకుండా చక్కటి ఎరువును చేతులారా నాశనం చేసినవాళ్లమవుతామంటున్నారు. మనిషి ఆరోగ్యం ప్రమాదం బారిన పడకుండా ఉండాలంటే చెరకు చెత్త, వరిగడ్డి, అపరాల వ్యర్థాలను ఎరువులుగా మలచుకోవాలి. ఇలా వ్యర్థాలతో భూమిని మల్చింగ్ చేయడం ద్వారా తేమశాతం నిల్వ ఉండి పంటలకు ఉపయోగపడుతుంది. సాగునీటి ఎద్దడి సమయంలో పంట దెబ్బతినకుండా ఉంటుంది. ప్రస్తుతం వరి కోతలు యంత్రాలతో కోస్తున్నారు. గడ్డిని తగలబెట్టకుండా పంటకు వినియోగించుకోవాలని నాగేంద్రరావు సూచిస్తున్నారు.



భూమిపై వ్యర్థాలతో మల్చింగ్

రబీలో అనువైన మినుము రకాలు

–ఘంటసాల, న్యూస్‌టుడే

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో అనువైన మినుము వంగడాలు, వాటి తీరు తెన్నులు, పంట కాలపరిమితి, దిగుబడులు తదితర విషయాలను ఘంటసాల కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, సమన్వయకర్త డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మీలు ఇలా వివరించారు.

ఎల్‌బీజీ రకాలు.. 752: ఇది పల్లాకు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. వరి మాగాణుల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి ఎకరానికి 6-7 క్వింటాళ్లు. ★ **884:** ఇది పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో సాగుకు అనువైన రకం. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **787:** ఈ రకం పల్లాకు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. కాండం కణుపుల వద్ద కూడా కాయలు వస్తాయి. పంట కాలం 75-80 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **932:** పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **904:** ఈ రకం పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **645:** ఈ రకం ఎండు తెగులును తట్టుకుంటుంది. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **648:** ఈ రకం ఎండు తెగులును తట్టుకుంటుంది. బూడిద, ఆకుముచ్చు, తుప్పు తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 90-95 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. * **709:** మాగాణి భూముల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పంట కాలం 80-85 రోజులు. దిగుబడి 6-7క్వింటాళ్లు. ★ **టీబీజీ 104:** ఇది పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలకు అనువైన రకం. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **129:** ఈ రకం పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అన్ని కాలాలు, వరి మాగాణుల్లో అనువైన రకం. పంట కాలం 85-90 రోజులు. దిగుబడి 8-10 క్వింటాళ్లు. ★ **జీబీజీ1:** ఈ రకం వరి మాగాణుల్లో ఆలస్యంగా విత్తుకునేందుకు అనువైన రకం. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 8-9 క్వింటాళ్లు. ★ **పీయూ 31:** ఈ రకం పల్లాకు తెగులును పూర్తిగా తట్టుకుంటుంది. పంట కాలం 70-75 రోజులు. దిగుబడి 5-6 క్వింటాళ్లు.



ఆ వీడియోలు బయటపెడతాడట!

మా అమ్మాయికి పెళ్లై రెండేళ్లు. తనని ఆధునికంగా కనిపించాలని, మోడ్రన్ దుస్తులు వేసుకోవాలంటూ ఆమె భర్త వేధిస్తున్నాడు. దాన్ని తను ఒత్తిడిగా భావిస్తోంది. అదే విషయాన్ని మేం వాళ్ల తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాం. వారు అతడికి నచ్చజెప్పకపోగా రివర్స్‌లో భర్తకు నచ్చినట్లు ఉంటే తప్పేంటి అన్నారు. అల్లుడిని నిలదీస్తే... తాను చెప్పినట్లు చేయకపోతే వాళ్ల బెడ్‌రూమ్ వీడియోలు బయటపెడతా అని బెదిరిస్తున్నాడు. మేం అతడిపై కేసు పెట్టొచ్చా? ఇందుకు ఎలాంటి ఆధారాలు సమర్పించాలి?

– ఓ సోదరి

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి
న్యాయవాది

ఇలాంటి విషయాలు వింటుంటే పెళ్లికి ముందు కౌన్సెలింగ్ ఎంత అవసరమో అర్థమవుతుంది. ఈ రోజుల్లో పల్లెటూళ్లూ, పట్టణాలూ అని లేకుండా అమ్మాయిలందరూ ఆధునిక దుస్తుల్లోనే కనిపిస్తున్నారు. ఆయన చెబుతున్న మోడ్రన్ మరీ శ్రుతిమించడంవల్ల అమ్మాయి ఇబ్బంది పడుతున్నట్లు ఉంది. ఈ విషయం తల్లిదండ్రుల దాకా వచ్చిందంటే వాళ్లిద్దరూ సర్దుకోలేకపోయారని తెలుస్తోంది. తన అత్తమామలు కొడుక్కి సర్దిచెప్పలేక మీతో వాదనకు దిగి ఉండొచ్చు. మీ అమ్మాయి భర్తతో కలిసి ఉండదలచుకోకపోతే భర్త మీద గృహహింస చట్టం కింద కేసు వేయవచ్చు. అతడు తను చెప్పినట్లు చేయకపోతే బెడ్‌రూమ్ వీడియోలు బయటపెడతానని కోపంతో అన్నాడా లేక తనని తాను సమర్థించుకోవడానికి అన్నాడా? ముందు ఇద్దరికీ ఫ్యామిలీ కౌన్సెలింగ్ చేయిస్తే మంచిది అనిపిస్తోంది. కేసులు వేస్తే కాపురం నిలబడదు. విడాకులకోసం కేసు వేస్తే అతను అన్న మాటల్ని నిరూపించగలగాలి. మీడియేటర్ దగ్గర పరిష్కారం కాకపోతే అప్పుడు శారీరకంగా మానసికంగా హింసిస్తున్నాడని గృహహింస కేసు వేయండి. ఆపై క్రూరత్వం కింద హిందూ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 13 ప్రకారం విడాకుల కేసు, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 7 ప్రకారం వాయురిజం కేసు కూడా వేయవచ్చు. రహస్యంగా ప్రైవేటల్ పార్ట్స్‌ని చూడటం, వీడియోలు తీయడం చట్టరీత్యా నేరం. దీనికి ఏడాది నుంచి మూడేళ్ల వరకూ శిక్ష పడుతుంది. ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

'మ్యాన్-కీపింగ్' వద్దు..!




ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో... 'మ్యాన్-కీపింగ్' మీదే చర్చంతా. అంటే భర్త లేదా ప్రేమించిన వ్యక్తితో బంధం నిలుపుకొనే క్రమంలో అమ్మాయిలు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అంటే- ఆర్థిక మద్దతు, సర్దుకుపోవడం, బంధం బలహీనపడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం, వాళ్ల అలవాట్లన్నీ సహించడం, ఏ చిన్న సమస్య వచ్చినా అమ్మాయే ముందుగా స్పందించి సరిదిద్దడం... వంటివన్నీ మ్యాన్ కీపింగ్‌లో అంశాలే. ఒకప్పటి అమ్మాయిలంతా ఇదే ధోరణిలో జీవితాన్ని గడిపేవారు. పెద్దవాళ్లూ దీన్నే ప్రోత్సహించేవారు. సర్దుకుపోవాలని అమ్మాయికే చెప్పేవారు. ఇప్పటికీ చాలామంది వీటినే పాటిస్తున్నారు కూడా. కానీ జెన్ జీ అమ్మాయిలు ఈ బానిసత్వం మావల్ల కాదు అంటున్నారు. ఇది ఒక రకంగా మమ్మల్ని మేము చంపేసుకోవడం లాంటిదే, సెల్ఫ్-కీపింగ్‌కే మా ఓటు అంటున్నారు. అంటే వ్యక్తిగత అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం. మంచీచెడుల్ని బేరీజు వేసుకుని పనులు చేయడం. పురుషాధిపత్యాన్ని పక్కకు నెట్టి తమకంటూ సొంత గుర్తింపును సంపాదించుకోవడం సెల్ఫ్-కీపింగ్‌లో ప్రధానాంశాలు. దీనికి విరుద్ధంగా వచ్చే ప్రేమా, పెళ్లీ బంధాలకు నిర్మొహమాటంగా నో చెబుతున్నారట. దాంతో సామాజిక మాధ్యమాల్లో ఎక్కడ చూసినా జెన్ జీ అమ్మాయిలు మరో మైలురాయిని దాటి ట్రెండ్ సెట్ చేస్తున్నారు అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

'పరీక్ష తప్పామనీ... ప్రేమలో విఫలం అయ్యామనీ... మంచి ర్యాంకు రాలేదనీ... ఇలా రకరకాల కారణాలతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు యువత. ఇవి ఒక్కరోజులో తీసుకున్న నిర్ణయాలు కాదు. రోజుల తరబడి బాధ పడుతూ... ఒకానొక బలహీన క్షణంలో ఆత్మహత్య చేసుకుంటున్నారు. అయితే కృత్రిమ మేధతో ఆత్మహత్య ఆలోచనల్ని ముందుగానే గుర్తించవచ్చు' అంటున్నారు **ముక్కు లాలస**. అదెలా అన్నది ఆమె మాటల్లోనే...



లాలస

ఏఐతో ఆత్మహత్యలకు చెక్!

ముప్పై ఏళ్లు దాటిన వారిలో చాలామంది తమకు ఎదురయ్యే సమస్యల్ని వ్యక్తపరచగలరు. పరిష్కారాల దిశగా ఆలోచించగలరు. కానీ యువత, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది సాధ్యం కాదు. ఈ భావాలన్నీ వాళ్లలోనే అణచిపెట్టుకుంటారు. ఇది అధ్యయనాలు చెబుతున్న మాట. యువతలో ఆత్మహత్యలు నానాటికీ పెరగడానికి ఇదీ ఓ కారణం. అలా కాకుండా వారి మానసిక స్థితి తెలుసుకోగలిగితే సగానికిపైగా ఆత్మహత్యల్ని నివారించవచ్చు. నా పరిశోధనలకు బలం కూడా ఇదే అంశం.

మాది తిరుపతి. నాన్న ముక్కు సత్యవంతుడు, న్యాయవాది. అమ్మ నాగలక్ష్మి, ప్రొఫెసర్. బాగా చదువుకోవాలి, మంచి ఉద్యోగం చేయాలి ఇవే నా లక్ష్యాలు. బీటెక్ పూర్తిచేసి కార్పొరేట్ ఉద్యోగాన్నీ సంపాదించా. రెండేళ్లు బిజినెస్ అనలిస్ట్‌గా విధులూ నిర్వర్తించా. కానీ ఏదో అసంతృప్తి వెంటాడేది. పరిశోధనల వైపు దృష్టిసారించాలి అనుకున్నా. అందుకు అమ్మానాన్నల ప్రోత్సాహమూ తోడైంది. అమ్మ తన వృత్తి జీవితంలో ఎంతో రాణించారు. ఆమె పేరుమీద చాలా పబ్లికేషన్లు ఉన్నాయి. ఆమె స్ఫూర్తితోనే ఉన్నత చదువులవైపు దృష్టి సారించా.

మొదటి అవకాశం...

ఎంటెక్‌లో చేరాను. అక్కడే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కింద క్వాంటమ్ కంప్యూటింగ్ అంశంపై ఇంటర్న్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. ఈక్రమంలో చాలా విషయాలు నేర్చుకున్నా. తర్వాత బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో పీహెచ్‌డీలో చేరా. ఓవైపు పీహెచ్‌డీ చేస్తూనే ఏఐ సంబంధిత విషయాలపై శిక్షణా తీసుకున్నా. వీటన్నింటి వల్లా పరిశోధనల మీద ఆసక్తి మరింత పెరిగింది. మా పిన్ని కటారు రాధ, గైనకాలజిస్టు. ఆమె ద్వారా వైద్య రంగంలో కృత్రిమ మేధ అవసరాన్ని గ్రహించాను. ఏఐని ఉపయోగించి క్యాన్సర్‌ను గుర్తించే మోడల్‌ను ఆవిష్కరించాలనుకున్నా. ఆ దిశగా ప్రయత్నాలూ మొదలుపెట్టా. కానీ ఒక రోజు పత్రికలో యువత ఆత్మహత్యల గురించి చదివా. బ్రేకప్‌లు, చదువులో ఎదురవుతున్న అడ్డంకులతో... ఒత్తిడికి లోనవుతున్నారు. అదే దీర్ఘకాలం కొనసాగి ఆత్మహత్యే శరణ్యం అనుకుంటున్నారు. ఇవేవీ జీవితాన్ని అక్కడితో ముగించేంత పెద్దవి కావు. అందుకే ఈ డిప్రెషన్‌ని ముందుగానే గుర్తించే వీలుంటే బాగుంటుంది అనిపించింది. కృత్రిమ మేధను ఉపయోగించి ఓ టూల్ తయారుచేయాలి అనుకున్నా.

జవాబు చెబితే చాలు...

2022 నుంచి దీనిపై పరిశోధనలు మొదలుపెట్టా. కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి కొందరు విద్యార్థుల డేటాను సేకరించా. 400మందిని ఎంపిక చేసుకుని వారి మానసిక పరిస్థితిపై అధ్యయనాన్నీ నిర్వహించా. మానసిక శాస్త్రంలో అప్పటికే అందుబాటులో ఉన్న ప్రశ్నావళిని ఆధారంగా చేసుకుని, ఏఐ మోడల్‌నీ తీసుకువచ్చా. దీనిలో ఏడు ప్రశ్నలు ఉంటాయి. మూడు నెలలకోసారి పరీక్షలు ముగిసిన వెంటనే గూగుల్ షీట్ ద్వారా సమాధానాలు సేకరించా. మెషీన్ లర్నింగ్‌తో విద్యార్థుల సమాధానాలు విశ్లేషిస్తే... ఇది ప్రమాదంలో ఉన్న వ్యక్తులను తెలివిగా, సమర్థంగా గుర్తించడానికి దోహదపడినట్లు వెల్లడైంది. వీటిలో ఏవీ ప్రత్యక్ష ప్రశ్నలు కాదు. అన్నీ పరోక్షంగానే ఉంటాయి. దీనివల్ల జవాబు ఇచ్చే వారు ఏ సంకోచం లేకుండా తమ మనసులోని భావాల్ని బయటికి చెబుతారు. వీటన్నింటినీ బేరీజు వేసి డిప్రెషన్ ఛాయల్నీ, సూసైడ్ టెండెన్సీనీ తెలుపుతుందీ టూల్. ఈ పరిశోధనాంశం ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ లోనూ చోటుదక్కించుకుంది. దుబాయిలో జరిగిన ప్రతిష్ఠాత్మక న్యూరోసైన్స్ కాన్ఫరెన్స్‌లో పురస్కారాన్నీ దక్కించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధను కలిపితే వచ్చే ఫలితాల మీద తదుపరి పరిశోధన చేస్తున్నా. దీనిపై పుస్తకాన్నీ రాశా. 'లాలాస క్వాంటమ్ మెథడ్'ను రూపొందించా. ఇది పబ్లికేషన్‌కు సిద్ధమవుతోంది.

– పసుపులేటి వేణుగోపాల్, తిరుపతి



పగుళ్లు పరార్ ఇలా...

చలికాలంలో చర్మం పొడిబారి పాదాల మడమలు పగుళ్లు రావడం సాధారణం. కానీ, ఈ సమస్య మరింత పెరగకూడదన్నా, అవి బాధించకూడదన్నా ఈ పని చేయండి.

- రాత్రి పడుకునే ముందు పావుగంట సేపు ఉప్పు నీటిలో పాదాల్ని నాననివ్వండి. తర్వాత ప్యూమిక్ స్టోన్‌తో మృతకణాల్ని తొలగించండి. పెట్రోలియం జెల్లీ రాసి మృదువుగా మర్దన చేయండి. ఆపై సాక్సు వేసుకుంటే సరి. ఇలా రోజూ చేస్తే మృదువుగా మారతాయి.
- పాదాలకు తగిన తేమ అందినప్పుడు పగుళ్లు ఇబ్బంది పెట్టవు. ఇందుకోసమే మార్కెట్‌లో మాయిశ్చరైజర్ సాక్సులు, మాస్కులు దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించి చూడండి.
- కొందరికి తరచూ కాళ్లు కడిగే అలవాటు ఉంటుంది. ఇంటి పనుల పేరుతో నీళ్లలోనూ నానుతుంటారు. ఇలాంటివారు రోజూ రాత్రిపూట తప్పనిసరిగా ఆముదంలో కాస్త పసుపు కలిపి రాసుకుంటే సరి. పగుళ్లు రావు. వచ్చినా అవి ఇన్ఫెక్షన్‌కి గురి కావు.
- పాదాల పగుళ్లకు నూనె రాయడం, ప్యాక్‌లు వేయడంతో పాటు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. కనీసం 3 లీటర్ల వరకూ అయినా నీళ్లను తాగాలి.



బంగారం - వెండి
1న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,32,850	1,20,000	1,79,717
విజయవాడ	1,28,475	1,19,600	1,78,700
ప్రొద్దుటూరు	1,27,900	1,17,670	1,75,000
రాజమహేంద్రవరం	1,30,480	1,19,600	1,96,000
విశాఖపట్నం	1,29,350	1,19,000	1,80,000
తమిళనాడు	-----	1,20,700	1,96,000

ఆమె సంకల్పం... ఆకాశమంత!

చిన్న కష్టం వస్తేనే కుంగిపోతాం. అరె మనకే ఎందుకు ఇలా అయ్యిందంటూ తెగ బాధపడతాం. కానీ ఆమె జీవితమే కష్టాలమయం. అయినా నిలదొక్కుకుని... ఆత్మవిశ్వాసానికి అర్థంగా నిలుస్తున్నారు కమలి.


కమలి



ఎత్తు మూడు అడుగులు. నడవలేదు, చేతులతో పాకుతూనే ఎక్కడికైనా వెళ్లాలి. దీనికితోడు అమ్మ చిన్నతనంలోనే చనిపోయింది. దీంతో రెండో పెళ్లి చేసుకున్నాడు తండ్రి. వైకల్యం ఉన్న కూతురిని ఆదరించకపోగా ఇంటి నుంచి గెంటేశాడు. ఎంత బతిమాలినా ఇంట్లోకి అడుగు పెట్టనీయలేదు. ఎక్కడికి వెళ్లాలో ఎవరిని సాయమడగాలో అర్థం కాలేదు కమలికి. ఒకానొక దశలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. కానీ అది పిరికితనం, జీవించి చూపించాలి అనుకున్న ఆమె జీవన పోరాటం మొదలుపెట్టారు. కమలిది ఝూర్ఖండ్‌లోని సత్‌గావం. తనకి వికలాంగ పెన్షన్ వచ్చేది. దాంతో టైలరింగ్ నేర్చుకున్నారు. ఆపై ఒక కుట్టు మెషీన్ కొని చుట్టుపక్కల వాళ్లకి వస్త్రాలు కుట్టివ్వడం మొదలుపెట్టారు. ఆ సంపాదనతోనే తన జీవితాన్ని మలుచుకున్నారు. ఈమె గురించి తెలిసి ఓ ఎన్‌జీఓ వాళ్లు ఆమెతో కాస్మెటిక్స్ దుకాణాన్ని తెరిపించారు. దాన్ని నిర్వహిస్తూనే టైలరింగ్‌నీ కొనసాగిస్తున్నారు. ఈమెకి దుస్తులు కుట్టడంలో మంచి పేరుంది. దీంతో ఆదాయం పెరిగింది. తన సంపాదనతో తమ్ముడి పిల్లలనీ చదివిస్తున్నారు. 'వైకల్యం అడ్డు అని నేనెప్పుడూ భావించను. ఎవరిపైనా ఆధారపడొద్దు, నా కష్టమ్మీద నేను బతకాలి అనుకున్నా. ఆ పట్టుదలే నన్ను ముందుకు నడిపిస్తోంది' అనే కమలి... ఎంతోమంది ప్రశంసలూ అందుకుంటున్నారు. సంకల్ప బలంతో సవాళ్లను అధిగమిస్తోన్న ఈమెను చూసి జీవిత పాఠాలు నేర్చుకోవాల్సిందే కదూ!

- ఈటీవీ భారత్



ఇలా చేయండి

ఇంట్లో చదువుకునే పిల్లలు ఉంటే... పుస్తకాల్లో బొమ్మలు అంటించడం, ప్రాజెక్టులు వంటివి తప్పనిసరి. వీటికోసం గమ్ వాడక తప్పదు. చాలాసార్లు అవి గడ్డ కట్టి సమయానికి పనికి రాకపోవడం, పిల్లల చేతులకు అంటుకుని చర్మం ఊడటం, అలర్జీలకు కారణమవ్వడం వంటివి గమనిస్తూనే ఉంటాం. ఇలాంటి తిప్పలు ఉండొద్దంటే... ఇంట్లోనే ఈ జిగురును తయారు చేసుకుని చూడండి. ఒక చిన్నపాత్రలో టేబుల్ స్పూను పంచదార వేయాలి. దానిలో కొంచెం షాంపూ వేసి, పంచదార కరిగేదాకా గిలకొట్టండి. తరవాత స్పూను గోధుమపిండి చేర్చి, మరోసారి కలపండి. ఇది కాగితాలు, ఫొటోలు, ఛార్టులు వంటివి అంటించడంలో చక్కగా సాయపడుతుంది. చేతికి అంటినా సులువుగా పోతుంది. చర్మానికి హాని ఉండదు. ప్రయత్నించి చూడండి.

ఈరోజు ఏదైనా కొత్తగా..!

ఉదయాన్నే లేవడం ఆలస్యం... అదే వంట, ఇంటి పని! ఆఫీసులోకి అడుగు పెడుతూనే ఉసూరుమనడం. 'అబ్బా ఈరోజుకి ఇంటికి వెళ్లిపోతే బాగుండు' అనిపించడం! చాలాసార్లు మనకి ఎదురయ్యేవే కదూ! రోజూ ఒకే పని చేస్తూ ఉంటే జీవితం బోరే కొడుతుంది మరి! దీంతో నీరసం, చేసే పనిమీద అనాసక్తి, ఒత్తిడి... చెప్పుకొంటూ పోవాలే కానీ ఇంకా బోలెడు సమస్యలు. దూరం కావాలా 'నోవల్టీ రూల్' పాటించండి.



పేరు విని కంగారు పడకండి. సింపుల్‌గా కొత్తగా ఏదైనా ప్రయత్నించమని చెబుతున్నారంతే. అది కూడా పెద్దవేం కాదు... చిన్న చిన్నవే! అవి మనలో ఉత్సాహాన్ని నింపి చలాకీగా చేస్తాయి. అంటే ఏమీ లేదు. రోజూ ఆఫీసుకీ, ఇంటికీ ఒకే దారిలో వెళ్తుంటారా? ఈసారి దారి మార్చండి. రోజూ పట్టించుకోమేమో కానీ కొత్తదారిలో వెళ్తున్నప్పుడు వ్యక్తులు, దారులు, భవంతులు... ఇలా ఎన్నో గమనిస్తుంటామట. రోజూ పనులైనా... కొత్త వంటలు, ఆ క్షణం ఏమనిపిస్తే వాటిని చేయడం, కూరగాయలు, సరకులు కొత్త ప్రదేశాల్లో కొనడం... చిన్నచిన్నవే కానీ మనలో చాలా మార్పు తెస్తాయి. ఎందుకిలా అంటే కొత్తది ఏం ప్రయత్నిస్తున్నా మన మెదడు ఫీల్‌గుడ్ హార్మోను డోపమైన్‌ను విడుదల చేస్తుంది. దీంతో ఆ క్షణం మన దృష్టంతా చేస్తున్న పనిమీదే ఉంటుంది. పైగా ఉత్సాహంగా పూర్తిచేస్తాం కూడానట. రోజూ ఒకే పని ఒకే తరహాలో చేయడం వల్ల జీవితం ఆటోపైలట్ మోడ్‌లోకి వెళ్లిపోతుంది. కాబట్టే, ఈ అనాసక్తి. ఇల్లు, ఉద్యోగం వంటి బాధ్యతలు మనకు ఎలాగూ తప్పనిసరి. తప్పించుకోవడానికి అన్నిసార్లూ షాపింగులు, పర్యటనలంటూ వెళ్లలేం. అలాగని కొద్దిరోజులకే విరక్తి తిరిగొస్తోంటే మనకీ సమస్యే. కాబట్టి, రోజూవాటినే కొత్తగా ఎలా చేయొచ్చా అని ఆలోచించి, ప్రయత్నించండి. మూడ్ మారిపోతుంది, ఉత్సాహంగా పూర్తిచేస్తారు కూడా! ఓసారి చేసి చూడండి మరి.



చెవులపై పూలతలు ఎంతందమో!

ఎంత ఖరీదైన దుస్తులు, నగలు ధరించినా... చెవులకు కమ్మలు లేకపోతే మాత్రం నిండుదనం రాదు. బుట్టలు, దిద్దులు, కమ్మలు, లోలాకులు... ఇలా ఎన్నెన్నో డిజైన్లు ఎప్పటికప్పుడు అలరిస్తూనే ఉన్నాయి. వాటిల్లో కొన్నాళ్లుగా యువతను మెప్పిస్తోన్న ఇయర్‌కఫ్స్ సందడీ తక్కువేం కాదు. చెవి మొత్తాన్నీ కప్పి ఉంచేలా సింగారించుకునే స్టైల్ నిన్నటిది. రొటీన్‌కి భిన్నంగా, ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకునే ఈతరం ఇందులోనూ మినిమలిజాన్ని వెతుకుతోంది. ఆధునిక డిజైన్ల స్థానంలో సంప్రదాయ సొగసులు అద్దుకోవాలనుకుంటోంది. దానికి తగ్గట్లే డిజైనర్లూ సింపుల్‌గా, స్టైలిష్‌గా వీటిని తీర్చిదిద్దేశారు. స్టేట్‌మెంట్ లుక్‌ని తెచ్చిపెట్టడానికి రాళ్లు, కుందన్లు, ముత్యాలు, పచ్చలు... ఒకటేమిటీ అన్నింటినీ అందంగా అమర్చేస్తున్నారు. చెవి అంచుల్లో చేరి లతల్లా అల్లుకుపోతున్న ఇవి అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి. వాటినోసారి మీరూ చూడండి.

నగా నట్రా

వెదురు రుచులతో సిరులు!

ఓర్పు, నేర్పు ఉండాలే కానీ, విజయం తప్పక వరిస్తుంది. అందుకు ఉదాహరణ పూనమ్ సైనీ. ఆమెకు వ్యాపారం చేయాలన్న ఆలోచన ఉన్నా కానీ, పెద్దగా పెట్టుబడి లేదు. అయినా ధైర్యంగా ముందడుగు వేసి వెదురు పచ్చళ్ల వ్యాపారంలో ఎదురులేని విజయం సాధించారు.


పూనమ్

పూనమ్‌ది హరియాణాలోని యమునానగర్. ఉపాధి కోసం 2019లో స్థానిక స్వయం సహాయక బృందంలో చేరి ఊరగాయల తయారీలో శిక్షణ తీసుకున్నారు. అనంతరం రూ.2వేల పెట్టుబడితో ఇంట్లోనే ఊరగాయలు, పచ్చళ్లను తయారు చేయడం మొదలుపెట్టారు. ప్రారంభంలో పెద్దగా వ్యాపారం జరగలేదు. ఈ పరిస్థితుల్లో మరేదైనా కొత్త వ్యాపారం చూసుకుందామని పూనమ్‌కు సూచించారు భర్త. అందుకు ఆమె అంగీకరించలేదు. మరికొన్నాళ్లు ఓపిగ్గా ప్రయత్నిద్దామన్నారు. ఊరగాయలు, పచ్చళ్లు, తాండ్రల తయారీలో ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగారు. రుచితోపాటు శుచీశుభ్రత ఉండటంతో ఆర్డర్లు కొంతమేర పెరిగాయి.



వెదురుతో ప్రయోగాలు...

ఎగ్జిబిషన్లు, మేళాల్లో వివిధ రకాల పచ్చళ్లు, తాండ్రలను ప్రదర్శిస్తుంటారు పూనమ్. ఈ నేపథ్యంలో 2022లో వెదురు చిగుళ్లను తరిగి, ఉడకబెట్టి ఊరగాయలు, పచ్చళ్లు, తాండ్రలను తయారు చేశారు పూనమ్. వాటికి మంచి ఆదరణ లభించింది. హరియాణాలోని కురుక్షేత్ర వేదికగా నవంబరు 15 నుంచి అంతర్జాతీయ గీతా మహోత్సవం జరుగుతోంది. ఇది డిసెంబరు 5 వరకు కొనసాగనుంది. ఈ ఎగ్జిబిషన్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేశారు పూనమ్. ఇక్కడ దాదాపు 16 రకాల ఊరగాయలు, పచ్చళ్లు, తాండ్రలను ప్రదర్శిస్తున్నారు. వెదురుతో తయారు చేసిన ఊరగాయ, పచ్చడి, తాండ్రకు భారీ క్రేజ్ లభిస్తోంది. సందర్శకులు వీటిని కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ముందస్తు ఆర్డర్లూ ఇస్తున్నారు. ఇప్పుడు ఆమె ఆదాయం రూ.లక్షల్లోకి చేరింది.

శిక్షణలోనూ రాణిస్తూ...

'మేం తయారుచేసే వెదురు ఊరగాయలు, తాండ్ర రుచికరంగా ఉంటాయి. ఎముకలకు బలాన్నిచ్చే కాల్షియం వీటిలో పుష్కలం. దిల్లీ, ఉత్తరాఖండ్ నుంచీ ఆర్డర్లు వస్తున్నాయి. నా దగ్గర శిక్షణ పొందిన 30 మంది మహిళలు సొంతంగా పచ్చళ్ల బిజినెస్‌లు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో 'హిసార్' వ్యవసాయ విశ్వవిద్యాలయం నన్ను సత్కరించింది' అని చెబుతారు పూనమ్. తాను ఎదుగుతూ, ఇతర జీవితాల్లో వెలుగులు నింపుతున్న పూనమ్ ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారు. అందుకే విశ్వవిద్యాలయం నుంచి సత్కారం అందుకొని ఇంటికి వచ్చినప్పుడు గ్రామస్థులు డోళ్లు, బాకా వాయించి మరీ ఆమెకు ఘన స్వాగతం పలికారు.

ఈటీవీ భారత్

ఛాంపియన్


గిల్

టీ20ల్లో గిల్ ఆడతాడా లేదా?

ఫిట్‌నెస్ సమీక్ష కోసం సీఓఈకి

దిల్లీ: మెడ నొప్పి వల్ల దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ నుంచి అర్ధంతరంగా తప్పుకొన్నాడు కెప్టెన్ శుభ్‌మన్ గిల్. అదే జట్టుతో వన్డే సిరీస్‌లోనూ అతను ఆడలేకపోయాడు. కోలుకునేందుకు మరింత సమయం పట్టడంతో వన్డేలకు దూరంగా ఉన్నాడు. దీంతో కేఎల్ రాహుల్ ఈ సిరీస్‌లో జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. మరి సఫారీ జట్టుతో ఈ నెల 9న ఆరంభమయ్యే అయిదు టీ20ల సిరీస్‌లో అయినా గిల్ ఆడతాడా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. అయితే మెడ నొప్పి నుంచి గిల్ కోలుకున్నట్లే కనిపిస్తోంది. తన ఫిట్‌నెస్‌పై సమీక్ష కోసం అతను బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో రిపోర్ట్ చేయబోతున్నాడు. అక్కడి వైద్యులు అతడిని పరిశీలించి, మ్యాచ్ ఫిట్‌నెస్ ఉన్నట్లు నిర్ధరిస్తే.. దక్షిణాఫ్రికాతో టీ20ల్లో గిల్ బరిలోకి దిగుతాడు. భారత టీ20 జట్టుకు అతను వైస్ కెప్టెన్ అన్న సంగతి తెలిసిందే. ఆసియా కప్‌లో టీ20 జట్టులోకి పునరాగమనం చేశాక గిల్.. ఈ ఫార్మాట్లో అంత గొప్పగా ఏమీ రాణించలేదు. 12 మ్యాచ్‌ల్లో 28.77 సగటుతో 259 పరుగులు సాధించాడు. అందులో ఒక్క అర్ధ సెంచరీ కూడా లేదు.

ముస్తాక్ అలీలో హార్దిక్


హార్దిక్

ముంబయి: టీమ్‌ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నీలో ఆడబోతున్నాడు. సెప్టెంబరు చివర్లో ఆసియా కప్‌లో ఆడుతూ గాయపడ్డ హార్దిక్.. అప్పట్నుంచి మైదానానికి దూరంగా ఉన్నాడు. ఇటీవలే అతను ఫిట్‌నెస్ సాధించాడు. ముస్తాక్ అలీ టోర్నీలో బరోడాకు అతను ప్రాతినిధ్యం వహించనున్నాడు. మంగళవారం హైదరాబాద్‌లో పంజాబ్‌తో మ్యాచ్‌లో ఆడనున్నాడు. గురువారం గుజరాత్‌తో మ్యాచ్‌లోనూ బరిలోకి దిగనున్నాడు. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టులో తనకు చోటు దక్కుతుందని హార్దిక్ ఆశిస్తున్నాడు.

కోచ్‌కు.. జట్టులోని స్టార్ ఆటగాళ్లకు మధ్య సయోధ్య లేనపుడు జట్టు ప్రయాణం సాఫీగా సాగడం కష్టం! గౌతమ్ గంభీర్ కోచ్ అయినప్పటి నుంచి స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలతో అతడికి సత్సంబంధాలు లేవనే వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ ఇద్దరు సీనియర్లు టెస్టులకు దూరం కావడానికి.. వన్డేల్లో రోహిత్ కెప్టెన్సీ కోల్పోవడానికి గంభీరే కారణం అన్న అభిప్రాయం అభిమానుల్లో బలంగా ఉంది. రో-కో 2027 వన్డే ప్రపంచకప్ ఆడాలనే ఆలోచనతో ఉన్న నేపథ్యంలో వీరికి, కోచ్‌కు మధ్య నెలకొన్న అంతరం తగ్గాల్సిందే. ఇందుకోసమే బీసీసీఐ సయోధ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాచారం.


గంభీర్


కోహ్లి, రోహిత్

ఎవరికి వారే!

రోహిత్-కోహ్లి.. గంభీర్ మధ్య అంతరం

సయోధ్యకు బీసీసీఐ ప్రయత్నం

ఈనాడు క్రీడావిభాగం

రాంచిలో దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో అద్భుత శతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు విరాట్ కోహ్లి. ఈ మ్యాచ్‌లో రోహిత్ కూడా చక్కటి అర్ధశతకం సాధించాడు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో అభిమానులు గౌతమ్ గంభీర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం మొదలుపెట్టారు. పనిగట్టుకుని భారత క్రికెట్లో రో-కోల ప్రాధాన్యం తగ్గించడానికి గౌతీ ప్రయత్నిస్తున్నాడన్నది వారి ఆరోపణ. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌ల్లో ఓటమికి బాధ్యులుగా చేస్తూ రోహిత్, కోహ్లిలకు పొమ్మనకుండా పొగబెట్టేశారనే చర్చ కొన్ని నెలలుగా నడుస్తోంది. రోహిత్, కోహ్లి ఒకరి తర్వాత ఒకరు టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించేలా చేసింది కోచ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌లే అనే వాదన వినిపించింది. ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును విజేతగా నిలిపిన రోహిత్‌ను తర్వాతి వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా తప్పించడంతో గౌతీ, అగార్కర్‌ల మీద అభిమానుల ఆగ్రహం ఇంకా పెరిగింది. ఇటీవల దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో టీమ్‌ఇండియా వైట్‌వాష్‌కు గురి కావడంతో.. వారి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ పరాభవానికి బాధ్యత తీసుకుని అతను కోచ్‌గా తప్పుకోవాలనే డిమాండ్లు గట్టిగా వినిపించాయి. రెండో టెస్టు ఓటమి అనంతరం గువాహటిలో పెద్ద ఎత్తున గంభీర్‌కు వ్యతిరేకంగా నినాదాలతో మైదానం హోరెత్తడం గమనార్హం.


రో-కోలో అసంతృప్తి

గంభీర్ విషయంలో ఇటు రోహిత్, అటు కోహ్లి అసంతృప్తితోనే ఉన్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. ఐపీఎల్ అనంతరం వీళ్లిద్దరూ ఒక దశలో ఇంగ్లాండ్ పర్యటన కోసం సన్నద్ధమవుతూ కనిపించారు. కానీ హఠాత్తుగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అప్పట్నుంచే ఇద్దరికీ గంభీర్‌తో సంబంధాలు దెబ్బ తిన్నట్లు కనిపిస్తోంది. గంభీర్ కోచ్‌గా ఉండగానే భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ గెలవగా.. తర్వాత ఓ కార్యక్రమంలో రోహిత్ మాట్లాడుతూ ఆ టోర్నీలో గెలిచిన జట్టును ద్రవిడ్ తయారు చేశాడని పేర్కొనడం గమనార్హం. ఇక రాంచి వన్డేలో సెంచరీతో జట్టును గెలిపించిన అనంతరం పెవిలియన్‌కు వచ్చాక, మ్యాచ్ అనంతరం గంభీర్‌తో అంటీముట్టనట్లు కోహ్లి వ్యవహరించాడంటూ కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో తిరిగాయి. బహుమతి ప్రదానోత్సవంలో కోహ్లి మాట్లాడుతూ.. తాను ఎప్పుడు మైదానంలోకి వచ్చినా 120 శాతం సన్నద్ధతతో ఉంటానని.. మ్యాచ్‌లకు ముందు మరీ ఎక్కువ సాధన అవసరం లేదని వ్యాఖ్యానించాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఆడాలని రోహిత్, కోహ్లిలపై జట్టు యాజమాన్యం ఒత్తిడి తెస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గంభీర్, అగార్కర్‌లను ఉద్దేశించే విరాట్ ఈ వ్యాఖ్యలు చేశాడనే చర్చ జరుగుతోంది.

ఒత్తిడిలో గంభీర్


2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడే ఉద్దేశం రోహిత్, కోహ్లిల్లో బలంగానే ఉన్నట్లు తెలుస్తోంది. కానీ జట్టు యాజమాన్యం నుంచి వీరికి ఈ విషయంలో హామీ మాత్రం దక్కడం లేదు. ఆ మేరకు హామీ ఉన్నట్లయితే రోహిత్‌ను వన్డే కెప్టెన్‌గా తప్పించేవారా అన్నది ప్రశ్న. రోహిత్‌ను వన్డే కెప్టెన్‌గా తప్పించాక.. అతడిని, కోహ్లిని జట్టులో కొనసాగించడం కష్టమే అనిపించింది. కానీ ఆస్ట్రేలియాలో రోహిత్, తాజాగా దక్షిణాఫ్రికాపై కోహ్లి మేటి ఇన్నింగ్స్‌లు ఆడి తమ సత్తాను చాటిచెప్పారు. అదే సమయంలో దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో భారత జట్టు వైట్‌వాష్‌కు గురి కావడంతో గంభీర్ తీవ్ర ఒత్తిడిలో పడ్డాడు. ఏదేమైనా ఇద్దరు సీనియర్ ఆటగాళ్లకు.. కోచ్‌కు మధ్య దూరం పెరుగుతుంటే అది జట్టుకు మంచిది కాదు. జట్టు వాతావరణం దెబ్బ తింటుంది. అందుకే గౌతీకి, రో-కోకు మధ్య అంతరాన్ని తొలగించేందుకే బీసీసీఐ సయోధ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. 2027 ప్రపంచకప్ దిశగా రోహిత్, కోహ్లిల ప్రణాళికలు తెలుసుకోవడం, జట్టు వారి నుంచి ఏం ఆశిస్తోందో తెలియజేయడం ఈ సమావేశం ఉద్దేశంగా చెబుతున్నప్పటికీ.. ప్రధాన ఉద్దేశం మాత్రం 'సయోధ్య' అని సమాచారం.

కోహ్లి విషయంలో ఆ ఆలోచన ఎందుకు?


సితాంశు కొటక్

రాంచి: టాప్ ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లి భవిష్యత్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఏంటని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాంశు కొటక్ ప్రశ్నించాడు. 2027 ప్రపంచకప్‌లో విరాట్ ఆడతాడో లేదోనన్న ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో సితాంశు ఈ వ్యాఖ్యలు చేశాడు. "కోహ్లి గొప్పగా ఆడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో శతకమే ఇందుకు నిదర్శనం. అసలు ఇప్పుడు అతడి భవిష్యత్ గురించి మాట్లాడటం ఎందుకు? అతడి ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకుంటే అసలు అలాంటి అనుమానాలకు ఆస్కారం లేదు. కోహ్లి, రోహిత్ జట్టు విజయాల్లో భాగమవుతున్నారు. వాళ్లిద్దరూ అనుభవజ్ఞులైన ఆటగాళ్లు. వాళ్లు ఆడుతున్న తీరు, భాగస్వామ్యాలను నిర్మిస్తున్న విధానం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుంది. కోహ్లి, రోహిత్ సలహాలు యువ ఆటగాళ్లకు కూడా మేలు చేస్తున్నాయి. 2027 ప్రపంచకప్ గురించి మేం ఇప్పుడు ఏదీ ఆలోచించట్లేదు. ప్రస్తుత మ్యాచ్‌లపైనే దృష్టి సారించాం" అని సితాంశు తెలిపాడు.

విరాట్ వయసు మీరినా..


స్టెయిన్

రాంచి: కెరీర్‌లో అత్యుత్తమ దశను దాటిన క్రీడాకారులు కుటుంబంతో గడిపేందుకు ఇష్టపడతారని.. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి మాత్రం మైదానంలో అద్భుతమైన ఫిట్‌నెస్‌తో అదరగొడుతున్నాడని దక్షిణాఫ్రికా దిగ్గజం డేల్ స్టెయిన్ ప్రశంసించాడు. "37-38 ఏళ్ల వయసున్న చాలామందితో మాట్లాడినప్పుడు.. ఇంటిని, పిల్లలను, పెంపుడు జంతువులను వదిలి వెళ్లడానికి ఇష్టపడమని చెబుతారు. విరాట్ మాత్రం భారత్ తరపున బరిలో దిగేందుకు మానసికంగా అత్యుత్తమ స్థితిలో ఉన్నాడు. వికెట్ల మధ్య పరుగెత్తుతున్నప్పుడు.. ఫీల్డింగ్, డైవింగ్ చేస్తున్నప్పుడు ఆ విషయాన్ని గమనించొచ్చు. కోహ్లి మానసికంగా కుర్రాడిలా.. తాజాగా ఉన్నాడు. మ్యాచ్‌లు ఆడాలని భావిస్తున్నాడు. 15-16 ఏళ్లలో అతను 300 కంటే ఎక్కువ వన్డేలు ఆడాడు. ఆ అనుభవం అతని దేహం, మనసులో ఉంది. మూడు రోజుల వర్షం తర్వాత మైదానానికి వచ్చినా.. అతని సన్నద్ధత ప్రభావితం కాలేదు. కోహ్లి మానసికంగా ఎంతో దృఢంగా ఉన్నాడు" అని స్టెయిన్ తెలిపాడు.



భారత్ 13 నమీబియా 0

ప్రపంచకప్‌లో శుభారంభం

శాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు అదిరే ఆరంభం. సోమవారం తొలి మ్యాచ్‌లో 13-0తో నమీబియాను చిత్తు చిత్తుగా ఓడించింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన భారత్.. గోల్ మీద గోల్ కొట్టి ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. పదో నిమిషంలో సాక్షి రాణా గోల్‌తో ఖాతా తెరిచిన భారత్.. అక్కడ నుంచి గోల్స్ చేస్తూనే పోయింది. కనిక సివాచ్ (12వ, 30వ, 45వ), హినా బానో (35వ, 35వ, 45వ) హ్యాట్రిక్ గోల్స్ కొట్టగా.. సాక్షి రాణా (10వ, 23వ) రెండు.. బినిమా (14వ), సోనమ్ (14వ), సాక్షి షుకియా (27వ), ఇషిక (36వ), మనీషా (60వ) ఒక్కో గోల్ కొట్టారు. భారత్ ఎనిమిది ఫీల్డ్ గోల్స్ సాధించింది. పెనాల్టీకార్నర్లను సద్వినియోగం చేయడం ద్వారా మరో అయిదు గోల్స్ కొట్టింది. మరోవైపు పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో మంగళవారం జరిగే పూల్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్‌తో భారత్ తలపడనుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో 7-0తో చిలీ, 17-0తో ఒమన్‌ను చిత్తుగా ఓడించి నాకౌట్ బెర్తును ఖాయం చేసుకున్న భారత్‌కు.. స్విట్జర్లాండ్ నుంచి పోటీ ఎదురు కానుంది. ఈ మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుకోవాలని రోహిత్ బృందం పట్టుదలగా ఉంది.

పికిల్‌బాల్ లీగ్ షురూ

దిల్లీ: ఇండియన్ పికిల్‌బాల్ లీగ్‌కు తెరలేచింది. సోమవారం ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో లీగ్ ప్రారంభమైంది. ఈనెల 7 వరకు జరిగే లీగ్‌లో బెంగళూరు బ్లాస్టర్స్, హైదరాబాద్ రాయల్స్, చెన్నై సూపర్ వారియర్స్, ముంబయి స్మాషర్స్, క్యాపిటల్ వారియర్స్, లఖ్‌నవూ లెపర్డ్స్ జట్లు బరిలో ఉన్నాయి.

హైదరాబాద్ విజయం: లీగ్‌లో హైదరాబాద్ రాయల్స్ శుభారంభం చేసింది. తొలి రోజు జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 4-2తో క్యాపిటల్ వారియర్స్ గుర్గావ్‌పై విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో లఖ్‌నవూ 4-1తో బెంగళూరు బ్లాస్టర్స్‌పై, చెన్నై సూపర్ వారియర్స్ 5-1తో ముంబయి స్మాషర్స్‌పై నెగ్గాయి.

మహిళల హాకీ చీఫ్ కోచ్ రాజీనామా


హరేంద్ర సింగ్

దిల్లీ: భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ హరేంద్ర సింగ్ తన పదవికి సోమవారం రాజీనామా చేశాడు. వ్యక్తిగత కారణాలతో హరేంద్ర తప్పుకున్నట్లు హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించింది. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టు నాలుగో స్థానంలో నిలవడంలో కీలకపాత్ర పోషించిన అప్పటి చీఫ్ కోచ్ సోయర్డ్ మరైన్ (నెదర్లాండ్స్) తిరిగి బాధ్యతలు చేపట్టే అవకాశముంది. 2021 ఆగస్టులో మరైన్ చీఫ్ కోచ్ పదవికి రాజీనామా చేశాడు. అమెరికా పురుషుల జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన హరేంద్ర.. 2024 ఏప్రిల్‌లో భారత మహిళల జట్టు శిక్షణ బాధ్యతలు స్వీకరించాడు. ఏడాది కాలంగా భారత మహిళల జట్టు ప్రదర్శన తీసికట్టుగా తయారైంది. ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ 2024-25 సీజన్‌లో 16 మ్యాచ్‌లాడిన భారత్ కేవలం రెండింట్లో గెలిచింది. తర్వాతి సీజన్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది.

ఈ దూకుడు ఘనత వాళ్లదే


అశ్విన్

దిల్లీ: టీమ్‌ఇండియా దూకుడుగా బ్యాటింగ్ చేస్తోందంటే అందుకు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్‌లే కారణమని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. "జట్టు నుంచి తాను ఏం కోరుకుంటున్నాడో చేసి చూపించడం ద్వారా కెప్టెన్‌గా రోహిత్ తనదైన ముద్రను వేశాడు. టీ20, వన్డే క్రికెట్లో మన బ్యాటింగ్ దూకుడు పెరిగిందంటే ఆ ఘనత ప్రధానంగా రోహిత్, రాహుల్ భాయ్‌లదే" అని చెప్పాడు. "వాళ్లు దారి చూపించారు. రాహుల్ ఎలా ఆడాలో చెప్పాడు. రోహిత్ చూపించాడు. బాట వేశాడు. ఫలితంగా భారత్ బ్యాటింగ్ చేసే విధానమే మారిపోయింది. వైట్‌బాల్ క్రికెట్లో స్ట్రైక్‌రేట్ ముఖ్యం" అని అశ్విన్ అన్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో భారత తుది జట్టు ఎంపికను అశ్విన్ తప్పు పట్టాడు. "హార్దిక్ పాండ్య లేకున్నా నితీశ్ కుమార్‌రెడ్డికి తుది జట్టులో చోటు ఇవ్వలేకపోయారంటే జట్టు ఎంపికలో లోపమున్నట్లే" అని అన్నాడు.


యాన్సెన్

యాన్సెన్.. భలే దొరికాడు

ఈనాడు క్రీడావిభాగం

దక్షిణాఫ్రికా జట్టులో ఆల్‌రౌండర్ అంటే జాక్వెస్ కలిస్ గుర్తొస్తాడు. బంతితో, బ్యాట్‌తో ఈ దిగ్గజ ఆటగాడు చెరగని ముద్ర వేశాడు. అతడి రిటైర్మెంట్ తర్వాత చాలామంది ఆల్‌రౌండర్లు సఫారీ జట్టులోకి వచ్చి వెళ్లారు. కానీ కొత్త బంతితో అదరగొట్టి.. బ్యాట్‌తో అవసరమైనప్పుడల్లా రాణించగలిగే ఆటగాడు కనిపించలేదు. ఆ లోటు మార్కో యాన్సెన్ తీరుస్తున్నాడు ప్రధానంగా బౌలర్, కాస్త బ్యాటింగ్ చేయగల ఆటగాడిగా జట్టులో చోటు దక్కించుకున్న యాన్సెన్.. ఇప్పుడు ఆల్‌రౌండర్‌గా నిఖార్సైన రూపాంతరం చెందుతున్నాడు. తాజాగా భారత్‌తో సిరీసే ఇందుకు ఉదాహరణ.

25 ఏళ్ల యాన్సెన్ ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టులో అత్యంత స్థిరంగా రాణిస్తున్న ఆటగాళ్లలో ఒకడు. 2021లోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసినా అతడికి ఇటీవలే సరైన గుర్తింపు లభిస్తోంది. తాజాగా భారత్‌తో టెస్టు సిరీస్‌లో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ప్రభావవంతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 9వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి 91 బంతుల్లోనే 93 పరుగులు చేశాడు. దీని వల్లే దక్షిణాఫ్రికా స్కోరు 400 దాటింది. ఆ జట్టు విజయంలో యాన్సెన్ ఇన్నింగ్స్ ఎంతో కీలకం. ఇక బంతితో అతడి ప్రభావాన్ని ప్రత్యేకించి చెప్పుకోవాలి. ఈ పొడగరి లెఫ్ట్ ఆర్మ్ పేసర్ పిచ్ నుంచి సహకారం అందుకుని చక్కని బౌన్స్ రాబడుతున్నాడు. స్లో పిచ్‌లపై సైతం తన స్లో బంతి ఆయుధంతో వికెట్లు పడగొడుతున్నాడు. ముఖ్యంగా నియంత్రణతో కూడిన బౌలింగ్‌తో కుడి చేతి వాటం బ్యాటర్లకు ఆడ సాధ్యం కాని కోణంలో బంతులు వేస్తూ పరీక్షిస్తున్నాడు. స్వింగ్‌కు పేస్‌ను మేళవించి వికెట్లు తీస్తున్నాడు. కీలక సమయాల్లో భాగస్వామ్యాలను విడగొడుతూ వికెట్ టేకింగ్ బౌలర్‌గా ఎదిగాడు. భారత్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో యాన్సెన్ 4 ఇన్నింగ్స్‌ల్లో 12 వికెట్లు తీశాడు. స్పిన్నర్లకు అనుకూలంగా కనిపించిన ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో అతడు రెండో స్థానంలో నిలవడం విశేషం. బ్యాట్‌తో 2 మ్యాచ్‌ల్లో 106 పరుగులు సాధించాడు.

బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించిన ఈ సిరీస్‌లో అతడు 90పైన స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేశాడు. టీమ్‌ఇండియాతో తొలి వన్డేలోనూ యాన్సెన్ తన పోరాటంతో ఆకట్టుకున్నాడు. బంతితో రెండు వికెట్లు తీసిన అతడు.. బ్యాట్‌తో చెలరేగాడు. 350 పరుగుల ఛేదనలో 130 పరుగులకే 5 వికెట్లు కోల్పోయినా.. దక్షిణాఫ్రికా ఆఖరిదాకా పోరాడిందంటే యాన్సెన్ దూకుడే కారణం. ఎడాపెడా షాట్లు ఆడిన అతడు.. బోష్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పి టీమ్‌ఇండియాను కంగారుపెట్టాడు. అతడి స్ఫూర్తితో బోష్ సైతం అదరగొట్టినా.. ఆఖర్లో తడబాటు వల్ల సఫారీ జట్టు ఓడిపోయింది. "బంతిని గమనాన్ని సరిగ్గా గుర్తించి షాట్లు ఆడుతున్నా. ప్రస్తుతం ఇది నాకు కలిసొస్తోంది" అని యాన్సెన్ అన్నాడు. అతడి ఆట చూస్తుంటే దక్షిణాఫ్రికాకు మూడు ఫార్మాట్లలోనూ స్థిరంగా ఆడే ఆల్‌రౌండర్ దొరికినట్లే కనిపిస్తోంది. ఇప్పటిదాకా 21 టెస్టుల్లో 89 వికెట్లు తీసి, 1145 పరుగులు చేసిన యాన్సెన్.. 30 వన్డేల్లో 47 వికెట్లు పడగొట్టి 534 పరుగులు చేశాడు. 19 టీ20ల్లో 18 వికెట్లు తీసి, 167 పరుగులు సాధించాడు. ముమ్మందు మ్యాచ్‌ల్లో అతడు ఇదే జోరు ప్రదర్శిస్తాడా అనేది ఆసక్తికరం.

ఖతార్ జీపీ వెర్‌స్టాపెన్ సొంతం


వెర్‌స్టాపెన్

దోహా: ఖతార్ గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేసులో ఊహించని విజేత. ఈ సీజన్లో స్థిరంగా రాణించలేకపోతున్న మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) అనుకోకుండా అదరగొట్టాడు. జోరు మీదున్న మెక్‌లారెన్ స్టార్లు లాండో నోరిస్, ఆస్కార్ పియాస్ట్రిలను వెనక్కి నెట్టి ఖతార్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. వెర్‌స్టాపెన్ తాజా విజయంతో ఈ సీజన్లో చివరిదైన అబుదాబి గ్రాండ్‌ప్రికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది ప్రపంచ ఎఫ్-1 డ్రైవర్ల జాబితాలో నోరిస్ (408) అగ్రస్థానంలో ఉండగా.. వెర్‌స్టాపెన్ (396), పియాస్ట్రి (392) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. అబుదాబి రేసులో నోరిస్ కనీసం మూడో స్థానంలోనైనా నిలిస్తే డ్రైవర్ టైటిల్ అతడి సొంతమవుతుంది.

వాళ్లను ఆపడం కష్టం

రాంచి: కోహ్లి లాంటి ప్రపంచ శ్రేణి బ్యాటర్లు జోరందుకుంటే ఆపడం కష్టమని దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ అన్నాడు. కోహ్లి మెరుపు శతకంతో తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. "ప్రపంచ స్థాయి బ్యాటర్లను ఔట్ చేయడం చాలా కష్టం. ఎల్లప్పుడూ బ్యాటర్లను వాళ్ల తొలి 10 లేదా 15 బంతుల్లోనే ఔట్ చేయడానికి ప్రయత్నిస్తా. వాళ్లు అప్పుడప్పుడే పిచ్‌కు అలవాటు పడతుంటారు. నిలదొక్కుకుంటే మాత్రం చెలరేగిపోతారు. అప్పుడు వాళ్లను ఆపడం చాలా కష్టం" అని యాన్సెన్ అన్నాడు. కోహ్లికి బౌలింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తానని, అదే సమయంలో అసహనం కూడా కలుగుతుందని అతడు చెప్పాడు. "అతడు ఆడుతుంటే చూడడానికి బాగుంటుంది. కోహ్లి ఆటను టీవీలో చూస్తూ పెరిగిన నేను.. ఇప్పుడు అతడికే బౌలింగ్ చేస్తున్నా. అసహనం కలుగుతుంది. అదే సమయంలో సరదాగా కూడా ఉంటుంది. అతడు డ్రైవ్‌లు బాగా ఆడతాడు. అలాగే పుల్స్, కట్స్ కూడా. అతడి ఆటలో ఎలాంటి మార్పు లేదు. భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతూనే ఉన్నాడు" అని యాన్సెన్ అన్నాడు.



చిన్న అలవాట్లతో పెద్ద ప్రయోజనాలు

* నిద్రపోవడానికి 3 గంటల ముందు తినడం ఆపేస్తే రాత్రివేళ కడుపులో ఆమ్లాలు ఎగజిమ్మడం తగ్గుతుంది.
* రాత్రి భోజనం తర్వాత కొద్ది సమయం నడకతో పేగుల కదలికలు మెరుగవుతాయి.
* పంచదార, కెఫీన్, నికోటిన్‌ను దూరం పెడితే జీర్ణరసాల ఉత్పత్తి పెరిగి అజీర్ణ సమస్యలు తలెత్తవు.
* తగినన్ని నీళ్లు తాగుతుంటే జీర్ణవ్యవస్థ సజావుగా సాగుతుంది.
* తగినంత నిద్రతో ఒత్తిడి నుంచి బయటపడొచ్చు.
* శుద్ధి చేసిన నూనెల వినియోగాన్ని పక్కనపెడితే శరీరంలో వాపు ప్రక్రియ దూరమవుతుంది.

– డైటే కలియర్, క్లినికల్ న్యూట్రీషియన్

అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్ స్థలం.. వాణిజ్య అవసరాల వినియోగానికి వీల్లేదు

- సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్‌లోని అనధికారిక నిర్మాణాలు క్రమబద్ధీకరించుకోకూడదు
- విశాఖలోని ఓ అపార్ట్‌మెంట్ కేసులో హైకోర్టు స్పష్టీకరణ



ఈనాడు, అమరావతి: అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్‌కు కేటాయించిన స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టంచేసింది. సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్‌లోని అనధికారిక నిర్మాణాలను, పార్కింగ్‌కు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు క్రమబద్ధీకరించుకోవడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. పార్కింగ్ స్థలం ఉమ్మడి ప్రాంతమని (కామన్ ఏరియా), దానిని అపార్ట్‌మెంట్ యజమానులు, అందులో నివసించేవారి అవసరాలకే వాడుకోవాలని ఏపీ అపార్ట్‌మెంట్స్ (ప్రమోషన్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఓనర్‌షిప్) చట్టంలోని సెక్షన్-9 స్పష్టం చేస్తోందని గుర్తుచేసింది. విశాఖపట్నం ఈస్ట్ పాయింట్ కాలనీలోని మాధవ మనోర్ అపార్ట్‌మెంట్‌లోని స్టిల్ట్ ఫ్లోర్‌లో అనధికారికంగా నిర్మించిన దుకాణాలను తొలగించేలా జీవీఎంసీ అధికారులు గతంలో నోటీసులు ఇచ్చారు. వాటిని సవాలు చేస్తూ ఈదర్లపల్లి బాలసుబ్రహ్మణ్యం, నడింపల్లి శ్రీ దివ్యదుర్గ మధులిక హైకోర్టులో పిటిషన్ వేశారు. సెల్లార్/ స్టిల్ట్ ఫ్లోర్‌లో నిర్మించిన దుకాణాల్లో ఆరింటిని తాము, తమ తండ్రి.. బిల్డర్ నుంచి కొన్నామని, వాటికి యజమానులమని పేర్కొన్నారు. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 455ఏ ప్రకారం ఆ షాపులను క్రమబద్ధీకరించుకోవచ్చని, సంబంధిత దరఖాస్తు అధికారుల పరిశీలనలో ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ వారి పిటిషన్‌ను కొట్టివేశారు.

★ ప్రస్తుత కేసులో అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా స్టిల్ట్ ఫ్లోర్‌లో షాపులు నిర్మించారు. 26 ఏళ్లుగా ఆ షాపులను తమ ఆధీనంలోనే ఉన్నందున వాటిని క్రమబద్ధీకరించాలని పిటిషనర్లు కోరడం సరికాదు. స్టిల్ట్ ప్రాంతంలో నిర్మించిన అనధికారిక షాపులను క్రమబద్ధీకరించుకోవడం ద్వారా చట్టబద్ధం చేసుకోలేరు. 2025 నవంబర్ 12న ఇచ్చిన జీవో 225 కూడా ఇందుకు అనుమతించదు. పార్కింగ్ స్థలాన్ని ఇతర అవసరాలకు మార్చడానికి, ముఖ్యంగా వాణిజ్య కార్యకలాపాలకు వాడుకోవడానికి వీల్లేదని 'నహల్‌చంద్, లాలూ చంద్ ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ పంచలి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్' కేసులో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అపార్ట్‌మెంట్ పైన ఉండే స్కైపార్కింగ్ ప్రాంతం, స్టిల్ట్ ఫ్లోర్‌లోని పార్కింగ్ స్థలం అపార్ట్‌మెంట్ వాసుల అవసరాలకే తప్ప, వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు ఆ తీర్పులో 'పేర్కొంది' అని హైకోర్టు ఉటంకించింది.

★ ప్రస్తుత కేసులో అనధికారికంగా నిర్మించిన పిటిషనర్ల దుకాణాలను కూల్చివేయాలని అధికారులను ఆదేశించింది. ఆ ప్రాంతాన్ని పార్కింగ్‌కు వీలుగా మార్చేలా 'మాధవి మనోర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్'కు నాలుగు వారాల్లో అప్పగించాలని స్పష్టంచేస్తూ జస్టిస్ హరినాథ్ తీర్పు ఇచ్చారు.

★ అంతకుముందు జీవీఎంసీ తరఫు న్యాయవాది ఎస్ఎస్ బోస్, మాధవి మనోర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు సమర్పించిన శాంక్షన్ ప్లాన్ నిజమైంది కాదు. వ్యాజ్యం దాఖలు చేసేందుకు అనువుగా వారు ప్లాన్‌ను తయారు చేశారని పేర్కొన్నారు. దీనిపై లోతుగా విచారించిన న్యాయమూర్తి.. పిటిషనర్లకు దుకాణాలు అమ్మినవారు బిల్డర్‌తో భాగస్వాములని తేల్చారు. పైగా ఫ్యాబ్రికేట్ శాంక్షన్ ప్లాన్‌ను కోర్టుకు సమర్పించారని తప్పుపట్టారు. వ్యాజ్యాన్ని కొట్టేస్తూ తీర్పు ఇచ్చారు.

సత్యవర్ధన్ కిడ్నాప్, దాడి కేసులో..
వంశీ అనుచరులకు రిమాండ్

- లొంగిపోయిన తెల్లప్రోలు రాము, వజ్రకుమార్
- 10 నెలలుగా అజ్ఞాతంలోనే..



కోర్టులో లొంగిపోయేందుకు వస్తున్న నిందితులు వజ్రకుమార్, తెల్లప్రోలు రాము

ఈనాడు, అమరావతి: గన్నవరంలోని తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను అపహరించి, దాడి చేసిన కేసులో ఉన్న నిందితులు తెల్లప్రోలు రాము (ఏ3), వజ్రకుమార్ (ఏ6)లకు విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు రిమాండ్ విధించింది. వైకాపా నేత వల్లభనేని వంశీ అనుచరులైన వీరు సోమవారం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో లొంగిపోయారు. సత్యశ్రీతో కలిసి వచ్చారు. తొలుత కోర్టులో ఎన్‌బీడబ్ల్యూ (నాన్-బెయిలబుల్ వారెంట్)లు రీకాల్ కోసం పిటిషన్ వేశారు. పరారీలో ఉన్న వీరిపై గతంలో కోర్టు ఎన్‌బీడబ్ల్యూ జారీచేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై సోమవారం మధ్యాహ్నం విచారణ జరిగింది. వీటిని తోసిపుచ్చిన న్యాయాధికారి.. నిందితులకు ఈనెల 15 వరకు రిమాండ్ విధిస్తూ, నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించాలని ఉత్తర్వులిచ్చారు. ఈ కేసులో మొత్తం 12 మందిని నిందితులుగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా నలుగురు కొమ్మా కోట్లు (ఏ2), యర్రంశెట్టి రామాంజనేయులు అలియాస్ రాము అలియాస్ పొట్టి రాము (ఏ9), వేణు (ఏ12), చేట్టిల శ్రీనివాస్ (ఏ11)లు ఇంకా పరారీలో ఉన్నారు. తెల్లప్రోలు రాము, వజ్రకుమార్‌లు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి.. తెదేపా కార్యాలయంపై దాడి కేసును ఉపసంహరించుకునేలా బెదిరించి కీలకంగా వ్యవహరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో విజయవాడలో అతన్ని కిడ్నాప్ చేసి, కారులో ఎక్కించుకుని హనుమాన్ జంక్షన్‌కు తీసుకెళ్లారు. అక్కడ బెదిరించి వాంగ్మూల పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. మరుసటి రోజు సత్యవర్ధన్‌ను విజయవాడ కోర్టుకు తీసుకెళ్లి.. కేసు ఉపసంహరించుకుంటున్నట్లుగా న్యాయమూర్తి ఎదుట వాంగ్మూలం ఇప్పించారు. అనంతరం వజ్రకుమార్ తన ఇంటికి వెళ్లిపోయాడు. రాము మిగిలిన నిందితులతో కలిసి సత్యవర్ధన్‌ను కారులో ఎక్కించుకుని హైదరాబాద్‌లోని వంశీ ఫ్లాట్‌కు తీసుకెళ్లారు. అక్కడ బాధితుడిని చిత్రహింసలు పెట్టారు. మరుసటి రోజు విశాఖకు తరలించారు. కేసు నమోదైనప్పటి నుంచి నిందితులు పోలీసులకు దొరక్కుండా పరారీలో ఉన్నారు.

104 పట్టణాలకు 'అమృత్' ఘడియలు!

- రూ.8 వేల కోట్లతో 281 తాగునీటి ప్రాజెక్టులు
- పనులకు టెండర్లు పిలవనున్న పురపాలకశాఖ

ఈనాడు,అమరావతి: పట్టణాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచే ప్రాజెక్టుల పనులకు ముందడుగు పడుతోంది. రూ.8 వేల కోట్లతో 104 పట్టణ స్థానిక సంస్థల్లో 281 ప్రాజెక్టుల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి పురపాలక ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం టెండర్లు పిలుస్తోంది. రెండేళ్లలో వీటిని పూర్తి చేసి ప్రతి కుటుంబానికి తలసరి రోజూ 135 లీటర్ల నీరు అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. 2040 వరకు పట్టణాల్లో ప్రజల తాగునీటి అవసరాలకు వీలుగా ప్రాజెక్టులను డిజైన్ చేశారు.

★ పట్టణాల్లో ప్రజల భవిష్యత్ తాగునీటి అవసరాలపై కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పథకాన్ని వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర వాటా నిధులు సరిగా కేటాయించని కారణంగా అనేక పనులు మొదలే కాలేదు. బిల్లులు చెల్లించక ప్రారంభించినవి పూర్తవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్'లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినా ఆర్థికంగా, సాంకేతికంగా తలెత్తే సమస్యలను దృష్టిలో పెట్టుకుని దాన్ని పక్కన పెట్టింది.

★ పనులు మొదలవ్వని 281 ప్రాజెక్టుల పనులు పాత మోడల్‌లోనే పూర్తి చేయాలన్న ప్రభుత్వం ఆదేశాలతో సవరించిన అంచనాలతో రూ.8 వేల కోట్లు అవసరమని ఇంజినీర్లు నివేదించారు. ఇందులో రూ.1,500 కోట్లు ఆపరేషన్, మెయింటెనెన్స్ (వోఅండ్ఎం)కి ఖర్చు చేయనున్నారు. మిగిలిన రూ.6,500 కోట్లతో పనులు పూర్తి చేయనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.2,230 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.2,900 కోట్లుగా నిర్ణయించారు. మిగతా మొత్తాన్ని 15వ ఆర్థిక సంఘం నిధుల్లో, పట్టణ స్థానిక సంస్థల వాటా కింద సమకూర్చనున్నారు.

మరో 17 పట్టణాల్లో రూ.1,400 కోట్లతో పనులు

★ అమృత్ 2.0లో చేర్చిన పట్టణాలు కాకుండా మరో 17 చోట్ల రూ.1,400 కోట్లతో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచే పనులు ప్రభుత్వం చేపట్టనుంది. ఇందు కోసం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కింద బ్యాంకు నుంచి రుణం తీసుకుంటోంది. బ్యాంకు రుణం 80%, మిగతా 20% నిధులు రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనుంది. 17 పట్టణాల్లో ప్రజల రాబోయే 15-20 ఏళ్ల అవసరాలకు వీలుగా ప్రాజెక్టును డిజైన్ చేశారు. పనులకు సంబంధించి త్వరలో టెండర్లు పిలవనున్నారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణంలో ఏ-39 చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై విచారణను సుప్రీంకోర్టు జనవరి 19కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులిచ్చింది. ఈ కేసులో తన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ అక్టోబరు 7న ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ మోహిత్‌రెడ్డి వేసిన ఎస్ఎల్‌పీపై అక్టోబరు 10న తొలిసారి విచారించిన ధర్మాసనం మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. సోమవారం విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది ప్రేరణాసింగ్ వాదిస్తూ, తమకు కౌంటర్ వేయడానికి రెండు వారాల సమయమివ్వాలని కోరగా, ధర్మాసనం అంగీకరించింది. రీజాయిండర్ ఇవ్వడానికి మోహిత్‌రెడ్డికి 2 వారాల గడువిస్తూ విచారణను వాయిదా వేసింది.

ఫారం నెం - VII
(చట్టం నెం.30/2013 లోని సెక్షన్ 19(1) మరియు రూలు 25(1) ప్రకారం)

రూఢీ ప్రకటన

Rc.No.L9/1023/2024 Date: 29-11-2025

కృష్ణా డిస్ట్రిక్ట్ గెజిట్ సంఖ్య: 67/KST/2025 Dt.: 29-11-2025

క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన కృష్ణా జిల్లా, మచిలీపట్నం మండలం, **కరగ్రహారం** గ్రామములో గల **య.31.42 సెంట్లు భూమి** ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా **"గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ మచిలీపట్నం అభివృద్ధి"లో భాగంగా రోడ్డు & రైలు కనెక్టివిటీ** నిర్మాణము చేయుట కోసం భూమి అవసరమైనట్లుగా కృష్ణా జిల్లా కలెక్టరు గారు అవసరమని, అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన కృష్ణా జిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున సదరు భూములయందు ఆసక్తిగల వ్యక్తులు అభ్యంతరములను దాఖలు చేసినారు. చట్టం 30/2013 లోని సెక్షన్ 15 ప్రకారము విచారణ మీదట మరియు ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్, మంగళగిరి వారు భూసేకరణకు అవసరమగు పైకము మొత్తము జమచేసియున్నందున సంతృప్తి చెందిన వారై, కృష్ణా జిల్లా కలెక్టరు గారు చట్టం **u/s 30/2013** (కేంద్ర చట్టం 30/2013) లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.

రూఢీ ప్రకటన

దిగువ షెడ్యూలులో పేర్కొనిన **య.31.42** సెంట్లు భూమి, చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013)లోని సెక్షన్ 19(1) ప్రకారము ప్రజాహిత కార్యక్రమాలకు అనగా **"గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ మచిలీపట్నం అభివృద్ధి"లో భాగంగా రోడ్డు & రైలు కనెక్టివిటీ** నిర్మాణము చేయుట ప్రయోజనం కోసం అవసరమని కృష్ణా జిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించుచున్నారు.

షెడ్యూలు

ప్రాజెక్టు పేరు: "గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ మచిలీపట్నం అభివృద్ధి"లో భాగంగా రోడ్డు & రైలు కనెక్టివిటీ నిర్మాణము చేయుట ప్రయోజనం కోసం.

గ్రామము: కరగ్రహారం **మండలం : మచిలీపట్నం నార్త్** **జిల్లా: కృష్ణా జిల్లా**

క్రమ సం	సర్వే నెం.	పూర్తి విస్తీర్ణం	సేకరణ క్రింద ప్రాంతం (ఎకరములలో)	భూమి వివరం	ప్రయోజనము గల వ్యక్తి పేరు (అసైన్‌మెంట్ రిజిస్టరు రికార్డు (లేదా) ఎఫ్.ఎల్.ఆర్ ప్రకారము)	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు/రకాల సంఖ్య మరియు కట్టడముల వివరాలు
1			0.50	మెట్ట	కంచర్ల పాండు S/o. రాజ రత్నం	గోపువాని పాలెం R.S.No. 137	7/2A	26/1	7/1B	-
2			0.50	మెట్ట	పాతాపాటి నాంచారయ్య S/o. కృష్ణ మూర్తి	7/2A	7/2A	26/1	7/1B	-
3			0.50	మెట్ట	బండెల వెంకన్న S/o. రాయప్ప	7/2A	7/2A	26/1	7/1B	-
4			0.50	మెట్ట	చిన్నం నరసింహం S/o. ధాండియా	7/2A	7/2A	26/1	7/1B	-
5			0.50	మెట్ట	చిన్నం సుబ్బారావు S/o. నరసింహం	7/2A	7/2A	26/1	7/1B	-
6			0.50	మెట్ట	శ్రీకాకుళపు జగన్నాథం S/o. రామవయ్య	7/2A	7/2A	26/1	7/1B	-
7	7-2	6.05	0.50	మెట్ట	నాయడు వుయ్యూరు రెడ్డి S/o. మహా లక్ష్మడు	7/2A	7/2A	26/1	7/1B	-
8			0.50	మెట్ట	నాయుడు నాగేశ్వరరావు S/o. వుయ్యూరు రెడ్డి	7/2A	7/2A	26/1	7/1B	-
9			0.50	మెట్ట	ముచ్చు నాగేశ్వరరావు S/o. శోభనాద్రి రావు	7/2A	7/2A	26/1	7/1B	-
10			0.50	మెట్ట	కొక్కిలిగడ్డ వెంకట స్వామి S/o. శోభన చలం	7/2A	7/2A	26/1	7/1B	-
11			0.50	మెట్ట	మోక కృష్ణమూర్తి S/o. గంగయ్య	7/2A	7/2A	26/1	7/1B	-
12			0.50	మెట్ట	కొక్కిలిగడ్డ నరసింహారావు S/o. సాంబశివరావు	7/2A	7/2A	26/1	7/1B	-
13			0.05	మెట్ట	మోకా కోటేశ్వరరావు S/o. సత్యనారాయణ	7/2A	7/2A	26/1	7/1B	-
14	249-2	8.70	0.22	మెట్ట	సత్తెనేది గంగరాజు S/o. రామచంద్రుడు	7/2A	7/2A	26/1	7/1B	-
15	249-3	8.70	0.79	మెట్ట	వీరవల్లి వెంకటేశ్వరరావు S/o. శ్రీరాములు & సత్తెనేడి సుబ్రహ్మణ్యం	7/2A	7/2A	26/1	7/1B	-
16	249-4	8.70	0.49	మెట్ట	సత్తినేడి పెద్ద రామచంద్రరావు S/o. నరసింహారావు	7/2A	7/2B	26/1	7/1B	-
17	249-5	8.70	0.42	మెట్ట	సత్తినేడి గజేంద్రరావు S/o. రాజయ్య	గోపువాని పాలెం R.S. No. 138	R.S. No. 251	R.S. No. 250	R.S. No. 28	-
18	249-6	8.70	0.44	మెట్ట	సత్తినేడి చిన్న రామచంద్రరావు S/o. నరసింహారావు					-
19	249-7	8.70	0.05	మెట్ట	కడి సుబ్రహ్మణ్యేశ్వరరావు S/o. నాగేశ్వరరావు					-
20	249-8	8.70	0.66	మెట్ట	కడి. సుబ్రహ్మణ్యేశ్వరరావు S/o. నాగేశ్వరరావు					-
21	249-9	8.70	0.62	మెట్ట	కడి సాంబశివరావు					-
22	249-10	8.70	1.28	మెట్ట	మాదమల రంగనాయకమ్మ W/o. హనుమంతరావు					-
23	249-11	8.70	1.37	మెట్ట	కడి. నాగమణి W/o. కృష్ణమూర్తి & వన్నెంరెడ్డి. సీత రత్నం W/o. వెంకట కృష్ణయ్య					
24	249-12	8.70	0.48	మెట్ట	వన్నెంరెడ్డి. ప్రహ్లాదరావు S/o కనక సుబ్బారావు					-
25	249-13	8.70	1.19	మెట్ట	వన్నెంరెడ్డి. సీత రత్నం W/o.వెంకట కృష్ణయ్య					-
26	249-14	8.70	0.69	మెట్ట	వన్నెంరెడ్డి వన ప్రహ్లాదరావు S/o.కనక సుబ్బారావు					-
27	251-2	0.95	0.95	మెట్ట	వన్నెంరెడ్డి వన శ్రీ ప్రహ్లాదరావు S/o. కనక సుబ్బారావు	251/7	251/9	R.S.No. 250	251/1	-
28	251-3	0.72	0.72	మెట్ట	వన్నెంరెడ్డి. కోటేశ్వరరావు S/o. వీర స్వామి	251/8	251/10, 11,12	R.S.No 250	251/1	-
29	251-4	0.64	0.64	మెట్ట	చిట్టిబోయిన వనమలయ్యా	251/9	251/18	R.S.No 250	251/1	-
30	251-5B	0.64	0.61	మెట్ట	చిట్టిబోయిన వనమలయ్యా	251/9	251/16, 17	R.S.No 250	251/1	-
31	251-7B	1.34	1.23	మెట్ట	పెనుబోతు నారాయణరావు	251/12	R.S.No 252	R.S.No 250	251/1	-
32	251-8B	1.43	1.32	మెట్ట	వన్నెంరెడ్డి దశరధరామయ్య S/o. అమృత రామయ్య	251/12	R.S.No 252	R.S.No 250	251/1	-
33	251-9B	1.42	1.32	మెట్ట	మడమల పూర్ణచంద్రరావు S/o. గురుమూర్తి	251/12	R.S.No 252	R.S.No 250	251/1	-
34	251-10	0.42	0.42	మెట్ట	వన్నెంరెడ్డి వేణుగోపాలరావు S/o అంజనీలు	251/11	R.S.No 252	R.S.No 250	251/1	-
35	251-11	0.52	0.52	మెట్ట	వన్నెంరెడ్డి భాస్కరరావు S/o వీరబ్రహ్మం	251/11	R.S.No 252	R.S.No 250	251/1	-
36	251-12B	0.52	0.40	మెట్ట	వన్నెంరెడ్డి ప్రభాకరరావు S/o. వీరబ్రహ్మం	251/10	R.S.No 252	R.S.No 250	251/1	-
37	251-13B	0.17	0.08	మెట్ట	గుండు చలపతిరావు S/o. వెంకటేశ్వరరావు	R.S.No 251	252/8	252/3	252/1	-
38	251-14	0.08	0.08	మెట్ట	గుండు వనప్రసాదరావు S/o. వీరస్వామి	R.S.No 251	252/8	252/4	252/2	-
39	251-15	0.09	0.09	మెట్ట	గుండు వనప్రసాదరావు S/o. వీర స్వామి	R.S.No. 251	252/8	252/5	252/3	-
40	251-16	0.22	0.22	మెట్ట	గుండు రాఘవరావు S/o. సుబ్బారావు	R.S.No 251	252/8	252/6	252/4	-
41	251-17	0.22	0.22	మెట్ట	గుండు వేంకటేశ్వరరావు S/o. కనకదుర్గయ్య	R.S.No 251	252/8	252/7	252/5	-
42	251-18	0.42	0.42	మెట్ట	గుండు కోటేశ్వరరావు S/o. కనకదుర్గయ్య	R.S.No 251	252/8	R.S.No 253	252/6	-
43	252-2B	0.30	0.16	మెట్ట	గుండు చలపతిరావు S/o. వెంకటేశ్వరరావు	252/2 -7	252/9	R.S.No 253	252/1	-
44	252-3	0.13	0.13	మెట్ట	గుండు వనప్రసాదరావు S/o. వీరస్వామి	252/8	252/10	R.S.No 253	252/1	-
45	252-4	0.13	0.13	మెట్ట	గుండు వనప్రసాదరావు S/o. వీర స్వామి	252/9	252/11	R.S.No 253	252/1	-
46	252-5	0.3	0.30	మెట్ట	గుండు రాఘవరావు S/o. సుబ్బారావు	252/10	252/12	R.S.No. 253	252/1	-
47	252-6	0.28	0.28	మెట్ట	గుండు వేంకటేశ్వరరావు S/o. చలపతిరావు	252/11	252/13, 14	R.S.No. 253	252/1	-
48	252-7	0.55	0.55	మెట్ట	గుండు కోటేశ్వరరావు S/o. సూర్యనారాయణ	R.S.No. 250	R.S.No. 252	253/ 3,4	R.S.No. 252	-
49	252-8B	0.8	0.73	మెట్ట	మడమల సత్యనారాయణ	R.S.No. 250	253/3	253/ 12	R.S.No. 250	-
50	252-9B	0.74	0.69	మెట్ట	మడమల రంగనాయకమ్మ	R.S.No. 253/2	253/4	253/12	253/1	-
51	252-10B	0.72	0.66	మెట్ట	మడమల. పూర్ణ చంద్రరావు S/o. వెంకట రత్నం	R.S.No. 250	253/ 13	బంగాళా ఖాతము	253/ 3,4	-
52	252-11B	0.91	0.74	మెట్ట	మడమల. నాగయ్య	R.S.No. 253/3	253/5	253/ 12,13	253/1	-
53	252-12B	1.16	0.43	మెట్ట	మడమల. నాంచరయ్య	R.S.No. 253/12	253/ 14	బంగాళా ఖాతము	253/ 4,5	-
54	253-1	0.08	0.08	మెట్ట	పెనుబోతు. గంగయ్య S/o. వెంకట స్వామి	R.S.No. 253/4	253/6	253/13	R.S.No. 252	-
55	253-2	0.27	0.27	మెట్ట	పెనుబోతు. గంగయ్య S/o. వెంకట స్వామి	250	253/3	253/8	250	-
56	253-3	0.67	0.67	మెట్ట	కొక్కిలిగడ్డ. మంగ దేవి W/o. పెద్ద ఏడుకొండలు	253/2	253/4	253/8	253/1	-
57	253-12	0.31	0.31	మెట్ట	కొక్కిలిగడ్డ. మంగ దేవి W/o.పెద్ద ఏడుకొండలు	250	253/13	బంగాళా ఖాతము	253/8	-
58	253-4	0.67	0.67	మెట	మోక. విజయలక్ష్మీ W/o. పెద్ద ఏడుకొండలు	253/3	253/5A	253/8	253/1	-
59	253-13	0.32	0.32	మెట్ట	మోక. విజయలక్ష్మీ W/o. పెద్ద ఏడుకొండలు	253-12	253-14	బంగాళా ఖాతము	253-8	-
60	253-5A	0.67	0.31	మెట్ట	శేరు. విజయలక్ష్మీ W/o. నాగరాజు	253-4	253- 5B	253-8	253-1	-
	మొత్తం	**54.36**	**31.42**							

భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, మచిలీపట్నం కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పని దినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును. భూసేకరణ కారణంగా పునరావాసం మరియు పునర్వ్యవస్థీకరణ పొందే కుటుంబాల సంఖ్య ఏమియూ లేవు. బొగ్గు గనులు, యినుప రాయి, పలకరాయి లేదా యితర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములోగాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వట గాని తొలగించుటగాని చేయవలెను.

సం/- **డి.కె.బాలాజీ, IAS**
కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్, కృష్ణా జిల్లా

పొన్నవోలు హాజరుపై తదుపరి విచారణలో తేలుస్తాం

- స్పష్టం చేసిన హైకోర్టు న్యాయమూర్తి
- సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ వ్యాజ్యాలు ఈనెల 10కి వాయిదా

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి ఎసైన్డ్ భూముల వ్యవహారంలో సీఐడీ తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాలలో ఫిర్యాదుదారు, వైకాపా మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హాజరు కావడాన్ని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే కేసులో పొన్నవోలు గతంలో సీఐడీ తరఫున అదనపు ఏజీ హోదాలో హాజరై వాదనలు వినిపించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిర్యాదిదారు తరఫున వాదనలు వినిపించడం బార్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధమన్నారు. మరోవైపు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. తాను ఫిర్యాదుదారు తరఫున హాజరుకావచ్చని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు స్పందిస్తూ.. ఈ విషయాన్ని తదుపరి విచారణలో తేలుస్తామని స్పష్టం చేశారు. విచారణను ఈనెల 10కి వాయిదా వేశారు.

★ ఎసైన్డ్ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 17న నిబంధనలకు విరుద్ధంగా జీవో 41 జారీ చేసిందని పేర్కొంటూ వైకాపా అప్పటి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి 2021 ఫిబ్రవరి 24న సీఐడీకి ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా సీఐడీ 2021 మార్చి 12న తెదేపా అధినేత చంద్రబాబు, మాజీమంత్రి పి.నారాయణపై కేసు నమోదు చేసింది. దానిని కొట్టేయాలంటూ ఇరువురు 2021లో హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేశారు. అప్పట్లో ఈ కేసుపై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. సోమవారం ఈ వ్యాజ్యాలు హైకోర్టులో విచారణకు వచ్చాయి.

ఈ తెల్ల బంగారానికి ధర ఎప్పుడు వస్తుందో!



పెద్దాపురంలో రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

ఈ ఏడాది వర్షాలు పంట దశలోనే పత్తిని దెబ్బతీశాయి. అయినా ఎలాగోలా తిప్పలు పడి కర్షకులు పంటలు సాగుచేశారు. తీరా అరకొరగా దిగుబడి చేతికొచ్చినా.. ధర లేక ఇల్లు దాటే పరిస్థితి లేదు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పెద్దాపురంలో ఏ రైతు ఇంట్లో చూసినా గుట్టలుగా పత్తి కనిపిస్తోంది. చిత్రంలో కనిపిస్తున్న రైతు శివరాజు జ్వాలానరసింహం. 16 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మొంథా తుపానుకు ముందు మొదటిసారి పత్తి తీసి, ఇంటి వద్ద నిల్వ చేశారు. సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇంట్లోనే పెట్టుకున్నారు. పత్తి దెబ్బతినకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం తన దగ్గర 60 క్వింటాళ్ల వరకు సరకు ఉందని, మద్దతు ధర ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని వాపోయారు. మరోవైపు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. రకరకాల నిబంధనలతో ఉపయోగంలేకుండా పోతున్నాయని చెబుతున్నారు.

– ఈనాడు, అమరావతి

హైదరాబాద్-విజయవాడ మధ్య విమాన సమస్యలు పరిష్కరించండి

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి తెదేపా ఎంపీల వినతి

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్-విజయవాడ మధ్య విమానయాన సమస్యలు పరిష్కరించాలని తెదేపా ఎంపీలు సోమవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి విజ్ఞప్తి చేశారు. పార్టీ పార్లమెంటరీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అమలాపురం ఎంపీ జీఎం హరీష్ బాలయోగి ఇక్కడి పార్లమెంటు భవన్‌లో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విజయవాడ-హైదరాబాద్ మధ్య తగిన సంఖ్యలో విమానాలు లేకపోవడం వల్ల ఛార్జీ రూ.18 వేల పైనే ఉంటోందని, అంత చెల్లించడానికి సిద్ధపడినా సీట్లు దొరకని పరిస్థితి ఉందని ఎంపీలు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చిన్న విమానాల (ఏటీఆర్) వల్లే ఈ సమస్య ఏర్పడుతున్నట్లు వివరించారు. అమరావతికి వచ్చే పెట్టుబడిదారులు కూడా ఏటీఆర్ విమానాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. విదేశీ ప్రయాణికుల లగేజ్ వారితో రావడం లేదని, రెండు మూడు రోజుల తర్వాత చేరుతుండటంతో ఫిర్యాదులు పెరిగిపోతున్నాయని తెలిపారు. అందువల్ల ఏటీఆర్‌ల స్థానంలో విజయవాడ-హైదరాబాద్ మధ్య పెద్ద విమానాలు నడిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విజయవాడ నుంచి అహ్మదాబాద్, వారణాసి, పుణె, కొచ్చి, గోవాలకూ విమాన సర్వీసులు ప్రారంభించాలని కోరారు. ప్రస్తుతం విజయవాడ నుంచి హైదరాబాద్, దిల్లీ, ముంబయిలకు నడుస్తున్న సర్వీసులను అంతర్జాతీయ విమానాలతో అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించారు. వచ్చే వారం రోజుల్లో ఈ అంశాలపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కృష్ణా ట్రైబ్యునల్ గడువు 2026 జులై వరకు పొడిగింపు

కేంద్ర జలశక్తి శాఖ సహాయమంత్రి రాజ్‌భూషణ్ చౌధరి వెల్లడి

ఈనాడు, దిల్లీ: కృష్ణా ట్రైబ్యునల్-2 గడువును 2026 జులై 31 వరకు పొడిగించినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయమంత్రి రాజ్‌భూషణ్‌చౌధరి తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాద పరిష్కారం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అదనపు విధివిధానాలపై ట్రైబ్యునల్ తీసుకున్న నిర్ణయాలపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ సోమవారం అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. "ఏపీ, తెలంగాణల మధ్య కృష్ణా జల వివాదాల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అదనపు విధివిధానాలపై కృష్ణా ట్రైబ్యునల్-2 ఇంతవరకూ తుది నిర్ణయాన్ని వెలువరించలేదు. ప్రస్తుతం ఈ అంశం ఇంకా ట్రైబ్యునల్ పరిధిలోనే ఉంది. ఈ నివేదికను సమర్పించడానికి మరో ఏడాది గడువు ఇవ్వాలని ట్రైబ్యునల్ చేసిన విజ్ఞప్తి మేరకు, దాని గడువును 2026 జులై 31వ రకు పొడిగించాం" అని కేంద్రమంత్రి వివరించారు.

పెళ్లిలో బంధువులకు కానుకగా శిరస్త్రాణాలు

- రాజస్థాన్‌లో వధువు కుటుంబంపై ప్రశంసల వర్షం



వివాహ వేడుకలో పెళ్లివారు అతిథులకు రిటర్న్ గిఫ్టులు ఇవ్వడం సాధారణమే. అయితే రాజస్థాన్ బికనేర్ నగరంలోని ఓ వధువు కుటుంబం.. పెళ్లికి హాజరైన బంధువులందరికీ శిరస్త్రాణాల(హెల్మెట్)ను రిటర్న్ గిఫ్టులుగా అందజేసి ప్రశంసలు అందుకుంటోంది. మనోజ్ బర్వాల్ అనే వ్యక్తి కుమార్తె వివాహం ఆదివారం జరిగింది. పెళ్లికి వచ్చే అతిథులందరికీ శిరస్త్రాణాలను కానుకగా ఇవ్వాలని మనోజ్ బర్వాల్ నిశ్చయించుకున్నారు. అనుకున్నట్లే, ఆదివారం వధూవరులిద్దరూ పూలమాలలు మార్చుకున్న తర్వాత మనోజ్ ముందుగా తన అల్లుడికి హెల్మెట్ ఇచ్చారు. అనంతరం అతిథులందరికీ మొత్తం 286 శిరస్త్రాణాలను అందజేశారు. సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ ఆవశ్యకతను చాటిచెప్పేందుకే వాటిని బహుమతిగా ఇచ్చామని మనోజ్ చెప్పారు.

బ్రహ్మోస్ పరీక్ష విజయవంతం



దిల్లీ: దీర్ఘశ్రేణి సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను భారత సైన్యం సోమవారం విజయవంతంగా పరీక్షించింది. బంగాళాఖాతంలో వెలుపల ఒక ప్రయోగవేదిక నుంచి ఈ అస్త్రం దూసుకెళ్లింది. సైన్యంలోని దక్షిణ విభాగానికి చెందిన బ్రహ్మోస్ యూనిట్ దీన్ని చేపట్టింది. అండమాన్, నికోబార్‌లోని త్రివిధ దళాల విభాగం సమన్వయంతో ఇది సాగింది. తాజా పరీక్షలో ఈ క్షిపణి.. నిర్దేశిత లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ప్రయోగానికి సంబంధించిన లక్ష్యాలన్నీ నెరవేరాయని ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. సైన్యంలోని బ్రహ్మోస్ విభాగాల పోరాట సన్నద్ధతను ఇది చాటిందని వివరించింది. అత్యంత కచ్చితత్వంతో దీర్ఘశ్రేణి దాడుల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు భారత సైన్యం సాగిస్తున్న కసరత్తులో తాజా పరీక్ష ఒక మైలురాయి అని వివరించింది. బ్రహ్మోస్ క్షిపణిలో అధునాతన దిక్సూచి, నియంత్రణ వ్యవస్థలు ఉన్నాయి. ఈ అస్త్రాన్ని భారత్, రష్యాలు ఉమ్మడిగా రూపొందించాయి.

ఈసారి గజగజ!

సాధారణం కంటే ఎక్కువగా చలి తీవ్రత: ఐఎండీ


దిల్లీ: దేశంలోని మధ్య, వాయువ్య ప్రాంతాలతో పాటు ద్వీపకల్ప ప్రాంతంలో భాగమైన దక్షిణాది రాష్ట్రాల్లో ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో ఈసారి శీతాకాలంలో సాధారణం లేదా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదు కానుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం అంచనా వేసింది. పశ్చిమ హిమాలయ ప్రాంతంలో, ఆ ప్రాంతపు పాదభాగంలో, దేశ తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో సాధారణం కన్నా ఎక్కువ ఉష్ణోగ్రత నమోదవుతుందని వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణా, పంజాబ్, మహారాష్ట్రలోని కొన్ని భాగాల్లో నాలుగు నుంచి ఐదు రోజులు ఎక్కువగా శీతల గాలులు వీస్తాయని తెలిపారు. దేశంలోని అధిక భాగాల్లో సాధారణం లేదా అంతకన్నా తక్కువ ఉష్ణోగ్రత నమోదు కానుందన్నారు. బలహీనమైన 'లా నినా' పరిస్థితులు డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకూ కొనసాగుతాయని అంచనా వేస్తున్నట్టు వివరించారు. భూమధ్య రేఖ మధ్య, తూర్పు ప్రాంతాల్లో పసిఫిక్ మహాసముద్ర జలాలు భారీస్థాయిలో చల్లబడటాన్ని 'లా నినా'గా వ్యవహరిస్తారు.

ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేశారు?



రాజ్యసభలో ప్రశ్నించిన మల్లికార్జున ఖర్గే

దిల్లీ: రాజ్యసభ ఛైర్మన్‌గా తొలిసారి సభలో అడుగుపెట్టిన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఛైర్మన్.. ధన్‌ఖడ్ ఆకస్మికంగా వైదొలగడాన్ని ఆయన ప్రస్తావించడంతో అధికారపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. సోమవారం సభలో ఖర్గే కొద్దిసేపు మాట్లాడారు. ఇరు పక్షాల మధ్య సమతూకం పాటించాలని, ప్రతిపక్ష సభ్యుల సమస్యలను లేవనెత్తడానికి అవకాశం ఇవ్వాలని కొత్త ఛైర్మన్‌ను కోరారు. రాధాకృష్ణన్.. కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చిన వారేనని తెలిపారు. సభ సజావుగా సాగడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా.. జులై 21న ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడాన్ని ఖర్గే ప్రశ్నించారు. పార్లమెంటరీ చరిత్రలోనే ఇదో అనూహ్య పరిణామమని అభిప్రాయపడ్డారు. ఆయనకు వీడ్కోలు పలికే కార్యక్రమాన్నీ నిర్వహించకపోవడం తనను బాధించిందని తెలిపారు. తమపై ప్రధాని మోదీ సభ బయట ఆరోపణలు చేశారని, దానికి తాము సభలోనే బదులిస్తామని స్పష్టం చేశారు. ఖర్గే వ్యాఖ్యలతో అధికార పక్ష సభ్యులు భగ్గుమన్నారు. కొత్త ఛైర్మన్‌ను స్వాగతించే కార్యక్రమంలో ధన్‌ఖడ్ పేరును ఖర్గే తీసుకురావడంపై పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తప్పుబట్టారు. గతంలో ధన్‌ఖడ్ అభిశంసనకు నోటీసు ఇచ్చిన ఘటనలకు సంబంధించిన సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి నడ్డా జోక్యం చేసుకొని సభ్యులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ధన్‌ఖడ్ ప్రస్తావన అసమంజసమని అభిప్రాయపడ్డారు.



రాజ్యసభలో సభ్యులను వారిస్తున్న ఛైర్మన్ రాధాకృష్ణన్

కశ్మీర్‌కు పరిమిత అధికారాలను ప్రశ్నించిన ఎన్‌సీ సభ్యుడు

నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) తరఫున ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన చౌదరి మహమ్మద్ రంజాన్ సోమవారం ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వానికి పరిమిత అధికారాలను ఆయన ప్రశ్నించారు. ఆయనతోపాటు ఎన్‌సీ మరో నేత సజ్జాద్ అహ్మద్ కిచ్లూ, పార్టీ కోశాధికారి గుర్విందర్ సింగ్ ఓబెరాయ్ ప్రమాణం చేశారు. 2019లో జమ్మూ కశ్మీర్‌ను విభజించిన తర్వాత 2021 నుంచి అక్కడి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి ఇటీవల ఎన్నికలు నిర్వహించారు. 3 స్థానాలను ఎన్‌సీ, ఒక స్థానాన్ని భాజపా గెలుచుకున్నాయి.

కుంగుబాటు ఎందుకంటే..?



కుంగుబాటుకు దారితీసే కారణాల్లో కొన్ని.. ★ వ్యాయామం చేయకపోవడం. ★ విచ్చలవిడిగా ఖర్చు పెట్టడం. ★ అతిగా తినడం. ★ లక్ష్య రహితంగా జీవిస్తుండటం. ఈ అంశాల్లో మార్పులకు ప్రయత్నిస్తే మీ జీవితంలో కొత్తదనం వస్తుందనడంలో సందేహం లేదు.

– మాట్ గ్రే, వ్యాపారవేత్త

ప్రపంచం మెచ్చిన పాఠశాల



ఈటీవీ భారత్: గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఒక జిల్లా పరిషత్ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారు. మహారాష్ట్ర పుణె జిల్లాలోని జలీందర్ నగర్ పాఠశాల టీ4 ప్రకటించిన ప్రపంచంలోని 10 అత్యుత్తమ స్కూళ్లలో ఒకటిగా నిలిచింది. అక్కడ పని చేసే ప్రిన్సిపల్ దత్తాత్రేయ్ వరే గురూజీ, రితూజా తమ్హానే కలిసి పాఠశాలకు ఈ గుర్తింపు తీసుకొచ్చారు. కేవలం 8 నెలల్లోనే వారు ఈ ఘనతను సాధించడం విశేషం. జలీందర్ నగర్ పాఠశాలలో 8వ తరగతి వరకూ ఉంది. 150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తొలి 3 నెలల్లోనే ఈ పాఠశాలలో సిలబస్‌ను ఉపాధ్యాయులు పూర్తి చేశారు. ఆ తర్వాత వారికి కోడింగ్, ప్రోగ్రామింగ్, రోబోటిక్స్, ఏఐ, గ్రాఫిక్స్, 3డీ గేమింగ్, ఎలక్ట్రానిక్స్, ప్లంబింగ్ వంటి 21 అంశాల్లో శిక్షణ ఇచ్చారు.

మసాలా బాండ్ల కేసు..

కేరళ సీఎం విజయన్‌కు ఈడీ నోటీసు

ఆర్థికశాఖ మాజీ మంత్రి థామస్, కేఐఐఎఫ్‌బీ సీఈవోకు కూడా..




పథనంథిట్ట: కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డు(కేఐఐఎఫ్‌బీ)కు సంబంధించిన మసాలా బాండ్ల కేసులో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) షోకాజ్ నోటీసు జారీ చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనలను ఉల్లంఘించారన్న అభియోగాలతో విజయన్‌తోపాటు రాష్ట్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి టి.ఎం.థామస్ ఇసాక్, కేఐఐఎఫ్‌బీ సీఈవో కె.ఎం.అబ్రహాంలకు కూడా నోటీసులిచ్చింది. కేరళలో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణకు కేఐఐఎఫ్‌బీ 2019 మార్చి నెలలో మసాలా బాండ్లు జారీ చేసింది. వాటి ద్వారా లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నుంచి సుమారు రూ. 2,150 కోట్లు సమీకరించింది. అయితే ఆ నిధులను రాష్ట్రంలో భూసమీకరణకు మళ్లించారని, తద్వారా ఆర్బీఐ నిబంధనలను ఉల్లంఘించారని ఈడీ పేర్కొంది. దీనిపై నెల రోజుల్లోపు విజయన్, థామస్ ఇసాక్, అబ్రహాంలు వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం చేసింది.

కశ్మీర్‌లోని 8 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు

శ్రీనగర్: దిల్లీలో పేలుడు ఘటన వెనక ఉన్న 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌కు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కశ్మీర్‌లోని పుల్వామా, శోపియాన్, కుల్గామ్ జిల్లాల్లోని 8 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న శోపియాన్‌కు చెందిన మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ ఇంట్లో సోదాలు నిర్వహించినట్లుగా అధికారులు తెలిపారు. గత నెలలో అహ్మద్‌ను ఎన్ఐఏ కస్టడీలోకి తీసుకుంది. పుల్వామాలో నిందితులకు సంబంధమున్న ప్రాంతాల్లోనూ సోదాలు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు.

డిజిటల్ అరెస్టు మోసాలపై సీబీఐ

- దేశవ్యాప్తంగా ఈ తరహా కేసులపై ఏకీకృత దర్యాప్తు
- కీలక ఆదేశాలు జారీచేసిన సుప్రీంకోర్టు



దిల్లీ: దేశంలో కలకలం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్టు మోసాలపై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సహా పలు ప్రభుత్వ విభాగాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలీసు, ఈడీ తదితర సంస్థల అధికారులమంటూ, కోర్టు ఆదేశాల పేరుతోనూ జరుగుతున్న నేరాలపై ఏకీకృత దర్యాప్తు చేపట్టాలని సీబీఐకి సూచించింది. పన్నుల భారం మోపని దేశాల నుంచి మోసాలకు పాల్పడే సైబర్‌నేరగాళ్లను పట్టుకోవడానికి ఇంటర్‌పోల్ సహకారం తీసుకోవాలనీ తెలిపింది. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను జప్తు చేయడానికి కృత్రిమ మేధ(ఏఐ), మెషీన్ లెర్నింగ్ సాంకేతికతలను ఎందుకు వినియోగించడం లేదని భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్బీఐ)ని ప్రశ్నిస్తూ నోటీసు జారీ చేసింది. విపక్షాల పాలనలో ఉన్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ సహా.. అన్ని రాష్ట్రాలు వాటి భూభాగాల పరిధిలో జరిగిన డిజిటల్ మోసాలపై సీబీఐ దర్యాప్తునకు సమ్మతి తెలిపి సహకరించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం స్పష్టం చేసింది. హరియాణాకు చెందిన వృద్ధ దంపతుల ఫిర్యాదును సుమోటో పిటిషన్‌గా పరిగణించి సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

కోర్టు ఆదేశాల్లోని మరిన్ని వివరాలు..

- ■ సమాచార సాంకేతిక సేవలు అందించే సంస్థలూ దర్యాప్తులో సీబీఐకి సహకరించాలి.
- ■ సైబర్ నేరగాళ్లకు ఉపయోగపడేలా వ్యక్తులకు కానీ, సంస్థలకు కానీ బహుళ సిమ్‌లను టెలికాం సేవల ప్రొవైడర్లు జారీ చేయకుండా టెలికాం శాఖ చర్యలు చేపట్టాలి.
- ■ సీబీఐకి సహకారం అందించేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు... రాష్ట్ర, ప్రాంతీయ స్థాయి సమన్వయ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలి.
- ■ మారు పేర్లతో ఖాతాలను నిర్వహించుకునేలా నేరగాళ్లకు సహకరిస్తున్న బ్యాంకు అధికారులపైనా సీబీఐ దర్యాప్తు జరపాలి.
- ■ సైబర్ నేరాలను అరికట్టడానికి సంబంధించి కేంద్ర హోం, టెలికాం, ఆర్థిక, ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖల అభిప్రాయాలను సర్వోన్నత న్యాయస్థానానికి అందజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ఆదేశించింది.

దార్జిలింగ్ మాండరిన్ నారింజకు జీఐ ట్యాగ్



పశ్చిమబెంగాల్‌లోని దార్జిలింగ్‌లో శీతాకాల పంట మాండరిన్ నారింజకు జీఐ ట్యాగ్ లభించింది. దీంతో మళ్లీ ఈ పంటకు పూర్వ వైభవం వస్తుందని భావిస్తున్నారు. ఈ నారింజకు దేశంలోనే కాకుండా అంతర్జాతీయ పర్యాటకుల నుంచీ మంచి ఆదరణ ఉంది. దీని పేరు జీఐ రిజిస్ట్రీలో నవంబరు 24వ తేదీన నమోదైంది. రాష్ట్రంలో జీఐ ట్యాగ్ పొందిన 11వ పంటగా ఇది నిలిచింది.

ఈటీవీ భారత్

21,000 మంది గీతాగానం



హరియాణాలోని కురుక్షేత్రలో జరుగుతున్న అంతర్జాతీయ గీతా మహోత్సవంలో భాగంగా సోమవారం 21,000 మంది విద్యార్థులు గీతాగానం చేసి రికార్డు సృష్టించారు. స్థానిక కేశవ్ పార్కులో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా భగవద్గీతలోని శ్లోకాలను ఆలపించారు. ఇందులో దేశ విదేశాల్లోని లక్షల మంది ఆన్‌లైన్‌ద్వారా భాగస్వాములయ్యారు.

పంట వ్యర్థాల దహనాన్ని రాజకీయం చేయొద్దు

- దిల్లీ కాలుష్యంపై నెలకు రెండుసార్లు చర్చ జరగాలి
- స్పష్టం చేసిన సుప్రీం కోర్టు



దిల్లీ: దేశ రాజధాని దిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్య సమస్యను కేవలం శీతాకాలంలో నమోదయ్యే సాధారణ కేసులా పరిగణించకూడదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సూక్ష్మ, దీర్ఘకాల పరిష్కారాల కోసం నెలకు రెండుసార్లు దీనిపై చర్చించాలని స్పష్టంచేసింది. పెరుగుతున్న వాయు కాలుష్యానికి రైతులను నిందించడం సరికాదని, పంట వ్యర్థాల దహనాన్ని రాజకీయం చేయొద్దని సూచించింది. కొవిడ్-19 సమయంలోనూ పంట వ్యర్థాల దహనాలు కొనసాగాయనీ.. అయినప్పటికీ ప్రజలకు ఆకాశం స్పష్టంగా కనిపించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు సోమవారం వ్యాఖ్యానించింది. కాలుష్య నివారణకు కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్(సీఏక్యూఎం), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(సీపీసీబీ)లు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలను కేంద్రం జారీ చేయాలని ఆదేశించింది. కాలుష్య నివారణకు ఇప్పటివరకు ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ తీసుకున్న చర్యల వల్ల గాలి నాణ్యత ఎంతమేరకు మెరుగుపడిందనే విషయంపై వారంలోపు నివేదిక సమర్పించాలని పేర్కొంది. పంటవ్యర్థాల దహనం, వాహనాల ఉద్గారాలు, నిర్మాణ ధూళి, బయోమాస్ దహనం కాలుష్యానికి ప్రధాన కారకాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి న్యాయస్థానానికి తెలియజేశారు. వీటికోసం ఎలాంటి చర్యలు చేపట్టాలో వివరంగా జాబితా రూపొందించి ఇస్తానని ఆమె పేర్కొన్నారు.

వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్

గడువు పొడిగింపునకు సుప్రీం నిరాకరణ

దిల్లీ: వక్ఫ్ ఆస్తిగా రికార్డుల్లో నమోదు కానప్పటికీ ఏళ్ల తరబడి మతపరమైన కార్యక్రమాలకు ఉపయోగపడుతున్న కారణంగా వక్ఫ్ ఆస్తిగా పరిగణిస్తూ వచ్చిన 'వక్ఫ్ బై యూజర్' ఆస్తులతో పాటు ఇతర వక్ఫ్ ఆస్తులన్నింటినీ ఉమీద్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకునే గడువును పొడిగించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఇప్పటికే ఇచ్చిన గడువు ముగిసేలోగా పిటిషనర్లు సంబంధిత ట్రైబ్యునళ్లను ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకోవాలని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 'సెక్షన్ 3బీని మా దృష్టికి తెచ్చారు. అయితే దరఖాస్తుదారుల సమస్యకు ట్రైబ్యునళ్ల సమక్షంలో పరిష్కారం ఉంది. 6 నెలల గడువుకు ముందు ట్రైబ్యునళ్లను ఆశ్రయించి పరిష్కారం కోరే స్వేచ్ఛను పిటిషనర్లకు ఇస్తున్నాం. ఇందుకు సంబంధించి మా వద్దకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ పక్కనబెడుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు గడువును పొడిగించాలని కోరుతూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఏఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. వక్ఫ్ ఆస్తుల్ని రిజిస్టరు చేయడానికి ప్రభుత్వం విధించిన 6 నెలల గడువు పూర్తి కావచ్చిందని ఒక న్యాయవాది తెలిపారు.

పాఠాలు నేర్వకపోతే

విపక్షం తుడిచిపెట్టుకుపోతుంది: ఎన్డీయే

దిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నుంచి విపక్షాలు పాఠం నేర్చుకోకపోతే త్వరలో ఇతర రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల్లో ఏకంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అధికార ఎన్డీయే ఎంపీలు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్-సర్)ను వ్యతిరేకించే పేరిట పార్లమెంటు కార్యకలాపాలను విపక్షాలు ఒక వ్యూహం ప్రకారం అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. 'సర్'ను బిహార్ ఎన్నికల్లో పెద్ద అంశంగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్, ఇతర విపక్షాలు ప్రయత్నించినా ప్రజలు ఎన్డీయే పక్షానే నిలిచి, అదొక అంశమే కాదని విస్పష్టంగా తేల్చిచెప్పారని జేడీయూ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఆ పార్టీ ఎంపీ సంజయ్‌కుమార్ ఝా పీటీఐకి తెలిపారు. ఇప్పటికైనా విపక్షాలకు అర్థం కాకపోతే ఇదే ఓటమి మళ్లీమళ్లీ తప్పదన్నారు. విపక్షాల వల్లనే గతసారి పార్లమెంటు సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయని, ఆ తర్వాత ప్రజలు ఆ పార్టీలను బిహార్ నుంచి తుడిచేశారని త్రిపుర మాజీ సీఎం, భాజపా ఎంపీ బిప్లవ్‌కుమార్ దేవ్ అన్నారు. వాళ్లు ఎంత ఎక్కువగా సర్‌ను ప్రస్తావిస్తే అంతగా ప్రజల తిరస్కారం తప్పదన్నారు. సభలో గందరగోళం సృష్టించడం, నాటకాలాడటంపైనే విపక్షాలు దృష్టి పెడుతున్నాయని, పరిష్కారాలు వాటికి అవసరం లేదని ఎల్జేపీ-ఆర్వీ నేత చిరాగ్ పాస్వాన్ విమర్శించారు. గతంలో ఈవీఎంలను నిందించేవారని, ఇప్పుడు ఓటర్ల జాబితాల సవరణ రూపంలో కొత్త నెపాన్ని వెతుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు.

సీఐసీ ఎంపికకు 10న ప్రధాని నేతృత్వంలోని కమిటీ భేటీ

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

దిల్లీ: కేంద్ర సమాచార కమిషన్‌లోని కీలక పదవులను భర్తీ చేయడానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ ఈ నెల 10న సమావేశమయ్యే అవకాశం ఉందని సుప్రీంకోర్టుకు సోమవారం కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)తో పాటు సమాచార కమిషనర్ల పోస్టులకు పేర్లను సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించింది. కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్‌లలోని ఖాళీలను భర్తీ చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుపుతున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి ధర్మాసనానికి కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్రాల్లోని సమాచార కమిషన్‌లలో మొత్తం ఎన్ని పోస్టులున్నాయి, ఎన్ని భర్తీ అయ్యాయి, ఇంకా ఖాళీలెన్ని, ఆయా కమిషన్ల వద్ద పెండింగ్ కేసుల వివరాలను పంపించాల్సిందిగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ వాయిదాపడింది.

విపత్తుల వేళల్లో సన్నద్ధతపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు

దిల్లీ: ఆకస్మిక ప్రమాదాలు, విపత్తులు తలెత్తినప్పుడు తక్షణ సహాయానికి తరలివచ్చే అగ్నిమాపక విభాగం, రహదారి అత్యవసర ప్రతిస్పందన విభాగం తదితరాల్లోని ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. సూరత్‌లో 2019లో జరిగిన అగ్నిప్రమాదంలో కుమార్తెను కోల్పోయిన వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం సోమవారం ప్రభుత్వంతో పాటు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) స్పందననూ కోరింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

భారత్‌తో రక్షణ ఒప్పందంపై రష్యా పార్లమెంటులో ఓటింగ్ నేడు

మాస్కో: భారత్‌తో కీలక రక్షణ ఒప్పందాన్ని ఆమోదించేందుకు రష్యా పార్లమెంటులోని దిగువ సభ(స్టేట్ డ్యూమా) మంగళవారం ర్యాటిఫికేషన్ ఓటింగ్‌ను నిర్వహించనుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ గురువారం నుంచి రెండు రోజుల పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ ఓటింగ్ జరగనుంది. 'భారత్-రష్యా రెసిప్రోకల్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ లాజిస్టిక్స్ అగ్రిమెంట్' పేరిట ఇరు దేశాల మధ్య ఫిబ్రవరిలో ఈ ఒప్పందం జరిగింది. రెండు దేశాల మధ్య సైనిక సహకారాన్ని పెంపొందించుకోవడం దీని లక్ష్యం.

భారతీయుల వల్ల అమెరికాకే లబ్ధి

- హెచ్1బీ వీసాలను సమర్థించిన మస్క్



న్యూయార్క్: భారతీయుల ప్రతిభాపాటవాల వల్ల అమెరికా ఎంతగానో లబ్ధి పొందిందని ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. హెచ్1బీ వీసా కార్యక్రమాన్ని ఆయన గట్టిగా సమర్థించారు. ఈ వీసాలను రద్దు చేయడం అమెరికాకు కీడు చేస్తుందని హెచ్చరించారు. ఒక పాడ్‌కాస్ట్‌లో ఔత్సాహిక వ్యాపారవేత్త నిఖిల్ కామత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్1బీ వీసా కొంత వరకూ దుర్వినియోగమైన విషయం వాస్తవమే అయినా ఆ వీసాను పూర్తిగా ఎత్తేయరాదని తాను భావిస్తున్నట్లు తెలిపారు. 'కొందరు మితవాదులు హెచ్1బీని పూర్తిగా ఎత్తేయాలని కోరుకుంటున్నారు. అలా చేయడం అమెరికాకు కీడు చేస్తుందని వాళ్లు అర్థం చేసుకోవడం లేదు' అని ఆయన స్పష్టం చేశారు. వలసలకు వ్యతిరేకంగా అమెరికా మారిందా అన్న ప్రశ్నకు.. దీనిపై భిన్నాభిప్రాయాలున్నాయని మస్క్ వ్యాఖ్యానించారు. 'గత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో ప్రవాస వ్యవహారాలు పూర్తిగా అదుపు తప్పాయి, సరిహద్దులపై నియంత్రణ లేకుండా పోయింది. అలా నియంత్రణ లేని దేశం దేశమే కాదు' అని స్పష్టం చేశారు.

భారత్‌తో గాఢానుబంధం

ప్రపంచంలోనే అత్యంత ధనికుడైన ఎలాన్ మస్క్.. భారతదేశంతో తనకున్న గాఢమైన అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. తన సహజీవన భాగస్వామి అయిన శివోన్ జిలిస్‌కు భారత్‌తో అనుబంధం ఉందని తెలిపారు. అలాగే తన కుమారుడి పేరులో శేఖర్ పదం ఉందని వెల్లడించారు. జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్‌లో తన వ్యక్తిగత జీవితం గురించి ఎలాన్ మస్క్ మాట్లాడారు. 'మీకు తెలుసో లేదో కానీ నా సహజీవన భాగస్వామి శివోన్ జిలిస్‌కు భారతీయ మూలాలున్నాయి. ఆమె చిన్న వయసులోనే దత్తతకు వెళ్లారు. ఆమె కెనడాలో పెరిగారు. ఇక భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ గౌరవార్థం నా కుమారుడి పేరులో శేఖర్ అనే పదం చేర్చాను' అని మస్క్ తెలిపారు. మస్క్ సహజీవన భాగస్వామి శివోన్ జిలిస్ తల్లి పంజాబీ కాగా తండ్రి కెనడా జాతీయుడు. యేల్ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చేసిన శివోన్ జిలిస్ ప్రస్తుతం మస్క్ యాజమాన్యం కింద నడుస్తున్న న్యూరల్‌లింక్ అనే సంస్థలో ఆపరేషన్స్ అండ్ స్పెషల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

శ్రీలంకలో చిక్కుకున్న భారత పౌరులు స్వదేశానికి తరలింపు

- సహాయక చర్యలు ముమ్మరం చేసిన భారత్

కొలంబో: దిత్వా తుపాను కారణంగా శ్రీలంకలో చిక్కుకుపోయిన భారతీయుల ఆఖరి బృందాన్ని(104 మంది) కేంద్ర ప్రభుత్వం సోమవారం కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయానికి చేర్చింది. ఆపరేషన్ సాగర్ బంధులో భాగంగా శ్రీలంకలో సహాయక చర్యలను భారత్ ముమ్మరం చేసింది. చేతక్ హెలికాప్టర్లు ఎంతో మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. భారత జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్), హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్(హెచ్ఏడీఆర్) బృందాలు శ్రీలంకలో సహాయక చర్యలు చేపడుతున్నాయి.

హెలికాప్టర్ కూలి పైలట్ మృతి..

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సామగ్రి అందించేందుకు వెళ్లిన శ్రీలంక హెలికాప్టర్ కూలి పైలట్ మృతి చెందాడు. వైమానిక దళంలోని ఐదుగురి వ్యక్తులు తీవ్రంగా గాయపడటంతో వారి పరిస్థితి విషమంగా ఉంది. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఐదుగురు నావికులు మృతి చెందారు. వరదల కారణంగా ఆదివారం నాటికి మృతుల సంఖ్య 334కి చేరింది. 370 మంది ఆచూకీ తెలియరాలేదు. దాదాపు లక్ష యాభై వేల మంది ప్రజలు తాత్కాలిక వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్నారు.



శ్రీలంకలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న భారత వైమానిక దళ సిబ్బంది



అయ్యప్ప క్షేత్రానికి 15 రోజుల్లో రూ.92 కోట్లు

తిరువనంతపురం : కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప క్షేత్రానికి ఈ ఏడాది మండల-మకరవిలక్కు సీజన్‌లో తొలి 15 రోజుల్లో రూ.92 కోట్ల ఆదాయం వచ్చినట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌లో రూ.69 కోట్లు వసూలయ్యాయని, ఈ దఫా ఆదాయం 33.33 శాతం పెరిగిందని పేర్కొంది. ఈ ఏడాది అత్యధికంగా అయ్యప్ప ప్రసాదం విక్రయాల నుంచి రూ.47 కోట్లు సమకూరినట్లు టీడీబీ వివరించింది. హుండీ ఆదాయం గత సంవత్సరంతో పోల్చుకుంటే 18.18 శాతం పెరిగిందని వెల్లడించింది. గతేడాది మండల-మకరవిలక్కు సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి నవంబరు 30 వరకు దాదాపు 13 లక్షల మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు బోర్డు తెలిపింది.

విజయన్ ఇంటికి బాంబు బెదిరింపు

తిరువనంతపురం: కేరళ సీఎం పినరయి విజయన్ ఇంట్లో, పలయంలోని ఒక ప్రైవేటు బ్యాంకులో బాంబు పెట్టినట్లు సోమవారం బెదిరింపు ఈమెయిల్ రావడంతో ఆ రెండు ప్రదేశాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు తెలిపారు.

నెల రోజుల్లో 1.5 కోట్ల మందికి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు

దిల్లీ: గడచిన నెల పాటు నిర్వహించిన ప్రత్యేక ప్రచారం ఫలితంగా 1.5 కోట్ల మంది పెన్షనర్లు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు (డీఎల్సీలు) పొందారని కేంద్రం సోమవారం తెలిపింది. పెన్షనర్లు ఏడాదికోసారి లైఫ్ సర్టిఫికెట్ సమర్పిస్తేనే పెన్షన్ పొందేందుకు అర్హులవుతారు. గతంలో వాటిని భౌతికంగా మాత్రమే సమర్పించే వీలుండేది. దానివల్ల వృద్ధులైన పెన్షనర్లు ఇబ్బందులు పడేవారు. ఆ సమస్యను తొలగించడానికి డిజిటల్ పద్ధతిలో లైఫ్ సర్టిఫికెట్ విధానాన్ని ప్రవేశపెట్టారు. కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ గత నెల 1 నుంచి 30వ తేదీ వరకూ నాలుగోదఫా డిజిటల్ సర్టిఫికెట్ ప్రచార కార్యక్రమం విజయవంతంగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా మొత్తం 1.54 కోట్ల డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను జారీ చేశారు. ఇందులో 60 శాతం అంటే 91 లక్షలకు పైగా సర్టిఫికెట్లను ఫేస్ ఆథెంటికేషన్ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో జారీ చేశారు.

ఎలా ఉన్నారు.. ఏం కావాలి?

గోపీనాథపట్నంలో లబ్ధిదారుకు పింఛను అందజేసిన సీఎం

గణపవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలోని గుడ్ల నాగలక్ష్మి ఇంటికి వెళ్లారు. ఆమె కుమారుడు నాగ పవన్‌సాయి, కుమార్తె వాసవి ప్రధాన రహదారి వద్ద సీఎంకు స్వాగతం పలికి తమ ఇంటికి తోడ్కొని వెళ్లారు. లబ్ధిదారు కుటుంబసభ్యులను చంద్రబాబు పరిచయం చేసుకుని యోగక్షేమాలు అడిగారు. వారికి రూ.10 వేలు పింఛను అందజేశారు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న నాగలక్ష్మి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పోషణపై ఆమె భర్త నాగేశ్వరరావుతో మాట్లాడారు. డయాలసిస్ ఛార్జీలు, మందుల రూపంలో సగం పింఛను ఖర్చవుతోందని.. ఆశించిన మేర దర్జీ పని లేక చిన్నాచితకా కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నామని నాగేశ్వరరావు వివరించారు. తన కుమారుడు ఎంసీఏ ఫైనలియర్ చదువుతూ టీసీఎస్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడని, నాగలక్ష్మికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుమార్తె పదో తరగతి పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోందని చెప్పారు. చంద్రబాబు కలగజేసుకుని అమ్మాయి చదువు కొనసాగించేలా చూడాలని సూచించారు. నాగేశ్వరరావుకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని కలెక్టర్ వెట్రి సెల్వికి ఆదేశించారు. కుటుంబ ఉన్నతికి ఇంకా ఏం కావాలని సీఎం అడగ్గా, రూ.6 లక్షల అప్పు ఉందని, ఇల్లు బాగు చేయించుకునేందుకు సహకరించాలని నాగలక్ష్మి కోరారు. అనంతరం ఆమె 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి మా ఇంటికి రావడం ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. మా పక్కనే కూర్చొని తండ్రి మాదిరిగా యోగక్షేమాలు అడిగారు. మా సమస్యలు తీరుస్తామని భరోసానిచ్చారు. పావు గంట పాటు మాతో గడపడాన్ని అదృష్టంగా భావిస్తున్నామ'ని సంతోషం వ్యక్తం చేశారు.



ప్రజా వేదికపై మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మంత్రులు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, మార్గదర్శి పసుపులేటి వెంకట రామారావు, జాలాది లక్ష్మి, వాత్సల్య (బంగారు కుటుంబం), శాఖమూరి మణి (బంగారు కుటుంబం), మార్గదర్శి మనోజ్‌కుమార్ సోంకార్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, కలెక్టర్ వెట్రి సెల్వి

పీ4 దేశానికే తలమానికం

- రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు చేపట్టిన కార్యక్రమమిది
- నల్లమాడు ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనకు రాష్ట్రంలో చేపట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమం దేశానికే తలమానికంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నల్లమాడులో సోమవారం నిర్వహించిన ప్రజావేదికలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ఆయన మాట్లాడారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే పీ4 ప్రధాన లక్ష్యమన్నారు. చిన్న స్థాయి నుంచి కష్టపడి వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి, పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని మార్గదర్శులు మనోజ్‌కుమార్ సోంకార్, పసుపులేటి వెంకట రామారావులను సీఎం ప్రశంసించారు.



ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరైన జనం

భార్యాభర్తల ఉపాధికి భరోసా



నల్లమాడుకు చెందిన లబ్ధిదారు శాఖమూరి మణితో వేదికపై సీఎం చంద్రబాబుతో మాట్లాడారు. 'నా భర్త వెంకటేశ్. కూలి పనులకు వెళ్తుంటారు. మాకు ఇద్దరు అబ్బాయిలు. ఒకటి, రెండు తరగతులు చదువుతున్నారు. పెద్దబ్బాయికి తల్లికి వందనం వచ్చింది. నేను డీఎడ్ పూర్తి చేశా. టీచర్ ఉద్యోగం నా కల' అని ఆమె వివరించారు. ఆమె కుటుంబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శి ఆర్నవ్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత మనోజ్‌కుమార్ సోంకార్ మాట్లాడుతూ మణి, వెంకటేశ్‌లకు తన పరిశ్రమలో ఉద్యోగం ఇస్తానని, ఇద్దరు పిల్లల్ని చదివిస్తానని ముందుకొచ్చారు.

ఇల్లు కట్టించి, ఉపాధి కల్పిస్తా



నల్లమాడు గ్రామస్థురాలు జలాది లక్ష్మి మాట్లాడుతూ 'నేను దివ్యాంగురాలిని. మీరొచ్చాక పెంచిన పింఛన్ రూ.6 వేలు వస్తోంది. నా భర్త కామెర్లతో చనిపోయారు. నా కుమార్తె 8వ తరగతి చదువుతోంది. తల్లికి వందనం వచ్చింది. ఇల్లు కట్టుకునేందుకు డబ్బుల్లేక మధ్యలో ఆపేశాం. గ్రామ సమాఖ్య భవనంలో తలదాచుకుంటున్నామ'ని ఆవేదనగా చెప్పారు. లక్ష్మి కుటుంబాన్ని దత్తత తీసుకున్న గ్రీన్ ఏసియా ఇంపెక్స్ పరిశ్రమ అధినేత పసుపులేటి వెంకట రామారావు స్పందిస్తూ, లక్ష్మి చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ఆమెకు తన పరిశ్రమలో పని కల్పిస్తానని హామీ ఇచ్చారు. పాప వాత్సల్యను చదివిస్తానని సీఎం సమక్షంలో ప్రకటించారు.

రెండో విడత భూసమీకరణకు రైతుల అంగీకారం



పెదమద్దూరులోని రచ్చబండ వద్ద 'థాంక్యూ సీఎం సార్' ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, రైతులు

అమరావతి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతికి రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం నిర్ణయించి, అందులో పల్నాడు జిల్లా అమరావతి మండలం పెదమద్దూరును అంతర్భాగం చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి 'థాంక్యూ సీఎం సార్' అంటూ వారు సోమవారం ప్లకార్డులు ప్రదర్శించారు. రెండో విడత భూ సమీకరణలో వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడి గ్రామాలను కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. స్వచ్ఛందంగా భూసమీకరణకు సహకరిస్తామని ఈ సందర్భంగా కర్షకులు పేర్కొన్నారు.

వైకాపా హయాంలో చంద్రబాబుపై పెట్టిన కేసు మూసివేత

'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'గా పరిగణించిన న్యాయస్థానం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సహా మరికొందరిపై సీఐడీ నమోదు చేసిన క్రైమ్ నంబర్ 18/2023 అక్రమ కేసును మూసేస్తూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సోమవారం ఆదేశాలిచ్చింది. 2014-19 మధ్య తెదేపా హయాంలో పలు మద్యం కంపెనీలు, సరఫరాదారులకు అనుకూల నిర్ణయాలు తీసుకుని వారికి అనుచిత లబ్ధి కలిగించారని ఆరోపిస్తూ అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ డి.వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2023 అక్టోబరు 28న సీఐడీ కేసు నమోదు చేసింది. చంద్రబాబును ఏ-3గా, ఎక్సైజ్ కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస శ్రీనరేశ్‌ను ఏ-1గా, ఎక్సైజ్ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన కొల్లు రవీంద్రను ఏ-2గా పెట్టింది. దర్యాప్తు చేసిన అధికారులు.. కొద్ది రోజుల కిందట ఈ కేసును 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ (వాస్తవ విరుద్ధం)'గా పేర్కొంటూ న్యాయస్థానంలో క్లోజర్ రిపోర్టు దాఖలు చేశారు. దానిపై న్యాయస్థానం ఫిర్యాదుదారుకు నోటీసులివ్వగా.. సీఐడీ వాదనతో ఏకీభవిస్తూ ఈ కేసులో ఫిర్యాదుదారు, ఏపీఎస్‌బీఎల్ పూర్వపు ఎండీ వాసుదేవరెడ్డి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇచ్చారు. వీటన్నింటినీ పరిశీలించిన న్యాయస్థానం ఆ కేసును 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'గా పరిగణించి, కేసు మూసేస్తూ ఆదేశాలిచ్చింది.

18 నెలల్లో ₹50 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

నిరుద్యోగ నిర్మూలన ప్రణాళికలో భాగంగా ఇంటికో పారిశ్రామికవేత్త, ఇంటికో ఉద్యోగం లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగమేళాలు నిర్వహిస్తున్నాం. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న హామీకి కట్టుబడ్డాం. విశాఖ సీఐఐ సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకురాగా, ఇప్పటికే రూ.8 లక్షల కోట్లకు ఆమోదం తెలిపాం. ఈ పరిశ్రమలు స్థాపిస్తే, లక్షల్లో ఉద్యోగాలొస్తాయి. ఏలూరుతో పాటు కోస్తా జిల్లాల్లో ఆక్వాకల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్‌కు అవకాశాలున్నాయి. ఆక్వా రైతులకు రూ.1.50 పైసలకు యూనిట్ విద్యుత్తును అందిస్తూ ప్రభుత్వం రూ.850 కోట్ల భారం మోస్తోంది. 2028 నాటికి అమరావతి మొదటి దశ పూర్తిచేసి, రాజధానిని ఉద్యోగాల కల్పనకు కేంద్రంగా మారుస్తాం.

గంజాయిపై వైకాపా సర్కారు ఒక్క సమీక్షా చేయలేదు

గతంలో వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో కొందరు మహిళలు గంజాయి అమ్మి, లేడీ డాన్లుగా ఎదిగారు. నాటి ప్రభుత్వం గంజాయి కట్టడికి ఒక్క సమీక్షా చేయలేదంటే, వైకాపా ఎంత ప్రమాదకర పార్టీయో ప్రజలు ఆలోచించాలి. ఇది ఆడబిడ్డల గౌరవాన్ని కాపాడే ప్రభుత్వం. అందుకే స్త్రీ శక్తి అమలు చేస్తున్నాం. కష్టపడుతున్నట్లు నటించే వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వైకాపా పాలనలో రోడ్లపై గుంతలు పూడ్చకుండా వదిలేస్తే, మేమొచ్చాక మరమ్మతులు చేశాం. తాజాగా వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను జనవరిలోగా బాగుచేస్తాం. త్వరలో సంజీవని ప్రాజెక్టును ప్రవేశపెట్టి, ఎలాంటి జబ్బులకైనా ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య చికిత్సను ఇంటి ముంగిటే అందిస్తాం. ఎయిడ్స్‌పై నిశబ్దం వీడాలని నేను ఆనాడే హెచ్చరించా. అందుకే దేశంలో ఎయిడ్స్ కేసులు తక్కువున్న రాష్ట్రంగా ఏపీ ఉంది. పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నట్లు ఎన్డీయే ప్రభుత్వం మరో 20 ఏళ్లు అధికారంలో ఉండాలి.

మేలైన రకాలను ప్రోత్సహించండి

సభాస్థలిలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను అరగంట పాటు సందర్శించిన సీఎం చంద్రబాబు.. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖలు, డ్వాక్రా మహిళల ఉత్పత్తులను చూసి వివరాలు అడిగారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమక్షంలో దెందులూరు రైతులు వరి కంకుల మాలతో సీఎంను సన్మానించగా.. ఆ కంకులను చూసి 'ఇక్కడి రైతులు మారరు. 2-3 పంటలు వరే వేస్తున్నారు. ప్రత్యామ్నాయం ఎందుకు ఆలోచించరు' అని ప్రశ్నించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా స్పందిస్తూ, మొక్కజొన్న, మినుము తదితర అంతర పంటలతో పాటు వరిలోనూ అధిక దిగుబడులొచ్చే రకాలు వేస్తున్నారని చెప్పారు.

సీఎం 'భేష్. రైతుకు లాభం రావాలి. మేలైన రకాలను ప్రోత్సహించండ'ని పక్కనే ఉన్న మంత్రి మనోహర్‌కు సూచించారు.

కలెక్టర్ గారూ.. ఇది చూడండి

నల్లమాడు సభలో ఆ ఊళ్లో పంటల విస్తీర్ణం, మౌలిక వసతుల గురించి గ్రామ సచివాలయ ఉద్యాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ వివరించారు. ఆ క్రమంలో డేటా తప్పులుగా చదవడాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి.. 'మీ లెక్కలు సరిగా లేవు. అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. నేనొస్తున్నానని ఏదో డేటా తెచ్చి చదివారు. 499 హెక్టార్లు అంటే ఎన్ని ఎకరాలు? ఊళ్లో మీరు చెప్పిన లెక్కల ప్రకారం ఆయిల్‌పామ్ సాగు అంతగా లేదు కదా? గ్రామ ప్రాథమిక సమాచారంపైనే మీకు అవగాహన లేకపోతే ఎలా?' అని మందలించారు. వేదికపైనున్న కలెక్టర్ వెట్రి సెల్విని పిలిచి, 'ఏంటండి కలెక్టర్ గారూ. మీరొక్కరే పనిచేయడం కాదు, అందరితో చేయించాలి. అవగాహన పెంచుకోవాలి. ఈసారి మళ్లీ వస్తా. సచివాలయంలో గ్రామ రికార్డు పక్కాగా ఉండాలి' అని ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పార్థసారథి, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజుతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

వెయ్యి మంది కార్యకర్తలతో ఫొటోలు

బహిరంగ సభ తర్వాత సీఎం చంద్రబాబు గొల్లగూడెంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గ కార్యకర్తలకు అరుదైన అవకాశం దక్కింది. అధినేత చంద్రబాబు వెయ్యి మంది కార్యకర్తలతో విడివిడిగా ఫొటోలు దిగారు. 'పార్టీకి వెన్నెముకగా భావించే కార్యకర్తలతో ఓ గంటసేపు నిలబడి ప్రతి ఒక్కరి భుజాన చెయ్యేసి అధినాయకుడు ఫొటోలు దిగడం.. మా జీవితంలో మరుపురాని సందర్భం' అని తెలుగు తమ్ముళ్లు ఆనందం వ్యక్తంచేశారు.

తాళ్లవలసలో డయేరియా కేసులపై సీఎం ఆరా

పరిస్థితి చక్కదిద్దాలని అధికారులకు ఆదేశం

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో డయేరియా కేసులు నమోదు కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఆరా తీశారు. డయేరియాకు కారణాలు తెలుసుకుని, నీటి నాణ్యతను విశ్లేషించాలని, సమీప గ్రామాల పరిస్థితిపైనా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అందరికీ సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితిని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు సీఎంకు వివరించారు. "శని, ఆది, సోమవారాల్లో అస్వస్థతకు గురైన వేర్వేరు కుటుంబాలకు చెందిన తొమ్మిది మందిని టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నాం. చిన్నారావు (70) మృతికి డయేరియా కారణం కాదు. మూత్రపిండాల వ్యాధితో పాటు శరీరంలో పలు అవయవాలు విఫలం కావడమే అందుకు కారణమని వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురు కోలుకుంటున్నారు. మరో ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారు. గ్రామంలో బావి, కుళాయిలు, చేతిపంపుల నీరు సురక్షితమేనని పరీక్షల్లో తేలింది. జిల్లా పంచాయతీ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ క్షేత్రస్థాయిలో ఉంటూ పారిశుద్ధ్యం, నీటి సరఫరా పర్యవేక్షిస్తున్నారు. వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్నాయి" అని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఎట్టకేలకు కదిలారు!

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న 90% మంది తెదేపా ఎమ్మెల్యేలు

ఈనాడు, అమరావతి: ఎట్టకేలకు తెదేపా ఎమ్మెల్యేలు, మంత్రులు పింఛన్లు పంపిణీ చేసేందుకు లబ్ధిదారుల ఇంటి బాట పట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతినెలా ఏదో ఒక జిల్లాలో పేదల సేవలో (పింఛన్ల పంపిణీ) కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పార్టీకి చెందిన చాలామంది ఎమ్మెల్యేలు, మంత్రులు మాత్రం ఆయా కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ప్రజాప్రతినిధులందరూ ప్రతినెలా పింఛన్ల పంపిణీలో తప్పనిసరిగా పాల్గొనాలని పార్టీ శ్రేణులకు ఇటీవల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ గట్టిగా హెచ్చరించడంతో ఎట్టకేలకు కదిలారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో తెదేపా మంత్రులు, ఎమ్మెల్యేలు 90 శాతం మందికిపైగా పాల్గొన్నారు. 134 మంది తెదేపా ఎమ్మెల్యేలకు 120 మంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. 21 మంది తెదేపా మంత్రుల్లో 19 మంది హాజరయ్యారు.

ఎకరాలో కాదు, పదెకరాల్లో చేస్తావా?



నల్లమాడులో ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శనలను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. వెల్లమిల్లి గ్రామానికి చెందిన యువ రైతు రాజేంద్రప్రసాద్ చేస్తున్న సమీకృత వ్యవసాయం విధానాన్ని తెలుసుకున్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి, మత్స్య, కూరగాయలు సాగు చేస్తున్న తీరును రైతు వివరించారు. ఇదే సాగును పది ఎకరాల్లో చేయగలవా? అని సీఎం ఆరా తీయగా, చేయగలనని రాజేంద్రప్రసాద్ బదులిచ్చారు.

దిల్లీ చేరుకున్న మంత్రులు లోకేశ్, అనిత

నేడు కేంద్రమంత్రులు అమిత్‌షా, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లతో భేటీ

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనితలు సోమవారం రాత్రి దిల్లీ చేరుకున్నారు. వారు మంగళవారం పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లను కలిసి రాష్ట్రంలో మొంథా తుపాన్ కారణంగా జరిగిన నష్టానికి సంబంధించిన నివేదికను సమర్పించనున్నారు. ఈ తుపాను సమయంలో ప్రాణ నష్టం లేకున్నా ఆస్తి, పంట నష్టం అధికంగా నమోదైనందున బాధితులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేయనున్నారు. పత్తి, మొక్కజొన్న, అరటి ధరలు తగ్గడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను వ్యవసాయ మంత్రికి వివరించి ఆదుకోవాలని కోరనున్నట్లు తెలిసింది.



సోమవారం రాత్రి దిల్లీ చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలికి భేటీ అయిన తెదేపా ఎంపీలు, నాయకులు

త్వరలో 'ఫిల్మ్ టూరిజం పాలసీ'

సీఐఐ బిగ్ పిక్చర్ సమిట్‌లో కందుల దుర్గేశ్



ఈనాడు, అమరావతి: ప్రొడక్షన్ నుంచి ఎగ్జిబిషన్ వరకు రాష్ట్రంలో చిత్ర పరిశ్రమను బలోపేతం చేయడానికి త్వరలో 'ఫిల్మ్ టూరిజం పాలసీ' తెస్తామని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. అది తెలుగు సినీ పరిశ్రమను బలోపేతం చేసే విజనరీ డాక్యుమెంట్ అని అభివర్ణించారు. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో పెట్టుబడులు పెడితే ప్రోత్సహిస్తూ భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముంబయిలో జరుగుతున్న 'సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025'లో సోమవారం ఆయన పాల్గొన్నారు. సినీ, పర్యాటక రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. 'దేశంలోనే సినిమా షూటింగ్‌లకు ఏపీ అత్యంత అనుకూల రాష్ట్రం. ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీలు, ఆధునిక స్టూడియోలు, డబ్బింగ్, రీ-రికార్డింగ్ సెంటర్లు నిర్మిస్తే సంపూర్ణ మద్దతు ఇస్తాం. ప్రభుత్వ, బహిరంగ స్థలాల్లో షూటింగ్‌ల కోసం వేగంగా అనుమతులిస్తాం. త్వరలో నంది అవార్డులు, నంది నాటకోత్సవాల్ని పునరుద్ధరిస్తాం'' అని దుర్గేశ్ వివరించారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి, శ్రీశైలం, అరకులోయ, రాజమహేంద్రవరం, గండికోటల్ని యాంకర్ హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. అడ్వెంచర్, ఎకో, టెంపుల్, ఫిల్మ్ తదితర 21 సర్క్యూట్‌ల ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్నారు.

వరుస భేటీలతో బిజీబిజీగా..: సమ్మిట్‌లో భాగంగా సీఐఐ అధికారి సంజయ్ కత్వానీతో దుర్గేశ్ భేటీ అయ్యారు. అనంతరం ఏఐ యుగంలో మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం భవిష్యత్తు వృద్ధికి రోడ్‌మ్యాప్ అనే అంశంపై నిర్వహించిన చర్చా గోష్ఠిలో పాల్గొన్నారు. యూట్యూబ్ ఇండియా ఎండీ గుంజన్ సోనితో చర్చించారు. ఈ సందర్భంగా సినీ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనపై పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి ప్రజెంటేషన్ ఇచ్చారు. తర్వాత బేసిక్ ఫ్లై స్టూడియో సహా వివిధ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాల్ని వివరించారు.

గ్రామ స్థాయి నేతలు రాష్ట్ర నాయకులుగా ఎదగాలి

- 2012లో మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నిమ్మల ఇప్పుడు మంత్రి
- ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- తెదేపా మండలాధ్యక్షుల శిక్షణలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: తెదేపా గ్రామ, మండల స్థాయి నేతలు కూడా రాష్ట్ర స్థాయి నేతలుగా ఎదగాలని.. ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ఉపముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టాలని పార్టీ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. తెదేపా సిద్ధాంతం.. విధానం ఇదేనని ఆయన స్పష్టం చేశారు. 2012లో మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నిమ్మల రామానాయుడు ఇప్పుడు మంత్రి కావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో లోకేశ్ ప్రసంగించారు. 'తెదేపా ఓ విశ్వవిద్యాలయం. మనకు గుర్తింపు, గౌరవం దక్కుతున్నాయంటే పార్టీ వల్లనే. పార్టీ లేకపోతే మనం లేమని మర్చిపోవద్దు. అధిష్ఠానం నిర్ణయాల్ని తు.చ. తప్పకుండా పాటించాల్సిందే. పార్టీ కూడా కుటుంబం లాంటిదే. చిన్నచిన్న సమస్యలు సహజం. వాటిని బహిరంగ వేదికలపై మాట్లాడుకోకుండా కూర్చుని పరిష్కరించుకోవాలి. అలకలు వీడి, సంబంధిత నేతల దృష్టికి సమస్య తీసుకెళ్లాలి. ప్రజలతో అనుబంధం ఏర్పరుచుకోవాలి. 'పేదల సేవలో' సహా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్ని క్షేత్రస్థాయిలో వివరించాలి' అని వారికి దిశానిర్దేశం చేశారు.



కాఫీ కబుర్లు కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులతో మాట్లాడుతున్న తెదేపా ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్

జగన్ పాలనలో...: జగన్ పాలనలో ఒక్క అనంతపురం జిల్లాలోనే 67 మంది తెదేపా కార్యకర్తల్ని హత్య చేశారంటూ ఆనాటి అరాచకాల్ని లోకేశ్ గుర్తుచేశారు. ఇప్పటికీ మనం ఒక సైకోతో పోరాడుతున్నామనే విషయాన్ని అందరం గుర్తుంచుకోవాలన్నారు. క్లస్టర్ నుంచి రాష్ట్ర స్థాయి వరకూ అందరూ కలిసి సమష్టిగా పనిచేస్తేనే విజయాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు.

యోగాతో ప్రారంభమైన శిక్షణ : తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుల రెండు రోజుల శిక్షణ సోమవారం ఉదయం ఆరు గంటలకు యోగాతో ప్రారంభమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం చేశారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన 110 మంది మండల పార్టీ అధ్యక్షులను నాలుగు గ్రూపులుగా విభజించారు. పార్టీ నిర్మాణం, సిద్ధాంతం, ప్రయాణం తదితర అంశాల్ని వివరించారు. మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు ప్రసంగించారు. అధికారం ఉన్నా లేకపోయినా పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ఆధ్వర్యంలో శిక్షణ జరిగింది.

పాదయాత్ర వల్లే ఈ స్థాయికి వచ్చా

'కష్టం లేనిదే ఫలితం రాదు. యువగళం పాదయాత్ర వల్లే నేనీ స్థాయికి వచ్చా. పార్టీలో సంస్కరణల కోసం రెండేళ్లు పోరాడా. ఇప్పుడు వారంలో ఒకరోజు తెదేపా కేంద్ర కార్యాలయంలో ఉంటున్నా. మీ ఫీడ్‌బ్యాక్ తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. మీరు కూడా ఓర్పు, సహనంతో ప్రజలతో మమేకం కావాలి. ప్రతి ఒక్కరూ మై టీడీపీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్ ద్వారానే పార్టీ కార్యక్రమాల్ని సమన్వయం చేస్తున్నాం' అని చెప్పారు.

ప్రజాదర్బార్‌లో లోకేశ్‌కు వినతుల వెల్లువ



లోకేశ్‌కు తన సమస్య చెప్పుకొంటున్న మహిళ

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో ఖాళీగా ఉన్న నాదస్వరం, డోలు సహా వివిధ వాయిద్య కళాకారుల పోస్టుల్ని భర్తీ చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను అఖిల భారత నాయీబ్రాహ్మణ హక్కుల పరిరక్షణ సేవా సమితి ప్రతినిధులు కోరారు. వీటికి వయోపరిమితిలో సడలింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన లోకేశ్.. ఈ విషయాన్ని సంబంధిత శాఖ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి వినతులు స్వీకరించారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, వృద్ధులు, దివ్యాంగులు సహా అందరి సమస్యల్ని విన్నారు. ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ■ తమకు ఇంటి పట్టాలు ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన పలువురు గ్రామస్థులు కోరారు. ■ అన్నమయ్య జిల్లా ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపుతో ఇళ్లు, పొలాలు కోల్పోయామని, నష్టపరిహారం ఇప్పించాలని కొటవూరుకు చెందిన రైతులు విజ్ఞప్తి చేశారు. ■ తెదేపా సానుభూతిపరుడనే కారణంతో తనపై గత వైకాపా ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని, వాటిని ఎత్తివేయాలని చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం గోవిందపల్లికి చెందిన జయశంకర్ కోరారు.

రెండో భాషతో గ్రహణశక్తి సామర్థ్యానికి రక్ష



మాతృభాషకు అదనంగా మరో భాషను నేర్చుకోవడం ద్వారా మన గ్రహణశక్తి సామర్థ్య క్షీణతను అడ్డుకోవచ్చు. 27 దేశాల్లో 86 వేల మందిపై నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం రూఢీ అయ్యింది. బహుభాషా పరిజ్ఞానం శరీర వార్ధక్య వేగాన్ని 30 శాతం తగ్గిస్తుంది. భిన్న భాషల వినియోగం ఓ రకమైన మానసిక వ్యాయామమే. కాబట్టి ఈ ప్రయోజనాలు పొందాలంటే మరో భాషను నేర్చుకోవడం ఇప్పుడే ప్రారంభించండి.

– ఆడం గ్రాంట్, సైకాలజిస్టు

ఎమ్మెల్సీల రాజీనామాలపై ఎట్టకేలకు విచారణ

- మొత్తం ఆరుగురు సభ్యుల రాజీనామా
- ఆమోదించట్లేదంటూ హైకోర్టుకెళ్లిన జయమంగళ వెంకటరమణ
- 4వారాల్లో నిర్ణయం తీసుకోవాలని మండలి ఛైర్మన్‌కు కోర్టు నిర్దేశం
- ఐదుగురు ఎమ్మెల్సీలను పిలిచి విచారించిన మోషేనురాజు
- తర్వాత వాయిదాకు రావాలని పోతుల సునీతకు సూచన

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్సీల రాజీనామాలపై ఎట్టకేలకు విచారణ మొదలైంది. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు సోమవారం తన కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. రాజీనామాలు చేసిన ఆరుగురిలో ఐదుగురిని విడివిడిగా పిలిచి మాట్లాడారు. మరో ఎమ్మెల్సీ పోతుల సునీత ఆలస్యంగా రావడంతో ఆమెను విచారించలేదు. తర్వాత వాయిదాకు రావాలని చెప్పారు. వైకాపా తరఫున ఎన్నికైన నలుగురు, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ కోటాలో ఎంపికైన మరో ఇద్దరు ఎమ్మెల్సీలు వారి పదవులకు రాజీనామా చేశారు. వీరిలో పోతుల సునీత, బల్లి కళ్యాణచక్రవర్తి, కర్రి పద్మశ్రీ గతేడాది ఆగస్టులో, జయమంగళ వెంకటరమణ గతేడాది నవంబరులో, మర్రి రాజశేఖర్ ఈ సంవత్సరం బడ్జెట్ సమావేశాల వేళ, శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జాకియా ఖానమ్ మే నెలలో రాజీనామా చేశారు. ఇవన్నీ పెండింగులో ఉన్నాయి. తమ రాజీనామాలను ఆమోదించాలంటూ సునీత, పద్మశ్రీ, చక్రవర్తి ఇప్పటికే పలుమార్లు ఛైర్మన్‌ను కలిసి, విజ్ఞప్తి చేశారు. ఇటీవల మండలి సమావేశాల సమయంలో సభలోనే ఆందోళనా చేశారు. తన రాజీనామాపై ఛైర్మన్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ జయమంగళ వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించారు. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ ఇటీవలే హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. సోమవారం వెంకటరమణ ఛైర్మన్‌ను కలిసినపుడు కోర్టు ఉత్తర్వులను అందజేశారు.

స్వచ్ఛందంగానే రాజీనామా చేశాం

విచారణ సందర్భంగా ఛైర్మన్ ఎమ్మెల్సీలను పలు ప్రశ్నలు అడిగారు. 'మీపై ఎవరైనా ఒత్తిడి తీసుకొచ్చి రాజీనామా చేయించారా? ప్రలోభపెట్టారా? రాజకీయ లబ్ధి కోసం రాజీనామా చేశారా? ఎందుకు చేశారు' వంటి ప్రశ్నలు అడిగారు. తమపై ఎవరూ ఒత్తిడి తీసుకురాలేదని, స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగానే రాజీనామాలు చేశామని ఎమ్మెల్సీలు జవాబిచ్చారు. నిబంధనల ప్రకారం తగిన ఫార్మాట్‌లోనే రాజీనామాలను సమర్పించామని చెప్పారు. వాటిని ఆమోదించాలని ఛైర్మన్‌ను కోరారు.

- విచారణ తర్వాత మళ్లీ ఛైర్మన్‌ను కలిసిన డిప్యూటీ ఛైర్‌పర్సన్ జాకియా ఖానమ్.. రాజీనామాను వెనక్కి తీసుకుంటానని చెప్పినట్లు తెలిసింది. ఆమెకు వచ్చే ఏడాది జులై వరకు ఎమ్మెల్సీగా పదవీకాలం ఉంది. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాక ఆమె భాజపాలో చేరారు.

హైకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరా: వెంకటరమణ

'నా రాజీనామాపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఆ మేరకు రాజీనామాను ఆమోదించాలని ఛైర్మన్‌ను కోరాను. వైకాపా బీఫాంపై ఎమ్మెల్సీ అయిన నేను ఆ పదవికి రాజీనామా చేశాకే జనసేనలో చేరానని చెప్పాను. వారి పార్టీలోకి రమ్మని ప్రలోభపెట్టారా? ఇప్పుడు ఈ రాజీనామాను ఆమోదిస్తే ఇదే ఎమ్మెల్సీ పదవిని మళ్లీ ఇస్తామన్నారా అని ఛైర్మన్ అడిగారు. ఎమ్మెల్సీ ఇస్తారో, మంత్రి పదవి ఇస్తారో అది తర్వాత సంగతి. నన్నెవరూ ప్రలోభపెట్టలేదు, నా రాజీనామాను ఆమోదించండని ఛైర్మన్‌ను కోరా' అని జయమంగళ వెంకటరమణ విలేకర్లతో చెప్పారు. జనసేన నుంచి ఎమ్మెల్సీ ఇస్తే తీసుకుంటారా అని విలేకరులు అడగ్గా.. 'అవన్నీ పార్టీ విధి విధానాలు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పే కాలజ్ఞానం నాకు తెలియదు' అని సమాధానమిచ్చారు.

వైకాపాలో చాకిరీ చేయించుకుని తొక్కేశారు

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

ఈనాడు, అమరావతి: 'వైకాపాలో నాకు జరిగినంత అన్యాయం రాష్ట్రంలో ఇంకెవరికీ జరిగి ఉండదు' అని ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన మర్రి రాజశేఖర్ వ్యాఖ్యానించారు. రాజీనామాపై శాసనమండలి ఛైర్మన్ వద్ద సోమవారం విచారణ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'చిలకలూరిపేటలో నా చాకిరీ వల్లే వైకాపా నిలబడింది. నేను, నా మనుషులు జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచీ చిత్తశుద్ధితో పని చేస్తే.. అక్కడ మమ్మల్నే తొక్కేశారు. కొత్తగా వచ్చినవారిని బలోపేతం చేయాలని ప్రయత్నించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే నాకు వైకాపా ఎమ్మెల్సీ పదవినిచ్చింది. కానీ, ఏ మాత్రం గౌరవం లేని ఆ పార్టీలో ఉండటం సరి కాదనే బయటకొచ్చాం. ఆ పార్టీ బీఫాంపై వచ్చిన ఎమ్మెల్సీ పదవి కూడా వద్దనే రాజీనామా చేశా. దాన్ని ఆమోదించాలని ఛైర్మన్‌ను కోరా' అని చెప్పారు. వైకాపా కంటే తెదేపాలో ప్రజాస్వామ్యం ఉందా అని ఒక విలేకరి అడగ్గా.. 'వైకాపా కంటే తెదేపానే నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పార్టీ' అని రాజశేఖర్ సమాధానమిచ్చారు.

మళ్లీ విధుల్లోకి ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాశ్

గత ప్రభుత్వ హయాంలో బకాయిలు అడిగినందుకు డిస్మిస్



ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాశ్

అనంతపురం (నేరవార్తలు), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో పోలీసులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాశ్ ప్లకార్డు పట్టుకుని నిరసన తెలపడంతో డిస్మిస్ అయ్యారు. డిమాండ్లను అడిగినందువల్లే అప్పటి సర్కారు డిస్మిస్ చేసిందని భావించిన కూటమి ప్రభుత్వం ఆ ఉత్తర్వులను రద్దు చేసి, తిరిగి విధుల్లోకి చేరడానికి వీలుగా ఆదేశాలు జారీ చేసింది. కానిస్టేబుల్ ప్రకాశ్ సోమవారం అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ వద్ద రిపోర్ట్ చేశారు. డిస్మిస్ అయిన మూడేళ్ల మూడు నెలల కాలాన్ని 'విధుల్లో లేనట్లు' పరిగణించి, తిరిగి చేరడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2022 జూన్ 14న అప్పటి ముఖ్యమంత్రి జగన్ శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంలో కానిస్టేబుల్ ప్రకాశ్ అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో 'సేవ్ ఏపీ పోలీస్' నినాదంతో నిరసన తెలిపారు. దాన్ని అప్పటి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. గతంలో సదరు కానిస్టేబుల్ ఎదుర్కొన్న ఓ కేసుపై విచారణ వేసి, నేరం రుజువైనట్లుగా పేర్కొంటూ అప్పటి ఎస్పీ ఫక్కీరప్ప 2022 ఆగస్టు 25న ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు. దీనిపై బాధిత కానిస్టేబుల్ పోరాటం చేసినా ఉపయోగం లేకుండా పోయింది. దీనిపై అప్పట్లో చంద్రబాబు సహా తెదేపా నాయకులు స్పందించారు.

చిత్రహింసలు ఎదుర్కొన్నా: కానిస్టేబుల్ ప్రకాశ్

'గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పోలీసులకు రావాల్సిన బకాయిలు రూ.23 వేల కోట్లు ఉండేది. వాటిని చెల్లించాలని అడిగిన కారణంగానే నన్ను, నా కుటుంబాన్ని చిత్రహింసలకు గురిచేశారు. గత ప్రభుత్వం నాపై అనేక కేసులు బనాయించి, విధుల నుంచి డిస్మిస్ చేసింది. నాకు సంబంధం లేని కేసులో 52 రోజులు జైలుకు పంపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నా బాధను ఆలకించి ఉద్యోగాన్ని తిరిగి ఇప్పించారు. ఇందుకు మంద కృష్ణ మాదిగ సహకరించారు. వారందరికీ కృతజ్ఞతలు'.

సునీల్ కుమార్‌ను సర్వీసు నుంచి తొలగించండి

కేంద్రానికి ఉప సభాపతి రఘురామ లేఖ



ఈనాడు, అమరావతి: అఖిల భారత సర్వీస్ ప్రవర్తన నియమాలను ఉల్లంఘిస్తూ.. రాజకీయ సమావేశాల్లో బహిరంగంగా పాల్గొంటూ కుల ఆధారిత రాజకీయ సమీకరణలకు పిలుపునిచ్చిన ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సర్వీసు నుంచి తొలగించాలని ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర డీఓపీటీ శాఖ కార్యదర్శికి సోమవారం ఆయన లేఖ రాశారు. సునీల్ కుమార్ ఒక రాజకీయ సమావేశంలో పాల్గొన్నారని, అందులో 'రాజకీయ లబ్ధి కోసం దళితులు, కాపులు ఏకమవ్వాలి.. కాపు నాయకుడిని ముఖ్యమంత్రిగా, దళిత నాయకుడిని ఉప ముఖ్యమంత్రిని చేయాలి' అని వ్యాఖ్యలు చేశారని రఘురామ తన లేఖలో పేర్కొన్నారు. అధికారి సస్పెన్షన్‌లో ఉన్నప్పటికీ ప్రవర్తనా నియమావళికి లోబడే వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

హిందూ వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నారు

'సునీల్ కుమార్ అంబేడ్కర్స్ ఇండియా మిషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా హిందూ వ్యతిరేక ప్రచారానికి ఒడిగడుతున్నారు.. బలహీన వర్గాల మధ్య వైరాన్ని, వేర్పాటువాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారు. ఆయన తీరుపై గతంలో నేను ఎంపీగా ఉన్నపుడు కేంద్రానికి లేఖ రాస్తే.. విచారణ జరిపించాలని నాడు రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వానికి పంపింది. కానీ, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు' అని పేర్కొన్నారు. పరిస్థితి తీవ్రత, సున్నితత్వంతో పాటు.. 'నేను సమర్పించిన ఆధారాలను పరిశీలించండి.. వాటి ఆధారంగా సునీల్ కుమార్‌పై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి, అవసరమైతే సర్వీసు నుంచి తొలగించాలి' అని ఉప సభాపతి కోరారు.

మీ కాపు నాయకుణ్ని ముఖ్యమంత్రిని చేసుకోండి

- మా దళిత నేతల్లో ఒకరిని ఉప ముఖ్యమంత్రి చేయండి
- నాకు టికెట్ ఇచ్చినా దళితవాడ కోసం వదులుకున్నా..
- ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు
- అఖిల భారత సర్వీసు అధికారిగా ఉంటూ రాజకీయ నాయకుడి తరహాలో ప్రకటనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పదే పదే విదేశీ పర్యటనలకు వెళ్లారనే అభియోగాలపై సస్పెన్షన్‌కు గురైన, శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజును వైకాపా హయాంలో సీఐడీ కస్టడీలో అంతమొందించేందుకు యత్నించారనే కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ రాజకీయపరమైన వివాదాస్పద వ్యాఖ్యలు, ప్రకటనలతో మరోసారి వార్తల్లోకి ఎక్కారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గాంధీ గ్రామంలో ఆదివారం జరిగిన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



సభలో ఆయన చేసిన రాజకీయ వ్యాఖ్యలు అఖిల భారత సర్వీసుల (ప్రవర్తన) నియమావళి ఉల్లంఘనేనని విశ్రాంత ఐఏఎస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మీరు ముందుకెళ్లండి.. మీతో పాటు మేమూ ముందుకొస్తాం..

'మీ కాపు నాయకుణ్ని మీరు ముఖ్యమంత్రిని చేసుకోండి. మా దళిత నాయకుణ్ని ఉప ముఖ్యమంత్రిని చేయండి. మా హర్షకుమార్, మా విజయ్‌కుమార్, మా జడ శ్రవణ్‌కుమార్‌లలో ఒకరిని ఉప ముఖ్యమంత్రిని చేయండి. రెండేళ్లలో దిగిపోయే ఉప ముఖ్యమంత్రి కాదు.. ఐదేళ్లు ఉండే పదవి కావాలి' అని సునీల్ పేర్కొన్నారు. "రాష్ట్రంలో ప్రధానమైన, అత్యధిక జనాభా ఉన్న, అధికారం కోసం ప్రయత్నిస్తున్న, అందులో చాలా వరకూ విజయం సాధించిన కులం కాపు సామాజికవర్గం. వారూ మనలో కలిస్తే మన బలం రెట్టింపవుతుంది. మన డిమాండ్‌కు సహకరించాలని కాపు సోదరులను కోరండి. అందర్నీ కలుపుకొని పోయి.. అందరికీ మన ఎజెండా ఏంటో తెలియజేయండి. మీరు దళితవాడ పంచాయతీకి మద్దతుగా నిలిస్తే మేము మీకు మద్దతిస్తామని వారితో చెప్పండి' అని పేర్కొన్నారు. ఆయన ప్రసంగ వీడియో సోమవారం వెలుగులోకి వచ్చింది.

- 'నాకు ఎన్నికల్లో టికెట్ ఇస్తే కూడా వద్దని చెప్పి దళితవాడను పంచాయతీగా చేయాలని అడిగాను. నేను టికెట్ వదులుకుంటేనే చేస్తామనే హామీ లభించింది' అని సునీల్ కుమార్ చెప్పారు.

అఖిల భారత సర్వీసు అధికారులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనటం నిషేధం..

సర్వీసు నియమావళి ప్రకారం అఖిల భారత సర్వీసు అధికారులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనటం నిషేధం. వారు ఏ పార్టీలోనూ సభ్యుడిగా ఉండరాదు. రాజకీయాల్లో పాల్గొనే ఏ పార్టీతోనూ, సంస్థతోనూ సంబంధం, అనుబంధం పెట్టుకోకూడదు. రాజకీయ ఉద్యమాల్లో, కార్యకలాపాల్లో పాల్గొనకూడదు. ఆర్థికంగా మద్దతివ్వకూడదు. రాజకీయ తటస్థత కలిగి ఉండాలి. నైతికత పాటించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, చర్యలను విమర్శించేలా బహిరంగ ప్రకటనలు చేయకూడదు. 'అయితే సునీల్ కుమార్ వ్యాఖ్యలను విశ్లేషిస్తే నియమావళి ఉల్లంఘించారనేది స్పష్టమవుతోంది. ఇది దుష్ప్రవర్తన కిందకే వస్తుంది. అఖిల భారత సర్వీసుల (క్రమశిక్షణ, అప్పీలు) నియమావళి-1969 ప్రకారం ఆయనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు' అని ఓ విశ్రాంత ఐఏఎస్ అధికారి పేర్కొన్నారు.

13 నెలల తర్వాత విధుల్లోకి..

వైకాపాతో అంటకాగిన గనుల శాఖ అధికారులకు త్వరలో పోస్టింగులు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలతో అంటకాగిన అధికారులను 13 నెలల తర్వాత విధుల్లోకి తీసుకున్నారు. వైకాపా నేతలు చెప్పినట్లు వ్యవహరించారనే ఆరోపణల కారణంగా ఇద్దరు ఉప సంచాలకులు, నలుగురు సహాయ సంచాలకులు, ఇద్దరు మినరల్ రెవెన్యూ అధికారులు, ఓ సూపరింటెండెంట్‌లను గతేడాది అక్టోబరు చివర్లో సెలవుపై పంపారు. అప్పటి నుంచి వీరు సెలవులోనే ఉన్నారు. పదేపదే విజ్ఞప్తులు చేసుకోవడంతో.. మూడు రోజుల కిందట వారిని విధుల్లోకి తీసుకున్నారు. డీడీలు జగన్నాథరావు, నర్సింహారెడ్డి, ఏడీలు రవిప్రసాద్, నాగయ్య, అమీర్‌బాషా, సాయిరామ్‌సింగ్‌లు గనుల శాఖ సంచాలకుని కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. వీరికి పోస్టింగ్‌ల కోసం దస్త్రాన్ని ప్రభుత్వానికి పంపారు. ఒకటి, రెండు రోజుల్లో వీరికి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు. మినరల్ రెవెన్యూ అధికారులు ఉమామహేశ్వరరావు, రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ గౌస్‌లు.. సెలవులకు ముందు ఏ విధుల్లో ఉండేవారో అక్కడే తిరిగి చేరారు.

ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య

భర్త వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ



మాధురి సాహితీ వివాహం నాటి చిత్రం



ఎయిమ్స్ శవాగారం వద్ద చిన్నరాముడు

తాడేపల్లి, న్యూస్‌టుడే: పెళ్లైన కొద్ది నెలలకే ఓ ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నివాసం ఉంటున్న సీనియర్ ఐఏఎస్ చిన్నరాముడు కుమార్తె మాధురి సాహితీబాయి(27) ఆదివారం రాత్రి తన గదిలోని బాత్‌రూమ్‌లో ఉరివేసుకుంది. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం బుగ్గనపల్లి తండాకు చెందిన రాజేష్‌నాయుడిని 2025 మార్చిలో ఆమె ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. వివాహమైన మూడో నెల నుంచి భర్త తనను వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులకు ఆమె తెలియజేయగా, కుమార్తెను అక్కడి పోలీసుల సహకారంతో రెండు నెలల కిందట తాడేపల్లిలోని నివాసానికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఆమె పుట్టింటిలోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆదివారం బలవన్మరణానికి పాల్పడింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. తల్లి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధించాడు: చిన్నరాముడు

చిన్నరాముడు మీడియాతో మాట్లాడుతూ.. "ఉద్యోగం ఉందని మోసం చేసి మా కుమార్తెను రాజేష్‌నాయుడు మహానందిలో రిజిస్టర్ మ్యారేజీ చేసుకున్నాడు. పెద్దల సమక్షంలో మళ్లీ పెళ్లి చేస్తామని చెప్పి అతడితో మా కుమార్తెను పంపాం. ఈ క్రమంలో ఆమెను అదనపు కట్నం తెమ్మంటూ రాజేష్ వేధింపులకు గురి చేశాడు. నీకు తానే దిక్కు, చంపేస్తానని బెదిరించేవాడు. కనీసం మాకు ఫోన్ చేయాలన్నా భర్త అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడ ఉండలేనని కుమార్తె చెప్పడంతో రెండు నెలల కిందట ఇంటికి తీసుకొచ్చాం. వచ్చిన నాటి నుంచి తన భర్తది నిజమైన ప్రేమ కాదని, అందుకే తీసుకెళ్లేందుకు రావడం లేదని కుమార్తె బాధపడుతూ ఉండేది. మాకు ఇలా దూరమవుతుందని అనుకోలేదు" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

వచ్చే ఎన్నికల నాటికి రాజకీయాల నుంచి రిటైరవుతా

ఎంపీ మాగుంట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'రానున్న రోజుల్లో రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్ తీసుకుంటా. నా తనయుడు మాగుంట రాఘవరెడ్డి పోటీ చేస్తాడు' అని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లానని చెప్పారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో సోమవారం జరిగిన మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి సభలో ఎంపీ మాగుంట ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యక్ష రాజకీయాల్లో లేకున్నా ప్రజాసేవలో నిమగ్నమై ఉంటానని చెప్పారు.

కృష్ణా బోర్డు ఛైర్మన్‌గా ఎస్.బిశ్వాస్

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా బోర్డు ఛైర్మన్‌గా ఎస్.బిశ్వాస్‌ను నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జల సంఘం ఛైర్మన్‌గా అనుపమ్ ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ రెండు పోస్టుల్లో ఛైర్మన్‌గా అతుల్ జైన్ విధులు నిర్వహిస్తుండగా ఆదివారం ఆయన పదవీ విరమణ చేశారు. దీంతో ఖాళీలను కేంద్రం భర్తీ చేసింది.

పదో తరగతి విద్యార్థుల మార్కుల ఆధారంగా ఉపాధ్యాయులకు గ్రేడ్లు

ఈనాడు, అమరావతి: పదో తరగతి విద్యార్థుల సరాసరి మార్కుల ఆధారంగా సబ్జెక్టు టీచర్లకు గ్రేడ్లు ఇవ్వనున్నట్లు పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల అవార్డులకు సైతం దీన్ని ప్రాతిపదికగా తీసుకోనున్నారు. పదో తరగతి పరీక్షలపై జిల్లా అధికారులతో ఉన్నతాధికారులు సోమవారం ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్ డ్యూటీలను రాష్ట్రస్థాయి నుంచే పంపనున్నారు. జవాబు పత్రాల మూల్యాంకనానికి సైతం రాష్ట్రస్థాయి కార్యాలయం నుంచే ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. ఒక్కో విద్యార్థి సమాధానపత్రాన్ని మూల్యాంకనం చేసేందుకు కనీసం 12 నుంచి 15 నిమిషాలు కేటాయించాల్సి ఉంటుంది. ఈ నెల 15 తర్వాత పదో తరగతి విద్యార్థులెవ్వరినీ ఇతర కార్యకలాపాలకు వినియోగించకూడదు. ప్రతిరోజూ వారికి పరీక్ష నిర్వహించి, మార్కులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలి. ప్రతిరోజూ నిర్వహించే స్లిప్‌టెస్ట్ సమాధానపత్రాలను పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రధానోపాధ్యాయులు భద్రపరచాలి. విద్యార్థులను దత్తత తీసుకునే విధంగా రాష్ట్రస్థాయి నుంచే సూచనలు చేస్తారు. మరోవైపు 1-5 తరగతుల వారికి నిర్వహించే ఎఫ్ఎల్ఎన్ సర్వేను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

మా గూడూరును మాకిచ్చేయండి..

- నెల్లూరు జిల్లా ప్రజల ఆందోళన
- చంద్రబాబు, లోకేశ్ హామీ అమలు చేయలేదని ఆవేదన
- 'సేవ్ రాపూరు.. సేవ్ పెంచలకోన' నినాదంతో ప్రచారం

ఈనాడు, నెల్లూరు: జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల సరిహద్దుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన మార్పుచేర్పుల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని నెల్లూరు జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో భాగమైన.. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలుపుతూ గత వైకాపా ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దుతుందని కొండంత ఆశలు పెట్టుకున్న అక్కడి ప్రజలకు నిరాశే ఎదురైంది. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని.. ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపకపోగా, వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో ఉండగా, వాటిని కూడా తిరుపతి జిల్లాలో కలపడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

110 కిలోమీటర్లు ప్రయాణించాలి


నియోజకవర్గ కేంద్రం గూడూరు నుంచి నెల్లూరు 42 కి.మీ. దూరంలో ఉంటే, తిరుపతి 97.5 కి.మీ. దూరంలో ఉంది. నియోజకవర్గంలోని కోట నుంచి తిరుపతి ఏకంగా 107 కి.మీ. దూరం. 2022 ఏప్రిల్‌లో వైకాపా ప్రభుత్వం గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లా నుంచి వేరు చేసి, తిరుపతి జిల్లాలో కలిపింది. ఈ ప్రాంతాల నుంచి తిరుపతి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 100 నుంచి 110 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రయాణ సమయం, రవాణా ఖర్చు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లోనే ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. 2023 జూన్‌లో కోటలో యువగళం బహిరంగ సభలో లోకేశ్, 2024 ఏప్రిల్ 20న గూడూరులో మహిళా సదస్సులో చంద్రబాబు గూడూరు నియోజకవర్గాన్ని మళ్లీ నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. అది నెరవేరకపోవడంతో అక్కడి ప్రజలు మళ్లీ ఆందోళనబాట పట్టారు. సామాజిక మాధ్యమాల్లోనూ పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తున్నారు.

సాగునీటి సమస్యలు తలెత్తుతాయని ఆందోళన

- ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాలు నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్నాయి. ఇప్పుడు రాపూరును తిరుపతి జిల్లాలో కలపడంతో కండలేరు జలాశయం ఆ జిల్లా పరిధిలోకి వెళుతుంది.
- ఇప్పుడు రాపూరు మండలాన్ని తిరుపతిలో కలపడం వల్ల నెల్లూరు జిల్లాలోని నీటి యాజమాన్య హక్కులున్న గ్రామాలకు నీటిని విడుదల చేయాలంటే తిరుపతి జిల్లా అధికారులను అడగాల్సి వస్తుందని, రెండు జిల్లాల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు తిరుపతి జిల్లాలోని ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డులో సభ్యులు కాకపోవడంతో ఇక్కడి రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు.
- ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన రాపూరు మండలంలో ఉంది. రాపూరు మండలాల్ని తిరుపతి జిల్లాలో కలపడంతో పెంచలకోనను కోల్పోతామని నెల్లూరు ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 'సేవ్ రాపూరు-సేవ్ పెంచలకోన' పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు.

పెద్దహరివాణం మండలంలో కలపొద్దు

- ఆదోని పట్టణంలో విలీన గ్రామాల ప్రజల నిరసన



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన పెద్దహరివాణం మండల విలీన గ్రామాల ప్రజలు

ఆదోని(ఎస్కేడీ కాలనీ)/గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని 17 గ్రామాలను పెద్దహరివాణం మండలంలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆదోని పట్టణంలో పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆదోని నియోజకవర్గంలో ఇటీవల కొత్తగా పెద్దహరివాణం మండల కేంద్రంగా ప్రకటిస్తూ ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. దీని ప్రకారం.. ఆదోని మండలంలోని 17 గ్రామాలను పెద్దహరివాణం మండలంలో విలీనం చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సుమారు 16 గ్రామాల ప్రజలు కన్నెర్రజేశారు. తమ గ్రామాలను పెద్దహరివాణం మండలంలో కలపొద్దంటూ సోమవారం ఆదోనిలో పెద్దఎత్తున ప్రదర్శన చేశారు. అనంతరం పట్టణంలోని కోట్ల కూడలిలో బైఠాయించడంతో సుమారు గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తరువాత ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి, ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. ఆదోని మండలానికి ఐదారు కి.మీ. దూరంలో ఉన్న గ్రామాలను కూడా 35 కి.మీ. దూరంలో ఉన్న పెద్దహరివాణం మండలంలో కలపడం తగదని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. మరోవైపు ఆదోని మండలం పెద్ద తుంబళం గ్రామాన్ని మండల కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టర్ కార్యాలయం ఎదుట మరికొందరు ఆందోళన చేశారు.

అదుపులో ఉండాలని అడుగులు వేయించారు



రౌడీషీటర్లను నడిపిస్తున్న పోలీసులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరులోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో క్రియాశీలకంగా ఉన్న 45 మంది రౌడీషీటర్లకు పోలీసులు వినూత్నంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం వీఆర్సీ సెంటరు నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు రోడ్డుపై నడిపించారు. చెప్పులు లేకుండా ఒంటి కాలిపై నిలబెట్టారు. నేర కార్యకలాపాల్లో పాల్గొనబోమని, సత్ప్రవర్తనతో నడుచుకుంటామని ప్రమాణం చేయించారు. అనంతరం వారిని అండర్‌టేకింగ్ తీసుకున్నారు.

రాజ్‌భవన్.. ఇకపై లోక్‌భవన్!

కేంద్ర హోం శాఖ సూచనతో ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పేరు మార్పు

తిరువనంతపురం, ఈనాడు, దిల్లీ: వలసవాద వాసనలను తుడిచిపెట్టేందుకు.. రాజ్‌భవన్, రాజ్ నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాసిన లేఖకు అనుగుణంగా చాలా రాష్ట్రాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చారు. ఇప్పుడు ఆ జాబితాలో ఒడిశా చేరింది. ఒడిశా రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్పుచేసినట్లు ఆ రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు సోమవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. "ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచనల స్ఫూర్తి, కేంద్ర హోంమంత్రిత్వశాఖ మార్గదర్శకత్వంతో చేసిన ఈ మార్పు పారదర్శకత, ప్రజలతో బలమైన అనుబంధం పట్ల మాకున్న నిబద్ధతను చాటి చెబుతోంది. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలన్న మా సంకల్పాన్ని తెలియజేస్తోంది. ఈ మార్పునకు మార్గదర్శిగా నిలవడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నా" అని పేర్కొన్నారు. కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ దీనిపై స్పందిస్తూ.. 'గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల అధికారిక నివాసాలైన రాజ్‌భవన్, రాజ్‌నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్పు చేయడం.. వలసవాద ఆలోచనలను విడిచిపెట్టి ప్రజాస్వామ్యానికి పట్టం కట్టడంలో గొప్ప మైలురాయిగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు.



ప్రయోజనాల గని మునగ

శరీరానికి అత్యంత ఆవశ్యకమైన తొమ్మిది రకాల అమినో యాసిడ్లు మునగాకులో ఉంటాయని మీకు తెలుసా? అంతేకాకుండా ఏ, సీ, ఈ విటమిన్లు కూడా ఉంటాయి. మునగాకు మన రోగనిరోధక శక్తిని, చర్మ, మెదడు ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుంది. రోజూ కొద్దిపాటి మునగాకు పొడిని మీ ఆహారంలో భాగం చేసుకుంటే మీ దీర్ఘకాల ఆరోగ్యానికి అది భరోసానిస్తుంది.

– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

విశ్రాంత కెప్టెన్ వైఎన్ రెడ్డి మృతి



నరసింహారెడ్డి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం గోరిజవోలుగుంటపాలేనికి చెందిన ఆర్మీ విశ్రాంత కెప్టెన్ వై.నరసింహారెడ్డి (88) సోమవారం తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన 1965, 1971లలో జరిగిన భారత్- పాకిస్థాన్ యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆయన సేవలకు అప్పటి ప్రభుత్వం నుంచి సమర సేవా మెడల్ (1965), సంగ్రామ్ మెడల్ (1965), లాంగ్ సర్వీస్ మెడళ్లు అందుకున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. 1984లో జరిగిన 'ఆపరేషన్ బ్లూ స్టార్'లోనూ నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఆయన భౌతికకాయానికి పలువురు గ్రామస్థులు, ప్రముఖులు నివాళులర్పించారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

EENADU Vol: 52, Issue: 112 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఐఐటీ- హైదరాబాద్‌లో గ్రాన్యూల్స్ సీవోఈ కేంద్రాలు

ఈనాడు, హైదరాబాద్: గ్రాన్యూల్స్ ఇండియా, ఐఐటీ- హైదరాబాద్‌లోని టెక్నాలజీ రీసెర్చ్ పార్క్‌లో రెండు అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) కేంద్రాలను ప్రారంభించింది. ఇందులో ఒకటి 'ఎక్సలెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫెర్మెంటేషన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్' కాగా, 'గ్రాన్యూల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పార్టికల్ ఇంజినీరింగ్' రెండోది. ఈ కేంద్రాల ప్రారంభోత్సవంలో గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమ చిగురుపాటి, ఐఐటీ- హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి పాల్గొన్నారు. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వల్ల పెప్టైడ్, ఆధునాతన పదార్థ విజ్ఞానశాస్త్రంలో నైపుణ్యాలను పెంపొందించే అవకాశం కలుగుతుందని అన్నారు. సీడీఎంఓ విభాగంలో విస్తరించాలని భావిస్తున్నామని, తద్వారా ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందించగలుగుతామని వివరించారు.

సెల్‌ఫోన్లలో సంచార్‌సాథీ యాప్ తప్పనిసరి

మోసాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్ ఇకపై సెల్‌ఫోన్లలో తప్పనిసరిగా ఉండనుంది. దేశీయంగా తయారు చేసే/ దిగుమతి చేసుకునే సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయాలని తయారీదార్లు, దిగుమతిదార్లను టెలికాం విభాగం ఆదేశించింది. నవంబరు 28 తేదీతో విడుదలైన ఈ ఆదేశాల ప్రకారం.. 90 రోజుల్లో ఈ ఆదేశాలు అమలు కావాల్సి ఉంది. ఫోన్‌లో సంచార్‌సాథీ యాప్ ప్రీఇన్‌స్టాల్ అయి ఉండాలి. ఫోన్ వాడకాన్ని ప్రారంభించినప్పటి నుంచి, ఈ యాప్ పని చేయాలి. ఫోన్ నుంచి ఈ యాప్‌ను తొలగించే వీలుండకూడదు. ఇప్పటికే దేశీయంగా తయారైన/దిగుమతి చేసుకున్న ఫోన్లలోనూ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునేలా చూడాలని నిర్దేశించింది. ఈ విషయంలో తీసుకున్న చర్యలను వివరిస్తూ తయారీదార్లు/దిగుమతిదార్లు 120 రోజుల్లోగా టెలికాం విభాగానికి సమాచారం ఇవ్వాలి.

✦ ప్రతి మొబైల్‌కు ప్రత్యేకంగా ఉండే 15 అంకెల ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ నంబర్ (ఐఎంఈఐ) దుర్వినియోగాన్ని నివారించేందుకు, వినియోగదారులు ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఈ నంబరును ట్యాంపరింగ్ చేస్తే మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా.. రెండూ విధించేలా టెలికమ్యూనికేషన్ల చట్టం 2023ను రూపొందించారు. మోసపూరిత కాల్స్ పైనా, సెల్‌ఫోన్ అపహరణ పైనా సంచార్‌సాథీ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

✦ వాట్సప్, సిగ్నల్, టెలిగ్రాం వంటి సామాజిక మాధ్యమ యాప్‌లను, సంబంధిత సిమ్ కలిగిన ఫోన్‌లో మాత్రమే వినియోగించేలా చూడాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించిన సంగతి విదితమే.

పీఎస్‌బీలు నాలుగే ఉంటాయా?



మలివిడత విలీన ప్రక్రియ సన్నాహాల్లో ప్రభుత్వం

ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల మలివిడత విలీన ప్రక్రియకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పీఎస్‌బీల సంఖ్యను ప్రస్తుతమున్న 12 నుంచి నాలుగుకి తగ్గించడం ద్వారా, పెద్ద బ్యాంకులుగా మార్చే ప్రయత్నాలను ప్రభుత్వం మొదలుపెట్టిందని ఈ పరిణామాన్ని గమనిస్తున్న వర్గాలు తెలిపాయి. ఇకపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), కెనరా బ్యాంక్- యూనియన్ బ్యాంక్‌లు మాత్రమే ఉంటాయని.. మిగతా బ్యాంకులను వీటిలో విలీనం చేయాలని ప్రభుత్వం అనుకుంటోందని సంబంధిత వర్గాలు తెలిపినట్లు ఆంగ్ల పత్రికలు వెల్లడించాయి.

కెనరా బ్యాంక్.. యూనియన్ బ్యాంక్ ఒక్కటిగా

కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లను విలీనం చేసే అవకాశం ఉంది. వీటి కిందకే ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్‌లనూ తీసుకొచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. తద్వారా అవతరించే పెద్ద బ్యాంకుతో పాటు ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీలను మాత్రమే మున్ముందు కొనసాగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు వివరించాయి.

● ఇతర మధ్య తరహా పీఎస్‌బీలు- ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలను ఎస్‌బీఐ, పీఎన్‌బీ లేదా బీఓబీలో విలీనం చేసే అవకాశం ఉందని తెలిపాయి. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌పై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నాయి. మిగతా బ్యాంకుల విలీన ప్రతిపాదనలు ఒక కొలిక్కి వచ్చాక.. దీనిని కూడా పై నాలుగింటిలో ఏదోక దానిలో కలిపే అవకాశం ఉంది.

ఆర్థిక మంత్రి అనుమతితో ముందుకు..

పీఎస్‌బీల విలీన ప్రతిపాదన ఖరారయ్యాక.. ఆర్థిక మంత్రి ఆమోదం కోసం పంపిస్తారు. అక్కడ అనుమతి లభించాక.. కేబినెట్ సెక్రటేరియట్‌లోని ఉన్నతాధికారుల అభిప్రాయాలను తీసుకుంటారు. ఆ తర్వాత ప్రధాని కార్యాలయం, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పరిశీలనకు పంపిస్తారు.

● అన్ని అనుమతులు లభ్యమైతే 2026-27లో రెండో విడత పీఎస్‌బీల విలీన ప్రక్రియ చోటుచేసుకునే అవకాశం ఉంది.

● మొదటి విడత విలీన ప్రక్రియలో భాగంగా 2017-20 మధ్య పీఎస్‌బీల సంఖ్యను 27 నుంచి 12కు తగ్గించిన సంగతి తెలిసిందే.

ఇవీ లక్ష్యాలు

బ్యాలెన్స్ షీట్ల బలోపేతం, కార్యకలాపాల సామర్థ్యం మెరుగుపర్చడం, అంతర్జాతీయంగా పోటీ సామర్థ్యాన్ని పెంచే లక్ష్యాలతో బ్యాంకుల విలీన ప్రతిపాదనను ఆర్థిక శాఖ రూపొందించినట్లు తెలుస్తోంది. 'తొలుత చిన్న బ్యాంకులను పెద్ద బ్యాంకుల్లో విలీనం చేస్తారు. ఆ తర్వాత వీటిల్లోనూ కొన్నింటిని మళ్లీ విలీనం చేసి మరింత పెద్ద బ్యాంకులుగా మారుస్తార'ని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి.

ఇప్పటికైతే విలీన ప్రతిపాదన లేదు: మంత్రి పంకజ్ చౌధ్రీ

పీఎస్‌బీల విలీనం/ఏకీకరణకు సంబంధించి ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రతిపాదనా లేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ తెలిపారు. విదేశీ మారకపు నిర్వహణ నిబంధనలు- 2019 ప్రకారం.. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితి పీఎస్‌బీల్లో 20%, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో 74 శాతమని ఆయన వెల్లడించారు. ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన కేంద్ర మంత్రివర్గం అనుమతులకు అనుగుణంగానే ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా విక్రయ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 6% వాటా విక్రయం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం)లో 6% వాటాను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో ప్రభుత్వం ఈనెల 2 నుంచి విక్రయించనుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం.. ఈ వాటా విక్రయంతో ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2,600 కోట్లు సమకూరే అవకాశం ఉంది. 'నాన్ రిటెయిల్ మదుపర్లకు ఆఫర్ ఫర్ సేల్ మంగళవారం ప్రారంభం కానుంది. రిటెయిల్ మదుపర్లు బుధవారం బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. బ్యాంక్‌లో 5% వాటాను ప్రభుత్వం ఆఫర్ చేస్తోంది. మరో 1% వాటాను గ్రీన్ షూ ఆప్షన్‌గా ఉంచాం' అని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపం) కార్యదర్శి అరుణిష్ చావ్లా పేర్కొన్నారు.

సాయి పేరెంటరల్స్ చేతికి ఆస్ట్రేలియా కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ సంస్థ సాయి పేరెంటరల్స్ లిమిటెడ్, ఆస్ట్రేలియాలో అడిలైట్ కేంద్రంగా పనిచేస్తున్న నొమెడ్ ఫార్మాస్యూటికల్స్‌లో 74.5% వాటాను రూ.125 కోట్లతో కొనుగోలు చేసింది. నొమెడ్ ఫార్మా దాదాపు 60 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్ల (సుమారు రూ.354 కోట్ల) వార్షికాదాయం ఆర్జిస్తోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఫార్మాస్టోర్లకు ప్రైవేట్ లేబుల్ ఔషధాలను ఈ సంస్థ సరఫరా చేస్తోంది. ఈ సంస్థ దాదాపు 53 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్ల (సుమారు రూ.313 కోట్ల) పెట్టుబడితో అడిలైట్‌లో నిర్మిస్తున్న కొత్త యూనిట్ 2026 డిసెంబరుకు సిద్ధం అవుతోంది. ఈ కంపెనీని కొనుగోలు చేయడం వల్ల ఫార్ములేషన్లు, సీడీఎంఓ సేవల్లో విస్తరించగలమని సాయి పేరెంటరల్స్ ఎండీ కె.అనిల్ కుమార్ అన్నారు. నొమెడ్ ఫార్మా వద్ద 41 ఔషధాల డోసియర్లు ఉన్నందున, సెమీ-రెగ్యులేటెడ్, రెగ్యులేటెడ్ మార్కెట్లలో విస్తరించే వీలుందన్నారు.

హైదరాబాద్‌లో రూ.4,150 కోట్ల ప్రాజెక్టు

అభివృద్ధి చేయనున్న గోద్రేజ్ ప్రాపర్టీస్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో విలాసవంత గృహ నిర్మాణ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు గోద్రేజ్ ప్రాపర్టీస్ వెల్లడించింది. ఇటీవలే కోకాపేట నియోపొలిస్‌లో ఈ సంస్థ ఎకరా రూ.147.75 కోట్ల చొప్పున 5.03 ఎకరాలను మొత్తం రూ.743 కోట్లకు హెచ్‌ఎండీఏ నిర్వహించిన ఇ-వేలంలో సొంతం చేసుకుంది. ఈ భూమిలోనే 25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విలాసవంత నివాస గృహ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని సంస్థ బీఎస్ఈకి తెలిపింది. దీని ద్వారా రూ.4,150 కోట్ల ఆదాయం సాధించే అవకాశం ఉందని పేర్కొంది.

మీడియా-వినోద రంగంపై భారీగా ఏఐ ప్రభావం

సమాచార, ప్రసారాల కార్యదర్శి సంజయ్ జాజు

ముంబయి: మీడియా-వినోద రంగంపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం భారీగా ఉండనుందని, పరిశ్రమ అత్యుత్తమంగా ఈ సాంకేతికతను వినియోగించుకోవాలని సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు పిలుపునిచ్చారు. డైరెక్ట్-టు-మొబైల్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రాజెక్టు కోసం ఐఐటీ కాన్పూర్‌లో పలు దశల్లో ప్రూఫ్-ఆఫ్-కాన్సెప్ట్ స్టడీస్ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. 'ఏఐ ప్రభావం ఈ విభాగంపై భారీ స్థాయిలో పడనుంది. చాలా సానుకూలతలు కనిపించనున్నాయి. అలాగే ప్రతికూలతలూ ఉంటాయి. అందుకే మనం ఎక్కడ గీత దాటరాదో తెలుసుకుని ప్రవర్తించాల'ని సీఐఐ ఆధ్వర్యంలో జరిగిన 'బిగ్ పిక్చర్ సమిట్ 2025'లో పేర్కొన్నారు.

కోడి గుడ్లు

2న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	640
వరంగల్	642
విజయవాడ	665
తూ/ప గోదావరి	640
విశాఖపట్నం	630
చిత్తూరు	663

వాహన జోరు.. పారిశ్రామికోత్పత్తి బేజారు



పండగ సీజన్ తరవాత కొనుగోలుదార్ల నుంచి గిరాకీ బాగుండటంతో, గత నెలలో వాహన టోకు విక్రయాలు పెరిగాయి. దిగ్గజ సంస్థలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా 2024 నవంబరుతో పోలిస్తే, గత నెలలో బలమైన గణాంకాలను నమోదు చేశాయి. మారుతీ సుజుకీ ఇండియా 40 ఏళ్లలోనే అత్యధికంగా నవంబరులో 2,29,021 వాహనాలను విక్రయించింది.

✦ **పెండింగ్‌లోనే 1.50 లక్షల కార్లు:** నవంబరులో రిటెయిల్ వృద్ధి 31 శాతమని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ వెల్లడించారు. ప్రస్తుతం 8 మోడళ్ల నిల్వలు లేవని, బుకింగ్‌లు సుమారు 1.5 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు.

✦ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ దేశీయ విపణికి 57,436 వాహనాలను సరఫరా చేసింది. 2024 నవంబరులో సరఫరా చేసిన 47,063 వాహనాలతో పోలిస్తే ఇవి 22% అధికం. మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయ ప్రయాణికుల వాహన సరఫరాలు 46,222 నుంచి 22% పెరిగి 56,336కు చేరాయి. హ్యుందాయ్ మోటార్ టోకు విక్రయాలు 48,246 నుంచి 4% పెరిగి 50,340కు చేరాయి. కియా ఇండియా విక్రయాలు 20,600 నుంచి 25,489కు చేరాయి. ✦ ద్విచక్ర వాహన విభాగంలో హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా 25% వృద్ధితో 5,91,136 వాహనాలను విక్రయించింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ మొత్తం విక్రయాలు 22% పెరిగి 1,00,670కు చేరాయి. బజాజ్ ఆటో దేశీయ విక్రయాలు మాత్రం 1% తగ్గి 2,02,510కు పరిమితమయ్యాయి

ఏడాది కనిష్ఠానికి..



దేశ పారిశ్రామికోత్పత్తి వృద్ధి అక్టోబరులో 0.4 శాతంగా నమోదైంది. ఇది ఏడాది కనిష్ఠ స్థాయి. 2024 సెప్టెంబరులో నమోదైన సున్నా వృద్ధి తర్వాత ఇదే తక్కువ. విద్యుత్, తయారీ, గనుల రంగాల పేలవ ప్రదర్శన ఇందుకు కారణం. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారంగా పారిశ్రామికోత్పత్తి వృద్ధిని లెక్కిస్తారు. 2024 అక్టోబరులో ఇది 3.7% వద్ద ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం..

✦ తయారీ రంగ ఉత్పత్తి వృద్ధి 1.8 శాతానికి తగ్గింది. 2024 అక్టోబరులో ఇది 4.4 శాతంగా ఉంది గనుల ఉత్పత్తిలో 1.8%, విద్యుదుత్పత్తిలో 6.9% క్షీణత నమోదైంది. 2024 అక్టోబరులో గనుల రంగ ఉత్పత్తిలో 0.9%, విద్యుదుత్పత్తిలో 2% వృద్ధి ఉంది.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- అక్టోబరులో పారిశ్రామికోత్పత్తి వృద్ధి 2.7 శాతానికి తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 4%.

తగ్గిన జీఎస్టీ వసూళ్ల వృద్ధి



ఈనాడు, దిల్లీ: జీఎస్టీ నెలవారీ వసూళ్ల వృద్ధిరేటు నవంబరులో గణనీయంగా తగ్గింది. దేశీయంగా నవంబరులో జీఎస్టీ స్థూల వసూళ్లు రూ.1,70,276 కోట్లుగా నమోదయ్యాయి. 2024 నవంబరు నాటి రూ.1,69,016 కోట్లతో పోలిస్తే, ఇవి 0.7% మాత్రమే ఎక్కువ. అక్టోబరులో రూ.1.95 లక్షల కోట్ల పన్ను వసూలైంది.

రాష్ట్రాలకు ఆదాయంలో మార్పు లేదు: జీఎస్టీ కింద వసూలైన మొత్తంలో, రాష్ట్రాలకు చేరే ఆదాయంలో మార్పేమీ లేదు. అన్ని రాష్ట్రాలకు కలిపి గతనెలలో రూ.86,882 కోట్ల ఆదాయం వచ్చింది. ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ ఆదాయం 5% తగ్గితే, తెలంగాణ ఆదాయం 1% పెరిగింది. 2024 నవంబరులో ఏపీకి రూ.2,828 కోట్లు రాగా, ఈసారి రూ.2,697 కోట్లకు తగ్గాయి. తెలంగాణ ఆదాయం రూ.3,880 కోట్ల నుంచి రూ.3,910 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబరు వరకు చూసుకుంటే తెలంగాణ ఆదాయం 4%, ఆంధ్రప్రదేశ్ ఆదాయం 2% పెరిగింది.

9 నెలల కనిష్ఠానికి 'తయారీ'



దిల్లీ: నవంబరులో దేశీయ తయారీ రంగ వృద్ధి 9 నెలల కనిష్ఠమైన 56.6 పాయింట్లుగా నమోదైంది. విదేశీ విపణుల్లో ప్రతికూలత దృష్ట్యా అమ్మకాలు, ఉత్పత్తి నెమ్మదించడం ఇందుకు ప్రధాన కారణమని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యాన్‌ఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ (పీఎంఐ) నివేదిక తెలిపింది. అక్టోబరులో ఈ సూచీ 59.2 పాయింట్లుగా ఉంది. పీఎంఐ పరిభాషలో పీఎంఐ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, 50 పాయింట్ల దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారు. నవంబరులో సూచీ 50 పాయింట్ల పైనే ఉన్నప్పటికీ.. గత 9 నెలల్లోనే తక్కువగా నమోదైంది. నవంబరులో భారత తయారీ రంగ వృద్ధిపై అమెరికా సుంకాలు ప్రభావం చూపించాయని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి తెలిపారు. ఆఫ్రికా, ఆసియా, ఐరోపా, మధ్యప్రాచ్య దేశాలకు అధిక ఎగుమతుల వల్ల, అంతర్జాతీయంగా మన ఉత్పత్తులకు గిరాకీ సానుకూలంగానే ఉందని కంపెనీలు చెబుతున్నా.. మొత్తం మీద వృద్ధి జోరు నెమ్మదించిందని నివేదిక స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టుకు అనిల్ అంబానీ

దిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాలను మోసపూరిత ఖాతాగా వర్గీకరిస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్ ఇంకా విచారణకు నమోదుకాలేదు. ఎస్‌బీఐ నిర్ణయంపై అంబానీ పిటిషన్‌ను ఈ ఏడాది అక్టోబరు 3న హైకోర్టు కొట్టివేసింది.

18% పెరిగిన ఎఫ్‌డీఐ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- సెప్టెంబరులో భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 18% పెరిగి 35.18 బిలియన్ డాలర్లకు చేరాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇవి 29.79 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అమెరికా నుంచి వచ్చిన పెట్టుబడులు రెట్టింపై 6.62 బి.డాలర్లకు చేరాయి. 2025-26 జూన్-సెప్టెంబరు త్రైమాసికంలో ఎఫ్‌డీఐలు 21% వృద్ధితో 16.54 బి.డాలర్లుగా నమోదయ్యాయి. ఎఫ్‌డీఐని అత్యధికంగా ఆకర్షించిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉండగా.. తెలంగాణ (1.14 బిలియన్ డాలర్లు.. సుమారు రూ.10,146 కోట్లు) ఏడో స్థానంలో ఉంది.

87 రుణ యాప్‌లకు చెల్లుచీటీ: నిబంధనలు పాటించకపోవడంతో 87 అక్రమ రుణ యాప్‌లను స్తంభింప చేసినట్లు లోక్‌సభకు ఇచ్చిన సమాచారంలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రి హర్ష్ మల్హోత్రా తెలిపారు.

సన్ ఫార్మా నుంచి ప్లేక్ సోరియాసిస్ మందు

ప్లేక్ సోరియాసిస్ వ్యాధికి చికిత్సలో వినియోగించే ఇలుమ్యా (టిల్‌డ్రాకిజుమ్యాబ్) ఔషధాన్ని సన్ ఫార్మా మనదేశంలో విడుదల చేసింది. అమెరికాలో చర్మవ్యాధి నిపుణులు ఈ ఔషధాన్ని అధికంగా సిఫారసు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 35 దేశాల్లో ఈ మందు వినియోగంలో ఉంది. ప్రపంచ జనాభాలో 2-3% మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని అంచనా. సోరియాసిస్ బాధితులకు ఇలుమ్యా ఔషధం మంచి పరిష్కారమని సన్ ఫార్మా ఎండీ కీర్తి గనోర్కర్ అన్నారు. మనదేశంలో 0.44-2.8% మంది ఈ వ్యాధితో ఇబ్బంది పడుతున్నారని అంచనా.

మారుతీలో ఎస్ఎంజీ విలీనం పూర్తి

దిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ)లో, సుజుకీ మోటార్ గుజరాత్ (ఎస్ఎంజీ) విలీన పథకం డిసెంబరు 1 నుంచి అమల్లోకి వచ్చిందని ఎంఎస్ఐ వెల్లడించింది. ఫలితంగా, కంపెనీ అధీకృత మూలధనం రూ.15,000 కోట్ల మేర పెరిగిందని నియంత్రణ సంస్థలకు ఎంఎస్ఐ సమాచారం అందించింది. ఎంఎస్ఐ యాజమాన్యంలోని పూర్తిస్థాయి అనుబంధ సంస్థ ఎస్ఎంజీ విలీన పథకానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపిన సర్టిఫైడ్ కాపీని కంపెనీ దిల్లీ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు దాఖలు చేసిందని, తదనుగుణంగా ఈ పథకం 2025 డిసెంబరు 1 నుంచి అమల్లోకి వచ్చింది.

పెట్టుబడులపై ఎల్ఐసీకి ఎలాంటి సలహాలివ్వలేదు

ఆర్థిక మంత్రి స్పష్టీకరణ

పెట్టుబడి నిర్ణయాల విషయంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)కు ఎటువంటి సలహాలు, ఆదేశాలను తమ శాఖ ఇవ్వలేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు స్పష్టం చేశారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీఎస్) ఆధారంగానే అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టిందని తెలిపారు. కంపెనీల మూలాలపై విస్తృత స్థాయి పరిశోధన ఆధారంగానే ఎల్ఐసీ పెట్టుబడులు పెడుతోందని అన్నారు. ఆ క్రమంలోనే అదానీ గ్రూప్‌నకు చెందిన 6 కంపెనీల షేర్లను రూ.38,658.85 కోట్లతో కొనుగోలు చేసిందని, మరో రూ.9625.77 కోట్లను ఆ గ్రూప్‌నకే చెందిన బాండ్లలోనూ పెట్టిందని వివరించారు. అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ ఎల్ఐసీని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు నిర్దేశించారని గత అక్టోబరులో 'వాషింగ్టన్ పోస్ట్' ఆరోపించిన సంగతి తెలిసిందే. ఎన్ఎస్ఈ, బీఎస్ఈలోని అగ్రగామి 500 కంపెనీల్లోనూ ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టిందని ఆర్థిక మంత్రి గుర్తు చేశారు. అదానీ గ్రూప్‌లో ఒకే కంపెనీలో రూ.9,000 కోట్ల లోపే ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టినా, మొత్తం గ్రూప్ కంపెనీల్లో కలిపి రూ.38,658.85 కోట్ల ఈక్విటీ పెట్టుబడులు పెట్టడం గమనార్హం.

ఎల్ఐసీ అత్యధిక ఈక్విటీ పెట్టుబడులు

కంపెనీ	రూ.కోట్లలో
రిలయన్స్	40,901.38
ఇన్ఫోసిస్	38,846.33
టీసీఎస్	31,926.89
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	31,664.69
హిందుస్థాన్ యునిలీవర్	30,133.49

కంపెనీ	ఎల్ఐసీ డెట్ పెట్టుబడులు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	49,149.14
రిలయన్స్ ఇండస్ట్రీస్	14,012.34
ఐసీఐసీఐ బ్యాంక్	13,435.00
శ్రీరామ్ ఫైనాన్స్	11,075.00
అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజడ్	9,625.77

5 ఏళ్లలో 2 లక్షల కంపెనీల మూత

లోక్‌సభలో వెల్లడించిన ప్రభుత్వం

గత అయిదేళ్లలో 2,04,268 ప్రైవేటు కంపెనీలు మూతపడ్డాయని ప్రభుత్వం తెలిపింది. విలీనం, బదిలీ, రద్దు, కంపెనీల చట్టం 2013 కింద రికార్డుల నుంచి తొలగింపు వంటి వేర్వేరు కారణాలతో ఈ కంపెనీలు మూతపడ్డాయని కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లోక్‌సభకు రాతపూర్వకంగా తెలిపారు. ఆయా కంపెనీల్లోని ఉద్యోగులకు పునరావాసం కల్పించారా అన్న ప్రశ్నకు సమాధానంగా, ప్రభుత్వం ముందు అటువంటి ప్రతిపాదనేదీ లేదన్నారు. 2021-22 నుంచి అయిదేళ్లలో 1,85,350 కంపెనీలను అధికారిక రికార్డుల నుంచి తొలగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జులై 16 వరకు 8,648 కంపెనీలను తొలగించారు. ఆయా కంపెనీలను మనీ లాండరింగ్ కార్యకలాపాల వంటి వాటికి షెల్ కంపెనీలుగా వాడారా అన్న ప్రశ్నకు సమాధానంగా 'కంపెనీల చట్టంలో షెల్ కంపెనీకి నిర్వచనం లేద'న్నారు.

సంవత్సరం	మూతపడ్డ కంపెనీల సంఖ్య
2024–25	20,365
2023–24	21,181
2022–23	83,452
2021–22	64,054
2020–21	15,216

పాదరక్షల వ్యాపారాన్ని మరింత విస్తరించాలి

● రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



దిల్లీ: ప్రపంచంలోనే పాదరక్షల ప్రధాన ఎగుమతిదారుగా భారత్ ఉందని, ఈ వ్యాపారాన్ని మరింత విస్తరించి ఎగుమతులకు మద్దతు ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. సోమవారమిక్కడ జరిగిన ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) స్నాతకోత్సవంలో ముర్ము మాట్లాడుతూ 'స్పోర్ట్స్, నాన్-లెదర్ రంగంలో వ్యాపారాలకు భారీ అవకాశాలు ఉన్నాయి. ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడానికి వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మద్దతునిస్తోంది. దిగుమతులతో పోలిస్తే ఎగుమతులు 4 రెట్లు అధికంగా ఉన్నాయి. ఇవి ఇంకా పెరగాల'ని ఆకాంక్షించారు. 2024-25లో భారత పాదరక్షల ఎగుమతులు 2.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.22,250 కోట్లు)గా ఉండగా.. దిగుమతులు 680 మిలియన్ డాలర్లు (సుమారు రూ.6052 కోట్లు)గా ఉన్నాయి. విస్తరణ వల్ల విద్యార్థులు కాస్తా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారతారని, ఉపాధి వస్తుందని ముర్ము పేర్కొన్నారు.

ఔషధాలపై సున్నా టారిఫ్

అమెరికా, యూకే ఒప్పందం

లండన్: అమెరికాకు ఎగుమతి అయ్యే తమ ఔషధాలపై సున్నా టారిఫ్ అమలయ్యేలా యునైటెడ్ కింగ్‌డమ్ ఒప్పందం చేసుకుంది. కనీసం మూడేళ్ల పాటు ఇది అమలవుతుంది. ప్రతిగా కొత్త ఔషధాల ఆవిష్కరణ కోసం యూకే 25% అధిక పెట్టుబడులు పెట్టనుంది. యూకేలో తయారైన మందులు, ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్లు, వైద్య సాంకేతికతపైనా అమెరికా ఎటువంటి సుంకమూ విధించదు. యూకే ఔషధ కంపెనీలు అమెరికాలో మరిన్ని పెట్టుబడులు పెట్టడం ద్వారా, అక్కడ ఉద్యోగావకాశాలు కల్పిస్తాయి.

గరిష్ఠాల నుంచి సూచీలు వెనక్కి..



ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1171 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.2559 కోట్లు

సెన్సెక్స్ ▼ 65 — 85642
నిఫ్టీ ▼ 27 — 26176

జీవనకాల గరిష్ఠ స్థాయుల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో, సోమవారం దేశీయ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఫైనాన్స్, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యపరపతి విధాన సమీక్షకు ముందు మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. నవంబరులో జీఎస్టీ వసూళ్ల వృద్ధి నెమ్మదించడమూ ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 8 పైసలు తగ్గి 89.53 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.96% లాభంతో 63.60 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.17,000 కోట్లు పెరిగి రూ.474.52 లక్షల కోట్లు (5.29 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెప్టెంబరు త్రైమాసిక జీడీపీ గణాంకాల అండతో, సెన్సెక్స్ ఉదయం 359 పాయింట్ల (క్రితం ముగింపు 85,706.67) లాభంతో 86,065.92 వద్ద ప్రారంభమైంది. అదే జోరులో 86,159.02 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. అక్కడ అమ్మకాలు రావడంతో, నష్టాల్లోకి జారుకున్న సూచీ, 85,489.65 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 64.77 పాయింట్ల నష్టంతో 85,641.90 వద్ద ముగిసింది. నిఫ్టీ 27.20 పాయింట్లు తగ్గి 26,175.75 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,325.80 దగ్గర రికార్డు గరిష్ఠాన్ని నమోదుచేసింది.

✦ నవంబరులో అమ్మకాలు 26% పెరగడంతో టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్ షేరు 1.93% లాభపడి రూ.363.75 వద్ద ముగిసింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 15 నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్ 1.65%, సన్‌ఫార్మా 1.28%, ట్రెంట్ 0.76%, ఎస్‌బీఐ 0.65%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.65% తగ్గాయి. మారుతీ 1.40%, బీఈఎల్ 1.36%, కోటక్ బ్యాంక్ 1.12%, హెచ్‌సీఎల్ టెక్ 0.95% రాణించాయి. రంగాల వారీ సూచీల్లో.. స్థిరాస్తి, మన్నికైన వినిమయ వస్తువులు, సేవలు, టెలికాం, ఎఫ్ఎమ్‌సీజీ, చమురు-గ్యాస్ 1.02% పడ్డాయి. వాహన, లోహ, ఫోకస్డ్ ఐటీ, ఐటీ, వినియోగ మెరిశాయి. బీఎస్ఈలో 1768 షేర్లు లాభపడగా, 2484 స్క్రిప్‌లు నష్టపోయాయి. 205 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

మీషో ఉద్యోగుల వేతనాల కోసం ఐపీఓ నిధులు

సాఫ్ట్ బ్యాంక్ పెట్టుబడులు కలిగిన ఇ-కామర్స్ కంపెనీ మీషో ఐపీఓ ఈ నెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.105-111ను నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.5,421 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. ఇందులో రూ.480 కోట్లను ఏఐ, టెక్నాలజీ బృందాల వేతనాలకు వినియోగించనుంది. ఐపీఓ నిధులను కంపెనీ ఉద్యోగుల వేతనాలకు వినియోగించడం ఆందోళనకర సంకేతాలని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీసింది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఐపీఓకు సెబీ అనుమతి

ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ అనుబంధ సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)కి సెబీ అనుమతి లభించింది. ఈ నెలలో కంపెనీ రూ.10,000 కోట్ల ఐపీఓకు వచ్చే అవకాశం ఉంది. మరో మూడు కంపెనీలు- విద్యుత్ సొల్యూషన్ల ప్రొవైడర్ పవరికా లిమిటెడ్, మురుగునీటి శుద్ధి సొల్యూషన్ల సంస్థ టెక్నోక్రాఫ్ట్ వెంచర్స్, అన్ను ప్రాజెక్ట్స్ ఐపీఓలకూ సెబీ అనుమతి వచ్చింది.

✦ ఐపీఓ ద్వారా రూ.290 కోట్లు సమీకరించేందుకు సెబీ వద్ద ఎంపీ ఎలక్ట్రోసిస్టమ్స్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది.

✦ హిందుస్థాన్ యునిలీవర్ మేనేజ్‌మెంట్ కమిటీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హోమ్ కేర్)గా వందన సూరి పదోన్నతి పొందారు.

✦ పెర్నాడ్ రికార్డ్ ఇండియా నుంచి ఇంపీరియల్ బ్లూ విభాగాన్ని రూ.3,442 కోట్లకు కొనుగోలు చేయడాన్ని పూర్తి చేసినట్లు తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ ప్రకటించింది.

✦ పర్యవేక్షణ (సూపర్‌విజన్) విభాగంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా ఉషా జానకిరామన్‌ను నియమించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఆమె నియామకం డిసెంబరు 1 నుంచే అమల్లోకి వచ్చింది.

ఈనాడు సినిమా

వివాహ బంధంలోకి సమంత- రాజ్



భూతశుద్ధి వివాహం అంటే?

భూతశుద్ధి పద్ధతిలో కథానాయిక సమంత, రాజ్ నిడిమోరు ఏడడుగులు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే భూతశుద్ధి వివాహం, ఆ సంప్రదాయం గురించి అందరిలోనూ ఆసక్తి కలిగింది. భూతశుద్ధి వివాహం అనేది యోగ సంప్రదాయ విధానంలో వేలాది సంవత్సరాలుగా కొనసాగుతోన్న అత్యంత పవిత్రమైన వివాహ పద్ధతి. ఇందులో పేరుకు తగ్గట్లుగానే ఆలోచనలు, భావోద్వేగాలు లేదా భౌతికతకు అతీతంగా దంపతుల మధ్య లోతైన బంధాన్ని ఏర్పరిచేందుకు రూపొందించిన విశిష్టమైన ప్రక్రియే ఈ వివాహం. లింగ భైరవి ఆలయాల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో నిర్వహించే ఈ వివాహ క్రతువు వధూవరుల దేహాల్లోని పంచభూతాలను శుద్ధి చేస్తుంది. వారి దాంపత్య ప్రయాణంలో సామరస్యం, శ్రేయస్సు, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా దేవీ అనుగ్రహాన్ని ప్రసాదిస్తుందని నమ్ముతారు. సాధారణంగా హిందూ జంటలకు చేసే సంప్రదాయ మంత్రోచ్చారణలతో పాటు వధూవరుల శరీరం, మనసు, జీవశక్తి స్థాయిలను సమన్వయం చేసే యోగిక క్రతువులతో ఈ వివాహం చేస్తారు. ఈశా ఫౌండేషన్ మాత్రమే ఈ వివాహాలను చేస్తుంది. ఈ క్రతువులో పెళ్లి జంటకు ప్రాథమిక స్థాయిలో లోతైన బంధం ఏర్పడుతుందని విశ్వసిస్తారు.

తమ వ్యక్తిగత జీవితం గురించి ప్రచారంలో ఉన్న వార్తలకు తెర దించుతూ అగ్ర కథానాయిక సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు వివాహ బంధంతో ఒకటయ్యారు. తమిళనాడు కోయంబత్తూర్ జిల్లాలోని ప్రసిద్ధ ఈశా యోగా కేంద్రంలో సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. లింగ భైరవిదేవి సన్నిధిలో భూతశుద్ధి వివాహ విధానంలో పెళ్లి జరిగినట్లు ఈశా ఫౌండేషన్ ప్రకటించింది. రాజ్-డీకే సంయుక్తంగా తెరకెక్కించిన 'ది ఫ్యామిలీమ్యాన్ సీజన్2', 'సిటడెల్: హనీ బన్నీ'లో సమంత నటించిన విషయం తెలిసిందే. ఆయా ప్రాజెక్టుల కోసం పనిచేస్తున్న సమయంలోనే సమంత, రాజ్‌ల మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. సమంత నిర్మించిన 'శుభం' చిత్రానికి రాజ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. లింగ భైరవిదేవి సన్నిధిలో రాజ్‌తో కలిసి ఉన్న ఫొటోలను సమంత సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

–న్యూస్‌టుడే, చెన్నై, కోయంబత్తూర్

మధ్యతరగతి కుర్రాళ్ల ప్రేమకథ ఎపిక్



ఆనంద్, నాగవంశీ, వైష్ణవి చైతన్య, ఆదిత్య హాసన్

శేఖర్ కమ్ముల సినిమాలో హీరో లాంటి అబ్బాయికి.. సందీప్ రెడ్డి వంగా సినిమాలోని హీరో లాంటి అమ్మాయికి మధ్య జరిగే ప్రేమకథే మా 'ఎపిక్' అంటున్నారు హీరో ఆనంద్ దేవరకొండ. ఆయన, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'ఎపిక్' అనే పేరును ఖరారు చేస్తూ.. సోమవారం హైదరాబాద్‌లో టైటిల్ గ్లింప్స్ విడుదల చేశారు. '#90s' వెబ్‌సిరీస్‌లోని ఆదిత్య పాత్ర నేపథ్యంగా సాగే వినోదాత్మక ప్రేమకథగా ఈ చిత్రం రూపొందినట్లు ప్రచార చిత్రంతో అర్థమవుతోంది. ఈ సందర్భంగా హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. "నాకీ సినిమా అవకాశం రావడానికి ఈటీవీ విన్‌లో '#90s' వెబ్‌సిరీస్ చూశా. అందులోని చిన్న ఆదిత్య పాత్రకు నేను చాలా కనెక్ట్ అయ్యా. చిన్నప్పుడు నేనూ ఇలాగే ఉండేవాణ్ని కదా అనిపించింది. అలాంటి ఆదిత్య పాత్ర పెద్దయ్యాక ఇంట్లో వాళ్ల ఒత్తిడితో యూకేకి చదువుకోవడానికి వెళ్తే.. అక్కడ ఓ అమ్మాయితో ప్రేమలో పడితే ఏం జరిగిందన్నది ఈ చిత్ర కథాంశం. ఇందులోని ప్రేమకథ, వినోదం, పాటలు ప్రతిదానితో ప్రేక్షకులు తప్పక కనెక్ట్ అవుతారు. ఇలాంటి రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఈ మధ్య కాలంలో రాలేదు" అన్నారు. "ఇది చాలా అందమైన.. యూత్‌ఫుల్ సినిమా. దీంట్లో నాయకానాయికల పాత్రలకు ప్రతిఒక్కరూ కనెక్ట్ అవుతారు" అంది నటి వైష్ణవి చైతన్య. దర్శకుడు ఆదిత్య హాసన్ మాట్లాడుతూ.. "నేనెప్పుడూ సింపుల్ కథల్నే తెరపై చాలా మంచిగా చూపించాలనుకుంటా. ఇది కూడా అలాంటి కథే. మధ్యతరగతి కుర్రాళ్ల అందమైన ప్రేమకథగా ఉంటుంది. దీనికి ప్రతిఒక్కరూ కనెక్ట్ అవుతారు. ఇది కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందని నమ్ముతున్నా" అన్నారు. "ఈ సినిమాకి సీక్వెల్ ఉంటుంది. అందుకే ఈ చిత్రానికి ఫస్ట్ సెమిస్టర్ అని ఉపశీర్షిక పెట్టాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఈ కార్యక్రమంలో అజీమ్, నిరంజన్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓ టీ టీ లో ఈ వారం

వినోదాలు వడ్డించడానికి ఓటీటీలు రెడీ.. మరి వాటిని ఆస్వాదించడానికి ప్రేక్షకులు సిద్ధమేనా! కొత్త కథల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినీ ప్రేమికుల కోసమే ఇదంతా. ఎప్పటిలాగే ఈ వారాంతం అలరించడానికి అదిరిపోయే కంటెంట్‌ను అందుబాటులో తీసుకొచ్చాయి ఓటీటీలు.

హో.వాట్.వన్(చిత్రం)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
ది అబాండన్స్(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
జే కెల్లీ(చిత్రం)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
డీయస్ ఈరే(చిత్రం)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
అరసయ్యన ప్రేమ ప్రసంగ(చిత్రం)	శుక్రవారం	సన్‌నెక్ట్స్
కుట్రం పురిందవన్(సిరీస్)	శుక్రవారం	సోనీ లివ్
ఫాల్‌స్పెట్ పోలీస్‌స్టేషన్(సిరీస్)	శుక్రవారం	ఆహా
ది ప్రైస్ ఆఫ్ కన్ఫెషన్(సిరీస్)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
సూపర్ టుమారో(సిరీస్)	శనివారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
ది నైట్ మై డాడ్ సేవ్డ్ క్రిస్మస్2 (చిత్రం)	శనివారం	నెట్‌ఫ్లిక్స్

గర్ల్‌ఫ్రెండ్ వచ్చేస్తోంది




షరతులు లేని ప్రేమ గురించి కళ్లకు కట్టినట్లు చూపించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక, దీక్షిత్ శెట్టి జంటగా నటించారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. అను ఇమ్మాన్యుయేల్ కీలక పాత్ర పోషించింది. ఇటీవలే థియేటర్లలోకి వచ్చి యువతను విశేషంగా ఆకట్టుకుంది చిత్రం. ఇందులో భూమా పాత్రలో తనదైన నటనతో అలరించింది రష్మిక. బంధాల విషయంలో ఎంత జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలో ఆద్యంతం సున్నితంగా తెలియజేసింది. ఇప్పుడీ సినిమా శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది.

సీరియల్ కిల్లర్ లొంగిపోతాడా?



ఆర్నెల్లు.. తొమ్మిది మంది మహిళల హత్యలు.. ఓ సీరియల్ కిల్లర్.. ఈ అంశాలతో రూపొందిన చిత్రం 'స్టీఫెన్'. మిథున్ బాలాజీ దర్శకత్వం వహించారు. 'గ్యాంగ్' ఫేమ్ గోమతి శంకర్ హీరోగా నటించారు. సైకాలజికల్ నేపథ్యంలో తీర్చిదిద్దిన ఈ సినిమా ట్రైలర్ ఇటీవలే విడుదలై ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. శుక్రవారం నెట్‌ఫ్లిక్స్‌లో రాబోతుంది చిత్రం. ఇందులో సీరియల్ కిల్లర్ పాత్రలో కనిపించనున్నారు గోమతి. తొమ్మిది మందిని దారుణంగా చంపేసిన ఆయన.. ఆ హత్యలు ఎందుకు.. ఎవరితో కలిసి చేశాడనే ప్రశ్నల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. అసలు ఆ సీరియల్ కిల్లర్ హత్యలకు కారణమేంటి? ఆయన పోలీసులకు లొంగిపోయాడా? లేదా అనేది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.

తెరపైకి వి.శాంతారామ్ జీవితం



సిద్ధాంత్ చతుర్వేది

ప్రముఖ చిత్రనిర్మాత, దర్శకుడు వి.శాంతారామ్ జీవిత చరిత్ర తెరపైకి రాబోతున్నట్లు కొన్నిరోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వీటన్నింటినీ నిజం చేస్తూ.. 'వి.శాంతారామ్' బయోపిక్‌ను ప్రకటించింది చిత్రబృందం. ది రెబల్ ఆఫ్ ఇండియన్ సినిమా అనేది ఉపశీర్షిక. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది నటిస్తున్నారు. సోమవారం ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడిస్తూ.. సిద్ధాంత్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "'వి.శాంతారామ్'.. భారతీయ సినిమాను పునర్నిర్వచించిన రెబల్ మళ్లీ తన స్థానానికి వచ్చేశారు" అనే వ్యాఖ్యను జోడించింది. ఇందులో శాంతారామ్ పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు సిద్ధాంత్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రాబోయే తరాలకు భారతీయ సినిమాను విప్లవాత్మకంగా మార్చిన దిగ్గజ చిత్రనిర్మాత వి.శాంతారామ్. ఆయన భారతీయ, ప్రపంచ సినిమాకు మార్గదర్శకుడు మాత్రమే కాదు.. అడ్డంకులు ఎదురైనా ముందుకు సాగే దార్శనికుడు. శాంతారామ్ జీవితం నన్ను ఎంతగానో కదిలిచింది. ఇప్పుడాయన పాత్రలోకి అడుగుపెట్టడం గౌరవంగా ఉంద"ని అన్నారు. రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాశ్ కాలే, సరితా అశ్విన్ వర్దే సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

అంచనాలకు దీటుగా అఖండ 2

"కథలు ఎంత లోకల్‌గా ఉంటే... సినిమాలకు గ్లోబల్‌గా అంత ఆదరణ దక్కుతోంది. ఇప్పుడంతా మనవైన కథల్నే చూడాలనుకుంటున్నారు. అందుకే పాన్ ఇండియా పేరుతో మన కథల్లోనూ, పాత్రల్లోనూ ప్రత్యేకంగా మార్పులేమీ చేయాల్సిన అవసరం లేదు. వాటిని సహజంగా తెరపైకి తీసుకొస్తే చాలు. 'అఖండ 2' దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు నచ్చే మనదైన కథతోనే రూపొందింది. ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలకు మించి థియేటర్లలో అనుభవాన్ని పంచుతుంది" అంటున్నారు ప్రముఖ నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట. 14 రీల్స్ ప్లస్ పతాకంపై అగ్ర కథానాయకులతో సినిమాల్ని రూపొందిస్తున్న నిర్మాతలు వీళ్లు. ఇటీవల బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో 'అఖండ 2: తాండవం' చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్మాతలు సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"ఈ కథ అనుకున్నప్పుడే...దేశం మొత్తం చూసేలా రూపొందించాల్సిన సినిమా అనుకున్నాం. పాన్ ఇండియా స్థాయితోపాటు, త్రీడీలోనూ తీయాలని అప్పుడే నిర్ణయించాం. ఇందులో విజువల్స్ అంత ఘనంగా ఉంటాయి. 2డీలో ఈ సినిమా చూశాక, త్రీడీలోనూ ఓసారి చూద్దాం అనిపించేలా ఈ సినిమా ఉంటుంది. సంచలన విజయం సాధించిన 'అఖండ'కి కొనసాగింపు కావడం ఒకెత్తైతే, బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో హాట్రిక్ విజయాల తర్వాత వస్తున్న సినిమా కావడం మరో ఎత్తు. ఆ అంచనాలకి దీటుగా ఏ విషయంలోనూ రాజీపడకుండా 'అఖండ 2' చిత్రాన్ని తెరకెక్కించాం. శివుడంటేనే మాస్ కదా, శివతాండవం ఎంత శక్తిమంతంగా ఉంటుందో ఇందులో యాక్షన్ అలా ఉంటుంది. త్రిశూలం ఇందులో వాడినట్టుగా మరే సినిమాలోనూ వాడలేదేమో. బాలకృష్ణతో పదేళ్ల కిందట 'లెజెండ్' చేశాం. పదేళ్ల తర్వాత కూడా ఆయనలో అదే ఉత్సాహం. ఆయనతో మాట్లాడితే చాలు, ఆ శక్తి, ఉత్సాహం మనలోనూ కలిగేంత ప్రభావం చూపిస్తారు. కథానాయిక సంయుక్త ఒక హీరోయిన్‌లా పరిమితం కాకుండా, కథలో ఒక ముఖ్యమైన పాత్రలో కనిపిస్తారు. ఆది పినిశెట్టి శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారు".



గోపీ ఆచంట, రామ్ ఆచంట

● "సనాతన ధర్మం అనే అంశంతోపాటు, మనలోనూ భక్తి, దేవుడిపై మనకున్న నమ్మకం ప్రధానంగా సాగే కథ ఇది. ప్రస్తుతం దేశమంతా సనాతన ధర్మం గురించి మాట్లాడుకుంటున్నారని, ఆ నేపథ్యంలో కథ రాసుకుని తీసిన సినిమా కాదు ఇది. సహజంగానే ఆ నేపథ్యంలో పుట్టిన కథ ఇది. తొలి చిత్రం 'అఖండ' కథలోనే దేవాలయాలు, చిన్నారుల జోలికి వెళితే ఆ పరమశివుడే వస్తాడనే అంశం ఉంటుంది. దానికి కొనసాగింపుగానే 'అఖండ 2' ఉంటుంది. ఇందులో అఘోరా పాత్ర మరింత శక్తిమంతంగా ఉంటుంది. కుంభమేళాలో చిత్రీకరణ చేశాం. తెరపై చూసే ప్రతీ సన్నివేశం సినిమా కోసం మేం తీసిందే. అందుకోసం అనుమతులు పొందడంలో చాలా సవాళ్లు ఎదురయ్యాయి. డ్రోన్ అనుమతులు సహా మాకు అన్నీ దొరికాయి. దర్శకుడు బోయపాటి శ్రీను పరిమిత సంఖ్యలో బృందంతో కలిసి వెళ్లి అనుకున్న సన్నివేశాల్ని పక్కాగా తెరపైకి తీసుకొచ్చారు. పతాక సన్నివేశాల్ని జార్జియాలో ప్రతికూలమైన వాతావరణ పరిస్థితుల మధ్య చిత్రీకరణ చేశాం. తమన్ సంగీతం, మాట్రిక్స్ సంస్థ విజువల్ ఎఫెక్ట్స్, రాంప్రసాద్, సంతోష్ డిటాకే విజువల్స్... ప్రతీ సాంకేతిక విభాగం అత్యున్నతమైన పనితీరుని కనబరిచింది. 4వ తేదీ రాత్రి ప్రత్యేక ప్రదర్శనలకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. అనుమతులు వచ్చాక అధికారికంగా ప్రకటిస్తాం".

● "సరిగ్గా 2014 ఎన్నికలకు ముందు బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో మేం 'లెజెండ్' చిత్రాన్ని నిర్మించాం. అదే కలయికలోనే మళ్లీ 2024 ఎన్నికలకు ముందు ఓ సినిమాని చేయాలనుకున్నాం. సరిగ్గా ఎన్నికలకు ముందు రావల్సిన కథే అది కూడా. అయితే ఈసారి ఎన్నికల తేదీపై స్పష్టత రాకపోవడంతో మేం ఆ కథని పక్కనపెట్టి 'అఖండ - 2' చిత్రాన్ని పట్టాలెక్కించాం. బాలకృష్ణ - బోయపాటి శ్రీను అనుకోవాలి కానీ, అఖండ ప్రపంచం నేపథ్యంలో ఎన్నైనా సినిమాలు చేయొచ్చు. 'అఖండ 2' కథ మాత్రం ఎక్కడ మొదలవుతుందో, అక్కడ పరిపూర్ణంగా ముగుస్తుంది. ప్రత్యేకమైన అనుభవాన్ని పంచే ఈ సినిమాని దక్షిణాది భాషలతోపాటు, హిందీ, అవధిలోనూ విడుదల చేస్తున్నాం. పైరసీని తగ్గించగలం కానీ, పూర్తిగా నిర్మూలించడం అసాధ్యం. థియేటర్లలోనే చూడాలనిపించేలా సినిమాల్ని తీస్తేనే, ప్రేక్షకులంతా థియేటర్లకు వస్తారు. 'అఖండ 2' అలాంటి హంగులతోనే రూపొందింది. మా సంస్థ నుంచి సగటున ఏడాదికి ఒక సినిమా చొప్పున వస్తోంది. 'బైసన్ నాయుడు' చిత్రీకరణ పూర్తయింది. రెండు నెలల్లో ఆ సినిమాని విడుదల చేస్తాం. ఆ తర్వాత రెండు చిత్రాలు కొత్త నటులతో చేయబోతున్నాం. ఒక భారీ సినిమా కూడా ప్రణాళికలో ఉంది. త్వరలోనే ఆ వివరాల్ని ప్రకటిస్తాం".

'వన్ బై ఫోర్'.. అసలు నిరుత్సాహపరచదు



అపర్ణ, వెంకటేశ్, హీనా సోని, అపర్ణ శెట్టి

వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్, హీనా సోని నాయకానాయికలుగా బాహుబలి పళని కె తెరకెక్కించిన చిత్రం 'వన్ బై ఫోర్'. రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 12న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ.. "టంగ్ స్లిప్ అనే పాయింట్‌తో ఈ క్రైమ్ డ్రామాను రూపొందించాం. 'బాహుబలి'కి పని చేసిన దర్శకుడు పళని దీన్ని రాజమౌళి స్టైల్‌లోనే తెరకెక్కించారు. ఒక్క సీన్ కూడా బోర్ కొట్టించకుండా సినిమా తీశారు" అన్నారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే చిత్రమిది. దీన్ని అందరూ చూసి ఆదరించండి" అన్నారు దర్శకుడు పళని. ఈ కార్యక్రమంలో రాజేశ్ గుంజల్, రాందాస్, అపర్ణ శెట్టి, సోని, సాగర్ వేలూరు తదితరులు పాల్గొన్నారు.

భారత్ - కొరియా భాగస్వామ్యంలో సినిమాలు రావాలి!



యూ ఇన్ - షిక్, సురేశ్ చుక్కపల్లి, లిమ్ సాంగ్ వూ

భవిష్యత్తులో భారతీయ ప్రేక్షకుల కోసం సినిమాలు రూపొందిస్తామన్నారు ప్రముఖ కొరియన్ దర్శకుడు, నిర్మాత యూ ఇన్ - షిక్. తెలుగు ప్రేక్షకుల అభిరుచి తనని ఎంతగానో ఆశ్చర్యపరిచిందని, తాను రూపొందించిన సినిమాల గురించి కూడా ఇక్కడ వివరంగా మాట్లాడుతున్నారన్నారు. ఆయన సోమవారం హైదరాబాద్‌లో జరిగిన మూడవ కొరియన్ చలన చిత్రోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యూ దిల్లీలోని కొరియా రిపబ్లిక్ రాయబార కార్యాలయం, కొరియన్ ఫిల్మ్ కౌన్సిల్, హైదరాబాద్‌లోని కొరియా కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో ప్రసాద్ ల్యాబ్స్‌లో ఈ చిత్రోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పలు కొరియన్ చిత్రాల్ని ప్రదర్శించారు. అనంతరం యూ ఇన్-షిక్ మాట్లాడుతూ "భారతీయ ప్రేక్షకుల కోసమే కాకుండా, తెలుగు ప్రేక్షకుల కోసం కూడా సినిమాలు నిర్మిస్తామ"న్నారు. హైదరాబాద్‌లోని కొరియా కాన్సుల్ జనరల్ సురేశ్ చుక్కపల్లి మాట్లాడుతూ "సాంస్కృతికంగా భారతీయులు, కొరియన్ల మధ్య చాలా సారూప్యతలు ఉన్నాయి. వాళ్లంతా మనలాగే పెద్దల్ని, సంస్కృతిని, మూలాల్ని గౌరవిస్తుంటారు. వాళ్ల పూర్వీకులు ఇక్కడ నివసించారని వాళ్ల నమ్మకం. కొరియన్ వెబ్ సిరీస్‌లు తెలుగు, హిందీలోనూ అనువాదం అవుతున్నాయి. భారతీయ చిన్నారులు, గృహిణులు కొరియన్ డ్రామాల్ని చూస్తున్నారు. వాళ్లు మన భారతీయ సినిమాల్ని ఇష్టపడుతున్నారు. రెండు చిత్ర పరిశ్రమలూ మరింత దగ్గరయ్యేలా, మన హైదరాబాద్‌లో కొరియన్ సినిమాల చిత్రీకరణ జరిగేలా ఇక్కడి సౌకర్యాల గురించి వివరిస్తున్నాం. భారత్ - కొరియా భాగస్వామ్యంలో భవిష్యత్తులో సినిమాలు రావాలని కోరుకుంటున్నాం" అన్నారు. మంగళవారం కొరియన్ బృందం ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించనుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొరియన్ ప్రతినిధి లిమ్ సంగ్ వూ తదితరులు పాల్గొన్నారు.

నెలరాజే యువరాజై...



రక్షణ, రిచర్డ్ రిషి

రిచర్డ్ రిషి కథానాయకుడిగా... మోహన్.జి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ద్రౌపది 2'. రక్షణ ఇందుచూడన్ ద్రౌపది పాత్రలో నటిస్తున్నారు. సోల చక్రవర్తి నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలోని 'నెలరాజే యువరాజై...' అంటూ సాగే పాటని సోమవారం విడుదల చేశారు. కాబోయే వరుడి మనసుని ఊహించుకుంటూ, అతన్ని మనువాడే యువతి పాడుకునే ఈ పాటని జిబ్రాన్ స్వరపరచగా, పద్మలత ఆలపించారు. సామ్రాట్ రచించారు. భారీ హంగులతో, బలమైన కథతో రూపొందుతున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చిత్రవర్గాలు తెలిపాయి. నట్టి నటరాజ్, వేల రామమూర్తి, చిరాగ్ జాని, దినేశ్ లాంబా, గణేశ్ గౌరంగ్, వైగీ మహేంద్రన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, ఛాయాగ్రహణం: ఫిలిప్ ఆర్.సుందర్.

ఫిబ్రవరిలో యుఫోరియా



భూమిక

ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రావల్సిన 'యుఫోరియా' చిత్రాన్ని ఫిబ్రవరి 6కు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించాయి ఆ సినిమా వర్గాలు. గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. నీలిమ గుణ, యుక్తా గుణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భూమిక చావ్లా, గౌతమ్ వాసుదేవ్ మేనన్, సారా అర్జున్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవతరంపై మత్తు పదార్థాల ప్రభావాన్ని స్పృశిస్తూ, ఒక వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న చిత్రమిదని సినీ వర్గాలు తెలిపాయి. "ఆలోచింపజేసే కథ ఇది. ప్రేక్షకులకు ఓ మంచి అనుభవాన్ని పంచేలా దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. 'ఒక్కడు' తర్వాత భూమిక కోసం దర్శకుడు గుణశేఖర్ మరో మంచి పాత్రని ఇందులో సృష్టించారు. మొదట క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న చిత్రాన్ని విడుదల చేయాలనుకున్నాం. అయితే అనుకోకుండా అదే రోజున చాలా సినిమాలు విడుదల తేదీల్ని ప్రకటించాయి. ఆ రద్దీ దృష్ట్యా మా సినిమాని ఫిబ్రవరి 6న విడుదల చేయాలని నిర్ణయించాం. ఇలాంటి సినిమాకి ఒక మంచి విడుదల తేదీ ముఖ్యమని భావించి వెనక్కి వెళ్లామ"ని నిర్మాతలు తెలిపారు. నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచిలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్పలత, సాయిశ్రీనికారెడ్డి, ఆశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ఛాయాగ్రహణం: ప్రవీణ్ కె.పోతన్.

బెల్లా బెల్లా.. బాగున్నావే రసగుల్లా!



రవితేజ, ఆషికా రంగనాథ్

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు రవితేజ. కిశోర్ తిరుమల తెరకెక్కిస్తున్న ఈ సినిమాని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం నుంచి సోమవారం తొలి గీతాన్ని విడుదల చేశారు. "బెల్లా బెల్లా.. ఈసా బెల్లా.. బాగున్నావే రసగుల్లా" అంటూ సాగిన ఈ రొమాంటిక్ గీతానికి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా..సురేశ్ గంగుల సాహిత్యమందించారు. నకాశ్ అజీజ్, రోహిణి ఆలపించారు. ఈ పాటలో రవితేజ - ఆషికాల కెమిస్ట్రీ.. వాళ్లిద్దరూ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నటి ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ.. "మంచి వినోదంతో నిండిన కుటుంబ కథా చిత్రమిది. దీంట్లో నా పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది" అంది. "ఈ సినిమాలో నేను బాలమణి పాత్రలో నటిస్తున్నా. మాస్ మహారాజా ఎనర్జీ ఎలా ఉంటుందన్నది సంక్రాంతికి అందరూ చూస్తారు" అంది నటి డింపుల్ హయతి. ఈ చిత్రానికి కూర్పు: శ్రీకర్ ప్రసాద్, ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల.

పునర్ శ్రవణ ప్రాప్తిరస్తు!



కాక్లియర్ ఇంప్లాంట్. అత్యంత విజయవంతమైన వైద్య ఆవిష్కరణల్లో ఒకటి. బ్రహ్మ చెవుడు గలవారికి తిరిగి వినికిడిని రప్పించటంలో.. మాటలను అర్థం చేసుకోవటానికి, చుట్టుపక్కల ప్రపంచంతో మమేకం కావటంలో ఎంతగానో తోడ్పడుతోంది. ఒకప్పటికన్నా ఇప్పుడు ఇంప్లాంట్స్ అధునాతన రూపం సంతరించుకున్నాయి. రాన్రానూ వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. వీటి అమరిక అవసరమైనవారి పరిధి సైతం విస్తరిస్తోంది. ఫలితంగా ఇప్పుడు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స వయసుతో నిమిత్తం లేకుండా.. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎందరికో పునర్ శ్రవణ భాగ్యాన్ని ప్రసాదిస్తోంది. దీనిపై సమగ్ర కథనం ఈవారం మీకోసం.



డా॥ ఎన్.విష్ణుస్వరూప్ రెడ్డి
కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్
కేర్ హాస్పిటల్
బంజారాహిల్స్
హైదరాబాద్

మనం అప్రయత్నంగా శబ్దాలను వింటుంటాం గానీ ఇదో సంక్లిష్ట ప్రక్రియ. ఇందుకోసం చెవిలో పెద్ద తతంగమే నడుస్తుంది. బయటి చెవి నుంచి వచ్చే శబ్దాలకు కర్ణభేరి స్పందించటంతో వినికిడి ప్రక్రియ మొదలవుతుంది. కర్ణభేరి కంపించగానే మధ్య చెవిలోని మూడు గొలుసు ఎముకలూ ప్రకంపిస్తాయి. వీటిల్లో చివరి ఎముక లోపలి చెవిలోని వర్తులాకార గొట్టం (కాక్లియా)తో అనుసంధానమవుతుంది. ఈ కాక్లియాలోని ద్రవంలో రోమకణాలు తేలియాడుతూ ఉంటాయి. కర్ణభేరి, గొలుసు ఎముకల కంపనాలకు ద్రవంలో సున్నితమైన అలలు లేస్తాయి. అప్పుడు రోమకణాలు ఊగటం, వీటి నుంచి విద్యుత్ ప్రచోదనాలు ఉత్పత్తి కావటం, అవి శ్రవణ నాడి ద్వారా మెదడుకు చేరుకోవటం, శబ్దాన్ని విన్న అనుభూతి కలగటం అంతా ఒక క్రమపద్ధతిలో సాగుతుంది. ఇందులో ఎక్కడ సమస్య తలెత్తినా వినికిడి లోపిస్తుంది. అయితే లోపలి చెవి సమస్యలు చికిత్సకు ఒక పట్టాన లొంగవు. ఇక్కడే కాక్లియర్ ఇంప్లాంట్ ఆదుకుంటుంది. ఇది వినికిడి సాధనాలతో ఫలితం లేనివారికి అద్భుత వరంగా పనిచేస్తుంది.

ఎలా పనిచేస్తుంది?



కాక్లియర్ ఇంప్లాంట్‌ను కొందరు వినికిడి సాధనమని భావిస్తుంటారు. వినికిడి సాధనాలు శబ్దాల తీవ్రతను మాత్రమే పెంచుతాయి. కానీ కాక్లియర్ ఇంప్లాంట్ అలా కాదు. వినికిడికి మూలమైన శ్రవణనాడిని ప్రేరేపించి, శబ్దాలు వినిపించేలా చేస్తుంది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. రిసీవర్ స్టిమ్యులేటర్ భాగాన్ని చెవి వెనకాల ఆపరేషన్ చేసి, లోపల అమరుస్తారు. దీనికి గల ఎలక్ట్రోడ్ తీగలను కర్ణభేరి కింది నుంచి, కాక్లియాలోకి ప్రవేశపెడతారు. మైక్రోఫోన్, స్పీచ్ ప్రాసెసర్, ట్రాన్స్‌మిటర్‌తో కూడిన రెండో భాగాన్నేమో చెవి వెనకాల బయట అమరుస్తారు. లోపలి, వెలుపలి భాగాలు రెండూ వీటిల్లోని అయస్కాంతం సాయంతో పట్టుకొని ఉంటాయి. వెలుపలి భాగంలోని మైక్రోఫోన్ గ్రహించిన ధ్వనులు సంకేతాలుగా మారి, లోపల అమర్చిన భాగానికి ప్రసారమవుతాయి. ఇవి విద్యుత్ ప్రచోదనాలుగా మారి, ఎలక్ట్రోడ్ తీగ ద్వారా క్లాకియాలోకి చేరతాయి. అప్పుడు శ్రవణ నాడీ కణాలు ప్రేరేపితమై ఆ సమాచారాన్ని మెదడుకు పంపిస్తాయి. వీటిని మెదడు విశ్లేషించి, ధ్వని రూపంలో వినిపిస్తుంది.

చెవి భాగంలో మత్తుతోనే

శిశువులకు, చాలామంది పిల్లలకు ఇప్పటికీ జనరల్ అనస్థీషియాతో చేసే శస్త్రచికిత్సే ప్రామాణికం. అయితే ఇప్పుడు పెద్దవారిలో కొందరికి చెవి వెనక భాగానికి మాత్రమే లోకల్‌గా మత్తు ఇచ్చి శస్త్రచికిత్స చేయటమూ సాధ్యమవుతోంది. గుండె, ఊపిరితిత్తి, కిడ్నీ, కాలేయ జబ్బుల వంటివి గలవారికి మత్తుమందుతో ముడిపడిన దుష్ప్రభావాలు తగ్గటానికి, త్వరగా కోలుకోవటానికిది ఉపయోగపడుతుంది. (మేం తొమ్మిదేళ్ల క్రితమే తొలిసారిగా లోకల్ అనస్థీషియాతో ఒకే ఊపిరితిత్తి గల వ్యక్తికి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స చేశాం. ఇప్పటివరకూ జనరల్ అనస్థీషియా ఇవ్వటం కుదరని 30 మందికి ఈ పద్ధతిని అనుసరించాం. మనదేశంలో లోకల్ అనస్థీషియాతో ఇంత ఎక్కువ సంఖ్యలో కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చటం మరెక్కడా లేదు. ఒకరికి ఒకేసారి రెండు చెవుల్లోనూ ఇంప్లాంట్ అమర్చాం కూడా).

ముప్పులు తక్కువే

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సతో పెద్దగా ముప్పులేవీ ఉండవనే చెప్పాలి. చాలా అరుదుగా ఇన్‌ఫెక్షన్ రావొచ్చు. కొందరికి పరికరం విఫలం కావొచ్చు. శస్త్రచికిత్సకు ముందు మెదడుపొర వాపు రాకుండా న్యూమోవాక్, హిబ్ టీకాలు తీసుకోవటం తప్పనిసరి.

త్వరగా అమర్చితే మరింత ప్రయోజనం

వినికిడిలోపాన్ని గుర్తిస్తే.. ముఖ్యంగా శిశువులకు, పిల్లలకు వీలైనంత త్వరగా కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ప్రస్తుతం నవజాత శిశువులకు వినికిడి పరీక్ష చేయిస్తున్నందున ముందుగానే వినికిడిలోపాన్ని గుర్తించటమూ సాధ్యమవుతోంది. కొద్ది వారాల వయసులోనే సమస్య బయటపడుతోంది. తీవ్ర వినికిడిలోపం ఉన్నట్టు తేలితే 6-12 నెలల్లోనే కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చాలని అంతర్జాతీయ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. మెదడుపొర వాపుతో కాక్లియా దెబ్బతింటే ఇంకాస్త ముందుగానే అమర్చాలనీ చెబుతున్నాయి. దీంతో మాటలు మామూలుగా వచ్చేలా చూసుకోవచ్చు. లేకపోతే మూగవారిగా మిగిలిపోయే ప్రమాదముంది. ఎందుకంటే మనం ఎదుటివారి మాటలను వినటం, వాటిని అనుకరించటం ద్వారానే మాట్లాడటం నేర్చుకుంటాం మరి. రెండేళ్ల వయసులోపు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసిన పిల్లలకు మాటలు బాగా వస్తున్నట్టు అధ్యయనాలు, అనుభవాలు సూచిస్తున్నాయి. అందరిలా బడికి వెళ్లి చదువుకోవచ్చు. ఇతరులతో మాట్లాడే నైపుణ్యాలూ మెరుగవుతాయి. మాటలు రావటానికి ముందు.. అంటే 1-6 ఏళ్ల పిల్లలకు వినికిడి సాధనాలతో ప్రయోజనం కనిపించకపోతే, వీలైనంత త్వరగా కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చటమే మంచిది. అనంతరం రెండేళ్ల పాటు మాటలను వినిపించి, అర్థం చేసుకోవటానికి ఇచ్చే చికిత్స (ఏవీటీ) అవసరమవుతుంది.

మాటలు వచ్చిన తర్వాత వినికిడిలోపం తలెత్తిన పిల్లలకైతే (5–6 ఏళ్ల వయసులో)– మాటలు రాకముందు వినికిడి లోపించినవారితో పోలిస్తే వీరికి కాక్లియర్ ఇంప్లాంట్‌తో మరింత ఎక్కువ ఫలితం కనిపిస్తుంది. అప్పటికే శ్రవణ సంబంధ జ్ఞాపకం ఉండటం వల్ల త్వరగా పరికరానికి అలవాటు పడతారు. 3-6 నెలల్లోపే ఫోన్‌లో మాట్లాడగలిగే స్థితికి చేరుకుంటారు. మామూలుగా నలుగురితో మాట్లాడే సామర్థ్యం త్వరగా అబ్బుతుంది.

పెద్దవారికైతే– దీర్ఘకాలంగా వినికిడి లోపిస్తే.. ముఖ్యంగా శక్తిమంతమైన డిజిటల్ వినికిడి సాధనాలు పెట్టుకున్నా శబ్దాలు వినపడనివారికి కాక్లియర్ ఇంప్లాంట్స్ ఎంతో మేలు చేస్తాయి. శబ్దాలు స్పష్టంగా వినిపించేలా చేయటం ద్వారా ఇతరుల మీద ఆధారపడటాన్ని తగ్గిస్తున్నాయి. ఆత్మ విశ్వాసం, నలుగురితో సంబంధ బాంధవ్యాలు పెరగటానికి తోడ్పడుతున్నాయి. రోజువారీ పనులు హాయిగా చేసుకోవటం, భావోద్వేగ పరంగా స్థిరంగా ఉండటం సాధ్యమవుతుంది. చెవిలో మోత గలవారికి సమస్య తగ్గుముఖం పడుతుంది.

- అయితే కాక్లియర్ ఇంప్లాంట్ ఫలితాలు సమయానికి శస్త్రచికిత్స చేయటం, తగిన పరికరాన్ని ఎంచుకోవటం, అమర్చిన అనంతరం తీసుకునే మాటలను అర్థం చేయించే చికిత్స మీద ఆధారపడి ఉంటాయని గుర్తుంచుకోవాలి.

ఎవరికి అవసరం?

● పుట్టుకతో గానీ మాటలు వచ్చిన తర్వాత గానీ వినికిడి లోపించిన పిల్లలకు, పెద్దలకు. ● రెండు చెవుల్లోనూ తీవ్రమైన వినికిడిలోపం గలవారికి (ప్యూర్‌టోన్ ఆడియో పరీక్షలో సగటున 70-80 డెసిబెల్స్‌కు మించి లోపం ఉన్నవారికి).
● వినికిడి సాధనాలతో అంతగా ఫలితం కనిపించనివారికి.
● పదాలను 50-60%, అంతకన్నా ఎక్కువగా గుర్తించలేనివారికి.
● వాక్యాలను 40-60%, అంతకన్నా ఎక్కువగా పసిగట్టలేనివారికి
● రణగొణధ్వనుల మధ్య మాటలు సరిగా వినిపించనివారికి
● వినికిడి సాధనాల తీవ్రతను పూర్తిస్థాయిలో పెంచినా ఫలితం లేనివారికి
● శ్రవణనాడి దెబ్బతినటం వల్ల హఠాత్తుగా వినికిడిలోపం తలెత్తినా లేదా క్రమంగా పెరుగుతూ వస్తూ మందులతో ప్రయోజనం కలగనివారికి

ఆర్థిక సాయం కూడా


కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స చేయించుకోవటానికి పేద పిల్లలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం లభిస్తోంది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ఎంపికచేసిన రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, ప్రైవేట్, కార్పొరేట్ బీమా వంటివీ ఆదుకుంటున్నాయి.

సురక్షితం, అధునాతనం

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స సురక్షితం. చిన్నకోతతోనే చేయటం సాధ్యమవుతోంది. ఫలితం ఎలా ఉంటుందో ముందే అంచనా వేయొచ్చు కూడా. ఇది సహజ వినికిడి ఏదైనా మిగిలుంటే దాన్ని కొనసాగేలా చేస్తుంది కూడా. ఆధునిక ఎలక్ట్రోడ్లు చాలా సన్నగా, మృదువుగా ఉంటున్నాయి. అందువల్ల మధ్య చెవికి ఇబ్బంది కలిగించవు. ఇవి 3 టెస్లా వరకూ ఎంఆర్ఐనీ తట్టుకోగలవు.

● అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రాసెసర్లూ ఉన్నాయి. ఏఐ సాయంతో రణగొణధ్వనులను తగ్గించటం, స్మార్ట్‌ఫోన్‌తో నేరుగా కనెక్ట్ కావటం, వైర్‌లెస్‌గా శబ్దాలను ప్రసారం చేయటం, చెవి వెనకభాగంలో చిన్నగా ఒదిగిపోవటం వంటి సౌకర్యాలు ఆకట్టుకుంటున్నాయి. వేర్వేరు వాతావరణాల్లో వాటంతటవే శబ్దాన్ని ప్రాసెస్ చేసే స్మార్ట్ సౌండ్ పరిజ్ఞానంతోనూ వస్తున్నాయి.

● కొన్ని కంపెనీలు ఇంట్లో నుంచే మ్యాపింగ్ చేయటానికి, అక్కడి నుంచే శబ్దాల తీవ్రతను సవరించుకోవటానికీ (టెలి-ఆడియాలజీ) వీలు కల్పిస్తున్నాయి. ఇది గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారికి, వృద్ధులకు, ఇతర దేశాల్లో ఉండేవారికి ఎంతో అనువుగా ఉంటుంది.



వర్ధమాన విధానాల ఆశ


కచ్చితంగా పరికరాన్ని అమర్చటానికి రోబోటిక్ పద్ధతి సాయంతో ఇంప్లాంట్ అమర్చటం, జన్యుపరంగా తలెత్తే వినికిడిలోపాన్ని సరిచేయటానికి జన్యు చికిత్స వంటి విధానాలు పురుడుపోసుకోవటం ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. పూర్తిగా చెవి లోపలే అమర్చే ఇంప్లాంట్‌లూ రూపుదిద్దుకుంటున్నాయి. కృత్రిమ మేధ ఆధారిత అంచనా మోడళ్లు, ఆయా వ్యక్తులకు అనుగుణంగా వినికిడి తీరును తీర్చిదిద్దటానికి తోడ్పడే మ్యాపింగ్ వ్యవస్థలు ఆసక్తి కలిగిస్తున్నాయి. ఇవి త్వరగా కోలుకోవటానికి, మరింత స్పష్టంగా వినపడటానికి, ఎక్కువమందికి చికిత్సలు అందుబాటులోకి రావటానికీ వీలు కల్పించనున్నాయి.


అన్నం ముద్ద కిందికి దిగదేం?

సమస్య సలహా

సమస్య: నాకు 69 ఏళ్లు. తినేటప్పుడు ముద్ద ఛాతీలోనే ఆగుతుంది. కిందికి దిగదు. గాలి పట్టేసినట్టు అనిపిస్తుంది. చాలాసేపటికి గానీ కుదురుకోదు. ఇదేమైనా జబ్బా? – **నూతి సత్యానంద్, హయత్‌నగర్**

సలహా: మీరు అన్నవాహిక సమస్యతో బాధపడుతున్నారని అనిపిస్తోంది. మీ వయసు 69 అంటున్నారు కాబట్టి వెంటనే కారణమేంటో తెలుసుకోవటం చాలా ముఖ్యం. గొట్టం మాదిరిగా ఉండే అన్నవాహిక క్రమబద్ధంగా కదులుతూ, తిన్న ఆహారాన్ని జీర్ణాశయంలోకి చేరవేస్తుంది. మీరు చెప్పిన లక్షణాలన్నీ దీని లోపలి మార్గం సన్నబడటం లేదా కదలికలు తగ్గటాన్ని సూచిస్తున్నాయి. దీర్ఘకాలంగా జీర్ణాశయంలోని ఆమ్లం పైకి ఛాతీలోకి ఎగదన్నుకొని రావటంతో అన్నవాహికలో మచ్చ ఏర్పడి, మార్గం సన్నబడొచ్చు. కొన్నిసార్లు కణితులతోనూ ఇలా జరగొచ్చు. అరుదుగా అన్నవాహిక కింది భాగంలో కణజాలం రింగులా ఏర్పడటం (షాట్జ్కీ రింగ్), జీర్ణాశయంలోని కొంతభాగం ఛాతీలోకి చొచ్చుకురావటం (హయటస్ హెర్నియా), అన్నవాహిక పైభాగంలో సాలెగూడులా పొర ఏర్పడటం (ఈసోఫేగల్ వెబ్), బయటి నుంచి అన్నవాహిక మీద ఒత్తిడి పడటం మూలంగానూ ముద్ద సరిగా మింగుడుపడకపోవచ్చు. ఈ సమస్యలను ఎండోస్కోపీ లేదా గ్యాస్ట్రోస్కోపీతో తేలికగానే గుర్తించొచ్చు. వీలైనంత త్వరగా, సరైన చికిత్స తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. అన్నవాహిక కండరాలు సరిగా సంకోచించక పోయినా (అకలేషియా కార్డియా) ముద్ద కిందికి దిగకపోవచ్చు. దీనికి ఎండోస్కోపీ పద్ధతిలో చికిత్స చేయొచ్చు. అన్నవాహిక కండరాలు పట్టేయటం (ఈసోఫేగల్ స్పాజమ్), అన్నవాహిక అస్తవ్యస్తంగా సంకోచించటం మూలంగానూ ఇలాంటి ఇబ్బందులు తలెత్తొచ్చు. ఇవి తగ్గటానికి మందులున్నాయి. రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు, స్టిరాయిడ్ మందులు వేసుకునేవారు, యాంటీబయాటిక్స్ అధికంగా వాడేవారు, ఆస్తమా వంటి జబ్బులకు ఇన్‌హేలర్లు వాడేవారిలో అన్నవాహికలో ఫంగస్ ఇన్‌ఫెక్షన్ (క్యాండిడయాసిస్) తలెత్తొచ్చు. ఇదీ ముద్ద కిందికి దిగకపోవటం వంటి ఇబ్బందులు కలిగించొచ్చు. గ్యాస్ట్రోస్కోపీతో దీన్ని తేలికగా గుర్తించొచ్చు. నిర్ణీత కాలం యాంటీఫంగల్ మందులు వాడితే నయమవుతుంది. వేగంగా బరువు తగ్గటం, ముద్ద అక్కడే చిక్కుకుపోవటం, రక్తహీనత వంటి తీవ్ర లక్షణాలు కనిపిస్తే మాత్రం సత్వరం డాక్టర్‌ను సంప్రదించటం మంచిది.





- డా॥ కె.జగన్మోహన రావు
సీనియర్ గ్యాస్ట్రోఎంటెరాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

ఎనామిల్‌ను తిరిగి వృద్ధి చేసే జెల్

డ్రిల్లింగ్, ఫిల్లింగ్ లేకుండా పిప్పి పళ్లకు చికిత్స చేయగలిగితే? అలాంటి రోజులు మరెంతో దూరంలో లేవు. క్షీణించిన ఎనామిల్‌ను తిరిగి వృద్ధి చేయగల గ్లిజరాల్-స్టేబిలైజ్డ్ క్యాల్షియం ఫాస్ఫేట్ జెల్‌ను శాస్త్రవేత్తలు రూపొందించారు మరి. బాల్యంలో దంతాల మీద దృఢమైన ఎనామిల్ పొర ఏర్పడటానికి తోడ్పడే సహజ ప్రక్రియనే ఇదీ అనుకరిస్తుంది. అందుకే దంత సమస్యల నివారణలో ఈ జెల్ మేలిమలుపు కాగలదని భావిస్తున్నారు. ప్రసుతం పిప్పిపళ్లను మరమ్మతు చేయటం లేదా నివారించుకోవటం మీదే దృష్టి సారిస్తున్నారు. కొత్త జెల్ అందుబాటులోకి వస్తే ఎనామిల్‌ను సహజంగా తిరిగి వృద్ధి చేయటం సాధ్యమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

హఠాత్ మధుమేహమా?

బరువు పెరగటం, ఊబకాయం వంటి ముప్పు కారకాలేవీ లేకుండా ఉన్నట్టుండి, రాత్రికి రాత్రే రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరిగిపోయాయా? ఇది క్లోమగ్రంథి (పాంక్రియాస్) ఇబ్బందిలో పడిందనటానికి సంకేతం కావొచ్చు. తక్షణం మేల్కోవటం మంచిదని తాజా అధ్యయనం ఒకటి చెబుతోంది.

సాధారణంగా టైప్2 మధుమేహం క్రమంగా తలెత్తుతూ వస్తుంటుంది. హఠాత్ మధుమేహం అలా కాదు. ఉన్నట్టుండి రక్తంలో గ్లూకోజు మోతాదులు బాగా పెరుగుతాయి. దీనికి క్లోమం వాపు (పాంక్రియాటైటిస్), దానిపై రోగనిరోధక వ్యవస్థ దాడి చేయటం లేదా అరుదే అయినా పాంక్రియాస్ క్యాన్సర్ వంటి తీవ్ర సమస్యలు కారణం కావొచ్చు. అక్యూట్ పాంక్రియాటైటిస్.. అంటే ఉన్నట్టుండి క్లోమగ్రంథి వాపునకు గురైన ప్రతి ఐదుగురిలో ఒకరు ఆ తర్వాత మధుమేహం బారినపడుతున్నట్టు ఫ్రాంటియర్స్ ఇన్ ఫిజియాలజీ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంటోంది. హఠాత్ మధుమేహానికీ క్లోమగ్రంథి ఆరోగ్యానికీ సంబంధం ఉంటున్నట్టు ఇది చెబుతోంది. క్లోమం వాపు, క్యాన్సర్ వంటి సమస్యలు గ్రంథి పనితీరును అస్తవ్యస్తం చేయటం మూలంగా గ్లూకోజు మోతాదుల నియంత్రణా గాడి తప్పుతుంది మరి.



ఎందుకిలా?

రక్తంలో గ్లూకోజు మోతాదులను నియంత్రించే ఇన్సులిన్ హార్మోన్ క్లోమగ్రంథి నుంచే ఉత్పత్తి అవుతుంది. ఈ గ్రంథి వాచినా, గాయపడినా, దానిపై రోగనిరోధక వ్యవస్థ దాడి చేసినా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నట్టుండి పడిపోతుంది. ఇలా ఇన్సులిన్ మోతాదులు హఠాత్తుగా తగ్గటం వల్ల రక్తంలో గ్లూకోజు స్థాయులు హఠాత్తుగా పెరుగుతాయి. ఇది మధుమేహాన్ని ప్రేరేపిస్తుంది.

పరీక్షించుకోవటం మేలు

హఠాత్తుగా మధుమేహం బయటపడితే వయసుతో పాటు వచ్చి ఉండొచ్చని కొట్టిపారేయకుండా క్లోమగ్రంథి సమస్యలేవైనా ఉన్నాయేమో పరీక్షించుకోవటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా బక్క పలుచగా ఉన్నవారు, చురుకుగా శారీరక శ్రమ చేసేవారు, 50 ఏళ్లు పైబడినవారిలో మధుమేహ లక్షణాలేవీ లేకుండా ఉన్నట్టుండి గ్లూకోజు మోతాదులు పెరిగితే అసలే నిర్లక్ష్యం చేయొద్దని చెబుతున్నారు. కడుపు స్కానింగ్, క్లోమగ్రంథి ఎంజైమ్‌ల విశ్లేషణతో అంతర్గత వాపు, కణితుల వంటి సమస్యలను మరింత తీవ్రం కాకముందే గుర్తించొచ్చు.


గ్లూకోజు పరీక్షలూ

అక్యూట్ పాంక్రియాటైటిస్‌కు గురైనవారు క్రమం తప్పకుండా గ్లూకోజు పరీక్షలూ చేయించుకోవాలని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా మద్యం అలవాటు గలవారు, క్లోమం వాపుతో కణజాలం చచ్చుబడినవారికిది తప్పనిసరని వివరిస్తున్నాయి. వీరిని నిశితంగా గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం. సమస్యను ముందే గుర్తించి, చికిత్స తీసుకుంటే పరిస్థితి దిగజారకుండా చూసుకోవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, మద్యం జోలికి వెళ్లకపోవటం వంటి జాగ్రత్తలతో కాపాడుకోవచ్చు.

ఆహారం, వ్యాయామం రెండూ కలిస్తే..

బరువు తగ్గటానికి.. ముఖ్యంగా పొట్టలో అవయవాల చుట్టూ పోగుపడే హానికర కొవ్వును తగ్గించుకోవటానికి ప్రయత్నిస్తున్నారా? అయితే ఆహార, వ్యాయామ నియమాలు రెండూ పాటించి చూడండి.

ఆహార నియమాలు, వ్యాయామాల్లో ఏదో ఒకదాన్ని అనుసరించటంతో పోలిస్తే రెండింటినీ పాటించినవారిలో అవయవాల చుట్టూరా కొవ్వు మరింత ఎక్కువగా తగ్గుతున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి అధ్యయనం సూచిస్తోంది. మన ఒంట్లో కొవ్వు వేర్వేరు చోట్ల స్థిరపడుతుంది. ఎక్కడ పోగుపడిందనే దాన్ని బట్టి ఆరోగ్యకరమా? హానికరమా? అని నిర్ణయిస్తుంటారు. ఉదాహరణకు- చర్మం కింద ఉండే కొవ్వు ఆరోగ్యకరమైందని భావిస్తే.. పొట్టలో అవయవాల చుట్టూ పోగుపడే కొవ్వును హానికరమైందని పరిగణిస్తారు. ఇది మధుమేహం, కాలేయానికి కొవ్వు పట్టటం, గుండెజబ్బుల వంటి సమస్యల ముప్పు పెరిగేలా చేస్తుంది. అందుకే ఆహార, వ్యాయామాలతో దీన్ని తగ్గించుకోవాలని నిపుణులు సూచిస్తుంటారు. అయితే చాలామంది ఆహార నియమాలు పాటిస్తున్నాం కదాని వ్యాయామాన్ని పెద్దగా పట్టించుకోరు. కొందరు వ్యాయామం చేస్తున్నాం కదాని, ఏం తిన్నా ఫర్వాలేదని భావిస్తుంటారు. నిజానికి వీటిల్లో ఏదో ఒకటి ఎంచుకునేవారితో పోలిస్తే- రెండింటినీ కలిపి పాటించినవారిలో సగటున 1.9 కిలోల మొత్తం కొవ్వు, 150 గ్రాముల పొట్టలో కొవ్వు ఎక్కువగా తగ్గినట్టు పరిశోధకులు గుర్తించారు. ఇది చాలా గొప్ప తేడా అని.. 1.9 కిలోలంటే వీరి సగటు శరీర కొవ్వులో దాదాపు 7 శాతంతో సమానమని వివరిస్తున్నారు. ఇక పొట్టలో కొవ్వు 150 గ్రాములంటే వీరి అవయవాల చుట్టూరా ఉన్న కొవ్వులో 16% తగ్గటంతో సమానమని చెబుతున్నారు. అనారోగ్యకర ఆహార అలవాట్లు, బద్ధకాన్ని ప్రోత్సహించే వాతావరణంలో నివసిస్తున్న తరుణంలో జీవనశైలిలో చిన్న మార్పులు చేసుకున్నా పెద్ద ఫలితం కనిపిస్తున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.



హైబీపీకి నిద్ర కళ్లెం

రోజూ ఒకే సమయానికి పడుకోవటం, లేవటం మంచిదని పెద్దలు చెబుతుంటారు. ఇది జీవితంలో వృద్ధి చెందటానికే కాదు.. ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది. పరిశోధనలూ దీన్ని బలపరుస్తున్నాయి. రాత్రిపూట రోజూ ఒకే సమయానికి (లేదా ఆ సమయానికి దగ్గరగా) పడుకుంటే అధిక రక్తపోటు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నట్టు స్లీప్ అడ్వాన్సెస్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంటోంది. ముఖ్యంగా రాత్రిపూట రక్తపోటు బాగా తగ్గుతోందని వివరిస్తోంది. అప్పటికే హైబీపీ తగ్గటానికి మందులు వేసుకుంటున్న వారిలోనూ నిద్ర వేళలు మంచి ప్రభావం చూపుతుండటం విశేషం. ఈ అధ్యయనంలో అధిక రక్తపోటుతో బాధపడుతున్న కొందరు మధ్యవయసు వ్యక్తులను ఎంచుకొని రెండు వారాల పాటు ఒకే సమయానికి పడుకోవాలని, పగటి కునుకు మానెయ్యాలని సూచించారు. వీరెవరికీ ఎక్కువ లేదా తక్కువ సేపు నిద్రించాలని చెప్పలేదు. కేవలం సమయానికి మాత్రమే పడుకోవాలని చెప్పారు. దీంతో ఆశ్చర్యకర ఫలితాలు వెలువడ్డాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, ఉప్పు తగ్గించటంతో సమానంగా.. రోజంతా సిస్టాలిక్ రక్తపోటు (పై సంఖ్య) 4 ఎంఎంహెచ్‌జీ, డయాస్టాలిక్ రక్తపోటు (కింది సంఖ్య) 3 ఎంఎంహెచ్‌జీ తగ్గటం గమనార్హం. రాత్రిపూటైతే మరింత ఎక్కువగా.. సిస్టాలిక్ రక్తపోటు 5 ఎంఎంహెచ్‌జీ, డయాస్టాలిక్ రక్తపోటు 4 ఎంఎంహెచ్‌జీ తగ్గింది కూడా. రాత్రిపూట 5 ఎంఎంహెచ్‌జీ రక్తపోటు తగ్గినా గుండెజబ్బు ముప్పు 10% కన్నా ఎక్కువగా తగ్గుతుండటం గమనార్హం.



ఆ ఆందోళన తీరే వేరు

ముట్లుడిగే దశకు చేరుకుంటున్నప్పుడు (పెరిమెనోపాజ్) మహిళల్లో కొన్ని మూడ్ మార్పులు కనిపిస్తుంటాయి. నిజానికి ప్రతి పది మందిలో దాదాపు నలుగురు ఆందోళన వంటి ఇబ్బందులతో సతమతమవుతుంటారు. అప్పటికే ఆందోళన సమస్యతో బాధపడుతున్నవారికిది మరింత తీవ్రమవుతుంటుంది కూడా. దీనికి రకరకాల కారణాలు దోహదం చేస్తుంటాయి.

హార్మోన్ల అస్తవ్యస్తం: రుతుక్రమం ఆగిపోయే దశ సమీపిస్తున్నప్పుడు ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల మోతాదులు పడిపోతుంటాయి. సెరటోనిన్ స్థాయులూ తగ్గుముఖం పడతాయి. ఇది చిరాకు, దిగులు, ఆందోళనకు దారితీస్తుంది. మరోవైపు ఒత్తిడికి కారణమయ్యే కార్టిజోల్ హార్మోన్ పెరగటం సమస్యను మరింత తీవ్రం చేస్తుంది.

శారీరక ఇబ్బందులు: వేడి ఆవిర్లు, రాత్రిపూట చెమట పట్టటం, నిద్ర అస్తవ్యస్తం కావటం వంటి ఇబ్బందులూ ఆందోళనకు గురిచేస్తుంటాయి.

లక్షణాలు రకరకాలు: ముట్లుడుగుతున్న దశలో ఒక్క ఆందోళన మాత్రమే కాదు.. నిరాశ, నిస్పృహ, గుండె దడ, చెమట అతిగా పోయటం, వణుకు, జీర్ణ సమస్యలు, మతిమరుపు, ఏకాగ్రత లోపించటం వంటి లక్షణాలూ కనిపిస్తుంటాయి.

తగ్గించుకోవటమెలా?: క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, ఆరోగ్యకర ఆహారం తినటం, కంటి నిండా నిద్రపోవటం.. యోగా, ధ్యానం వంటి పద్ధతులతో మానసిక ఒత్తిడిని నియంత్రించుకోవటం ద్వారా ఆందోళన తగ్గించుకోవచ్చు. ● కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (సీబీటీ) కూడా మేలు చేస్తుంది. ఇందులో ప్రతికూల ఆలోచనల నుంచి మనసును మళ్లించి, సానుకూలంగా ఆలోచించేలా కౌన్సెలింగ్ ఇస్తారు. ● కొందరికి ఆందోళన తగ్గించే, నిద్ర పట్టేలా చేసే మందులూ అవసరమవ్వచ్చు.



»»»» చలి నొప్పులు

చలికాలం కొందరికి హాయిగానే ఉంటుంది. కొందరికి మాత్రం నొప్పులతో వేధిస్తుంది. అవును. చలికాలంలో కండరాలు, ఎముకల నొప్పులు తీవ్రమవుతుంటాయి. భుజాలు బిగుసుకుపోవటం, మోకాళ్లలో స్వల్పంగా ఇబ్బంది కలగటంతో మొదలై.. క్రమంగా నొప్పులు ఎక్కువ వుతూ వస్తుంటాయి. దీంతో మెట్లు ఎక్కటం, ముందుకు వంగటం, కాఫీ చేత్తో పట్టుకోవటం వంటి మామూలు పనులూ పెద్దవిగా తోస్తుంటాయి. ఇంతకీ చలి కాలంలో నొప్పులు ఎందుకు తీవ్రమవుతాయి?

కారణాలు ఇవీ..

కండరాలు బిగుసుకోవటం: వాతావరణంలో ఉష్ణోగ్రత పడిపోయినప్పుడు కండరాలు, స్నాయువులు బిగుతుగా అవుతాయి. దీంతో అవి సాగే గుణం తగ్గి నొప్పులు పెరుగుతాయి. ముఖ్యంగా మెడ, నడుం, మోకాళ్లు, భుజాల నొప్పులు ఎక్కువవుతాయి.

రక్త ప్రసరణ తగ్గటం: చలి మూలంగా రక్తనాళాలు సంకోచిస్తాయి. ఫలితంగా కండరాలు, ఎముకలకు రక్తం అందటం తగ్గుతుంది. అంటే మరింత నొప్పి పుట్టటానికి బీజం పడినట్టే. కీళ్లు, కండరాలు కోలుకోవటమూ మందగిస్తుంది.

విటమిన్ డి పడిపోవటం: శీతకాలంలో ఎండ కాయటం తగ్గుతుంది. ఒంటికి తగినంత ఎండ తగలకపోతే విటమిన్ డి మోతాదులూ పడిపోతాయి. ఇది కీళ్లు, నడుం నొప్పులతో పాటు నిస్సత్తువ ఎక్కువ కావటానికీ దారితీస్తుంది.

పాత గాయాలు ఉద్ధృతం: పాత గాయాలతో చర్మం మీద ఏర్పడ్డ మచ్చలు చలి మూలంగా మరింత నొప్పి కలిగేలా చేస్తాయి.

కీళ్లవాపు తీవ్రం: వయసు మీద పడటం వల్ల కీళ్లు అరుగుతుంటాయి. దీంతో కీళ్లు బిగుసుకోవటం, వాపు, నొప్పి కలుగుతుంది. ఇవి చలికాలంలో మరింత ఎక్కువవుతాయి.

కదలకుండా ఉండటం: బయట చలిగా ఉండటం వల్ల చాలామంది ఇంట్లోనే ఉండిపోవటానికి ఇష్టపడుతుంటారు. ఇలా కదలికలు తగ్గటం వల్ల కండరాలు బలహీనపడతాయి, బిగుసుకుంటాయి. ఇవి నొప్పులు తీవ్రమయ్యేలా చేస్తాయి.

ఎలా తగ్గించుకోవాలి?

● దుప్పటి కప్పుకోవటం, నొప్పి ఉన్నచోట వేడి కాపు పెట్టటం, గోరువెచ్చటి నీటితో స్నానం చేయటం ద్వారా కండరాల బిగువు సడలేలా చూసుకోవచ్చు. ● ఉదయం, సాయంత్రం వేళల్లో కాసేపు శరీరాన్ని నెమ్మదిగా సాగదీసే వ్యాయామాలు చేయాలి. ముఖ్యంగా మెడ, వీపు, తొడలు, పిక్కలు సాగదీయటం మీద దృష్టి పెట్టాలి. ● ఆరు బయట ఎండ కాస్తున్నప్పుడు నడవటం, ఇంట్లో సైకిల్ తొక్కటం మంచిది. తేలికైన యోగాసనాలూ మేలే. ఇవి రక్త ప్రసరణ పుంజుకోవటానికి, బిగువు తగ్గటానికి తోడ్పడతాయి. ● చలికాలంలో తగినంత నీరు తాగకపోవటం వల్ల ఒంట్లో నీటిశాతం తగ్గుతుంది. ఇది నొప్పులు తీవ్రమయ్యేలా చేస్తుంది. కాబట్టి రోజుకు 6-8 గ్లాసుల నీరు తాగాలి. ● నొప్పిని తగ్గించే పూత మందులు రాసుకోవటం, గోరువెచ్చటి నూనెతో మర్దన చేసుకోవటం ఉపయోగపడతాయి. అవసరమైతే డాక్టర్ సలహా మేరకు పారాసిటమాల్ వంటి నొప్పి మందులు వేసుకోవాలి. ● చేతులకు గ్లౌజులు, మోకాళ్లకు క్యాప్స్, ఉన్ని సాక్స్ ధరించటం ద్వారా కీళ్లు మరింత దెబ్బతినకుండా చూసుకోవచ్చు.



డాక్టర్ వద్దకు ఎప్పుడు?

నొప్పి విడవకుండా వేధిస్తున్నా, కీళ్లలో వాపు లేదా ఎరుపు తలెత్తినా, నడవటం లేదా పడుకోవటానికి నొప్పి ఇబ్బంది కలిగిస్తున్నా, చేతులు లేదా కాళ్లలో పొడుస్తున్నట్టు గానీ మొద్దుబారినట్టుగానీ అనిపిస్తున్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

కరెంట్ అఫైర్స్

◆ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఎన్ని గిన్నిస్ రికార్డులను నెలకొల్పాయి?



జ: 2 (63 అడుగుల ఎత్తు 11 అడుగుల వెడల్పు, ఏడు టన్నుల పుష్పాలతో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ ప్రపంచంలోనే అతి పెద్ద బతుకమ్మగానూ, 1354 మంది మహిళలు లయబద్ధంగా ఆడి చేసిన అతి పెద్ద జానపద నృత్యానికి రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు లభించాయి.)

మాదిరి ప్రశ్నలు

◆ ప్రపంచ జంతు దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (1925లో ప్రారంభమైన ఈ దినోత్సవం 2025లో 100వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. 2025లో ఈ దినోత్సవాన్ని 'సేవ్ యానిమల్స్ సేవ్ ది ప్లానెట్' అనే థీమ్‌తో నిర్వహించారు.)

జ: అక్టోబరు 4

◆ ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) 2025 ఐయూసీఎన్ వరల్డ్ కన్జర్వేషన్ కాంగ్రెస్ సందర్భంగా ఏ రాష్ట్రంలోని పాక్ బే లో ఉన్న భారతదేశపు మొదటి డుగోంగ్ కన్జర్వేషన్ రిజర్వ్‌ను అధికారికంగా గుర్తించింది?

జ: తమిళనాడు

మరింత సమాచారం

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

కదలని ఆవేశాలు.. మహాశక్తి నిలయాలు!


శీతాకాలంలో ఉదయం నిద్రలేవగానే పైనుంచి దుప్పటి తీస్తున్నప్పుడు ఒక్కోసారి చిన్న షాక్ తగులుతుంటుంది. బెలూన్‌ను తలకు రుద్దినప్పుడు వెంట్రుకలు పైకి లేస్తుంటాయి. నిత్య జీవితంలో కనిపించే ఇలాంటి పలు అంశాల వెనుక వస్తువుల ఉపరితల విద్యుదావేశాల ప్రభావం ఉంటుంది. వస్తువు ఉపరితలంపై విద్యుత్తు ఆవేశాలు పేరుకుపోయి, నిశ్చలంగా ఉండటాన్నే స్థిర విద్యుత్తు అంటారు. అది కరెంటు మాదిరి ప్రవహించకుండా ఒకేచోట స్థిరంగా ఉండిపోతుంది. ఆ విధంగా ఆవేశాలు చలనంలో లేనప్పుడు వాటి మధ్య పని చేసే శక్తులు, వాటి నిల్వ, విడుదల తదితర ప్రక్రియలను పోటీ పరీక్షార్థులు అధ్యయనం చేయాలి. మెరుపులు, పిడుగులు, ఉరుములు తదితరాలు ఏర్పడటంలో స్థిరవిద్యుత్తు ప్రభావాన్ని వివరించే భౌతికశాస్త్ర నియమాలను అర్థం చేసుకోవాలి.



విద్యుత్తు

(స్థిర విద్యుత్తు/స్థావర విద్యుత్తు)


ఆధునిక జీవన విధానం అంతా అనేక రకాల పరికరాలపై ఆధారపడి సాగుతోంది. వాటిలో దాదాపు అన్నింటికీ విద్యుత్తు అవసరం ఉంటుంది. విద్యుత్తు ఒక శక్తి రూపం. విద్యుత్తుకు, విద్యుత్తు ప్రవాహానికి మూలం ఎలక్ట్రాన్‌లు. ఇళ్లు, కార్యాలయాలు, మార్కెట్లు తదితరాలు పని చేయాలన్నా, రాత్రిపూట వెలుతురు కావాలన్నా విద్యుత్తు ఉండాల్సిందే. నిత్య జీవితంలో అతి ముఖ్యమైన ఆ విద్యుత్తు అనేక రకాల వనరుల నుంచి లభిస్తోంది. ★ విద్యుత్తు అనే పదాన్ని మొదట లూయీ గాల్వానీ ఉపయోగించారు. 'వస్తువులను ఘర్షణకు గురిచేస్తే అవి తేలికపాటి వస్తువులను ఆకర్షిస్తాయి' అని 2500 ఏళ్ల కిందటే గ్రీకులు గుర్తించారు. విద్యుత్తును మొదట కనుక్కున్నవారు థేల్స్. ఈయన సిద్ధాంతమే 'థేల్స్ ఆఫ్ మిలిటస్'. క్రీ.పూ.600 సంవత్సరంలో థేల్స్ మొదటిసారి 'స్థావర విద్యుత్తు'ను కనుక్కున్నాడు. సీమ గుగ్గిలం (అంబర్)ను ఉన్ని చర్మంతో రుద్దితే అది చిన్న చిన్న కాగితపు ముక్కలను ఆకర్షిస్తుందని గమనించాడు.



థేల్స్

★ క్రీ.శ. 1600లో విలియం గిల్‌బర్ట్ అనే మరో శాస్త్రవేత్త స్థావర విద్యుత్తును కనుక్కోవడమే కాకుండా నామకరణం కూడా చేశాడు. ఆయన తన ప్రయోగశాలలో గాజుకడ్డీని సిల్కు వస్త్రంతో తుడుస్తున్నప్పుడు చేతిలోని వస్త్రం వేడెక్కింది. ఆ విధంగా చేయడం వల్ల ఘర్షణకు శక్తి పుడుతుందని తెలుసుకున్నాడు.


★ 'సిల్కు వస్త్రంతో రుద్దిన గాజు ధన విద్యుదావేశాన్ని పొందుతుంది. దీనికి కారణం గాజు కడ్డీ కొంత విద్యుదావేశాన్ని కోల్పోతుంది. దానిని సిల్కు వస్త్రం గ్రహించి రుణ విద్యుదావేశాన్ని పొందుతుంది.' అని గిల్‌బర్ట్ తెలిపాడు. ★ బెంజిమెన్ ఫ్రాంక్లిన్ మొదట విద్యుదావేశాలను ధన, రుణ ఆవేశాలుగా వర్గీకరించారు. విద్యుదావేశం అనేది ఒక శక్తి రూపం. ఇది అనేక ఎలక్ట్రాన్‌ల సముదాయం.




బెంజిమెన్ ఫ్రాంక్లిన్

విద్యుత్తు దర్శినులు: ★ విద్యుత్తు ప్రధానంగా 2 రకాలు 1) స్థిర/స్థావర విద్యుత్తు 2) ప్రవాహ విద్యుత్తు ★ స్థావర విద్యుత్తును తెలుసుకోవడానికి వాడే పరికరాలను విద్యుత్తు దర్శినులు అంటారు. ★ ఇది విద్యుదావేశం ఉనికిని తెలియజేసిన తొలి శాస్త్రీయ పరికరం. ఇది 2 రకాలు

1. స్వర్ణపత్ర విద్యుత్తు దర్శిని: ★ ఇది వస్తువులోని విద్యుదావేశాన్ని, ఉనికిని గుర్తించే పరికరం. ★ దీనిలో గాజుజాడీకి రబ్బరు బిరడా అమర్చి, దాని లోపలికి ఒక పిడి ఉన్న లోహపు కడ్డీని అమరుస్తారు. ★ ఆ లోహపు కడ్డీ చివర లోపలి వైపు రెండు బంగారు రేకులు ఒకే స్థానంలో చివరలు అతికించి ఉంటాయి. ★ విద్యుదావేశం ఉన్న వస్తువుతో పిడిని తాకిస్తే, వెంటనే రెండు బంగారు రేకులు వికర్షించుకొని దూరంగా జరుగుతాయి.



2. బెండు బంతి విద్యుత్తుదర్శిని: ★ ఇది వస్తువు మీద స్థిర విద్యుదావేశం ఉందా/ లేదా అని కనుక్కునే ఒక పరికరం. అంటే ఉనికిని గుర్తించే పరికరం. ★ దీంతో వస్తువు మీద ఏ రకమైన విద్యుదావేశం ఉందో కూడా తెలుసుకోవచ్చు. ★ దీని కోసం ఒక స్టాండ్‌కు దారం సహాయంతో బెండు బంతిని వేలాడదీసి దాని చుట్టూ ఒక పలుచని లోహపు పొరను చుడతారు (సిల్వర్/ అల్యూమినియం పొర). ★ విద్యుదావేశం ఉన్న వస్తువును దగ్గరకు తీసుకొచ్చినప్పుడు బంతి దూరంగా జరిగితే వస్తువు మీద విద్యుదావేశం ఉన్నట్లు భావిస్తారు. ★ వస్తువును తాకించడం ద్వారా కూడా బంతికి విద్యుదావేశాన్ని ముందుగానే అందిస్తారు.



విద్యుదీకరణ: వస్తువులను రాపిడికి గురి చేస్తే ఘర్షణ జరిగి ఒక వస్తువులో ఉన్న విద్యుదావేశం మరో వస్తువులోకి బదిలీ జరుగుతుంది. దానినే విద్యుదీకరణ అంటారు. ★ దీనివల్ల మెరుపులు, పిడుగులు ఏర్పడతాయి. ★ విద్యుదీకరణ ప్రక్రియనే విద్యుత్తు ఉత్సర్గం అని కూడా అంటారు. ★ విద్యుదావేశం అనేది వస్తువులో ఎల్లప్పుడూ దాని ఉపరితలం పైనే నిల్వ ఉంటుంది. **ఉదా:** వర్షంలో కారు నడుపుతున్నప్పుడు దానిపై పిడుగు పడినప్పటికీ, ఆ కారులో ఉన్న వ్యక్తికి ప్రమాదం జరగకపోవడం. ★ మేఘాల్లో ఆవేశాలు చేరడం వల్ల మెరుపులు ఏర్పడతాయి. ★ మేఘాల మధ్య ఘర్షణ జరిగి ధన, రుణ ఆవేశాలు పోగవుతాయి. ఒక మేఘం ఎలక్ట్రాన్‌లను గ్రహించి, రెండోది కోల్పోయి ఆవేశాలను పొందుతాయి. ★ ఈ సమయంలో ప్రకాశవంతమైన రేఖలు, ధ్వనులు ఉత్పత్తి అవుతాయి. ఆ కాంతి రేఖలను మెరుపులని, ప్రక్రియను విద్యుత్తు ఉత్సర్గమని అంటారు.

మాదిరి ప్రశ్నలు

1. ఒక రీఫిల్‌ను పాలిథీన్‌తో రుద్ది, వేరొక పాలిథీన్‌తో రుద్దిన రీఫిల్ వద్దకు తీసుకువస్తే ఆ రెండు...
   1) ఆకర్షించుకుంటాయి 2) వికర్షించుకుంటాయి
   3) తటస్థంగా ఉంటాయి
   4) రెట్టింపు పరిమాణం పెరుగుతాయి
2. 'ఆకాశంలో మెరుపులు ఏర్పడటం, దుస్తులు స్పార్క్‌లను ఏర్పరచి వెంట్రుకలను ఆకర్షించడం రెండూ ఒకటే' అని తెలిపింది ఎవరు?
   1) గిల్‌బర్ట్ 2) లూయీ గాల్వానీ
   3) థేల్స్ 4) బెంజిమన్ ఫ్రాంక్లిన్
3. జిరాక్స్ కాపీలు తీయడానికి కిందివాటిలో ఏది ఉపయోగపడుతుంది?
   1) స్థిర విద్యుత్తు 2) ప్రవాహ విద్యుత్తు
   3) తక్కువ ఓల్టేజీ 4) అధిక కాంతి, వేడి

సమాధానాలు: 1-2, 2-4, 3-1.



రచయిత: ఎస్.వై.నాయుడు



పిడుగులు: మేఘాలు ప్రయాణించేటప్పుడు అవి బరువెక్కి నల్లగా మారతాయి. ఆ సమయంలో అవి భూమికి దగ్గరగా వచ్చి వ్యతిరేక ఆవేశాన్ని ప్రేరేపిస్తాయి. ఈ వ్యతిరేక ఆవేశాల వల్ల వాటి మధ్య ఆకర్షణ ఏర్పడి అధిక విద్యుదావేశం భూమిపై పడుతుంది. దానినే పిడుగు అంటారు. ✦ ఆవేశిత కణాల మధ్య ఉండే బలమే 'విద్యుదయస్కాంత బలం'. ✦ మెరుపు, పిడుగులు పడేటప్పుడు వచ్చే పెద్ద ధ్వనిని 'ఉరుములు' అంటారు. ✦ పిడుగులు పడేటప్పుడు మెరుపు వచ్చిన కొంతసేపటికి ఉరిమిన శబ్దం వినిపిస్తుంది. కాంతి వేగం ధ్వని వేగం కంటే ఎక్కువగా ఉండటమే అందుకు కారణం ✦ పిడుగులు, మెరుపులు వచ్చేటప్పుడు బహిరంగ ప్రదేశాలు సురక్షితం కాదు.
✦ కారు, బస్సు లాంటి వాటిలో ప్రయాణిస్తుంటే తలుపులు, అద్దాలను మూసేయాలి. ✦ పిడుగులు ఎత్తయిన బిల్డింగులు, చెట్లను త్వరగా ఆకర్షిస్తాయి. అందుకే ఆ సమయంలో వాటి కింద నిలబడకూడదు.
✦ కరెంటు/లోహపు స్తంభాలను తాకకూడదు.
✦ పిడుగుల బారి నుంచి రక్షణకు వాడే పరికరం తటిద్వాహకం. దీనినే లైట్నింగ్ కండక్టర్ అంటారు.

లైట్నింగ్ కండక్టర్: ✦ దీనిని బెంజిమెన్ ఫ్రాంక్లిన్ కనుక్కున్నాడు. ✦ దీని తయారీకి రాగిలాంటి మంచి విద్యుత్తు వాహకం పదార్థాన్ని వాడతారు. ✦ లైట్నింగ్ కండక్టర్ ముందు భాగం సూది (మొనదేలి)గా ఉంటుంది.
✦ వీటిని ఎత్తయిన బిల్డింగులు, టవర్లపై అమరుస్తారు. నేరుగా భూమిలోకి కలుపుతారు. దీనిని 'ఎర్తింగ్' అని పిలుస్తారు. ✦ ఎర్తింగ్ ద్వారా పిడుగుల ఆవేశం నేరుగా భూమిలోకి పోతుంది. భూమిలో అనంతమైన సంఖ్యలో ధన, రుణ ఆవేశాలు కలిగి ఉంటాయి. అందువల్ల భూమిని 'ఎలక్ట్రానిక్ సింక్' అని కూడా అంటారు.

JUNIOR INTER English



The Malady of overthinking



Annotations (4 Marks)

Final Exams-2026 IMPORTANT Q & A

1) I Was a hospital in myself. All they need to do would be to walk round me, and, after that, take their diploma.

A: i) Name of the Lesson: The Malady of Overthinking.
ii) Name of the Writer: Jerome K. Jerome.

Context: In the given lines, the narrator compares himself to a hospital. He feels as if he has many health issues.His body could be a case study for medical students.

Explanation: The narrator visited the British Museum to read about the treatment for a slight ailment. Eventually, he read about all the diseases mentioned in the medical dictionary. He then felt that his body was like a hospital.

Critical appreciation: Jerome K. humorously highlights the habit of overthinking. It causes people to feel sick even when they are not. Here, the narrator's overthinking and self-diagnosis are presented in a light comedy. Comparing himself to a hospital seems very funny. The story is a brilliant satire on self-diagnosis.

2) Don't stuff up your heard with things you don't understand. I followed the directions, with the happy result.

A: i) Name of the Lesson: The Malady of Overthinking.
ii) Name of the Writer: Jerome K. Jerome.

Context: In these lines, the writer tells himself and others not to fill their minds with confusing stuff. He says that we should not waste our time on unnecessary things. He says that he simply follows the directions of his doctor friend and gets good results.

Explanation: The narrator became frozen with horror while reading the symptoms of different diseases. His self-diagnosis filled him with horror and despair. He went to a doctor, who was his old friend. The doctor examined him and wrote a simple prescription. The doctor said, 'We shouldn't think too much about what we can't understand'.


Critical appreciation: Jerome K. advises don't rack your brain with things you don't understand and can't control. He concludes that sometimes following a simple advice is the best way to solve a problem.

For more IMP Q&A

Writer: J Syamala

కరిగే పర్వతాలు.. కదిలే ఇసుక దిబ్బలు!

భూమిపై కనిపించే విభిన్న స్వరూపాలన్నీ అంతర్జనిత, బహిర్జనిత శక్తుల కారణంగానే ఏర్పడుతుంటాయి. భూమి లోపలి పొరల కదలికలు, అగ్నిపర్వత పేలుళ్ల ఫలితంగా పీఠభూములు, పర్వతాలు ఆవిర్భవిస్తే, నీటి ప్రవాహాలతో మైదానాలు రూపుదిద్దుకుంటాయి. గాలుల కోత, వాతావరణ వ్యత్యాసాలు తదితరాల బాహ్య బలాలతో కొండలు కూడా క్రమంగా శిథిలమవుతుంటాయి. ఈ విధంగా ప్రకృతి శక్తుల వల్ల జరిగే కోత, నిక్షేపణ, వికోషీకరణం ప్రభావాలు, ఆ ప్రక్రియలో రూపుదిద్దుకునే రకరకాల భూస్వరూపాలు, వాటిలో జరిగే మార్పులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రపంచవ్యాప్తంగా పలు వాతావరణ పరిస్థితులు సృష్టిస్తున్న భౌగోళిక స్వరూపాలు, వాటి ప్రత్యేకతలనూ అర్థం చేసుకోవాలి.



ప్రపంచ భూగోళశాస్త్రం

అంతర్జనిత శక్తులు, బహిర్జనిత శక్తులు, పవన భూస్వరూపాలు

1. ఏ బలాల వల్ల పర్వతాలు ఏర్పడతాయి?
   1) అంతర్జనిత బలాలు
   2) బహిర్జనిత బలాలు
   3) సంపీడనా బలాలు 4) తన్యతా బలాలు
2. ఖండ పర్వతాలు ఏర్పడటానికి కారణమైన ప్రక్రియ?
   1) తన్యతా బలాలు 2) సంపీడనా బలాలు
   3) బహిర్జనిత బలాలు 4) అంతర్జనిత బలాలు
3. తీరమైదానాలు ఏ ప్రక్రియ ద్వారా ఏర్పడతాయి?
   1) నిమజ్జితం 2) సంపీడనం
   3) ఉద్గతి 4) తన్యత
4. భూచలనాలను ఎన్ని విధాలుగా వర్గీకరించవచ్చు?
   1) 4 2) 5 3) 2 4) 3
5. బంగాళాఖాతంలో భూప్రాంతం నిమజ్జితం చెందడం వల్ల హిమాలయాల నుంచి వేరు అయిన దీవులు ఏవి?
   1) న్యూమేర్ దీవులు
   2) అండమాన్ - నికోబార్ దీవులు
   3) బొరంగా దీవులు 4) రామ్ రీ దీవులు
6. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రంలో ఎత్తయిన పగడపు దీవులు ఏర్పడటానికి కారణం?
   1) నిమజ్జిత బలాలు
   2) ఉద్గతి బలాలు
   3) తన్యతా బలాలు
   4) సంపీడనా బలాలు



7. ఆఫ్రికా పగులు లోయల్లో విక్టోరియా సరస్సు, క్యోగో సరస్సు ఏర్పడేందుకు కారణం?
   1) భ్రంశోద్ధిత శిలా విన్యాసం 2) ఉద్గతి
   3) నిమజ్జితం 4) తన్యత
8. ఏ బలాల వల్ల ఎత్తైన ప్రాంతం శిథిలమై ఆ శిథిల పదార్థాలతో పల్లపు ప్రాంతాలు, సమతల మైదానాలు ఏర్పడతాయి?
   1) బహిర్జనిత బలాలు 2) సంపీడనా బలాలు
   3) అంతర్జనిత బలాలు 4) తన్యతా బలాలు
9. ముడుత పర్వతాలు ఏర్పడటానికి కారణమైన బలాలు?
   1) తన్యతా బలాలు
   2) అంతర్జనిత బలాలు
   3) బహిర్జనిత బలాలు
   4) సంపీడనా బలాలు



10. జలపాతాలు, కొండలు, గుహలు వంటి శిలాకృతులు ఏర్పడటానికి కారణం?
    1) అంతర్జనిత బలాలు 2) బహిర్జనిత బలాలు
    3) సంపీడనా బలాలు 4) తన్యతా బలాలు
11. అంతర్జనిత బలాల్లో ఏ చలనం కారణంగా భూకంపాలు, అగ్నిపర్వతాలు సంభవిస్తాయి?
    1) ఖండచలనం 2) పర్వతోద్భవ చలనం
    3) వికోశీకరణ చలనం 4) మంద చలనం
12. శిలాశైథిల్యం ప్రధానంగా ఏ ప్రక్రియ వల్ల జరుగుతుంది?
    1) యాంత్రిక, రసాయనిక 2) జీవ సంబంధిత
    3) యాంత్రిక, భౌతిక 4) ద్రావణీకరణం
13. భూపటలం కిందికి కుంగిపోవడాన్ని ఏమంటారు?
    1) ఉద్గతి 2) భగ్నం
    3) నిమజ్జితం 4) భ్రంశం
14. శిలాశైథిల్యాన్ని ఎన్ని రకాలుగా విభజించారు?
    1) 2 2) 3 3) 4 4) 5
15. శిలల్లో ఉండే పగుళ్లలోకి నీరు చేరి అతిశీతల వాతావరణానికి ఘనీభవించి మంచుగా మారడం వల్ల పగుళ్లు మరింత పెద్దవై శిలలు భౌతికంగా శైథిల్యం చెందడాన్ని ఏమంటారు?
    1) ఫ్రీజ్ యాక్షన్
    2) ఉష్ణోగ్రత మార్పు వల్ల
    3) ద్రావణీకరణం 4) పార్ద్రీకరణం
16. ఉష్ణోగ్రత అధికంగా ఉన్న శుష్క, ఎడారి ప్రాంతాల్లో ఏ రకమైన శిలా శైథిల్యం అధికంగా కనిపిస్తుంది?
    1) రసాయనిక 2) వాయు సంబంధిత
    3) జీవ సంబంధిత 4) భౌతిక
17. పెద్ద పెద్ద పర్వతాలు, కొండలు, పీఠభూములు బాహ్యబలాల ద్వారా శిథిలమై క్రమంగా విచ్ఛిన్నమయ్యే ప్రక్రియను ఏమంటారు?



    1) భగ్నం 2) వికోషీకరణం
    3) భ్రంశం 4) నిక్షేపణం
18. ఏ శిలలు రసాయనిక ప్రక్రియ కారణంగా త్వరగా శిథిలమవుతాయి?
    1) బసాల్ట్ శిలలు 2) కార్బొనేట్ శిలలు
    3) క్వార్ట్జ్ శిలలు 4) సిస్ట్ శిలలు
19. వర్షపాతం, ఆర్ద్రత అధికంగా గల అర్ధ శీతోష్ణస్థితి ప్రాంతాల్లో ఏ రకమైన శిలా శైథిల్యం కనిపిస్తుంది?
    1) భౌతిక 2) జీవ సంబంధిత
    3) రసాయనిక 4) వాయు సంబంధిత
20. శిలా శైథిల్యాలు ఎక్కువగా ఏ ప్రాంతాల్లో సంభవిస్తుంటాయి?
    1) ఉష్ణోగ్రత స్థిరంగా ఉన్న ప్రాంతాలు
    2) పీడనం స్థిరంగా ఉన్న ప్రాంతాలు
    3) పీడన తారతమ్యం అధికంగా ఉన్న ప్రాంతాలు
    4) ఉష్ణోగ్రత తారతమ్యం అధికంగా ఉన్న ప్రాంతాలు
21. ఎడారుల్లో కురిసిన వర్షపునీరు పెద్దపెద్ద లోయల ద్వారా ప్రవహిస్తే దాన్ని ఏమంటారు?
    1) వాడీలు 2) బజాడాలు
    3) ప్లయాలు 4) బోల్సన్
22. ఎడారిలోని పర్వతాల చుట్టూ ఉన్న మండలి పవనాలను ఏమని పిలుస్తారు?
    1) బోల్సన్ 2) బార్ఖన్
    3) బజాడాలు 4) పెడిమెంట్
23. ఎడారి ప్రాంతాల్లో గాలి క్రమక్షయం నిక్షేపణ వల్ల మైదానంగా మారిన భూ పొరలను ఏమంటారు?
    1) పెని మైదానాలు 2) డ్రిఫ్ట్ మైదానాలు
    3) లోయిస్ మైదానాలు 4) పెడి మైదానాలు
24. పెడి మైదానాలలో మిగిలిపోయిన ఎత్తయిన ప్రాంతాలను ఏమని పిలుస్తారు?
    1) ఇన్సెల్‌బర్గ్ 2) వాడీలు
    3) బజడాలు 4) పెడి మైదానాలు
25. కఠినమైన, మెత్తని శిలలో స్తంభాకారంలో ఉండే శిలలను ఏమంటారు?
    1) డైక్ 2) డిమియోసెల్లి
    3) పెడిమెంట్ 4) బాతోలిత్
26. పెద్దపెద్ద బండలతో విస్తరించి ఉన్న ఎడారులను ఏమంటారు?
    1) హమడాలు 2) బజడాలు
    3) పెడిమెంట్ 4) బోల్సన్
27. ఒకే ప్రాంతంలో గాలి వాలు, వేగం ఆధారంగా ఒక చోట నుంచి మరొక చోటుకు కదిలే మట్టిదిబ్బలను ఏమంటారు?
    1) బార్ఖన్ 2) సైఫ్
    3) నెబ్జా 4) థ్రియాన్లు
28. శిథిలావస్థకు లోనైన శిలలు రకరకాల రూపురేఖలతో చిత్రవిచిత్రంగా కనిపించడాన్ని ఏమంటారు?
    1) క్రమక్షయ భూస్వరూపాలు
    2) శిథిల భూస్వరూపాలు
    3) నిక్షేపణ భూస్వరూపాలు
    4) అవక్షేప స్వరూపాలు
29. పవన క్రమక్షయం ఎన్ని పద్ధతుల ద్వారా జరుగుతుంది?
    1) 6 పద్ధతులు 2) 5 పద్ధతులు
    3) 4 పద్ధతులు 4) 3 పద్ధతులు
30. పొడి వాతావరణ పరిస్థితుల్లో భూమిపై ఉండే తేలిక పదార్థాలు గాలికి కొట్టుకుపోవడాన్ని ఏమంటారు?
    1) అపఘర్షణ 2) ఎగురవేత
    3) ఎర్గ్ 4) థ్రియాన్
31. గాలిలో వేగంగా ప్రయాణించే ఇసుక రేణువులు శిలల ఉపరితలాన్ని బలంగా తాకి క్రమక్షయం చేయడాన్ని ఏమంటారు?
    1) నిక్షేపణ 2) రాపిడి
    3) అపఘర్షణ 4) శైథిల్యం
32. గాలి ఎగురవేత ప్రక్రియ అధికంగా ఉండటంతో ఏర్పడే గుంటలను ఏమంటారు?
    1) బజాడాలు 2) ఎగురవేత గుంటలు
    3) వాదీలు 4) బొల్సన్
33. ఎడారుల్లో పొరలు అడ్డంగా ఉండటంతో ఏర్పడే ఇసుక దిబ్బలను ఏమంటారు?
    1) ఎర్గ్ 2) లోయిస్ 3) నెబ్జా 4) సైఫ్
34. కదిలే ఇసుక దిబ్బలను ఏమంటారు?
    1) బార్ఖన్ 2) లోయిస్
    3) నెబ్జా 4) ఎర్గ్



35. రాజస్థాన్‌లో కదిలే ఇసుక దిబ్బలను ఏమని పిలుస్తారు?
    1) థ్రియాన్ 2) ఎర్గ్ 3) బార్ఖన్ 4) నెబ్జా
36. అర్ధ చంద్రాకారంలో ఉండే ఇసుక దిబ్బలను ఏమంటారు?
    1) నెబ్జా 2) సైఫ్‌లు
    3) బార్ఖన్ 4) లోఫ్‌లు
37. చైనాలోని హొయాంగ్ హో నది పసుపు వర్ణంలో ఉండటానికి కారణం?
    1) వాతావరణం
    2) పసుపు పచ్చని శైవలాలు పెరగడం
    3) లోయస్ మట్టి ప్రవహించడం
    4) పసుపు పచ్చని చెట్లు ఉండటం
38. ఎడారుల్లో పడిన వర్షపు నీరు లోతు తక్కువగా ఉన్న గుంతల ద్వారా ప్రవహిస్తే వాటిని ఏమంటారు?
    1) బోల్సన్ 2) వాడీలు
    3) బజాడాలు 4) ప్లయాలు
39. ఎడారులలో వీచే ఇసుక తుపాన్లను ఏమంటారు?
    1) థ్రియాన్
    2) ఎర్గ్
    3) సైమూన్లు
    4) బార్ఖన్



40. ఎడారి ప్రాంతంలో అరబ్బు కత్తి ఆకారంలా ఉండే ఇసుక దిబ్బలను ఏమని పిలుస్తారు?
    1) నెబ్జా 2) బార్ఖన్
    3) సైఫ్‌లు 4) లోయిస్
41. లేత పసుపు వర్ణంలో మెత్తటి మట్టితో విస్తారంగా నిర్మితమై ఉన్న మట్టిదిబ్బలను ఏమంటారు?
    1) లోయస్లు 2) నెబ్జా
    3) బార్ఖన్ 4) సైఫ్
42. బ్లిజార్డ్ కింది ప్రాంతంలో కనిపిస్తాయి?
    1) భూమధ్య రేఖ 2) ఉష్ణమండల ప్రాంతం
    3) అంటార్కిటికా ఖండం 4) సమ శీతల మండలం
43. లాప్స్ కింది ఏ ప్రాంతంలో ఉంటారు?
    1) తూర్పు ఆఫ్రికా 2) ఐరోపా స్టెప్పి
    3) దక్షిణ అమెరికా గడ్డి ప్రాంతం
    4) ఐరోపా టండ్రా
44. స్లింగ్ సైక్రోమీటర్ ద్వారా దేనిని కొలుస్తారు?
    1) ఉష్ణోగ్రత 2) హ్యూమిడిటీ
    3) పీడనం 4) వాయువేగం
45. కిందివాటిలో సెడిమెంటరీ రాక్స్?
    ఎ) బసాల్ట్ బి) లైమ్ స్టోన్ సి) షెల్ డి) గ్రానైట్
    1) ఎ, బి 2) బి, సి
    3) బి, డి 4) సి, డి
46. భూమిని అధ్యయనం చేయడాన్ని ఏమంటారు?
    1) కార్టోగ్రఫీ
    2) జియోగ్రఫీ
    3) సిస్మాలజీ 4) ఎపిగ్రఫీ




రచయిత: సక్కరి జయకర్

సమాధానాలు

1-1; 2-1; 3-3; 4-3; 5-2; 6-2; 7-3; 8-4; 9-1; 10-2; 11-4; 12-1; 13-3; 14-2; 15-1; 16-4; 17-2; 18-2; 19-3; 20-4; 21-1; 22-4; 23-4; 24-1; 25-2; 26-1; 27-3; 28-1; 29-4; 30-2; 31-3; 32-2; 33-3; 34-4; 35-1; 36-3; 37-3; 38-4; 39-3; 40-3; 41-1, 42-3, 43-4, 44-2, 45-4, 46-1.


నిశ్చల స్థితిలో ఉన్న విద్యుదావేశాల గురించి తెలిపే శాస్త్రాన్ని స్థిర విద్యుత్ అంటారు. ఆవేశాలు కదిలినప్పుడే వాటికి ఉన్న శక్తిని వినియోగించుకోవచ్చు. ఒక వాహక తీగలో ప్రవహిస్తున్న ఆవేశాలను విద్యుత్ ప్రవాహం అంటారు. చలనంలో ఉన్న ఆవేశాల ఫలితాలను 'ప్రవాహ విద్యుత్' ద్వారా తెలుసుకోవచ్చు. నిత్యజీవితంలో ఉపయోగించే గీజర్, ఫ్యాన్, లౌడ్ స్పీకర్, మోటార్ తదితరాలు ప్రవాహ విద్యుత్ అనువర్తనాలే. పోటీపరీక్షార్థులు సాధారణ విద్యుత్ వలయాలు, ఘటాల శ్రేణి, సమాంతర సంధానాలపై అవగాహన కలిగి ఉండాలి.

విద్యుత్ ఘటాలు - సంధానం



i. ఘటాల శ్రేణి సంధానం: ఒక ఘటం రుణ ధ్రువాన్ని మరొక ఘటం ధన ధ్రువానికి అనుసంధానం చేయడం వల్ల ఏర్పడే అమరికను ఘటాల శ్రేణి సంధానం (Series Connection) అంటారు.

- విద్యుత్ ఘటాలను శ్రేణిలో కలిపినప్పుడు వలయంలో ఎక్కువ విద్యుచ్ఛాలక బలం కలుగుతుంది. అప్పుడు బల్బు మరింత కాంతిమంతంగా వెలుగుతుంది.
- వలయంలో కలిపిన ప్రతి ఘటం e.m.f. వరుసగా E_1, E_2, E_3లుగా ఉంటే వలయంలో ఫలిత e.m.f. $E = E_1 + E_2 + E_3$



ii. ఘటాల సమాంతర సంధానం: రెండు లేదా అంతకంటే ఎక్కువ విద్యుత్ ఘటాల ధన ధ్రువాలను ఒక బిందువు (P)కు, వాటి రుణ ధ్రువాలను మరొక బిందువు (Q)కు కలిపితే దాన్ని విద్యుత్ ఘటాల సమాంతర సంధానం అంటారు.

- ఈ పద్ధతిలో బల్బు వెలగడానికి ఎక్కువ రసాయన శక్తి అందుబాటులో ఉంటుంది.
- దీనివల్ల బల్బు అదే తీవ్రతతో ఎక్కువ కాలం వెలుగుతుంది.
- వేర్వేరు e.m.f. ఉన్న ఘటాలను సమాంతర సంధానం చేసినప్పుడు వాటి ఫలిత పొటెన్షియల్ భేదం సంధానం చేసిన ఘటాల్లో గరిష్ఠ పొటెన్షియల్ భేదానికి సమానంగా ఉంటుంది.
- ఏ సమయంలోనైనా ఏదైతే ఎక్కువ e.m.f. కలిగి ఉంటుందో ఆ ఘటం మాత్రమే పనిచేస్తుంది.
- E_1, E_2, E_3లు e.m.f.లుగా ఉన్న మూడు ఘటాలను సమాంతర సంధానం చేసి, వాటిలో $E_1 > E_2 > E_3$ అనుకుంటే, ఫలిత e.m.f. $E = E_1$ అవుతుంది.

ఘటాలను శ్రేణిలో కలిపితే.. వలయంలో విద్యుచ్ఛాలక బలం!

ప్రవాహ విద్యుత్

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

విద్యుత్ ప్రవాహం

ప్రమాణ కాలంలో ఏదైనా వాహక మధ్యచ్ఛేదం ద్వారా ప్రవహించే ఆవేశాన్ని 'విద్యుత్ ప్రవాహం' అంటారు.

- ఒక వాహక మధ్యచ్ఛేదం ద్వారా t కాల వ్యవధిలో q ఆవేశం ప్రయాణిస్తుంటే విద్యుత్ ప్రవాహం $(i) = \frac{q}{t}$
- విద్యుత్ ప్రవాహానికి ప్రమాణం కూలూంబ్/సెకన్ లేదా ఆంపియర్ (A)
- విద్యుత్ ప్రవాహాన్ని అమ్మీటర్ అనే పరికరంతో కొలుస్తారు.

ఆంపియర్: ఒక కూలూంబ్ ఆవేశం ఒక సెకన్ కాలంలో ఏదైనా వాహక మధ్యచ్ఛేదాన్ని దాటితే ఒక ఆంపియర్ విద్యుత్ ప్రవహించినట్లు పేర్కొంటారు.

విద్యుత్ పొటెన్షియల్, పొటెన్షియల్ భేదం

విద్యుత్ ఆవేశాన్ని కదిలించాలంటే బలాన్ని ఉపయోగించి పని చేయాల్సి ఉంటుంది. ఆ పనిని తెలుసుకోవడానికి విద్యుత్ పొటెన్షియల్ అనే భావన ఉపయోగపడుతుంది.


- ఏకైక ధనాత్మక ఆవేశాన్ని అనంత దూరం నుంచి అంతరాళంలోని ఒక బిందువు వద్దకు త్వరణం లేకుండా విద్యుత్ క్షేత్రానికి వ్యతిరేకంగా తీసుకురావడానికి వినియోగించిన పనిని ఆ బిందువు వద్ద పొటెన్షియల్ అంటారు.
- విద్యుత్ పొటెన్షియల్‌ను కొలిచేందుకు ఓల్ట్‌మీటరును ఉపయోగిస్తారు. దీనికి ప్రమాణం ఓల్ట్ (V).
- W జౌల్ పని చేయడం ద్వారా +q కూలూంబ్ ఆవేశాన్ని ఒక బిందువు వద్దకు త్వరణం లేకుండా చేర్చగలిగితే ఆ బిందువు వద్ద

విద్యుత్ పొటెన్షియల్ $V = \frac{W}{q}$

- V_A, V_B అనేవి రెండు వేర్వేరు బిందువుల వద్ద విద్యుత్ పొటెన్షియల్ విలువలు అయితే ఆ రెండింటి మధ్య భేదాన్ని పొటెన్షియల్ భేదం అంటారు.

$$V = V_{BA} = V_B \sim V_A$$

- ఒక విద్యుత్ పరికరం లేదా విద్యుత్ జనకం పొటెన్షియల్ భేదాన్ని ఓల్టేజ్ అంటారు.



విద్యుచ్ఛాలక బలం

ఒక విద్యుత్ వలయంలో ఎలక్ట్రాన్‌లను అధిక పొటెన్షియల్ ఉన్న బిందువు వైపునకు తరలించడానికి విద్యుత్ ఘటం చేసే పనిని విద్యుచ్ఛాలక బలం (e.m.f.) అంటారు. దీనికి ప్రమాణం ఓల్ట్.

బల్బుల (పరికరాల) సంధానం

బల్బులు లేదా ఏ ఇతర గృహోపకరణాలనైనా విద్యుత్ వలయంలో సంధానించడానికి రెండు పద్ధతులు ఉంటాయి. అవి:


పరికరాల శ్రేణి సంధానం: ఒక విద్యుత్ వలయంలో ఒక బల్బు రెండో టెర్మినల్‌ని, రెండో బల్బు మొదటి టెర్మినల్‌కి కలుపుతూ వలయాన్ని పూర్తి చేస్తే ఆ బల్బులను శ్రేణిలో సంధానం చేశారని చెప్పవచ్చు.

- శ్రేణి సంధానంలో అన్ని బల్బులకు ఒకేవిధమైన విద్యుత్ ప్రవాహం అందుబాటులో ఉంటుంది.
- విద్యుత్ బ్యాటరీ ద్వారా లభించే పొటెన్షియల్ భేదం (V) బల్బులకు $V_1, V_2, V_3, ...$ లుగా పంపిణీ అవుతుంది.

$V = V_1 + V_2 + V_3$

- శ్రేణి సంధానంలో బల్బులకు తక్కువ ఓల్టేజ్ లభించడం వల్ల అవి తక్కువ కాంతి తీవ్రతను కలిగి ఉంటాయి.
- శ్రేణి సంధానంలో బల్బులకు ఒక మార్గం ద్వారా విద్యుత్ ప్రవాహం ఉండటం వల్ల ఒక బల్బును తీసివేసినా లేదా ఫిలమెంట్ తెగిపోయినా మిగతా ఏ బల్బులు వెలగవు. దీనికి కారణం వలయం తెగిపోవడమే.

సాధారణ విద్యుత్ వలయాలు



విద్యుత్ జనకం, శక్తిని ఉపయోగించే విద్యుత్ సాధనం, వాటిని కలిపే వాహకాలతో ఏర్పడిన అమరికను 'సాధారణ విద్యుత్ వలయం' అంటారు.

- దీని సహాయంతో విద్యుత్ ఘటంలోని రసాయన శక్తి తీగల ద్వారా బల్బులోకి చేరి కాంతి శక్తిగా మారుతుంది.

పరికరాల సమాంతర సంధానం: ఒక విద్యుత్ వలయంలో బల్బుల మొదటి టెర్మినళ్లు అన్నింటినీ ఒక ఉమ్మడి బిందువు (P)కు, రెండో టెర్మినళ్లు అన్నింటినీ మరొక ఉమ్మడి బిందువు (Q)కు కలిపితే ఆ బల్బులు సమాంతర సంధానంలో ఉన్నట్లు అర్థం.

- సమాంతర సంధానంలో అన్ని బల్బులకు ఒకే పొటెన్షియల్ భేదం (V) అందుతుంది.
- విద్యుత్ బ్యాటరీ ద్వారా లభించే విద్యుత్ ప్రవాహం (i) అన్ని బల్బులకు $i_1, i_2, i_3, ...$ లుగా పంపిణీ అవుతుంది.

$i = i_1 + i_2 + i_3 + ...$

- అన్ని పరికరాలకు ఒకే ఓల్టేజీ లభించడం వల్ల అవి పూర్తి తీవ్రతతో వెలుగుతాయి.
- సమాంతర సంధానంలో ఉన్న బల్బుల్లో ఏదైనా ఒక బల్బును తీసివేసినా, ఫిలమెంట్ కాలిపోయినా కేవలం ఆ భాగంలో మాత్రమే వలయం అసంపూర్ణం అవుతుంది. మిగిలిన పరికరాలు యథావిధిగా పని చేస్తాయి.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day 848

Unpretentious

Telugu meaning: వినయపూర్వకమైన, నమ్రతకలిగిన

English meaning: The word unpretentious (అన్‌ప్రిటెన్షియస్) is an adjective that describes someone or something simple, modest, and not trying to impress others.

Synonyms: Simple, Humble; ***Antonyms:*** Showy, Boastful

Usage: **1.** Despite his success, the actor remained unpretentious and treated everyone around him with genuine kindness.

2. The restaurant is popular for its unpretentious atmosphere and delicious homemade food.

Current Affairs



Top seeds Treesa Jolly and Gayatri Gopichand successfully defended their women's doubles title at the Syed Modi International 2025 badminton tournament on 30 November 2025. They defeated Japanese eighth seeds Kaho Osawa and Mai Tanabe 17-21, 21-13, 21-15 in the final at the Babu Banarasi Das Indoor Stadium in Lucknow.



Lok Sabha Secretary General Utpal Kumar Singh has been granted a further extension in tenure for one year on 30 November 2025. He is a 1986-batch Indian Administrative Service (IAS) officer of the Uttarakhand cadre, took over as the Lok Sabha Secretary General on December 1, 2020.



Vivek Chaturvedi was appointed as the Chairman of the Central Board of Indirect Taxes and Customs (CBIC) on 29 November 2025. He is a 1990-batch Indian Revenue Service (Customs & Indirect Taxes) officer and member of the CBIC.

- He succeeds Sanjay Kumar Agarwal, a 1988-batch IRS officer, who completed his tenure and retired on November 28, 2025.

Union Minister of State for Science and Technology Dr. Jitendra Singh launched the production version of India's indigenous Hansa-3 NG pilot trainer aircraft at CSIR-National Aerospace Laboratories (NAL) in Bengaluru.

- The Hansa-3 NG, India's first all-composite two-seat trainer, has been designed to meet rising demand for pilot training as India is projected to need nearly 30,000 pilots over the next two decades.

For more Current Affairs: Scan QR code

జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం

డిసెంబరు 2

చరిత్రలో ఈనాడు

సమాజంలో వేగంగా విస్తరిస్తోన్న వ్యాధులకు, మరణాలకు కాలుష్యమే ప్రధాన కారణం. ప్రధాన పారిశ్రామిక విపత్తుల్లో ఒకటైన భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో మరణించిన వారి జ్ఞాపకార్థం మన దేశంలో ఏటా డిసెంబరు 2న 'జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం'గా (National Pollution Control Day) నిర్వహిస్తారు. పర్యావరణానికి నష్టం కలిగించే తీవ్రమైన కాలుష్య కారకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు పారిశ్రామిక విపత్తుల నివారణకు అనుసరించాల్సిన చర్యల అవసరాన్ని చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- కాలుష్యానికి ముఖ్య కారణం జనాభా పెరుగుదలే. ఉత్పత్తి, వినియోగ కార్యకలాపాల వల్ల వచ్చే అనేక రకాల వ్యర్థాలు పర్యావరణంలోని వివిధ ఆవరణ వ్యవస్థల్లోకి చేరుతున్నాయి. ఫలితంగా నీరు, నేల, గాలి కలుషితమవుతున్నాయి. అంతిమంగా ఆ ప్రభావం జీవకోటిపై పడుతోంది.
- కాలుష్యానికి కారణమైన వాటిని కాలుష్య కారకాలు అంటారు. చెత్త లాంటి వ్యర్థాలు; సీసం, పాదరసం, జింక్ లాంటి మూలకాలు; సల్ఫర్ డైఆక్సైడ్, కార్బన్ డైఆక్సైడ్, అమ్మోనియం, ఫ్లోరిన్, క్లోరిన్ లాంటి వాయువులు; క్రిమిసంహారక మందులు, కృత్రిమ ఎరువులు, రేడియోధార్మిక పదార్థాలు, అధిక శబ్దం - ఉష్ణం మొదలైనవన్నీ దీనికి ఉదాహరణలు.

కాలుష్య నివారణ చర్యలు

మన దేశంలో కాలుష్యాన్ని నివారించడానికి, నియంత్రించడానికి భారత ప్రభుత్వం వివిధ చట్టాలు, నియమాలు అమలు చేస్తోంది. వాటిలో ముఖ్యమైనవి:

- ది వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ 1974
- ది వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) సెస్ యాక్ట్ 1977
- ది ఫారెస్ట్ (కన్జర్వేషన్) యాక్ట్ 1980
- ది ఎయిర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ 1981
- ది ఎన్విరాన్మెంట్ (ప్రొటెక్షన్) రూల్స్ 1986
- ది ఎన్విరాన్మెంట్ (ప్రొటెక్షన్) యాక్ట్ 1986




మన దేశంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌ను విడుదల చేసే సంస్థ, గతంలో అడిగిన ప్రశ్నలు తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

ఇనుము - ఉక్కు పరిశ్రమ

ఒక దేశ పారిశ్రామికాభివృద్ధిలో ఇనుము - ఉక్కు పరిశ్రమల పాత్ర అత్యంత కీలకం. ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో ఈ పరిశ్రమలు ఊతంగా నిలుస్తాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే భారత్‌లో ఈ పరిశ్రమల స్థాపన మొదలైంది. పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా పరిశ్రమలను నెలకొల్పుతూ వచ్చారు. వీటి నిర్మాణంలో పలు దేశాలు సహాయం అందించాయి. పోటీపరీక్షార్థులు ఆయా అంశాలపై అవగాహన పెంచుకోవాలి.



భారతదేశంలో ఇనుము ఉక్కు పరిశ్రమల అభివృద్ధిని రెండు దశల్లో పరిశీలించవచ్చు. అవి:

స్వాతంత్ర్యానికి పూర్వం: ఈ దశలో ఇనుము - ఉక్కు పరిశ్రమ ప్రగతి ప్రైవేట్ రంగంలో జరిగింది.

స్వాతంత్ర్యానంతరం: ఈ దశలో ప్రభుత్వ రంగంలో విదేశీ ఆర్థిక సహకారంతో పరిశ్రమలను స్థాపించారు.

ఇనుము - ఉక్కు పరిశ్రమకు కావాల్సిన ముడి పదార్థాలు:

- ఇనుప ధాతువు
- కోకింగ్ బొగ్గు
- సున్నపురాయి
- మాంగనీస్
- క్రోమైట్
- డోలమైట్
- కాల్చిన బంకమట్టి

స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ఇనుము - ఉక్కు కర్మాగారాలు

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం సత్వర అభివృద్ధి కోసం పంచవర్ష ప్రణాళికలను రూపొందించారు. మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రెండో పంచవర్ష ప్రణాళికా కాలంలో పారిశ్రామిక రంగానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.

స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన ఇనుము - ఉక్కు కర్మాగారాలు, ఉక్కు పోతపోసే విధానం, భిలాయ్ ఇనుము - ఉక్కు కర్మాగారం, ఇతర కర్మాగారాలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Technical Staff Jobs

Software Technology Parks of India (STPI) is inviting applications for filling up the Technical Staff posts in various departments on a regular basis. The total no. of posts is 24. The application fee is Rs.1000. The last date for online applications is 12 December 2025.

Internship Posts

DRDO - Defence Institute of Psychological Research (DIPR) in Delhi is inviting applications for the filling of JRF, RA, and paid internship posts for a period of two years. The total no. of posts is 10. Eligible candidates can apply offline before 19 December 2025.

Apprentice Posts

Munitions India Ltd, a unit of the Government of India, Ministry of Defence, Khadki Factory, is inviting applications for the Diploma and Graduate Apprentice posts in various departments. The total no. of posts is 50. Eligible candidates can apply online before 10 December 2025.

Did You Apply..?

Today (December 2) is the last date for the following Jobs

- AIIMS Delhi releases notification for 1,383 Group-B, C jobs
  Qualifications: 10th class, Intermediate, Diploma, Degree, PG.
- 29 Copy Editor Posts Prasar Bharati.
  Qualifications: Graduation, PG Diploma in Journalism.
- 24 Technical Assistant Jobs in CSIR NIO, Goa.
  Qualification: ITI / Diploma, B.Sc.

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Sphere

1. Diameter of a sphere is 35 cm. Find out its surface area?

A) 3508 sqcm B) 3805 sqcm
C) 3850 sqcm D) 3580 sqcm
E) None of the above

2. Diameter of a sphere is 21 cm. Find out its volume?

A) 4581 sqcm B) 4851 sqcm
C) 4951 sqcm D) 4915 sqcm
E) None of the above

3. The radii of two sphere are in the ratio 3 : 7. Find out the ratio of their volume.

A) 27 : 343 B) 9 : 49
C) $3\sqrt{3} : 3\sqrt{7}$ D) 343 : 27
E) None of the above

4. Find out the number of lead balls of radius $1\frac{1}{3}$ cm each that can be made from a sphere of radius $5\frac{1}{3}$ cm.

A) 54 B) 58 C) 60 D) 64 E) 72

5. A spherical ball of lead $\frac{54}{5}$ cm in diameter is melted and recast into three spherical balls. The diameter of two of these are $\frac{27}{5}$ cm and 9 cm respectively. The diameter of the third ball is:

A) $7\frac{1}{5}$ cm B) $7\frac{4}{5}$ cm
C) $7\frac{2}{5}$ cm D) $7\frac{3}{5}$ cm
E) None of the above

6. The radius of new sphere is $\frac{5}{2}$ times of the radius of the original sphere. Then the surface area of new sphere is increased by (in percentage):

A) 525 % B) 375% C) 425%
D) 500% E) 713%

7. 30 identical solid spherical balls of radius 7 cm are melted to form a single sphere. In this process 10% of solid is wasted. What is the radius of the biggest sphere?

A) 18 cm B) 63 cm C) 21 cm
D) 20 cm E) 27 cm

8. The radius of a wheel is 28 cm. What is the distance travelled by the wheel in 23 revolutions?

A) 40 m 84 cm B) 40 m 48 cm
C) 40 m 44 cm D) 44 m 08 cm
E) None of the above

9. Three spherical balls of radius 3 cm, 5 cm, 7 cm are melted to form a new spherical ball. In this process there is a loss of 30.7% of the material. What is the radius (approximately) of the new ball?

A) 6.7 cm B) 6 cm C) 5 cm
D) 7 cm E) 9 cm

10. The surface areas of two spheres are in the ratio of 5 : 4. Find out the ratio of their volumes.

A) $5 : 8\sqrt{5}$ B) 25 : 16
C) $5\sqrt{5} : 8$ D) 16 : 25
E) None of the above

11. The volume of a solid semisphere is numerically $1\frac{1}{2}$ times of its total surface area. The radius of solid semisphere is:

A) $6\frac{1}{4}$ Units B) $6\frac{3}{4}$ Units
C) $6\frac{1}{2}$ Units D) $6\frac{2}{3}$ Units
E) None of the above

12. The radii of a sphere and right circular cylinder are equal and their curved surface areas are also equal. Find the ratio of their volumes.

A) 2 : 3 B) 3 : 4 C) 3 : 2
D) 4 : 5 E) 7 : 11

13. The diameter of the moon is approximately one - fourth of that of the earth. what is the ratio (approximately) of their volume of the moon to that of the earth?

A) 1 : 16 B) 1 : 64 C) 64 : 1
D) 1 : 8 E) 3 : 7

14. Volume of two spheres are in the ratio 64 : 343. Find the radius of the smaller sphere, If the radius of the bigger sphere is 56 cm.

A) 32 cm B) 28 cm C) 30 cm
D) 29 cm E) 41 cm

15. A copper sphere of diameter 15 cm is drawn into a wire of diameter 3 mm. Find the length of the wire.

A) 300 m B) 225 m C) 250 m
D) 275 m E) 125 m

16. A sphere is melted and moulded into solid cylinder. If radius of both solids are equal, then find the ratio of the total surface area of sphere to the total surface area of cylinder.

A) 2 : 3 B) 3 : 2
C) 7 : 6 D) 6 : 7
E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert



400 ఏళ్లనాటి పెయింటింగ్‌కు రూ.24 కోట్లు

ప్యారిస్: నాలుగు శతాబ్దాల క్రితం నాటి ఓ పెయింటింగ్ రూ.24 కోట్లకు అమ్ముడైంది. బరోక్ కళలో సుప్రసిద్ధుడైన పీటర్ పాల్ రూబెన్స్ గీసిన పెయింటింగ్ ఈ ఘనత సాధించింది. శిలువపైన ఏసుక్రీస్తు ఉన్నట్లుగా వర్ణిస్తున్న ఈ కళాఖండాన్ని ఐరోపా ప్యారిస్‌లో కనుగొన్నారు. క్రీస్తు గాయం నుంచి నీరు, రక్తం ప్రవహిస్తున్నట్లుగా ఉన్న ఏకైక పెయింటింగ్ ఇదే అని రూబెన్స్ మీద పరిశోధనలు చేస్తోన్న నిల్స్ బట్లర్ వివరించారు.

ఈ ఏటి మేటి పదం... రేజ్ బెయిట్

ఖరారు చేసిన ఆక్స్‌ఫర్డ్

దిల్లీ: వెబ్ పేజీ, సోషల్ మీడియా ఖాతాలను దర్శించే వీక్షకుల సంఖ్యను పెంచడానికి.. ఆగ్రహం, నిస్పృహ వంటి భావాల్ని రెచ్చగొట్టేలా ఆన్‌లైన్ కంటెంట్‌ను సృష్టించడాన్ని తెలియజేసే ఆంగ్ల పదం 'రేజ్ బెయిట్' ఈ ఏడాది మేటి పదంగా ఎంపికైంది. ఈ పదానికి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ 2025 సంవత్సర మేటి పదంగా గుర్తింపు ఇచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా 3 రోజుల్లో 30వేల మంది పాల్గొన్న ఓటింగ్ ద్వారా ఈ పదాన్ని ఎంపిక చేశారు. వార్షిక ఉత్తమ పదంగా గుర్తింపు పొందేందుకు రేజ్ బెయిట్ తోపాటు ఆరా ఫార్మింగ్, బయో హ్యాక్ పదాలు పోటీ పడ్డాయి. ఓటర్ల సంఖ్య, ప్రజల వ్యాఖ్యల్లోని సెంటిమెంట్లు, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ నిఘంటు డేటాను విశ్లేషించిన అనంతరం ఈ పదాన్ని ఎంపిక చేశారు.

కార్ల కొనుగోలులో దివ్యాంగులకు అందని రాయితీ

సుప్రీంలో పిటిషన్.. నోటీసుల జారీ

దిల్లీ: దివ్యాంగులకు కార్ల కొనుగోలులో ఇవ్వాల్సిన జీఎస్టీ రాయితీని అధికారులు అందించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీ కౌన్సిల్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. వీటికి నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ యాక్ట్‌లోని 41వ సెక్షన్ కింద- అర్హులైన దివ్యాంగులకు కార్ల కొనుగోలులో జీఎస్టీ రాయితీని పునరుద్ధరించాలని పిటిషన్ దాఖలుచేసిన న్యాయవాది సజల్ జైన్ కోరారు. కారు కొనుగోలు చేసిన దివ్యాంగుల పట్ల అధికారులు భిన్నమైన విధానాలు అనుసరిస్తున్న కారణంగా జీఎస్టీ రాయితీ అర్హులందరికీ సమంగా అందడం లేదని న్యాయవాది తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

రుబయా కిడ్నాప్ కేసులో.. పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

దిల్లీ, శ్రీనగర్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రుబయా సయీద్ కిడ్నాప్ కేసులో.. పరారీలో ఉన్న నిందితుడు షఫత్ అహ్మద్ షాంగ్లూను సీబీఐ సోమవారం అరెస్టు చేసింది. అతడిపై రూ.10 లక్షల రివార్డు ఉంది. 1989లో అప్పటి కేంద్ర హోం మంత్రి అయిన ముఫ్తీ మహమ్మద్ సయీద్ కుమార్తె రుబయా సయీద్‌ను నిషేధిత జేకేఎల్‌ఎఫ్ ఉగ్రవాద సంస్థ సభ్యులు కిడ్నాప్ చేశారు. ఆమె అపహరణకు జేకేఎల్‌ఎఫ్ ఉగ్రవాదులతో కలిసి షఫత్ కుట్ర పన్నారని అభియోగాలు నమోదయ్యాయి. జేకేఎల్‌ఎఫ్ అధినేత యాసిన్ మాలిక్‌కు అతడు అత్యంత సన్నిహితుడు. రుబయా సయీద్ శ్రీనగర్‌లో 1989 డిసెంబరు 8న కిడ్నాప్‌నకు గురయ్యారు. అప్పటి ప్రధాన మంత్రి వి.పి.సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఐదుగురు ఉగ్రవాదులను జైలు నుంచి విడుదల చేయడంతో.. బదులుగా ఉగ్రవాదులు ఆమెను వదిలేశారు. మొత్తం ఐదు రోజులు ఆమె ఉగ్రవాదుల చెరలో ఉన్నారు. యాసిన్ మాలిక్ ప్రస్తుతం.. ఉగ్ర నిధుల కేసులో తిహాడ్ జైల్లో ఉన్నాడు.

శ్రీలంక అధ్యక్షుడితో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

దిల్లీ: 'దిత్వ' తుపాన్ ధాటికి విలవిలలాడిన శ్రీలంకకు అన్ని విధాలుగా సహాయమందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ తెలిపారు. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకెతో సోమవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ప్రాణ నష్టం సంభవించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విపత్తులో చిక్కుకున్న శ్రీలంక పౌరులకు భారత్ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. సహాయక చర్యల కోసం రక్షణ బృందాలను పంపించడంతో పాటు తుపాను బాధితులకు అవసరమైన సరకులను సరఫరా చేసిన భారత ప్రభుత్వానికి అనుర కుమార కృతజ్ఞతలు తెలిపారు.

గణనీయంగా తగ్గిన హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు

80శాతం తగ్గిన మరణాలు

దిల్లీ: దేశంలో హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు భారీగా తగ్గాయి. ఏటా సగానికి సగం తగ్గుతున్నాయి. 2010 నుంచి ఇప్పటిదాకా ఏటా సగటున 48.7శాతం తగ్గాయి. ఎయిడ్స్ మరణాలు 81.4శాతం పడిపోయాయి. తల్లి నుంచి బిడ్డకు ఇన్ఫెక్షన్ సోకే రేటు 74.6శాతం తగ్గిపోయింది. 2025 హెచ్ఐవీ అంచనాల నివేదికలో ఈ వివరాలున్నాయి.

✦ దేశంలో 25.61 లక్షల మంది హెచ్ఐవీ బాధితులున్నారు. మొత్తం బాధితుల్లో 13.97 లక్షల మంది పురుషులు, 11.64 లక్షల మంది మహిళలు. మహారాష్ట్రలో అత్యధికంగా 3.99 లక్షల మంది ఉన్నారు. కర్ణాటకలో 2.91 లక్షల మంది ఉన్నారు. ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, బిహార్, గుజరాత్, పంజాబ్‌లలో లక్ష నుంచి 2 లక్షల మధ్య ఉన్నారు.

దిగ్గజ ఆయుధ కంపెనీలపై సిరులవాన!

- 2024లో 5.9% మేర పెరిగిన ఆదాయం
- టాప్-100లో భారత్‌కు చెందిన మూడు కంపెనీలకు చోటు
- సిప్రీ నివేదిక

స్టాక్‌హోం: ఆయుధ విక్రయాలు, సేవల ద్వారా ప్రపంచంలో 100 అగ్రశ్రేణి ఆయుధ ఉత్పత్తి సంస్థలు ఆర్జించిన ఆదాయం గత ఏడాది 5.9 శాతం మేర పెరిగింది. ఉక్రెయిన్, గాజా యుద్ధాలకు తోడు అంతర్జాతీయ, ప్రాంతీయ ఉద్రిక్తతలు ఇందుకు కారణమయ్యాయి. 2024కు సంబంధించి.. మేధోమథన సంస్థ స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రీ) తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలు ఉన్నాయి. దీని ప్రకారం..

✦ టాప్-100 ఆయుధ కంపెనీల్లో భారత్‌కు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ 44వ స్థానంలో, భారత్ ఎలక్ట్రానిక్స్ 58వ స్థానంలో, మజ్గావ్ డాక్ షిప్ బిల్డర్స్ 91వ స్థానంలో ఉన్నాయి. వీటి ఉమ్మడి ఆదాయం 8.2 శాతం మేర పెరిగింది. దేశీయంగా పెరిగిన ఆర్డర్లే ఇందుకు కారణం.

✦ ప్రపంచవ్యాప్తంగా 100 అగ్రశ్రేణి సంస్థలు 2024లో రికార్డు స్థాయిలో 679 బిలియన్ డాలర్ల రెవెన్యూను ఆర్జించాయి.

✦ 2018 తర్వాత తొలిసారిగా తొలి ఐదు ఆయుధ కంపెనీలు.. లాక్‌హీడ్ మార్టిన్, నార్త్రాప్ గ్రుమన్ (అమెరికా), బీఏఈ సిస్టమ్స్ (బ్రిటన్), జనరల్ డైనమిక్స్ (అమెరికా)లు తమ రెవెన్యూను పెంచుకోగలిగాయి.

✦ జాబితాలోని అమెరికా కంపెనీల ఆదాయం 3.8 శాతం మేర పెరిగింది. అయితే తీవ్ర జాప్యాలు, వ్యయాలు పెరిగిపోవడం వంటివి ఆ దేశానికి చెందిన కీలక ఆయుధ అభివృద్ధి, ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. ఎఫ్-35 యుద్ధవిమానం, కొలంబియా తరగతి జలాంతర్గామి, సెంటినెల్ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి వంటివి ఇందులో ఉన్నాయి.

✦ జాబితాలో ఐరోపాకు చెందిన 26 సంస్థలు ఉన్నాయి. వీటి రెవెన్యూ 13 శాతం మేర పెరిగింది.

✦ టాప్-100 ఆయుధ సంస్థల్లో రష్యాకు చెందిన రోస్‌టెక్, యునైటెడ్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్‌లు ఉన్నాయి. వీటి రెవెన్యూ 23 శాతం మేర పెరిగి, 31.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా విడిభాగాల సరఫరాలో కొరత ఏర్పడినప్పటికీ ఈ సంస్థలు ఈ స్థాయి వృద్ధిని సాధించడం విశేషం.

✦ ఇజ్రాయెల్‌కు చెందిన మూడు కంపెనీల ఆదాయం 14 శాతం మేర పెరిగింది. తొలిసారిగా ఈ జాబితాలో అమెరికా సంస్థ స్పేస్‌ఎక్స్ కూడా చోటు సాధించింది. 2024లో ఈ సంస్థ రెవెన్యూ 180 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

హయ్యర్ పెన్షన్ దరఖాస్తులు 99% పరిష్కరించాం: కేంద్రం

దిల్లీ: ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం(ఈపీఎస్)- 1995 కింద హయ్యర్ పెన్షన్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 99 శాతం మేరకు పరిష్కరించామని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరాంద్లజే సోమవారం పార్లమెంటుకు తెలియజేశారు. సుప్రీంకోర్టు 2022 నవంబరు 4న వెలువరించిన ఆదేశాలను సకాలంలో అమలు పరిచేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌ఓ) చర్యలు తీసుకుందని ఆమె లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ అయిన 2023, జులై 11 నాటికి 17.49 లక్షల మంది ఈపీఎఫ్‌ఓ సభ్యులు ఉమ్మడి ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 15.24 లక్షల దరఖాస్తుల్ని యాజమాన్యాలు భవిష్యనిధి సంస్థకు 2025 జనవరి 31నాటికి సమర్పించాయని మంత్రి సభకు తెలిపారు. ఈ సంవత్సరం నవంబరు 24 నాటికి అందులో 99 శాతం దరఖాస్తుల్ని పరిష్కరించామని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించి మొత్తం 4,27,308 డిమాండ్ లెటర్లు జారీ చేసినట్టు మంత్రి వెల్లడించారు. అయితే ఇందులో 34,060 మంది దరఖాస్తుదారులు డిమాండ్ మొత్తాన్ని చెల్లించని కారణంగా అధిక పెన్షన్‌కు అర్హత కోల్పోయినట్టు తదనంతరం గుర్తించామని మంత్రి కరాంద్లజే అన్నారు. దాదాపు 2,33,303 మంది దరఖాస్తుదారులు డిమాండ్ మొత్తాన్ని చెల్లించి అధిక పెన్షన్‌కు సమ్మతి తెలిపారని, ఇందులో 96,274 మంది సర్వీసులో ఉండగా 1,37,029 మంది అప్పటికే రిటైరైపోయారని వివరించారు. రిటైరైపోయిన దరఖాస్తుదారుల్లో 1,24,457 మందికి ఇప్పటికే పెన్షన్ చెల్లింపు ఆదేశాలు (పీపీఓలు) జారీ చేశామని, 12,572 పీపీఓలు చివరిదశలో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగుల పెన్షన్ పథకానికి సంబంధించిన 12వ పేరాలో పెన్షన్ లెక్కింపు ప్రోరేటా ప్రాతిపదికన జరగాలని స్పష్టంగా పేర్కొన్నారని, ఇది న్యాయమైన విధానమని, వేతన సీలింగ్ పరిధిలో ఉన్న పెన్షనర్లను, అధిక వేతన వర్గాలను ఒకే రకంగా పరిగణించాలని ఈ నిబంధన చెబుతోందని మంత్రి తెలిపారు. సుప్రీంకోర్టు కూడా ఈ అంశాన్ని న్యాయవిరుద్ధంగా పరిగణించలేదన్నారు.

చర్చలు జరుగుతున్నా దాడులు ఆపరా?

- రష్యా తీరును తప్పుబట్టిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్
- జెలెన్‌స్కీతో భేటీలో పలు అంశాలపై చర్చ



పారిస్‌లోని ఎలీసీ ప్యాలెస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

పారిస్: సుదీర్ఘంగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా దౌత్య చర్చలు ప్రస్తుతం ఊపందుకోవడాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ స్వాగతించారు. ఉక్రెయిన్‌లో శాంతి, ఐరోపా భద్రత వంటి అంశాల భవిష్యత్తును ఈ చర్చలు నిర్దేశిస్తాయని పేర్కొన్నారు. ఫ్రాన్స్ పర్యటనకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మెక్రాన్ సోమవారం భేటీ అయ్యారు. పలు అంశాలపై విస్తృతంగా సమాలోచనలు జరిపారు. అనంతరం వారిద్దరూ కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శాంతి చర్చలు జోరుగా కొనసాగుతున్నప్పటికీ రష్యా బలగాలు దాడులు ఆపకపోవడాన్ని మెక్రాన్ విమర్శించారు. ఉక్రెయిన్ సార్వభౌమ దేశమని గుర్తుచేశారు. దాని భూభాగాల గురించి చర్చించే హక్కు దానికి మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు.

రష్యా దాడుల్లో మరో నలుగురి మృత్యువాత

ఉక్రెయిన్‌లోని నిప్రో నగరంపై రష్యా బలగాలు సోమవారం క్షిపణులతో దాడి చేశాయి. ఈ దాడుల్లో నలుగురు మృత్యువాతపడ్డారు. 40 మంది గాయపడ్డారు.

నేడు పుతిన్‌తో విట్కాఫ్ భేటీ

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతినిధి అయిన విట్కాఫ్‌తో మంగళవారం భేటీ కానున్నారు. ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ సోమవారం ధ్రువీకరించారు. మరోవైపు- రష్యాను నిలువరించేందుకు ముందుజాగ్రత్త చర్యగా ఆ దేశంపై దాడులు జరిపే అవకాశాలను పరిశీలిస్తున్నామంటూ నాటో మిలిటరీ కమిటీ చీఫ్ గిసెప్పే కావో డ్రాగోన్ ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను రష్యా తీవ్రంగా ఖండించింది. ఆ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంతో కూడుకున్నవని విమర్శించింది. వాటి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని.. నాటో సభ్యదేశాలకు ముప్పు తెచ్చిపెడతాయని హెచ్చరించింది.

ఇజ్రాయెల్ చేతికి లేజర్ రక్షణ వ్యవస్థ

టెల్ అవీవ్: ఇరాన్‌తో మళ్లీ యుద్ధమే వస్తే చిత్తుచేయడానికి అత్యంత ఆధునిక రక్షణ సాంకేతికతల్ని సిద్ధం చేస్తున్నామని ఇజ్రాయెల్ రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ అమీర్ బరాం తెలిపారు. శత్రు విమానాలు, క్షిపణులు, డ్రోన్లు, మోర్టార్ గుళ్లను గాలిలోనే తుత్తునియలు చేసే లేజర్ రక్షణ వ్యవస్థ ఐరన్ బీమ్‌ను డిసెంబరు 30న రక్షణ దళాలకు అందిస్తామని ఇజ్రాయెల్ రక్షణ పరిశోధన-అభివృద్ధి సంస్థ అధిపతి డేనియల్ గోల్డ్ చెప్పారు. టెల్ అవీవ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రెండవ అంతర్జాతీయ రక్షణ సాంకేతికతల వారోత్సవంలో వీరిద్దరూ ప్రసంగించారు. ఇజ్రాయెల్ శత్రువులు ఎప్పటికప్పుడు తమ గురించి తెలుసుకుంటూ తదుపరి యుద్ధానికి సన్నద్ధులవుతున్నారనీ, వారితో అన్నిరంగాల్లో పోరాటానికి సిద్ధంగా ఉన్నామని జనరల్ అమీర్ బరాం వివరించారు. ఇకపైన కూడా అన్ని రంగాల్లో శత్రువుల పీచమణచడానికి ఎలక్ట్రానిక్ యుద్ధం, క్వాంటమ్ సాంకేతికతను, కమ్యూనికేషన్ యంత్రాంగాన్నీ, సైబర్, అంతరిక్ష సాంకేతికతలను ఇజ్రాయెల్ సిద్ధం చేసుకొంటోందని తెలిపారు.

భూ కుంభకోణం కేసులో హసీనాకు ఐదేళ్ల జైలు

- తులిప్ సిద్దిఖీకి రెండేళ్ల శిక్ష

ఢాకా: భూ కుంభకోణం కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఐదేళ్ల శిక్ష విధిస్తూ ఇక్కడి న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. ఇదే కేసులో.. ఆమె సోదరి షేక్ రెహానాకు ఏడేళ్లు.. రెహానా కుమార్తె, బ్రిటన్ మంత్రి తులిప్ సిద్దిఖీకి రెండేళ్ల శిక్ష విధించింది. వీరితోపాటు ఈ కేసులో మరో 14 మందికి ఐదేళ్ల చొప్పున శిక్ష విధిస్తూ.. న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ 17 మంది రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా మరో ఆరునెలలు జైలు శిక్ష అనుభవించాలని పేర్కొంది. అవినీతి నిరోధక కమిషన్(ఏసీసీ) హసీనాపై నమోదుచేసిన కేసుల్లో న్యాయస్థానం ఇప్పటివరకు నాలుగు తీర్పులు ఇచ్చింది. 'పూర్వంచల్ న్యూ టౌన్' అనే ప్రాజెక్ట్ కింద ప్లాట్‌లను కేటాయించడంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల కారణంగా ఏసీసీ హసీనాపై ఆరు కేసులు నమోదు చేసింది.

బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటు వెనుక మాజీ ప్రధాని హసీనా..!

ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లో 16 ఏళ్ల క్రితం జరిగిన రైఫిల్స్ తిరుగుబాటు(2009) వెనుక మాజీ ప్రధాని షేక్ హసీనా హస్తం ఉన్నట్లు ఆ ఘటనపై దర్యాప్తు చేస్తున్న కమిషన్ తాజాగా ఆరోపించింది. నాడు హసీనానే స్వయంగా తిరుగుబాటుకు ఆదేశించారని విచారణలో తేలినట్లు పేర్కొంది. 2009లో జరిగిన ఈ తిరుగుబాటు సమయంలో బంగ్లా సైన్యాన్ని బలహీనపర్చేందుకు భారత్ యత్నించిందని కమిషన్ ఆరోపించింది. దీనిపై ఆంగ్లపత్రిక ఏఎఫ్‌పీ వెలువరించిన కథనాన్ని కమిషన్ ప్రస్తావించింది. హసీనా రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత.. 2009లో బంగ్లాలో జరిగిన రెండు రోజుల తిరుగుబాటులో అగ్ర సైనిక అధికారులతో సహా 74 మంది మరణించారు. గతేడాది హసీనా స్వదేశాన్ని వీడిన అనంతరం ఏర్పాటైన యూనస్ ప్రభుత్వం బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటుపై దర్యాప్తునకు ఓ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. అప్పటి అవామీ లీగ్ ప్రభుత్వ నేతలు కూడా తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు కమిషన్ తాజాగా తన నివేదికలో పేర్కొంది. హసీనా ఆదేశాలతో మాజీ ఎంపీ ఫజ్లే నూర్ తపోష్ దీనిని ముందుండి నడిపించినట్లు వెల్లడించింది. ఆ సమయంలో జరిగిన హత్యలకు హసీనానే కారణమని ఆరోపించింది.

భారత్‌పై ఆరోపణలు


రైఫిల్స్ తిరుగుబాటు సమయంలో హసీనాకు మద్దతుగా నిలిచిన భారత్.. బంగ్లాలో అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నించినట్లు కమిషన్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆ సమయంలో 921 మంది భారతీయులు ఢాకాకు వచ్చారని.. వారిలో 67 మంది ఎక్కడ ఉన్నారో ఇప్పటికీ తెలియరాలేదని పేర్కొంది. వీటిపై భారత్ ఇంకా స్పందించలేదు.

అత్యంత విషమంగా ఖాలిదా జియా ఆరోగ్యం!



బంగ్లాదేశ్‌కు మూడుసార్లు ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన ఖాలిదా జియా(80) ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, ప్రస్తుతం ఆమెను వెంటిలేషన్‌లో ఉంచారని బంగ్లాదేశ్ జాతీయ పార్టీ(బీఎన్‌పీ) నేతలు సోమవారం తెలిపారు. స్థానిక వైద్యులతోపాటు, అంతర్జాతీయ వైద్య నిపుణులు ఆమెను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఛాతీలో ఇన్‌ఫెక్షన్ కారణంగా గుండె, ఊపిరితిత్తులపై ప్రభావం పడడంతో నవంబరు 23న ఆమెను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల అనంతరం ఆమె ఆరోగ్యం మరింత దిగజారడంతో కరోనరీ కేర్ యూనిట్‌కు తరలించారు.

జియా అస్వస్థతపై ప్రధాని మోదీ ఆందోళన



దిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ ఛైర్‌పర్సన్ బేగం ఖాలిదా జియా(80) తీవ్ర అనారోగ్యానికి గురికావడంపై భారత ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. గుండె, ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకడంతో గత నెల 23 నుంచి ఆమె ఢాకాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బంగ్లాదేశ్ ప్రజలకు విశేష సేవలు అందించిన ఆమె సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ఆమెకు అవసరమైన సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు.

హాంకాంగ్ అగ్ని ప్రమాదంలో 151కి పెరిగిన మృతులు



హాంకాంగ్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న బహుళ అంతస్తుల భవన సముదాయంలోని ఓ ఫ్లాట్

బాధితులకు భారీగా సాయం

హాంకాంగ్: భారీ అగ్నిప్రమాదం సంభవించిన హాంకాంగ్ భవన సముదాయంలో ఇంకా మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. సోమవారం నాటికి మృతుల సంఖ్య 151కి పెరిగింది. ఇంకా 104 మంది ఆచూకీ తెలియరాలేదు. ప్రమాద బాధితుల కుటుంబాలను ఆదుకోవడానికి పెద్దఎత్తున జనం ముందుకు వస్తున్నారు. తమకు తోచినంత మేర సాయం అందజేస్తున్నారు. ఇలా ఇప్పటిదాకా సమకూరిన మొత్తం దాదాపు రూ.1029 కోట్లు (115 మిలియన్ల అమెరికన్ డాలర్లు) అని అధికారులు తెలిపారు.



అగ్ని ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న ఓ వ్యక్తి



ఆ ఊర్లో అసభ్యంగా మాట్లాడితే రూ.500 జరిమానా..

ఆదర్శంగా నిలుస్తున్న మహారాష్ట్ర గ్రామం

ఇంటర్నెట్ డెస్క్: పెద్దగా పెట్టుబడి అవసరం లేకుండానే ఒక చిన్న గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేయొచ్చో మహారాష్ట్రలోని సతారా నేవార్ నిరూపించింది. శుభ్రమైన వీధులు, సోలార్ వాటర్ హీటర్లు, వాటర్ ఏటీఎం వంటి సౌకర్యాలతో ఈ గ్రామం ఇప్పుడు సుస్థిర జీవనానికి చిరునామాగా మారింది. ఈ అద్భుతమైన పరివర్తన వెనక గణనీయమైన స్థానిక నాయకుడి కృషి ఉంది. ఆయన బలమైన ప్రణాళిక రూపొందించారు. దాని అమలుకు గ్రామస్థులను ఒప్పించారు. ఆదరణీయమైన సంస్కరణలు అమలు చేశారు. ఐక్యత, ముందుచూపు, క్రమశిక్షణతో కూడిన ఆదరణ ఉంటే చాలు ఎలాంటి గొప్ప మార్పు అయినా సాధ్యమేనని ఈ గ్రామ అభివృద్ధి రుజువు చేసింది. ఊరి మొత్తానికి ఉచితంగా వేడి నీటిని అందించేలా సోలార్ వాటర్ హీటర్ వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేశారు. వాటర్ ఏటీఎం కార్డు ఉపయోగించి శుద్ధి చేసిన తాగు నీటిని పొందే కమ్యూనిటీ ఆర్.ఓ వ్యవస్థ అందుబాటులో ఉంది. ప్రతి ఇంటికి మీటర్లు ఉన్న కుళాయిలు పెట్టారు. గ్రామంలో ఓపెన్ డ్రైనేజీలను తొలగించారు. వీధులను ప్రతి సాయంత్రం శుభ్రం చేస్తారు. వీధి దీపాలు కూడా సోలార్ శక్తితో వెలుగుతాయి. అంతేకాదు, ఇక్కడ ఎవరైనా అసభ్యంగా మాట్లాడితే రూ.500 జరిమానా విధిస్తారు. దీనివల్ల అన్ని వయసుల వారిలో పౌర మర్యాద పెరిగింది. సతారా నేవార్ గ్రామ ప్రజలు విద్య, వినోదానికి కూడా ప్రాధాన్యం ఇస్తారు. పిల్లల కోసం ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పెద్దవాళ్లు కూర్చుని టీవీ చూడడానికి, మాట్లాడుకోవడానికి ప్రత్యేక ప్రాంతం ఉంది. ఇటువంటి సామాజిక ప్రదేశాలు వివిధ తరాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తున్నాయి.

కావాలంటే నా ఎంఆర్ఐ ఫలితాలు విడుదల చేస్తా

ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్: తన ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న సందేహాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం సమాధానమిచ్చారు. కావాలంటే తన మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ) ఫలితాలను విడుదల చేస్తానని సోమవారం ఆయన చెప్పారు. అవి సమగ్రంగా ఉన్నాయన్నారు. అయితే తన శరీరంలోని ఏ భాగంపై ఎమ్ఆర్ఐ పరీక్ష నిర్వహించారో తనకు తెలియదని చెప్పారు. ఆ పరీక్ష తన మెదడుపై అయితే కాదని, ఎందుకంటే గ్రహణశక్తి పరీక్షలో తను ఎంతో చురుగ్గా ఉన్నట్లు తెలిపారు. అక్టోబరు నెలలో ట్రంప్ ఎందుకు వైద్య పరీక్ష చేయించుకున్నారు, వైద్యులు ఏ భాగానికి పరీక్ష నిర్వహించారు అన్న విషయాలను శ్వేతసౌధం ఇంకా బయటపెట్టలేదు.

అక్రమ వలసలకు బైడెన్, హారిస్‌లదే బాధ్యత

ఇంటర్నెట్ డెస్క్: వైట్‌హౌస్ సమీపంలో జరిగిన కాల్పుల ఘటనతో ఒక వలసదారుకు సంబంధం ఉండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని దేశాల నుంచి వలసల్ని సుదీర్ఘకాలం పాటు ఆపేస్తున్నట్లు వెల్లడించారు. అమెరికాకు ఇప్పటికే చాలా సమస్యలు ఉన్నాయని, ఇక మరిన్ని వలసలు అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పాలనను తీవ్రంగా విమర్శించారు. నాటి అధ్యక్షుడు జో బైడెన్, అప్పటి ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ దేశాన్ని మోసం చేశారని అన్నారు. "కాల్పులకు పాల్పడింది అఫ్గాన్ పౌరుడు. అలాంటి వారు దేశంలో చాలామంది ఉన్నారు. సోమాలియన్లు కూడా చాలా మంది ఉన్నారు. వాళ్లు ఎవరూ దేశంలో ఉండటానికి వీల్లేదు" అని ట్రంప్ అన్నారు.



కోల్‌కతాలోని సీఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీఎల్‌వోలు

బీఎల్‌వోల నిరసనలతో కోల్‌కతాలో ఉద్రిక్తతలు

కోల్‌కతా: సర్ ప్రక్రియలో పనిభారంపై పశ్చిమ బెంగాల్‌లో బీఎల్‌వోల నిరసనలు కొనసాగుతున్నాయి. రాజధాని కోల్‌కతాలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) కార్యాలయం ఎదుట వారు సోమవారం అధిక సంఖ్యలో గుమిగూడి ఆందోళనకు దిగారు. అదే సమయంలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి నేతృత్వంలో భాజపా ప్రతినిధుల బృందం సీఈవోతో భేటీ అయ్యేందుకు అక్కడికి రావడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. కాషాయ పార్టీ నేతలు వెనక్కి వెళ్లిపోవాలంటూ బీఎల్‌వోలు నినాదాలు చేశారు. బారికేడ్లను తొలగించుకొని కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. చివరకు బీఎల్‌వోల ప్రతినిధి బృందం లోపలికి వెళ్లి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు పోలీసులు అనుమతించారు.

పని ఒత్తిడితో.. యూపీలో బీఎల్‌వో ఆత్మహత్య

ఇంటర్నెట్ డెస్క్: పని ఒత్తిడి కారణంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో సర్వేశ్ సింగ్ (46) అనే ఓ బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) ఆత్మహత్య చేసుకున్నారు. బలవన్మరణానికి ముందు ఆయన తీసుకున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా కొన్ని వారాలుగా పనిభారం పెరిగిందని, ఎంత కష్టపడినా పని పూర్తి చేయలేకపోతున్నానని ఆయన కన్నీళ్లు పెట్టుకోవడం వీడియోలో కనిపించింది. ఆత్మహత్య చేసుకుంటున్నందుకు క్షమించాలని.. తన నలుగురు కుమార్తెలను జాగ్రత్తగా చూసుకోవాలని కుటుంబసభ్యులను అందులో కోరారు. సర్వేశ్ మురాదాబాద్‌లోని ఓ పాఠశాలలో అసిస్టెంట్ టీచర్‌గా పనిచేసేవారని.. అక్టోబరు 7న ఆయనకు బీఎల్‌వో పనులు అప్పగించారని పోలీసులు తెలిపారు.

'సర్'పై దుష్ప్రచారం రాజకీయ ప్రేరేపితమే

బెంగాల్, తమిళనాడులలో కసరత్తును సమర్థించుకున్న ఈసీ అఫిడవిట్

దిల్లీ: పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కసరత్తును ఎన్నికల సంఘం (ఈసీ) గట్టిగా సమర్థించుకుంది. మూకుమ్మడిగా ఓటర్లను తొలగిస్తున్నారంటూ రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలు అతిశయోక్తితో కూడినవనీ, ఊహాజనితమైనవనీ సుప్రీంకోర్టుకు సమర్పించిన 81 పేజీల అఫిడవిట్‌లో పేర్కొంది. సర్ కసరత్తును సవాల్ చేస్తూ డీఎంకే, సీపీఎం, టీఎంసీ, పశ్చిమ బెంగాల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ దాఖలు చేసిన వ్యాజ్యాలపై గత నెల 11న ప్రస్తుత సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం ఈసీ స్పందనను కోరింది. దీనికిగాను ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది పవన్ దివాన్ రెండు రాష్ట్రాలకు సంబంధించి వేర్వేరు అఫిడవిట్లు సమర్పించారు. సర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని కోరారు. రాజ్యాంగ అధికరణలు 324, 326 కింద సమకూరిన అధికారాల ప్రకారమే సర్ కసరత్తును ఈసీ చేపట్టిందని, ఓటరుగా నమోదుకు అవసరమైన అర్హతలను పరిశీలించాల్సిన బాధ్యత ఆ సంస్థపైనే ఉంటుందని వివరించారు.

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఎన్‌ఎంయూఏ, ఈయూలకు సభ్యత్వం

ఈనాడు, అమరావతి: ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ)కు చెందిన నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ), ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ)లకు ప్రభుత్వం సభ్యత్వం కల్పించింది. ఈ రెండు సంఘాలను గతంలో ప్రభుత్వం గుర్తించగా, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, వివిధ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా రాష్ట్రస్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో తమకు సభ్యత్వం కల్పించాలని ఆ సంఘాలు విజ్ఞప్తులు చేశాయి. వాటిని పరిగణనలోకి తీసుకుని ఈ రెండు సంఘాలకు సభ్యత్వం కల్పిస్తూ సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై ఎన్ఎంయూఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య హర్షం వ్యక్తం చేశారు.

పోలవరం ప్రాజెక్టు సీఈవోగా యోగేష్ పైతంకర్

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోగా యోగేష్ పైతంకర్‌ను కేంద్రజల్‌శక్తి శాఖ నియమించింది. ఇంతవరకు సీఈవోగా ఉన్న అతుల్ జైన్ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో యోగేష్ నియమితులయ్యారు.

కిలో అరటి 50పైసలు: జగన్

ఈనాడు, అమరావతి: 'హలో ఇండియా..ఆంధ్రప్రదేశ్ వైపు చూడు.. ఇక్కడ కిలో అరటి 50పైసలు, ఇక్కడి రైతుల దుస్థితి' అంటూ మాజీ సీఎం జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'అగ్గిపెట్టె, ఒక బిస్కట్ కంటే అరటి చాలా తక్కువ ధర. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి, నెల తరబడి పనిచేసే ప్రతిఫలంగా బాధను పొందుతున్న రైతులకిది దారుణమైన దెబ్బ. ఏ పంటకూ కనీస ధరలు దక్కడం లేదు' అని విమర్శించారు.



సృజనాత్మకత తోడుంటే..

సమస్త పరిశ్రమల్లో సృజనాత్మకతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అదేవిధంగా ప్రాజెక్టులను అభివృద్ధి పరచడం, కొత్త ఆవిష్కరణలు ఒడిసిపట్టడం వంటి అంశాల్లోనూ క్రియేటివిటీదే ముఖ్యపాత్ర. సృజనాత్మకత మెరుగుదల దిశగా మీరు చేసే ప్రయత్నం మీ వ్యక్తిగత, వృత్తిగత జీవితంలో మిమ్మల్ని ఉన్నతస్థానంలో నిలబెడుతుంది.

– కెన్నీ, ఆర్థిక సలహాదారు

2027 మార్చి నాటికి తొలిదశ పునరావాసం

- లక్ష కుటుంబాలను తరలించేందుకు చర్యలు
- తొలుత 38,060 కుటుంబాలు.. తర్వాత మిగిలినవి
- పోలవరం అథారిటీకి ప్రణాళిక సమర్పణ

ఈనాడు, అమరావతి: పోలవరం తొలిదశ పునరావాసాన్ని 2027 మార్చికల్లా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆ మేరకు పోలవరం అథారిటీకి పునరావాస కమిషనర్ తాజాగా ప్రణాళిక సమర్పించారు. దాదాపు లక్ష కుటుంబాలను (96,660) తరలిస్తే తప్ప పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీళ్లు నిలబెట్టడం సాధ్యం కాదు. తొలిదశలో 38,060 కుటుంబాలను తరలించి ఆ మేరకు మాత్రమే నీళ్లు నిలబెట్టేందుకు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇన్ని వేల కుటుంబాలను వేరే చోటుకు తరలించి వారికి అక్కడ కొత్త జీవితం ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు ఇళ్లు కట్టించడంతో పాటు పొలాలు ఇచ్చి సాగుకు, ఉపాధికి అవకాశాలు కల్పించాలి. జగన్ సర్కార్‌లో నిర్వాసిత కుటుంబాల కోసం ఒక్క కాలనీని కూడా పూర్తి చేయకపోవడంతో మళ్లీ ఇప్పుడు కొత్తగా ప్రారంభించి పూర్తి చేయాల్సి వస్తోంది. తొలిదశ పునరావాసానికి ఇంకా రూ.6,102.39 కోట్లు అవసరం. రెండో దశలో 58,600 కుటుంబాలను తరలించాలి. అందుకు కేంద్రం నుంచి ఇంకా నిధులు మంజూరు కావాల్సి ఉంది.

✦ ప్రధాన డ్యాం, కుడి, ఎడమ కాలువలకు మొత్తం భూమి సేకరణ ఇదే. పునరావాసానికి భూసేకరణ తొలిదశ వరకు మాత్రమే. 2026 మార్చి నాటికి భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

భూసేకరణ వివరాలు (తొలిదశలో + 41.15 మీటర్ల వరకు నీళ్లు నిల్వ చేసేలా) (ఎకరాల్లో)

అంశం	అవసరమైన భూమి	సేకరించింది	ఇంకా సేకరించాల్సింది
ప్రధాన డ్యాం	1,813.53	1,813.53	0
ముంపులో చిక్కే భూమి	59,484.63	58,270.48	1,214.15
ఎడమ కాలువ	10,611.77	10,605.56	6.21
కుడి కాలువ	10,044.87	10,084.86	00
భూసేకరణ, పునరావాసం కోసం	18,144.79	10,391.53	7,753.26

తొలిదశ మొత్తం నిర్వాసిత కుటుంబాలు:	38,060
1ఏ కింద:	20,946 కుటుంబాలు
1బీ కింద:	17,114 కుటుంబాలు
ఇప్పటివరకు తరలించినవి:	14,385 కుటుంబాలు
ఇంకా తరలించాల్సినవి:	23,675 కుటుంబాలు

నిర్వాసితుల తరలింపు ఇలా..

తొలిదశలో మొత్తం 38,060 కుటుంబాలను తరలిస్తున్నారు. ఇది కూడా 1ఏ, 1బీ అని రెండు భాగాలుగా విభజించారు. +45.72 మీటర్లకు నీళ్లు పెడితే తప్ప ముంపు రాదని భావించిన కొన్ని గ్రామాల్లో +41.15 మీటర్లకు నీళ్లు నిలబెట్టినా ముంపు తప్పదని తర్వాత తేలింది. తొలిదశ నిర్వాసితుల సంఖ్య పెరిగింది.

✦ ఇందులో 6,561 కుటుంబాల కోసం 49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం కొత్తగా టెండర్లు పిలిచి కొత్త గుత్తేదారులకు అప్పజెప్పి పనులు పూర్తి చేయించనున్నారు. టెండరు ప్రక్రియ కొనసాగుతోంది.

✦ 1బీ లో సొంతంగా ఇళ్లు కట్టుకుంటామన్న వారు పోను మిగిలిన కుటుంబాలకు తరలింపునకు అవసరమైన కాలనీల నిర్మాణం 2026 మార్చిలో టెండర్లు పిలిచి 2027 మార్చికి పూర్తి చేయాలనేదే ప్రణాళిక.

ఎన్నో సవాళ్లు..

పోలవరం 1బీ కింద నిర్వాసితుల తరలింపు అంశంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. గంగవరం, అడ్డతీగల మండలాల్లో గుర్తించిన భూములు తమకు వద్దని నిర్వాసితులు చెబుతున్నారు. అవి మండల కేంద్రాల నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని అంటున్నారు. అంత లోపలికి వెళ్లేందుకు తాము సిద్ధంగా లేమని పేర్కొంటున్నారు. మరో వైపు రోడ్డుకు దగ్గరగా అనువైన భూములు దొరక్కపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

✦ గిరిజనేతర భూములు కోర్టు కేసుల్లో ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆ భూములు ఆక్రమించుకున్న వారు భూసేకరణకు సహకరించేలా లేరు.

లిఫ్ట్ పాలసీ మార్గదర్శకాలు విడుదల

- ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీల కోసం..

ఈనాడు, అమరావతి: ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 4.0 అమలుకు మార్గదర్శకాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ నిబంధనలు 2024-29 మధ్య అమల్లో ఉంటాయని పేర్కొంది. ఐటీ రంగానికి సంబంధించి మౌలిక సదుపాయాలు, డిజిటల్ స్పేస్, ఉపాధి కల్పన ఆధారంగా ప్రోత్సాహకాలు అందించేందుకు వీలుగా ఐటీ, గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్ (జీసీసీ) పాలసీని ప్రభుత్వం రూపొందించింది. దీని అమలు పర్యవేక్షణకు నోడల్ ఏజెన్సీగా ఏపీఈడీబీ వ్యవహరిస్తుందని పేర్కొంది. ఐటీ/ఐటీ ఆధారిత కంపెనీల కింద 17 కేటగిరీ కార్యకలాపాలు నిర్వహించే సంస్థలను గుర్తించింది. ఐటీ, ఐటీ ఆధారిత సేవలందించే సంస్థలు, జీసీసీలు, జీసీసీ డెవలపర్లు, ఐటీ పార్కు డెవలపర్లు పాలసీ పరిధిలో ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హులుగా పేర్కొంది. భూములు పొందిన సంస్థలు 12 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభించాలి. డేటా సెంటర్లు/డేటా సెంటర్ సంస్థలకు భూముల ధరల్లో రాయితీ పొందే అవకాశం లేదని పేర్కొంది.

ప్రోత్సాహకాలు పొందేందుకు మార్గదర్శకాలు

✦ ఐటీ/ఐటీ ఆధారిత కంపెనీలు, జీసీసీలు ప్రోత్సాహకాలు పొందాలంటే అవి ఫార్చ్యూన్/ ఫోర్బ్స్ ర్యాంకింగ్ కలిగి ఉండాలి లేదా బిలియన్ డాలర్ల క్యాపిటలైజేషన్/ వార్షికాదాయాన్ని పొందాలి.
✦ ఐటీ సంస్థలు మూడేళ్లలో 3వేల మందికి, జీసీసీలు 2వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలి.
✦ విదేశీ కంపెనీలు భూ కేటాయింపులు పొందే సమయానికి దేశంలో కంపెనీని రిజిస్టర్ చేయాలి.
✦ ప్రోత్సాహకాలు పొందేందుకు మధ్యతరహా కంపెనీలకూ అవకాశం. వాటికి ఎకరా రూ.4 కోట్ల ధరకు భూమి కేటాయింపు.
✦ భూములు, భవనాలు, ఆఫీస్, ప్లాంట్, మెషినరీ, పరికరాల కొనుగోలుకు చేసిన మొత్తాన్ని స్థిర మూలధన పెట్టుబడిగా పరిగణించాలని నిర్ణయం.
✦ ఎకరాకు కనీసం 500 మందికి ఉపాధి కల్పించాలి.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు చిత్రపటానికి మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయం వెలుపల నాయీబ్రాహ్మణులు సోమవారం పాలాభిషేకం చేశారు. దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో ఖాళీగా ఉన్న వాద్యకారుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఎసైన్డ్ భూముల చట్ట సవరణపై ఆర్డినెన్స్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎసైన్డ్ భూముల (బదిలీలపై నిషేధం) చట్ట సవరణకు సంబంధించి గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఈ మేరకు గెజిట్ ప్రచురించాలని న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. విద్యుత్తు ఉత్పత్తి సంస్థలకు ఎసైన్డ్ భూముల్ని లీజుకు ఇచ్చేలా చట్ట సవరణ చేసే ప్రతిపాదనకు మంత్రివర్గం గతంలో ఆమోదం తెలిపింది.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

రాష్ట్రంలో 10 నగరాల్లో తగ్గిన కాలుష్యం

- ఉత్తరాంధ్రలోని 3 నగరాల్లో మాత్రం పెరుగుదల
- కేంద్రం వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 2017-18, 2024-25 మధ్యకాలంలో పది నగరాల్లో వాయు కాలుష్యం తగ్గితే, మూడు నగరాల్లో మాత్రం పెరిగింది. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి (తెదేపా) సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌కు 2019-20 నుంచి 2025-26 వరకు రూ.734.86 కోట్లు కేటాయించి, అందులో రూ.407.25 కోట్లు మున్సిపల్ కార్పొరేషన్లకు అందించినట్లు చెప్పారు. 2017-18తో పోలిస్తే 2024-25 నాటికి పది నగరాల్లో కాలుష్యం తగ్గి పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు.

రాష్ట్రంలోని వివిధ నగరాల్లో వాయు కాలుష్యం (ప్రతి ఘనపుమీటర్‌లో మైక్రోగ్రాం ధూళికణాలు)

నగరం	2017–18	2024–25
రాజమహేంద్రవరం	85	59
విజయవాడ	91	64
కడప	75	56
కర్నూలు	79	60
అనంతపురం	78	60
నెల్లూరు	64	51
చిత్తూరు	70	60
ఏలూరు	72	64
ఒంగోలు	65	58
గుంటూరు	66	64
కాలుష్యం పెరిగిన నగరాలు		
విశాఖపట్నం	76	101
శ్రీకాకుళం	69	79
విజయనగరం	72	74

విశాఖలో 46.23 కిలోమీటర్ల మెట్రోరైలు ప్రాజెక్టుకు ప్రతిపాదనలు

విశాఖపట్నంలో 46.23 కిలోమీటర్ల మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సవరించిన ప్రతిపాదనలు పంపినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్ సాహు తెలిపారు. సోమవారం రాజ్యసభలో వైకాపా ఎంపీ గొల్ల బాబూరావు అడిగిన ప్రశ్నకు ఈమేరకు సమాధానం ఇచ్చారు. మెట్రో ప్రాజెక్టు ఖర్చుతోకూడుకున్నదని, అందువల్ల ఈ ప్రతిపాదనను 2017 మెట్రోరైలు విధానాన్ని అనుసరించి మదింపుచేయాల్సి ఉంటుందన్నారు. ప్రాజెక్టు మంజూరుకు నిర్దిష్ట గడువు చెప్పడం సాధ్యంకాదని పేర్కొన్నారు.

అటల్ పెన్షన్ యోజన కింద ఏపీలో 41.48 లక్షలమంది నమోదు

సామాజిక భద్రతకు సంబంధించిన అటల్ పెన్షన్ యోజన కింద ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు 41,48,294 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడించారు. ఆమె సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం తెలిపారు. సేవింగ్ ఖాతా, లేదా పోస్టాఫీస్ ఖాతా ఉన్న 18-40 ఏళ్ల వయసులోపు వారంతా ఇందులో చేరొచ్చని చెప్పారు. 60 ఏళ్ల తర్వాత పింఛను మొదలవుతుందని తెలిపారు.

ముద్ర యోజన కింద ఏపీలో రూ.88 వేల కోట్ల రుణాలు

ప్రధానమంత్రి ముద్ర యోజన కింద 2020 ఏప్రిల్ 1 నుంచి ఈ అక్టోబరు 31వరకు ఆంధ్రప్రదేశ్‌లో 72.20 లక్షల ఖాతాలకు రూ.88,750 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి తెలిపారు. సోమవారం లోక్‌సభలో భాజపా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు ఈమేరకు సమాధానం ఇచ్చారు. ఇందులో 34.99 మంది మహిళా ఖాతాలకు రూ.25,248 కోట్ల రుణాలు పంపిణీచేసినట్లు చెప్పారు. ఇందులో ఎస్సీలకు రూ.2,067 కోట్లు, ఎస్టీలకు రూ.354 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. మొత్తం రుణాల్లో అత్యధికంగా కృష్ణా జిల్లాలో 6.02 లక్షల ఖాతాలకు రూ.8,325 కోట్లు, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4,696 ఖాతాలకు రూ.91.52 కోట్ల రుణం అందించినట్లు వెల్లడించారు.

ఏపీకి రూ.3,492 కోట్ల వడ్డీలేని మూలధన రుణం

మూలధన వ్యయంకోసం ఆంధ్రప్రదేశ్‌కు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,492.40 కోట్ల వడ్డీలేని రుణం విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌధరి తెలిపారు. దీని కింద మొత్తం 96 ప్రాజెక్టులకు అనుమతిచ్చినట్లు చెప్పారు.

సమగ్ర శిక్ష కింద 58.75% నిర్మాణాలే పూర్తి

సమగ్ర శిక్ష పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో రూ.142 కోట్లతో ఆమోదించిన 2,677 పనుల్లో ఇప్పటివరకు 1,573 (58.75%) పనులు మాత్రమే పూర్తయినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్‌చౌధరి తెలిపారు. సోమవారం లోక్‌సభలో తెదేపా ఎంపీలు కేశినేని శివనాథ్, బీకే పార్థసారథి, బస్తిపాటి నాగరాజు అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, ఏఎస్ఆర్, కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, అన్నమయ్య, నంద్యాల, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ఆమోదించిన పనుల్లో ఏ ఒక్కటీ పూర్తికాలేదని చెప్పారు.

విద్యాసంస్థల్లో ఫీజుల చెల్లింపునకు యూపీఐ అనుమతించాలి

అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రవేశ, పరీక్ష ఫీజుల చెల్లింపుల కోసం యూపీఐ విధానాన్ని అనుమతించాలని అక్టోబరు 10వ తేదీన అన్ని రాష్ట్రాలకూ అడ్వయిజరీ పంపినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌధరి తెలిపారు. తెదేపా ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, తెన్నేటి కృష్ణప్రసాద్‌లు అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు.

పీఎం ఉషా కింద రూ.28 కోట్లే వినియోగం

ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ (పీఎం-ఉషా) కింద ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు యూనివర్సిటీల పరిధిలోని 33 యూనిట్లకోసం రూ.378.75 కోట్ల పనులకు అనుమతిస్తే ఇప్పటివరకూ రూ.28 కోట్లే వినియోగించినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. లోక్‌సభలో తెదేపా ఎంపీ అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు బదులిచ్చారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి రూ.100 కోట్లకు అనుమతిస్తే రూ.5.63 కోట్లు మాత్రమే ఉపయోగించినట్లు చెప్పారు. యూనివర్సిటీల బలోపేతం కోసం 6 యూనివర్సిటీలకు ఒక్కోదానికి రూ.20 కోట్లు ఆమోదించగా, అందులో కేవలం రూ.17 లక్షలు మాత్రమే వినియోగించినట్లు తెలిపారు.

ఏపీలో పదిచోట్ల వాటర్ ఏరోడ్రోమ్స్ అభివృద్ధికి ప్రతిపాదన

ఉడాన్ 5.5 కింద సీ ప్లేన్‌ల నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదిచోట్ల వాటర్ ఏరో డ్రోమ్‌లను ప్రతిపాదించినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. ఇందులో అరకు, గండికోట, కాకినాడ, కోనసీమ, లంబసింగి, నరసాపురం, ప్రకాశం బ్యారేజి, రుషికొండ, శ్రీశైలం, తిరుపతి ఉన్నట్లు చెప్పారు. సోమవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఈ సీప్లేన్ నిర్వహణకు అవసరమైన ఏరో డ్రోమ్‌ల ఏర్పాటుకు జలవనరుల సామర్థ్యాల గురించి మదింపు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందన్నారు.

సగానికి సగం ఖాళీలతో 'ఆయుష్' పెరిగేదెలా?

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కేటాయించిన నిధులు వెచ్చిస్తేనే.. సేవలు అందుబాటులోకి

ఈనాడు, అమరావతి: వైద్యసేవల్లో కీలకమైన ఆయుష్ విభాగంలో పరిస్థితి గాడితప్పింది. సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆయుర్వేదం, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి, యోగ సేవలు ప్రజలకు చేరువ కావడంలేదు. వైద్యశాలలు, డిస్పెన్సరీల ద్వారా వైద్య సేవలు సమర్థంగా అందడంలేదు. వైద్య కళాశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య కల్లగానే మిగులుతోంది. గత వైకాపా ప్రభుత్వం ఈ శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర వాటా నిధులైనా ఇవ్వక, ఖాళీలు భర్తీ చేయక వ్యవస్థను నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ప్రపంచాన్ని ఆకర్షించేలా విశాఖలో యోగాంధ్ర నిర్వహించింది. బడ్జెట్‌లో రూ.165 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపింది. . రూ.వందల కోట్లతో కీలక ప్రాజెక్టులకు ప్రణాళికలు రూపొందించింది. దీంతోపాటు కొన్ని పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడంతో ఇన్నాళ్లూ నిస్తేజంగా ఉన్న ఆయుష్‌కు ఊపిరులూదినట్లయింది.

సేవల్లో లోపాలు.. తగ్గుతున్న రోగులు

రాష్ట్రంలో ఆయుష్ శాఖ పరిధిలో ఎనిమిది ఆసుపత్రులు, నాలుగు కళాశాలలు, 737 డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయుర్వేదిక్ ఆసుపత్రులకు ఏటా సుమారు 1.60 లక్షల మంది ఓట్ పేషెంట్లు, 15,000 మందికి పైగా ఇన్‌పేషెంట్లు సేవలు పొందుతుంటారు. హోమియోపతి ఆసుపత్రుల్లో 2 లక్షలకు పైగా ఓపీ, 2,000 వరకు ఐపీ.. నేచురోపతి వైద్యశాలల్లో 50,000కు పైగా ఓపీ ఉంటోంది. ఈ వైద్యంపై నమ్మకం ఉన్న రోగులంతా సరైన సిబ్బంది లేక, సేవలు అందక ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు.

✦ 2014-15లో మంజూరైన కాకినాడ 50 పడకల ఆసుపత్రి పనులు 90 శాతం, 2016-17లో మంజూరైన విశాఖలోని 50 పడకల ఆయుష్ ఆసుపత్రి పనులు 80 శాతం పూర్తయ్యాయి. విశాఖలో 2016-17లో మంజూరు చేసిన నేచురోపతి కళాశాల పనులు 50 శాతమే జరిగాయి. 2016-17లో మంజూరైన విశాఖలోని ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ పనులతోపాటు నంద్యాల జిల్లా బనగానపల్లిలోని ఆయుర్వేద మినీ ఆసుపత్రి నిర్మాణాలను పూర్తిచేయాల్సి ఉంది. ఇవన్నీ కొలిక్కివస్తే సేవలు మెరుగుపడే అవకాశం ఉంది.

సిబ్బంది లేకుండా యుద్ధమెలా..

ఆయుష్ విభాగంలో సగానికిపైగా (59.83 శాతం) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన కార్యాలయంలో 31 పోస్టులు, ఆర్డీడీ కార్యాలయంలో 37, ఆయుష్ కళాశాలల్లో 186, ఆసుపత్రుల్లో 154, డిస్పెన్సరీల్లో 1,095 పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల సేవల్లో లోపాలు తప్పడంలేదు. ఈ ఖాళీలను భర్తీ చేస్తేనే పరిస్థితి కుదుటపడే అవకాశం ఉంది.

✦ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒప్పంద పద్ధతిలో వివిధ కేటగిరీల్లో 107 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రకటన జారీచేసింది. కళాశాలల్లో 140 పోస్టులు భర్తీకి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. డిస్పెన్సరీల్లో 300 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంటే.. ఏడాదిపాటు ఆర్థిక ఊతం ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించినట్లు సమాచారం.

నిధులు విదల్చక నిస్తేజం..

కూటమి ప్రభుత్వం వచ్చాక నిధుల మంజూరుతో ఆయుష్ సేవలకు ఊపొచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆసుపత్రుల అభివృద్ధికి రూ.102.43 కోట్లు, కళాశాలల, బోధనాసుపత్రుల అభివృద్ధికి రూ.39.73 కోట్లు, వెల్‌నెస్ సెంటర్లు, ఐటీ, హెచ్‌ఆర్, ప్రత్యేక క్లినిక్‌లకు రూ.16.86 కోట్లు పరిపాలన ఖర్చులకు రూ.6.62 కోట్లు వెచ్చించేలా ప్రణాళికలు రూపొందించారు. దీంతో గత ఐదేళ్లూ నిస్తేజంగా ఉన్న శాఖలో కదలిక వచ్చినట్లయింది.

ఆయుష్ శాఖకు నిధుల కేటాయింపు ఇలా..

ఆర్థిక సంవత్సరం	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో..)
2019- 20	31.67
2021- 22	0
2022- 23	0
2023- 24	0
2024- 25	41.61
2025- 26	165.00 (మంజూరుకు ఆమోదం)

ఆయుష్ శాఖలో ఇదీ పరిస్థితి..

✦ మొత్తం పోస్టులు: 2,604
✦ భర్తీ అయినవి: 1,046
✦ ప్రస్తుతం ఖాళీలు: 1,558

గాలి నుంచి రోజుకు 10 లీటర్ల తాగునీరు

ఉత్పత్తి సాధనాన్ని రూపొందించిన దావణగెరె ఇంజినీరింగ్ విద్యార్థులు

దావణగెరె: గాలి నుంచి రోజుకు దాదాపు 10 లీటర్ల తాగునీటిని ఉత్పత్తి చేసే సరికొత్త సాధనాన్ని కర్ణాటకలోని దావణగెరెలో ఉన్న బాపూజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (బీఐఈటీ)కి చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైనింగ్ విభాగం విద్యార్థులు అభివృద్ధి చేశారు. 'స్మార్ట్ అట్మాస్ఫియర్ సిస్టమ్'గా దానికి నామకరణం చేశారు. ప్రస్తుతం ఈ నమూనాను కళాశాల భవనంపై అమర్చారు. ఎత్తయిన భవనాల పైనుంచి వీచే బలమైన గాలులను మూడు స్పిన్నింగ్ ఫ్యాన్‌ల ద్వారా ఇది లాగేసుకుంటుంది. ఆ గాలిలోని తేమను.. కండెన్సర్, బ్లోయర్, హీటర్‌ల సాయంతో నీటిగా మారుస్తుంది. ఇది పనిచేసేందుకు అవసరమైన శక్తిని సౌరఫలకలు అందిస్తాయి. ఈ విధానంలో ఉత్పత్తయ్యే నీరు శుద్ధమైనదని, అందులో సహజ ఖనిజ లవణాలు ఉన్నాయని నిర్ధారణ అయింది. తాము రూపొందించిన సాధనం ప్రస్తుతం రోకు 8-10 లీటర్ల నీటిని ఉత్పత్తి చేస్తోందని.. ఆ ఉత్పత్తి సామర్థ్యాన్ని 15-20 లీటర్లకు పెంచేందుకు కృషి చేస్తున్నామని విద్యార్థులు తెలిపారు.

గోకులాల నిర్మాణాలతో.. ఆర్థిక చేయూత

- 70-80 శాతం రాయితీతో పశువుల అందజేత
- రైతులు సామూహికంగా పెంపకం చేపట్టేలా ఏర్పాటు



పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం పులిపుట్టిలోని గోకులం

ఈనాడు, అమరావతి: మూడు, నాలుగు కాదు.. 20 పశువులు ఒకేచోట ఉండేలా పెద్ద షెడ్డు, తాగునీటి వసతి, గడ్డి పెంపకానికి అనువైన స్థలాన్ని అందుబాటులోకి తెస్తూ కూటమి ప్రభుత్వం గిరిజన రైతులకు అండగా నిలుస్తోంది. పశువులనూ 70-80 శాతం రాయితీతో అందించాలని నిర్ణయించింది. అవి వ్యాధుల బారిన పడకుండా సంరక్షణ చర్యలతోపాటు పాల విక్రయ మార్కెట్‌నూ అందుబాటులోకి తీసుకురానుంది. మూడు నెలలపాటు మేత, దాణా ఉచితంగా అందించనుంది. గిరిజన ప్రాంతాల్లో 10-15 మంది రైతులు సామూహికంగా పశువుల్ని పెంచుకునేలా పార్వతీపురం, సీతంపేట, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో 76 గోకులాల నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటివరకు 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి.

నిధులివ్వకుండా అడ్డుపడిన వైకాపా

2018-19 మధ్య తెదేపా హయాంలో 140 గోకులాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టాల్సి ఉండగా వైకాపా ప్రభుత్వం రాష్ట్రవాటాను సకాలంలో విడుదల చేయకుండా అడ్డుపడింది. దీంతో 76 గోకులాల నిర్మాణాలు మాత్రమే చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చి గాడిన పెట్టడంతో కొన్ని గోకులాల నిర్మాణం పూర్తవగా.. మరికొన్ని చివరిదశకు చేరాయి.

లబ్ధి పొందనున్న 760 మంది గిరిజన రైతులు..

గోకులాల నిర్మాణం, పశువుల కొనుగోలుకు ప్రభుత్వం రూ.24 కోట్లు విడుదల చేసింది.

✦ గోకులంలో 20 పశువులు ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ✦ ఒక్కో గిరిజన రైతుకు కనీసం రెండు పశువుల్ని (లబ్ధిదారు కోరుకున్నవి) అందించనున్నారు.
✦ గోకులం పరిధిలో 10 మంది రైతుల్ని ఎంపిక చేయనున్నారు. అంటే 76 గోకులాలకు 760 మంది లబ్ధిదారుల్ని గుర్తించనున్నారు.
✦ ఒక పశువు ధర రూ.లక్షగా నిర్ధారించారు.
✦ లబ్ధిదారు నివాసముండే జిల్లా నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి పశువుల కొనుగోలు చేపట్టాలని నిర్దేశించింది.

ఎక్కడెక్కడ ఎన్నంటే..

ఐటీడీఏ	మంజూరైన గోకులాలు
సీతంపేట	23
పార్వతీపురం	6
పాడేరు	18
రంపచోడవరం	18
చింతూరు	11

1991 నాటి ఆర్థిక సంస్కరణల ఉద్యమం అవసరం

- ప్లానింగ్ కమిషన్ మాజీ డిప్యూటీ ఛైర్మన్ మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ పరిణామాలు, సవాళ్లు, దేశీయ డిమాండ్ నేపథ్యంలో 1991 నాటి ఆర్థిక సంస్కరణల ఉద్యమం అవసరమని ప్రముఖ ఆర్థికవేత్త, ప్లానింగ్ కమిషన్ మాజీ డిప్యూటీ ఛైర్మన్ మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే జీడీపీలో 6.5 శాతం స్థిరమైన వృద్ధిరేటుతో పాటు సగటు వృద్ధిరేటు 8 శాతం సాధించాలన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో ''వేగంగా మారుతున్న ప్రపంచంలో విధానాల రూపకల్పనలో సవాళ్లు'' అనే అంశంపై బీపీఆర్ విఠల్ స్మారకోపన్యాసంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు అధ్యక్షత వహించగా... అహ్లూవాలియా వర్చువల్‌గా ప్రసంగించారు. ''భారత్‌లో ద్రవ్యలోటు ఎక్కువగా ఉన్నా... వేగంగా అభివృద్ధి చెందుతోంది. వచ్చే ఐదేళ్లలో వృద్ధిరేటు 7 శాతం నమోదు కావాలంటే ద్రవ్యలోటును కేంద్రం 4.9 నుంచి 3 శాతానికి తగ్గించాలి. ఆదాయం పెంచుకునేందుకు సంస్కరణలు తేవాలి. ప్రస్తుతం అమెరికా వైఖరి మారుతోంది. రక్షణ కోసం టారిఫ్‌లు విధిస్తోంది. మరోవైపు చైనా ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదుగుతున్నా... ఆ దేశంతో భద్రతాపరమైన అంశాలను విస్మరించలేం. యూకే, ఈయూతో స్వేచ్ఛావ్యాపార ఒప్పందాలు ఆహ్వానించదగినవే. ఆసియా దేశాలతోనూ ఒప్పందాలు పెంచుకోవాలి.


వేగంగా సాంకేతిక మార్పు

సాంకేతిక మార్పు వేగంగా జరుగుతోంది. 100 మిలియన్ల మందికి చేరుకునేందుకు ఆటోమొబైల్ పరిశ్రమకు 20 ఏళ్లు పట్టింది. అదే ఇంటర్నెట్‌కు మూడేళ్ల సమయం పడితే.. చాట్ జీపీటీకి పట్టింది మూడు రోజులే. ఏఐ, ఇతర టెక్నాలజీలతో ప్రస్తుతమున్న ఉద్యోగాలు పెద్దసంఖ్యలో ప్రభావితమవుతున్నాయి. కొత్త ఉద్యోగాల వృద్ధి నెమ్మదిగా ఉంటోంది. ఇదో పెద్ద సవాలు. రక్షణ రంగంలో ఖర్చులు ఏటా 0.5 నుంచి 1 శాతం పెంచుతున్నా, సాంకేతిక పరిశోధనలపై చేస్తున్న ఖర్చు చాలా తక్కువ. ప్రైవేటులో వీటికోసం ప్రభుత్వం ప్రోత్సాహకాలు పెంచాలి. ప్రపంచంలోని 20 అత్యంత కాలుష్య నగరాల జాబితాలో 14 దేశంలోనే ఉన్నాయి. పట్టణ ప్రజారవాణాలో ఈవీ బస్సుల వాటా రానున్న పదేళ్లలో 50 శాతానికి చేరాలి. విపత్తులను తట్టుకునే పంట రకాలు, మార్కెటింగ్‌పై ఖర్చులు పెంచాలి. రాష్ట్రాల పరిధిలోనూ వృద్ధిలో అసమానతలున్నాయి. ఉదాహరణకు కర్ణాటకను తీసుకుంటే బెంగళూరు... తెలంగాణలో హైదరాబాద్ మినహా ఇతర ప్రాంతాల్లో అసమాన వృద్ధి ఉంటోంది. రాష్ట్రస్థాయిలో విద్య, సాంకేతిక విజ్ఞానంతో వృద్ధిని విస్తరించాలి'' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ గ్రహీత సెస్ మాజీ ఛైర్మన్ కేఎల్ కృష్ణను సన్మానించారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ రేవతి, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్‌గా మాట్లాడుతున్న మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా

మెరుపులా కదులుదాం... మెస్సీని మెప్పిద్దాం!



దిగ్గజ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ బృందంతో హైదరాబాద్‌లో ఈ నెల 13న జరిగే మ్యాచ్ కోసం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సాధన చేస్తున్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్ ఎంసీహెచ్ ఆర్‌డీఐ మైదానంలో ఇలా ప్రాక్టీసు చేశారు



బూట్ పాలిష్ చేసే వ్యక్తికి బాలీవుడ్‌లో అవకాశం

చండీగఢ్‌లో బూట్ పాలిష్ చేసుకునే వికాస్ మాన్‌కు బాలీవుడ్ రూపంలో అదృష్టం తలుపుతట్టింది. నవాజుద్దీన్ సిద్దిఖీ చిత్రంలో పాటలు పాడే అవకాశం ఆయనను వరించింది. చండీగఢ్‌లోని సెక్టార్ 17లో బూట్ పాలిష్ చేసుకునే వికాస్ మాన్.. తన గాత్రంతో అక్కడికి వచ్చిన వారిని అలరిస్తుంటారు. రాజస్థాన్‌లో పుట్టిన ఆయన చిన్నప్పటి నుంచీ పాటలు పాడుతుండేవారు. దిల్లీ, చండీగఢ్‌లలో ఆయన పెరిగారు. ప్రస్తుతం ఆయన తన ముగ్గురు సోదరీమణులతో కలిసి చండీగఢ్‌లోనే ఉంటున్నారు. సూఫీ సంగీతంతో ఆయన అలరిస్తున్నారు. ఆయన పాటలను మెచ్చిన కొందరు ఫంక్షన్లలో పాటలు పాడాల్సిందిగా ఆహ్వానిస్తుంటారు. అలా ఒక వ్యక్తి వికాస్ ఫోన్ నంబరు తీసుకుని బాలీవుడ్‌కు చేర్చారు. వచ్చే ఏడాది మార్చిలో ఆయన ముంబయి వెళ్లి పాటలు పాడనున్నారు. - ఈటీవీ భారత్



ఫోన్ చూడకపోతే ప్రైజ్ మీదే

ఈ కాలంలో ఫోన్ లేకుండా ఒక్క క్షణం ఉండలేకపోతున్నాం. అలాంటి పరిస్థితుల నుంచి బయటపడాలని పంజాబ్‌లోని మోగా జిల్లా గోలియా ఖుర్ద్ గ్రామం సరికొత్త ప్రయత్నం చేస్తోంది. ఫోన్‌కు దూరంగా ఉండాలని 'గ్రేట్ సిటింగ్ ఛాలెంజ్' పేరిట పోటీ పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు ఇస్తామని ప్రకటించింది. ఇందులో పాల్గొనే వారు ఫోన్ లేకుండా ఒకే చోట కూర్చోవాలి. అలా అని నిద్రపోకూడదు. ఆకలి వేస్తే కూర్చున్న చోటికే నీరు, ఆహారం అందిస్తారు. అలా ఎక్కువ సేపు కూర్చున్న వారిని విజేతలుగా ప్రకటిస్తారు. మొదటి బహుమతిగా సైకిల్‌తో పాటు రూ.4,500 నగదు, రెండో బహుమతిగా రూ.2,500, మూడో బహుమతిగా రూ.1,500 ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. -ఇంటర్నెట్ డెస్క్

సామూహిక వివాహ వేడుకలో సీఎం కుమారుడి పెళ్లి

ఈటీవీ భారత్: మన దేశంలో బడాబాబుల పెళ్లిళ్లు ఎంత వైభవంగా జరుగుతాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అలాంటిది ఓ ముఖ్యమంత్రి కుమారుడు అత్యంత సాదాసీదాగా సామూహిక వివాహ వేడుకలో పెళ్లి చేసుకున్నారు. అంతేకాదు ఎలాంటి కానుకలు, హంగూ, ఆర్భాటాలు లేకుండా ఈ తంతు ముగించారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ చిన్న కుమారుడు డాక్టర్ అభిమన్యు తన చిరకాల స్నేహితురాలైన డాక్టర్ ఇషితా పటేల్‌ను ఆదివారం ఉజ్జయినిలో పెళ్లి చేసుకున్నారు. బాబా రామ్‌దేవ్ మంత్రాలు చదువుతుండగా.. పూల దండలు మార్చుకుని.. చాలా సింపుల్‌గా ఈ తతంగాన్ని ముగించారు. వీరితో పాటు మరో 21 జంటలు ఇదే ముహూర్తంలో వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. ఈ సామూహిక వివాహ వేడుకలను సన్వారాఖేడిలోని వాకంకర్ వంతెన సమీపంలోని గీతా కాలనీలో నిర్వహించారు.





అమెరికా నుంచి చూపునిస్తున్నారు

వారంతా అగ్రరాజ్యంలో ఉన్నత ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. అయినా తమ వంతుగా పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలని ఏపీ, తెలంగాణలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు యూఎస్‌ఏలోని సియాటెల్‌లో మైక్రోసాఫ్ట్ సంస్థలో పనిచేస్తున్న ఎనిమిది మంది. ఎంప్లాయీ గివింగ్ ప్రోగ్రామ్ కింద ఉద్యోగులు విరాళం ఇస్తే.. అంతే మొత్తాన్ని బిల్‌గేట్స్ ఫౌండేషన్ తన వాటాగా సమకూరుస్తుంది. ఏటా అక్టోబరులో ఈ కార్యక్రమాన్ని చేపడతారు. ఆ విధంగా వచ్చిన నిధులను సమాజంలో మార్పు తెచ్చేందుకు వినియోగించాలన్నది లక్ష్యం. అమెరికాకు చెందిన మంజరి సంకురాత్రి మెమోరియల్ ఫౌండేషన్(ఎంఎస్ఎంఎఫ్), కాకినాడలోని శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాల నిర్వహణకు ఆ మొత్తాన్ని వెచ్చిస్తున్నారు. శ్రీరామ్ సుంకరి నేతృత్వంలో ప్రవీణ్ ఉప్పులూరి, జనార్దన్ చక్క, మధుబాబు మల్లిడి, సోమ జగదీశ్, వినోద్ పర్ణ, మదన్ గుమ్మినేని, రామ్ ఉగ్గిరాల 2018 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి విశాఖపట్టణం, తూర్పు, పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాల్లో 34 శిబిరాలు నిర్వహించి.. మొత్తం 2,187 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయించారు. ఇప్పటివరకు మొత్తం రూ.1.20 కోట్లు సేకరించి శిబిరాలకు వినియోగించారు. - ఈనాడు, హైదరాబాద్



పన్నీర్ నీళ్లతో ఆరోగ్య పానీయం

డయాబెటిస్, బీపీ, గుండె జబ్బు పేషంట్లకు, చిన్న పిల్లలకు ప్రయోజనం కలిగించే ఆరోగ్య పానీయాన్ని హరియాణా హిస్సార్‌లోని ద లాలా లజపత్ రాయ్ వెటర్నరీ, పశు వైద్యశాస్త్ర విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. భారత్‌లో తొలిసారిగా 'వే కెఫిర్ హెల్త్ డ్రింక్'ను వారు రూపొందించారు. ఇమ్యూనిటీ లోపం ఉన్న చిన్నారులకు ఇది ఎంతో మేలు చేస్తుందని విశ్వవిద్యాలయ పరిశోధకులు తెలిపారు. 'పన్నీర్ తయారు చేసే సమయంలో భారీ స్థాయిలో నీరు మిగులుతుంది. దానిని ఇప్పటిదాకా పారబోసేవారు. అందులో ప్రొటీన్‌తోపాటు మినరల్స్, పోషక పదార్థాలుంటాయి. పెద్ద కంపెనీలు ఈ నీటిని పౌడర్‌గా మారుస్తాయి. ఇప్పుడు ఆ నీటి నుంచే మేం ఆరోగ్య పానీయాన్ని తయారు చేశాం' అని దీనిని అభివృద్ధి చేసిన తేజిందర్‌పాల్ సింగ్ తెలిపారు. -ఈటీవీ భారత్



పొద్దున పారిశుద్ధ్య కొలువు.. సాయంత్రం పేద విద్యార్థుల గురువు



ఇక్కడి చిత్రాల్లో పారిశుద్ధ్య కార్మికురాలిగా, బోధకురాలిగా కనిపిస్తున్న మహిళ ఒకరే. ఇందులో ప్రత్యేకత ఏముంది అనుకుంటున్నారా? మనకున్న జ్ఞానం మరొకరికి ఉపయోగపడాలి.. మనం ఏ పని చేస్తున్నా సమాజానికి కొంత తిరిగివ్వాలన్నదే ఆమె ఆలోచన. అందుకే పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నారు. సికింద్రాబాద్ బోలక్‌పూర్‌కు చెందిన స్రవంతి బీఏ చదివారు. పదేళ్ల కిందట జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలిగా చేరారు. ప్రైవేటు ఉద్యోగం చేసే ఆమె భర్త గుండెపోటుతో చనిపోయారు. నాలుగేళ్ల కిందట స్రవంతి ఓ సమావేశానికి వెళ్లారు. అక్కడ 'మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా మనకున్న చదువు మనకే కాకుండా పదిమందికి ఉపయోగపడాలి' అని ఓ వక్త చెప్పిన విషయం ఆమెను ఆలోచింపజేసింది. మర్నాటి నుంచే ఉచిత ట్యూషన్‌కు శ్రీకారం చుట్టారు. నర్సరీ నుంచి ఆరో తరగతి వరకు స్థానికంగా ఉండే పేద విద్యార్థులకు నిత్యం సాయంత్రం 5 నుంచి ఏడున్నర గంట వరకు పాఠాలు చెబుతున్నారు. అలా వందల మంది పేద విద్యార్థులను అక్షరసాయం చేశారు. తన ఇద్దరు పిల్లలను పోషిస్తూనే ఉదయం విధులు నిర్వహిస్తూ సాయంత్రం ట్యూషన్లు నిర్వహిస్తున్నారు.
-న్యూస్‌టుడే, సికింద్రాబాద్



దేవాదాయ పోస్టుల అర్హతలు సవరించాలి

భాజపా నాయకురాలు యామినీశర్మ

ఈనాడు, అమరావతి: దేవాదాయ శాఖ ప్రకటించిన వేద పండిత అధ్యాపకులు, చండీ సప్తశతి, ఇతర వేద పారాయణ పోస్టుల విద్యార్హత, ఇతర అంశాల్లో కొన్ని సవరణలు చేయాలని భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యురాలు యామినీశర్మ కోరారు. పలువురు వేద పండితుల వినతి మేరకు దేవాదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్, కమిషనర్ రామచంద్రమోహన్‌కు వినతిపత్రాలు అందించామని సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించి తగిన సవరణలు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. కమిషనర్‌కు వినతిపత్రం అందించిన వారిలో సత్యనారాయణపురం పురోహిత సంఘం అధ్యక్షుడు, భాజపా యువమోర్చా నాయకుడు తుమ్మలూరి కృష్ణ చైతన్య తదితరులు ఉన్నారు.



రామచంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యామినీశర్మ, కృష్ణ చైతన్య తదితరులు

మంతెన ఆరోగ్యాలయంలో చికిత్సల ధరల సవరణ

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా వెంకటాయపాలెంలోని మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యాలయంలో అందిస్తున్న ప్రకృతి వైద్య (నేచురోపతి) చికిత్సలు, ఇతర ప్రక్రియల ధరలను ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017లో విడుదలైన కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) మార్గదర్శకాల ప్రకారం రీయింబర్స్‌మెంట్ ధరలకు అనుగుణంగా చికిత్సల ధరలను సవరించినట్లు పేర్కొంది.



చుట్టేయగ యాదగిరి.. తరలొచ్చె భక్తఝురి

నరసింహ స్వామి, అయ్యప్ప స్వామి నామస్మరణ, భజనలు, భక్తిగీతాలాపనలతో యాదగిరిగుట్టలోని గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగింది. ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం వేకువ జామున శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ జరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి అయ్యప్ప భక్తులు భారీగా తరలివచ్చారు.
-న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

ఆర్టీసీ ఆస్తుల తనఖా ప్రతిపాదనను విరమించుకోవాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: ప్రజా రవాణా సంస్థ అయిన ఏపీఎస్ఆర్టీసీకి చెందిన విలువైన భూములు, భవనాలు, డిపోలు, ఇతర స్థిరాస్తులను కార్పొరేట్ కంపెనీలకు లీజు, తనఖాకు ఇవ్వాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లేఖ రాశారు. రహదారుల మరమ్మతుల కోసం ఆర్టీసీ ఆస్తులను తనఖా పెట్టాలనే నిర్ణయం ప్రజా రవాణా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ భవనం డిజైన్‌ల మదింపునకు కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: అమరావతిలో నిర్మించనున్న రాష్ట్ర గ్రంథాలయ నిర్మాణానికి సంబంధించి స్వీకరించిన డిజైన్‌ల ప్రతిపాదనల మదింపు కోసం రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆకృతులను పరిశీలించి, ఆర్కిటెక్చరల్ కన్సల్టెంట్‌ను ఈ కమిటీ ఎంపిక చేస్తుంది. కమిటీ ఛైర్‌పర్సన్‌గా పాఠశాల విద్య కార్యదర్శి, సభ్యులుగా పాఠశాల డైరెక్టర్, ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్, చీఫ్ ఇంజినీర్, సమగ్ర శిక్షా అభియాన్ చీఫ్ ఇంజినీర్, స్పా నుంచి ఒకరు, సభ్య-కన్వీనర్‌గా ప్రజా గ్రంథాలయ శాఖ డైరెక్టర్ వ్యవహరిస్తారని పేర్కొంది.

పీఎం సూర్యఘర్ పథకం అమలుకు రూ.3,762 కోట్ల రుణం

ఈనాడు, అమరావతి: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన కింద ఇళ్ల కప్పుపై సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన రూ.3,762.26 కోట్లు నాబార్డ్ నుంచి రుణంగా తీసుకునేందుకు డిస్కంలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు ఒక్కొక్కరికి 2 కిలోవాట్ల సౌర విద్యుత్ యూనిట్లు ఇళ్లపై ఉచితంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకం అమలుకు కేంద్రం ఇచ్చే రాయితీ పోను మిగిలింది డిస్కంలు భరించేలా నిర్దేశించింది. ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తోంది. ఇందుకోసం డిస్కంలకు ప్రతి నెలా తానే బిల్లు చెల్లిస్తోంది. ఆ మొత్తాన్ని సౌరవిద్యుత్ యూనిట్ల రుణాన్ని తిరిగి చెల్లించేందుకు వినియోగించాలని నిర్ణయించింది.

గృహ హింస బాధిత మహిళలకు ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా సీడీపీవోలు

ఈనాడు, అమరావతి: గృహహింస బాధిత మహిళలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమశాఖ పరిధిలోని సీడీపీవో, ఏసీడీపీవోలను ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నియమించింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న చర్యల్లో భాగంగా సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న 7 శక్తిసదనాలు, 2 సేవాగృహాలు, 2 రాష్ట్ర గృహాలను గృహహింస బాధితులకు ఆశ్రయాలుగా నోటిఫై చేస్తూ మరో ఉత్తర్వు ఇచ్చింది.

అంధుల లిపిలో అవినీతి 'ముద్ర'

- రాష్ట్ర బ్రెయిలీ ప్రెస్‌లో కనిపించని రికార్డులు
- రూ.కోట్లు వెచ్చించిన యంత్రాలు నిరుపయోగం
- విద్యార్థులకు సకాలంలో అందని పుస్తకాలు
- వైకాపా పాలనలో గాడి తప్పిన ముద్రణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అంధుల విద్యాలయాలకు పుస్తకాలు, అంధ ఉద్యోగులకు డిపార్టుమెంటల్ పరీక్షల పుస్తకాలు ముద్రించడానికి గుంటూరులో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బ్రెయిలీ ప్రెస్ అక్రమాలకు, అవకతవకలకు అడ్డాగా తయారైంది. వైకాపా ఐదేళ్ల పాలనలో కనీస పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు బ్రెయిలీ పుస్తకాలు ఇవ్వాలన్న లక్ష్యం నీరుగారిపోయింది. కోట్ల విలువైన ముద్రణా యంత్రాలు మూలనపడ్డాయి. తాజాగా దీనిపై గుంటూరు జేసీ ఇచ్చిన నివేదికను పరిశీలించిన ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.

రాష్ట్ర స్థాయి బెయిలీ ప్రెస్‌ను 2015లో ఏర్పాటు చేశారు. బ్రెయిలీ లిపిలో పాఠ్యపుస్తకాల ముద్రణ కోసం రూ.1.30 కోట్లు వెచ్చించి యంత్రాలు కొన్నారు. ఇక్కడ పాఠ్యపుస్తకాలు ముద్రించి రాష్ట్రవ్యాప్తంగా అంధ విద్యార్థుల పాఠశాలలన్నింటికీ సరఫరా చేసేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఈ ముద్రణాలయం గాడి తప్పింది. దీని నిర్వహణకు నియమించిన ఎండీ విధులు సక్రమంగా నిర్వహించకపోవడం, ప్రాజెక్టు అధికారి పర్యవేక్షణ లోపంతో ఇక్కడ పనిచేసే పొరుగు సేవల ఉద్యోగిని ఒకరు ప్రెస్ మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. విద్యాసంవత్సరం ముగిసిపోయినా పుస్తకాలు ఇవ్వడం లేదని అంధ దివ్యాంగుల యూనియన్ ఎన్ని ఫిర్యాదులు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక విజువల్లీ ఛాలెంజ్డ్ యూత్ అసోసియేషన్ ఫిర్యాదుతో విచారణకు ఆదేశించింది. గుంటూరు జేసీ ఆధ్వర్యంలో కమిటీ విచారణ జరిపి, నివేదికను ప్రభుత్వానికి పంపింది.



గుంటూరులోని బ్రెయిలీ ప్రెస్ భవనం

నివేదికలో కీలకాంశాలివీ..

✦ 2019 నుంచి ఒక్క ఏడాది కూడా సకాలంలో పుస్తకాలు ముద్రించి పాఠశాలలకు సరఫరా చేయలేదు. జూన్‌లో విద్యాసంవత్సరం మొదలైతే డిసెంబరు నాటికి కొన్ని పుస్తకాలు అందించారు. సైన్సు, మ్యాథ్స్ పుస్తకాలు విద్యాసంవత్సరం ముగిసినా సరఫరా చేయలేదు.

✦ రూ.1.30 కోట్లు వెచ్చించి కొన్న ముద్రణ యంత్రం పనిచేయడం లేదని పక్కన పడేశారు.

✦ కొత్తగా రూ.3.50 లక్షలు వెచ్చించి మరో యంత్రం కొన్నా అదీ మూలన పడింది.

✦ వైకాపా ఐదేళ్ల పాలనలో కనీసం సమీక్ష చేసే పరిస్థితి లేకపోవడంతో అప్పటి ఎండీ నిబంధనలకు నీళ్లొదిలారు. ప్రెస్ మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకున్న పొరుగుసేవల ఉద్యోగిని అంధులను కించపరిచేలా మాట్లాడటంతోపాటు అంతా తానై వ్యవహరించారు.

✦ విజయవాడలో ప్రధాన కార్యాలయం ఉండడంతో గుంటూరులోని ప్రెస్‌లో ఏం జరిగినా పట్టించుకునే వారు కరవయ్యారు.

లెక్కా పత్రం లేదు.

రూ.25 లక్షలతో ప్రహరీ నిర్మిస్తే.. ఒక్క రికార్డు లేకపోవడం ఇక్కడి పర్యవేక్షణ లోపానికి పరాకాష్ఠ. సాధారణ ఎన్నికల సమయంలో అంధులకు సంబంధించిన బ్యాలెట్ ముద్రణ, సరఫరాకు రూ.48 లక్షలు వెచ్చించారు. దీనికి సంబంధించిన రికార్డులూ లేవు. యంత్రాల మరమ్మతు, ఇతర ఖర్చుల పేరుతో వెచ్చించిన సొమ్ముకూ సరైన లెక్కా పత్రాల్లేకపోవడం గమనార్హం. యంత్రాలు ఎందుకు పాడయ్యాయి, నిజంగా పని చేయకపోతే కొన్ని పుస్తకాలు ఎలా ముద్రించారని విచారణాధికారుల ప్రశ్నకూ బాధ్యులు సమాధానమివ్వలేదు.

4,792 మెగావాట్ల మినీ సౌర ప్రాజెక్టులు

- పీఎం కుసుమ్ రెండో దశలో ఏర్పాటుకు నిర్ణయం
- రాబోయే 25 ఏళ్లలో ప్రభుత్వంపై తగ్గనున్న రూ.8,345 కోట్ల సబ్సిడీ భారం
- విద్యుత్తు కొనుగోలు వ్యయంలోనూ ఏటా రూ.620 కోట్లకు పైగా ఆదా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మరో 8.60 లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు పీఎం కుసుమ్ పథకం కింద ఫీడర్ స్థాయిలో మినీ సౌర విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా 4,792 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అంచనా వేసింది. వీటితో రాబోయే 25 ఏళ్లలో సుమారు రూ.8,400 కోట్ల మేర ఆదా అవుతుందని అంచనా. పీఎం కుసుమ్ మొదటి దశలో 2,93,587 వ్యవసాయ కనెక్షన్లకు సౌర విద్యుత్తు అందించాలని నిర్ణయించగా, దీనికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. యూనిట్‌కు సగటున రూ.3.17 చొప్పున చెల్లించేలా గుత్తేదార్లు బిడ్లు వేశారు. వీటి ద్వారా 1,162.80 మెగావాట్లు అందుబాటులోకి రానుంది. రెండు దశల్లో ఏర్పాటు చేసే మినీ సౌర ప్రాజెక్టుల ద్వారా పగటి వేళల్లో వ్యవసాయానికి విద్యుత్తు అందించడం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని 21 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు దశల వారీగా సౌర విద్యుత్తు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

మొదటి దశలో యూనిట్ రూ.3.17 మాత్రమే..

◆ వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకానికి ఏటా సుమారు రూ.12,000 కోట్లు సబ్సిడీ కింద ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తోంది. మినీ ప్రాజెక్టుల ఏర్పాటుతో ప్రభుత్వానికి ఆ భారం తగ్గనుంది. విద్యుత్తు కొనుగోలు, నిర్వహణ ఖర్చులు, సరఫరా, పంపిణీ నష్టాలు కలిపి యూనిట్‌కు సగటున రూ.7.50 అవుతుంది. ◆ పీఎం కుసుమ్ కింద యూనిట్‌కు సగటున రూ.3.17 మాత్రమే గుత్తేదారు సంస్థలకు ప్రభుత్వం చెల్లించనుంది. దీంతో యూనిట్‌కు రూ.4.33 చొప్పున ఆదా కానుంది.

◆ ఈ ప్రకారం 2.93 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు సరఫరా చేసే విద్యుత్తుకు చెల్లించే సబ్సిడీలో ఏటా రూ.81 కోట్లు ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు జీవితకాలం 25 ఏళ్లలో రూ.2,035 కోట్లు ఆదా అవుతుందని అంచనా.

◆ పీఎం కుసుమ్ కింద 4,792 మెగావాట్ల సౌర ప్రాజెక్టులు నిర్వహించే టెండర్లలోనూ మొదటి దశలో మాదిరే యూనిట్ ధర గుత్తేదార్లు కోట్ చేస్తే.. ఏటా రూ.333.81 కోట్లు ఆదా అవుతుంది. 25 ఏళ్లలో ఆ మొత్తం 8,345.20 కోట్లుగా అధికారుల అంచనా.

◆ రెండు దశల్లోని మినీ సౌర విద్యుత్తు ప్రాజెక్టులతో పగటి వేళల్లో మరో 5,954.80 మెగావాట్ల సౌర విద్యుత్తు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు మిగులు విద్యుత్తును ఇతర అవసరాకు వినియోగించే వెసులుబాటు కలుగుతుంది.

◆ రెండు దశల్లోని ఈ ప్రాజెక్టుల ద్వారా రాబోయే 25 ఏళ్లలో రూ.10,380 కోట్ల మేర ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అధిక ధరకు కొనే భారం తప్పుతుంది

పీఎం కుసుమ్ మొదటి దశలో ప్రతిపాదించిన ప్రాజెక్టులు 2027 నాటికి.. రెండో దశలో ప్రతిపాదించిన వాటిని 2029 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ప్రస్తుతం ఆయా కనెక్షన్లకు విద్యుత్తును డిస్కంలు అందిస్తున్నాయి. డిమాండ్ సర్దుబాటు కోసం బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్తు కొంటున్నాయి. మొదటి దశ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే.. అధిక ధరకు కొనుగోలు చేసే విద్యుత్తు తగ్గుతుంది. దీంతో ఏటా రూ.86 కోట్ల మేర ఆదా అవ్వనుంది. రెండో దశ ప్రాజెక్టులు పూర్తయితే ఏటా రూ.540 కోట్ల మేర విద్యుత్తు కొనుగోలు వ్యయంలో ఆదా అయ్యే అవకాశం ఉంటుందని అధికారులు లెక్కలు తేల్చారు.

రైతులకు భరోసా కల్పించాలి: మాధవ్

ఈనాడు, అమరావతి: వరుస విపత్తులతో నష్టపోతున్న వరి రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. ఆరుగాలం కష్టపడి వరి పండించినా.. కోత-నూర్పిడి సమయంలో వస్తున్న తుపాన్లు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. "ఖరీఫ్‌లో మొంథా తుపాను వల్ల కర్షకులు తీవ్రంగా నష్టపోయారు. దీని నుంచి కోలుకుంటున్న సమయంలో దిత్వా తుపాను రూపంలో వారికి మళ్లీ దెబ్బ తగిలింది. తడిసిన ధాన్యం ఎలా అమ్ముకోవాలో తెలియని పరిస్థితుల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి. ఈ విషయంలో మంత్రులు కార్యాచరణ ప్రకటించినా.. రైస్ మిల్లర్లు ద్వంద్వ వైఖరి అవలంబిస్తుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి" అని మాధవ్ విజ్ఞప్తి చేశారు.

అగ్నిమాపక సేవల చట్టం సవరణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆర్డినెన్స్ జారీ చేసింది. నేషనల్ బిల్డింగ్ కోడ్ (ఎన్‌బీసీ) మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'నమూనా బిల్లు'కు అనుగుణంగా.. చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్ తెచ్చింది. దాని ప్రకారం.... భవనాలు నిర్మించాలనుకునేవారు తొలుత ప్రొవిజనల్ నిరభ్యంతర పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే అగ్నిమాపక అధికారులు దాన్ని 21 రోజుల్లోగా పరిష్కరించాలి. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత సంబంధిత యజమాని ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. దాన్ని 30 రోజుల్లోగా అధికారులు పరిష్కరించాలి. ఆ తర్వాత నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. వీటితో పాటు ప్రస్తుతం చట్టంలో ఉన్న కొన్ని అంశాలను తొలగించి... నిబంధనల్ని సరళీకృతం చేసింది. ఈ మేరకు గవర్నర్ జారీ చేసిన ఆర్డినెన్స్‌ను న్యాయశాఖ సోమవారం గెజిట్‌లో ప్రచురించింది.

పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు

ఈనాడు, అమరావతి: విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో భాగంగా పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు విజయరామరాజు సోమవారం ఆదేశాలు జారీచేశారు. పాఠశాల స్థాయిలో ఈనెల 8లోపు, మండల స్థాయిలో 10వ తేదీలోపు, జిల్లా స్థాయిలో 12వ తేదీలోపు వైజ్ఞానిక ప్రదర్శనలు పూర్తికావాలని పేర్కొన్నారు. ఒక్కో జిల్లా నుంచి ఉత్తమమైన 11 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయాలని నిర్దేశించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శన ఎక్కడ, ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికచేసిన 11 ప్రదర్శనలను వెంటనే ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు పంపాలని ఆదేశించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలకు రూ.29.99 కోట్లు

- మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు నిర్మించాలని సూచన

ఈనాడు, అమరావతి: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో మరుగుదొడ్లు, బాత్‌రూంలు, ఆర్వో ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.29.99 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 551 ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలున్నాయి. ఇందులో 113 ఆశ్రమ పాఠశాలల్లో కొత్తగా 764 మరుగుదొడ్లు నిర్మిస్తారు.

మరో 149 ఆశ్రమ పాఠశాలల్లో 1,012 బాత్‌రూంలతో పాటు 123 ఆశ్రమ పాఠశాలల్లో 128 ఆర్వో ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించి 301 మరుగుదొడ్లు, 288 బాత్‌రూంలు, 93 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బాలికల గురుకులాల్లో బాత్‌రూంల నిర్మాణం

గిరిజన బాలికల గురుకులాల్లో బాత్‌రూంల నిర్మాణం, కిటికీలకు మెస్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.7.52 కోట్ల విడుదలకు అనుమతులిచ్చింది. ఈ నిధులతో 43 బాలికల గురుకులాల్లో బాత్‌రూంలు, 89 గురుకులాలు, 107 వసతి గృహాల్లో కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయనున్నారు.